ఈనాడు

కరీంనగర్ 21-8-2017 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 12

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16

www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

TG

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ శాఖ) మెదక్ జిల్లా
ఫారం- C
ప్రిలిమినరీ నోటిఫికేషన్

(భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టము నం. 21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాధి. పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) ప్రకారం మరియు 10A మినహాయింపు అనుసరించి)

(రూల్ 6/12 చూడుము)

కలెక్టర్ ఫైల్ నం.G1/891/2017 తేది: 10/08/2017
రెవెన్యూ డివిజనల్ అధికారి/భూ సేకరణ అధికారి, ఫైల్ నం.బి/1543/2017 తేది: 5/08/2017
Gezette No.5 తేది: 17/08/2017

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, మెదక్ గారు దిగువ నిర్దిష్ట పరచిన మెదక్ జిల్లాలోని నర్సాపూర్ మండలములోని రెడ్డిపల్లి గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణం ఎ. 151.05 గుంటలు ప్రజాప్రయోజన నిమిత్తం అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించడమైనది.
కావున మెదక్ జిల్లా నర్సాపూర్ మండలములోని రెడ్డిపల్లి గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణం ఎ. 151.05 గుంటలు గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారినుండి భూసేకరణ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్ జారిచేయనైనది.

పట్టా భూముల షెడ్యూల్

గ్రామము: రెడ్డిపల్లి | మండలము: నర్సాపూర్ | జిల్లా: మెదక్

వరుస సంఖ్య	సర్వే నెం.	భూమి రకం	భూమి స్వభావము	భూ సేకరణ చేయు విస్తీర్ణం	భూమి పట్టాదారు/ అనుబవదారు/ ఆసక్తిదారు పేరు మరియు చిరునామా	సరిహద్దులు తూర్పు	పడమర	ఉత్తరము	దక్షిణము	వృక్షములు రకము	సంఖ్య	నిర్మాణాలు రకము	విస్తీర్ణం
1	2	3	4	5	6	7	8	9	10	11		12	
72	260/ఊ	లావుని పట్టా	ఖుష్కి	00-32	కట్ట దశరథ్ తండ్రి చిన్న రామయ్య	కట్ట కిష్టయ్య	కట్ట అశోక్	కట్ట సామయ్య	మంగలి దాసు				
73	260/రు3	లావుని పట్టా	ఖుష్కి	00-20	కట్ట సామయ్య తండ్రి పోచయ్య	ఆయన్నగారి యాద గౌడ్	అందనగరం దశరథ్	మంతూర్ శివారు	కట్ట దశరథ్				
74	260/రు2	లావుని పట్టా	ఖుష్కి	00-20	కట్ట కిష్టయ్య తండ్రి పోచయ్య	ఆయన్నగారి యాద గౌడ్	ఆయ్యన్నగారి దశరథ్‌గౌడ్	రోడ్డు	కట్ట కిష్నయ్య			బోరు	1
75	260/రు1	లావుని పట్టా	ఖుష్కి	00-20	కట్ట యాదయ్య తండ్రి పోచయ్య	ఆయన్నగారి యాద గౌడ్	అందనగరం దశరథ్	రోడ్డు మంతురు శివారు	కట్ట దశరథ్				
76	260/రు	లావుని పట్టా	ఖుష్కి	00-20	కట్ట నర్సయ్య తండ్రి పోచయ్య	ఆయన్నగారి యాద గౌడ్	అందనగరం దశరథ్	రోడ్డు మంతూర్ శివారు	కట్ట దశరథ్				
77	260/క	లావుని పట్టా	ఖుష్కి	00-12	కట్ట కిష్టయ్య తండ్రి దుర్గయ్య	ఆయన్నగారి యాద గౌడ్	కట్ట దశరథ్	కట్ట కిష్టయ్య	నక్క సామయ్య				
78	260/ఖ	లావుని పట్టా	ఖుష్కి	01-10	దేవగోని యాదగౌడ్ తండ్రి దేవ గౌడ్	P.W.D. రోడ్డు	కట్ట సామయ్య	మంతూర్ శివారు	అందనగరం దశరథ			బోరు	1
79	260/ఘ1	లావుని పట్టా	ఖుష్కి	00-16	చందగోని పోచగౌడ్ తండ్రి వీర గౌడ్	చందగోని షేక గౌడ్	పోచమ్మ	సంగమేశ్వర్	గుడ్డి దశరథ్				
80	260/1/3	లావుని పట్టా	ఖుష్కి	00-20	ఎర్ల యాదగిరి తండ్రి భూమయ్య	బొమ్మల కుంట	P.W.D. రోడ్డు	గూడ నారాయణ	B.T. రోడ్డు				
81	260/1/2	లావుని పట్టా	ఖుష్కి	00-10	కట్ట దుర్గమ్మ భర్త భూమయ్య	అందనగరం లక్ష్మి	చిందు రవి	రోడ్డు	అందనగరం లక్ష్మి				
82	260/9	ప్రభుత్వము	ఖుష్కి	00.09	రోడ్డు								
	విస్తీర్ణము			113-36									
	మొత్తం విస్తీర్ణం:			151-05									

ప్రభుత్వ భూముల షెడ్యూల్

గ్రామము: రెడ్డిపల్లి | మండలము: నర్సాపూర్ | జిల్లా: మెదక్

ఇట్టి ప్రకటన భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టము నం. 21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) (కేంద్ర చట్టము నెం. 30/2013) ప్రకారం సంబంధం కలిగిన వ్యక్తులు అందరికి తెలియజేయుటకుగాను ఈ నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్, మరియు వివరములు జిల్లా కలెక్టర్, మెదక్ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నర్సాపూర్ వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ మెదక్ గారు, రెవిన్యూ డివిజనల్ అధికారి, నర్సాపూర్ గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో యేదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూ కమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, మెదక్ గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసిన తేది నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు/అమ్మకాలు/తాకట్లకు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.

సెక్షన్ (15) ప్రకారం, ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ తరువాత పైన చూపించిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యంతరములు ఉన్నచో అట్టి వ్యక్తులు, ఇట్టి నోటిఫికేషన్ జారీచేసిన (60) దినములలో జిల్లా కలెక్టర్ మెదక్ గారి/భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నర్సాపూర్ గారికి ముందు వారి అభ్యంతరములు వ్రాతపూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- తహసీల్దారు, నర్సాపూర్ మండలము
సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి, నర్సాపూర్ డివిజన్
సం/- జాయింట్ కలెక్టర్, మెదక్ జిల్లా
సం/- జిల్లా కలెక్టర్, మెదక్ జిల్లా

పేదలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- చౌటుప్పల్‌లోని బాలికల గురుకుల పాఠశాలకు రూ.5 కోట్ల మంజూరుకు హామీ
- 'ఈనాడు' వార్తకు స్పందన



బాలికల గురుకుల పాఠశాలలో వసతుల పరిశీలనకు వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: తెలంగాణలోని బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా గురుకుల పాఠశాలలోని విద్యార్థులు నివాసముండే ఛాత్రావాసం(డార్మెటరీ)లోకి వెళ్లారు. అక్కడున్న విరిగిన మంచాలు, విద్యార్థులు పడుకునేందుకు కూడా స్థలం లేకుండా డార్మెటరీ మొత్తం పెట్టెలతో నిండిపోవడాన్ని గుర్తించారు. విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. గురుకులంలో సకల సౌకర్యాలు కల్పించేందుకు రూ.5 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. 200 మంది విద్యార్థులకు సరిపడా కొత్త భోజనశాల, గ్రంథాలయ భవనం, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు తదితర వసతులు కల్పిస్తానని, వచ్చే విద్యా సంవత్సరం గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా స్థాయి పెంచుతానని హామీ ఇచ్చారు. మంత్రి వెంట భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు. 'చౌటుప్పల్ సహా..రాష్ట్రంలోని పలు గురుకుల పాఠశాలల్లో సమస్యలను ప్రస్తావిస్తూ ఇటీవల 'ఈనాడు' ప్రధాన సంచికలో 'గురుకులాలే కొత్తవి..కష్టాలు పాతవే' అన్న శీర్షికన ప్రచురితమైన కథనాన్ని చదివానని, సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే వచ్చానని' ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

'తిరంగా యాత్ర'లతో ప్రజల్లో ఐక్యం: మోదీ

దిల్లీ: దేశవ్యాప్తంగా భాజపా నిర్వహిస్తున్న 'తిరంగా యాత్ర' కార్యక్రమాలు.. 2022లోగా 'నూతన భారత్'ను నిర్మించే దిశగా ప్రజలను ఐక్యం చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జమ్ముకశ్మీర్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో జరిగిన యాత్రలకు సంబంధించిన చిత్రాలను ఆయన ఆదివారం ట్విటర్‌లో పోస్ట్ చేశారు. వీటి నిర్వహణకు కృషి చేస్తున్న పార్టీ కార్యకర్తలను అభినందించారు. అన్ని వర్గాల ప్రజలూ యాత్రల్లో పాలు పంచుకుంటున్నారని మోదీ వ్యాఖ్యానించారు.

రాజీవ్‌కు నివాళి: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా.. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఆయనకు నివాళులు అర్పించారు. జాతి కోసం రాజీవ్ అందించిన సేవలను స్మరించుకొంటూ.. ట్విటర్‌లో సందేశాన్ని పోస్ట్ చేశారు.

రేపు దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మె

దిల్లీ: వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయు), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐబీఓసీ), ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్ (ఎన్‌ఓబీడబ్లు) ఆధ్వర్యంలో ఈ సమ్మె జరగనుంది. ఈ సమ్మెలో ప్రయివేటు బ్యాంకులైన ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, కొటక్ మహీంద్రా బ్యాంకులు పాల్గొనడం లేదు. కార్మిక శాఖ ప్రధాన కమిషనర్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయని; ప్రభుత్వం, బ్యాంకుల యాజమాన్యాల నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో సమ్మె చేయక తప్పడం లేదని ఏఐబీఓసీ ప్రధాన కార్యదర్శి డి.డి.ఫ్రాంకో తెలిపారు. బ్యాంకులను విలీనం చేయకూడదని, కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రుణాలను మాఫీ చేయకూడదని, రుణాలు ఎగవేసే సంస్థలపై కేసులు నమోదు చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్లని ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. వెంకటాచలం తెలిపారు.

ఈతకొలనులో చిక్కుకున్న మహిళ

ఫేస్‌బుక్ సందేశంతో అందిన తక్షణ సాయం
క్షణాల్లో వచ్చేసిన పక్కింటావిడ

న్యూయార్క్: ఇంటి పెరట్లో ఉన్న ఈతకొలనులో చిక్కుబడిపోయిన న్యూహాంప్‌షైర్‌కు చెందిన 61 ఏళ్ల లెస్లీకాన్స్‌కు 'ఫేస్‌బుక్' ఓ పెద్ద సహాయకారిగా నిలిచిన సంఘటన ఇది. లెస్లీ ఈతకొలనులోకి దిగిన కాసేపటికల్లా నిచ్చెన కాస్తా మధ్యలోకి విరిగిపోయింది. ఇరుగు పొరుగును గొంతెత్తి పిలుద్దామంటే... పెద్దపెద్ద ప్రాంగణాలు కావడంతో అరిచి గగ్గోలుపెట్టినా అంతసులువుగా ఎవరికీ వినపడని పరిస్థితి. చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను కాస్తా గట్టుమీదున్న కుర్చీలో పెట్టి నీళ్లలోకి దిగిందామె. కాసేపు ఆమెకు దిక్కుతోచలేదు. అలా మూడుగంటల పాటు నీళ్లలోనే నానుతూ ఉండిపోయింది లెస్లీ. కాసేపయ్యాక ఈదుకుంటూ ముందుకు వెళ్లి... ఈతకొలనులో ఉన్న ఓ పైపును తీసుకుంది. మెల్లగా ఈతకొడుతూ ఆ పైప్‌సాయంతో గట్టుమీదున్న కుర్చీని ఒడుపుగా ..అతి జాగ్రత్తగా దగ్గరకు లాక్కుంది. అందులో ఉన్న ఐ -పాడ్‌ను తీసుకుంది. ఆపదలో ఉన్నాను...సాయానికై అభ్యర్థిస్తున్నానంటూ పంపే 'ఎస్‌ఓఎస్'ను 'ఫేస్‌బుక్'లో పోస్టింగ్ పెట్టింది. క్షణాల్లో లెస్లీ పక్కింటావిడ ఈత కొలను ముందు ప్రత్యక్షమైంది. ఆవిడ చిరునవ్వు...ఆదుకోవడానికి పడుతున్న తాపత్రయం చూసిన లెస్లీకి బోలెడంత ధైర్యం వచ్చింది. ఈతకొలను నిచ్చెనను బాగుచేసుకోవడానికి ఉపకరించే సామగ్రి ఉన్న 'టూల్‌బాక్స్' తన ఇంట్లో ఎక్కడుందో చెప్పి...తీసుకురావలసిందిగా ఆవిడను లోపలికి పంపింది. ఆవిడ వచ్చేలోగా మళ్లీ ఫేస్‌బుక్ ఖాతాలోకి వెళ్లింది....వెంటనే తనకు సాయం అందిందనీ...తాను సురక్షితమేననీ ...కంగారుపడి పరిగెత్తుకు రావలసిన అవసరం లేదంటూ మరో పోస్టింగ్ పెట్టేసింది. తన ఎస్‌ఓఎస్‌కు లభించిన స్పందన చూసి చెప్పలేనంత ధైర్యం కలిగిందనీ... జీవితం మనిల్ని ఎటువైపునకు నెట్టినా సరే...సాయం కోసం అర్థించవచ్చు అని ఆమె ఆ తర్వాత పేర్కొంది.

విమానాశ్రయాల్లో పెరగనున్న సేవా రుసుము?

దిల్లీ: విమాన ప్రయాణికులపై విధించే సేవా రుసుము (పీఎస్‌ఎఫ్) స్వల్పంగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. విమానాశ్రయాల భద్రత కోసం వెచ్చిస్తున్న ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో.. హోం, విమానయాన మంత్రిత్వ శాఖలు ఈ రుసుమును పెంచాలని భావిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. విమానాశ్రయాలకు ఎవరు భద్రత కల్పించాలన్న విషయంలో ఈ రెండు మంత్రిత్వశాఖల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి, కేంద్ర ప్రభుత్వమే ఈ అంశాన్ని చేపట్టాలని విమానయాన శాఖ వాదిస్తోంది. దేశంలోని 98 విమానాశ్రయాల్లో భద్రతకు ఎంత ఖర్చవుతుందనేది తేల్చేందుకు హోం శాఖ ఒక కమిటీని నియమించింది. అదే విధంగా పౌర విమానయానశాఖ కూడా పీఎస్‌ఎఫ్, పార్కింగ్, అద్దెల ద్వారా ఎంత ఆదాయం ఆర్జించవచ్చనే విషయంలో నివేదిక తయారు చేస్తోందని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ఆదాయం, వ్యయాల మధ్య పొంతన కుదరకపోతే, అప్పుడు పీఎస్‌ఎఫ్‌ను పెంచే దిశగా ఆలోచిస్తామని మరో అధికారి తెలిపారు. ప్రస్తుతం పీసీఎఫ్ కింద ప్రతి ప్రయాణికుడి నుంచి రూ.150 వసూలు చేస్తున్నారు. విమానాశ్రయాలకు భద్రత కల్పించినందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్‌ఎఫ్)కు విమానాశ్రయాలు రూ.800 కోట్ల వరకూ బాకీ పడ్డాయి. ఈ వ్యవహారాన్ని తేల్చేందుకు ఈ రెండు శాఖల సహాయ మంత్రులతోపాటు, ఆర్థిక శాఖ సహాయ మంత్రి, పలువురు ఉన్నతాధికారులు పలుమార్లు సమావేశం అయినప్పటికీ ఇంత వరకూ ఎలాంటి ఫలితం రాలేదు.

25 శాతం ప్రాంతాల్లో లోటు వర్షపాతం

- పరిస్థితులు మెరుగుపడే అవకాశం
- రుతుపవనాలపై ఐఎండీ అంచనాలు

దిల్లీ: దేశంలోని 25 శాతం ప్రాంతాల్లో ఇప్పటివరకూ లోటు వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రానున్న రోజుల్లో పరిస్థితులు మెరుగు పడతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. రుతుపవన కాలంలో ఇప్పటికే సగం రోజులు పూర్తయిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వివరాలను ఐఎండీ వెల్లడించింది. వాటి ప్రకారం.. దేశ వ్యాప్తంగా వర్షపాత లోటు ఐదు శాతంగా ఉంది. 26 శాతం ప్రాంతాల్లో ఈ లోటు మరింత ఎక్కువగా ఉంది. మధ్యప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్‌లలోని ప్రాంతాల్లో ఈ ప్రభావం కనిపిస్తోంది. 'ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. ప్రస్తుతం తీర ప్రాంతాలు, కర్ణాటకలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. మరాఠ్వాడ, మధ్య ప్రదేశ్‌లలోనూ వర్షాలు మొదలయ్యాయి. పరిస్థితులు మెరుగు పడతాయని ఆశిస్తున్నాం'అని ఐఎండీ డైరెక్టర్ జనరల్ కేజే రమేశ్ తెలిపారు. నైరుతి రుతుపవనాలు ద్వితీయార్థంలో దీర్ఘకాల సగటుకు సమానంగా వర్షాలు కురిపిస్తాయని గత వారం ఐఎండీ అంచనా వేసింది. ఆగస్టులో 99 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపింది. మరోవైపు రుతుపవనాలు పుంజుకుంటున్నాయని భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి మాధవన్ రాజీవన్ ట్వీట్‌చేశారు. వచ్చే రెండు వారాలపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో పుష్కలంగా వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. లోటు వర్షపాతం తీరిపోతుందని చెబుతూ.. కొన్నిచోట్ల వరదలకు అవకాశముందని హెచ్చరించారు. కర్ణాటక ఉత్తర, దక్షిణ ప్రాంతాలు (20 నుంచి 25 శాతం), మహారాష్ట్రలోని మరాఠ్వాడ, విదర్భ (32 శాతం) లోటు వర్షపాతమున్నట్లు ఐఎండీ తెలిపింది.

జాతీయగీతాన్ని అవమానించిన ముగ్గురిపై కేసు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: సినిమా థియేటర్‌లో జాతీయగీతం వస్తున్న సమయంలో లేచి నిలబడకుండా అగౌరవపర్చిన ముగ్గురు విద్యార్థులపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి చెందిన ఒమర్ ఫైజల్, ముదాబీర్ షబ్బీర్, జమునుగల్‌లు హైదరాబాద్ రేతిబౌలీలో ఉంటున్నారు. ఈ ముగ్గురు చేవెళ్లలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదవుతున్నారు. ఆదివారం సాయంత్రం అత్తాపూర్‌లోని మంత్రామాల్ థియేటర్‌లో సినిమా చూడడానికి వచ్చారు. సినిమా ప్రారంభానికి ముందు జాతీయగీతం వస్తున్న సమయంలో ప్రేక్షకులంతా లేచి నిలబడగా.. ఈ ముగ్గురు స్నేహితులు కూర్చొనే ఉన్నారు. తోటి ప్రేక్షకులు వారిని ప్రశ్నించగా దురుసుగా సమాధానమివ్వడంతో థియేటర్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాహకులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు జాతీయగీతాన్ని అగౌరవపర్చడంపై కేసు నమోదు చేసినట్లు చేశారు.

బెట్టింగ్ కేసులో వైకాపా ఎమ్మెల్యేలకు నోటీసులు

ఈనాడు, నెల్లూరు: నెల్లూరు జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో దర్యాప్తు ముమ్మరమైంది. ఇద్దరు వైకాపా ఎమ్మెల్యేలను ఈ కేసులో ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఆదివారం నోటీసులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఈ వ్యవహారాలతో నేరుగా సంబంధం ఉన్న వారినే పోలీసులు విచారించారు. తాజాగా నెల్లూరు పట్టణ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. వీరు నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఉండటంతో సీఐ, ఇద్దరు ఎస్‌ఐలను అక్కడికి పంపారు. నోటీసులను ఎమ్మెల్యేలకు ఇచ్చి అందినట్లుగా ధ్రువీకరణ కూడా తీసుకున్నారు.

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 21-8-2017 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 12

రూ. 5-00. పేజీలు 16+16

www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఉతికారేసిన ధావన్, కోహ్లి

9 వికెట్ల తేడాతో శ్రీలంకపై టీమ్ఇండియా జయకేతనం

- వివరాలు ఛాంపియన్‌లో

థాయ్.. జాయ్

హైదరాబాద్‌లో మసాజ్ ముసుగులో వ్యభిచారం

- స్పాలలో అసాంఘిక కార్యకలాపాల గుట్టురట్టు
- 12 చోట్ల దాడులు, 65 మంది మహిళల గుర్తింపు
- 34 మంది థాయ్‌లాండ్ యువతులు
- ఉద్యోగాల ఆశ చూపి రప్పించినట్టు దర్యాప్తులో వెల్లడి
- శాశ్వత సభ్యత్వానికి రూ.లక్ష
- 300-500 మంది వరకు సభ్యులు
- 19 మంది నిర్వాహకుల అరెస్టు



బాధిత యువతులను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

ఈనాడు – హైదరాబాద్

డ్రగ్స్ కలకలం నుంచి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న హైదరాబాద్‌కు మరో కుదుపు.. స్పాల పేరుతో.. మర్దన మాటున సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలు బహిర్గతమయ్యాయి. పలు స్పాలలో థాయ్ మసాజ్ ముసుగులో వ్యభిచారం జరుగుతోందంటూ సైబరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్యకు అందిన ఫిర్యాదుల మేరకు మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ఠాణాల పరిధిలో సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి శనివారం రాత్రి 12 స్పాలలో దాడులు నిర్వహించారు. థాయ్‌లాండ్‌తో పాటు పంజాబ్, హైదరాబాద్, ఈశాన్య రాష్ట్రాల నుంచి యువతుల్ని ఉద్యోగాల పేరుతో మభ్యపెట్టి వ్యభిచారం చేయిస్తున్నట్లు గుర్తించారు. విదేశీ యువతుల్ని (మిగతా 2లో)



రామప్ప దేవాలయం

అద్భుత శిల్పకళకు ఆపద

రామప్ప దేవాలయ పరిరక్షణపై ఉదాసీన వైఖరి

ఈనాడు-వరంగల్, వెంకటాపూర్-న్యూస్‌టుడే

కాకతీయుల అద్భుత కట్టడం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. 800 ఏళ్ల ఘన చరిత్ర గల శిల్ప సంపద ఎవరికీ పట్టడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ మండలంలో కొలువై ఉన్న ప్రఖ్యాత రామప్ప ఆలయం పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా ఆలయ వాయవ్య దిశలోని ప్రహరీ 40 మీటర్ల మేర కూలడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. 2014లోనూ తూర్పు ముఖద్వారం నుంచి ఆలయానికి ప్రవేశించే భాగం కూలిపోయింది. అప్పట్లో కూలిన ప్రాంతాన్ని మరమ్మతు చేసి పురావస్తు శాఖ చేతులు దులిపేసుకుంది. గత కొన్నేళ్లుగా వర్షాలు కురుస్తున్న సమయంలో రామప్ప ప్రధానం ఆలయంలోని పలుచోట్ల పై నుంచి నీటి ధారలు కురిసేవి. ఇలా రాతి గోడలు, స్తంభాల నుంచి నీరు రావడం ఆలయం ఉనికికే ప్రమాదమని విమర్శలు వెల్లువెత్తడంతో పురావస్తు శాఖ తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. మూడు సార్లు మరమ్మతులు చేసినా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు గతేడాది నీరు కురవడం అరికట్టగలిగారు. ఇలా తీవ్ర సమస్యలు ఎదురైనప్పుడు మాత్రమే పురావస్తు శాఖ తాత్కాలికంగా స్పందిస్తూ మరమ్మతులు



తాజాగా కూలిన ఆలయ ప్రహరీ

చేస్తోంది. సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. కానీ, పురావస్తు శాఖ, ప్రభుత్వాలు దీనిపై దృష్టిపెట్టడం లేదు. గత ఫిబ్రవరిలోనే రామప్ప ఆలయం 'యునెస్కో' వారసత్వ హోదా పోటీకి ఎంపికైంది. దీనిపై మరింత సమాచారం ఇవ్వాలని ఇటీవలే యునెస్కో కేంద్ర ప్రభుత్వాన్ని (మిగతా 2లో)



నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూర వద్ద మంజీర నుంచి గోదావరికి పరవళ్లు

కరవుతీరా వానలు

- 415 ప్రాంతాల్లో వర్షాలు • పలుచోట్ల కుంభవృష్టి
- రెంజల్, నల్లబెల్లిలో ఒకేరోజు 19 సెంటీమీటర్లు
- గత 2 నెలల్లో ఇదే అత్యధిక వర్షపాతం - 6లో
- నేడు, రేపు కాస్త తగ్గి...తిరిగి పెరగనున్న వర్షాలు

విలాసాలొద్దు

- అయిదు నక్షత్రాల హోటళ్లలో బస చేయొద్దు
- ప్రభుత్వ రంగ సంస్థల కార్లూ వాడొద్దు • సహచరులకు ప్రధాని మోదీ హెచ్చరిక

దిల్లీ: పర్యటనలకు వెళ్లేటప్పుడు అయిదు నక్షత్రాల హోటళ్లలో బస చేయవద్దని ప్రధాని నరేంద్ర మోదీ తన మంత్రివర్గ సహచరులకు హెచ్చరించారు. తమ మంత్రిత్వ శాఖల పరిధిలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఎలాంటి సౌకర్యాలు ఆశించకూడదని, కనీసం అవి సమకూర్చే కార్లను కూడా ఉపయోగించకూడదని గట్టిగా చెప్పారు. బుధవారం మంత్రివర్గ సమావేశం ముగిసిన తరువాత అందర్నీ ఉండాలని చెప్పి ఇలాంటి పనులు చేయొద్దంటూ మందలించారు. కొందరు మంత్రులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అతిథి గృహాల్లో కాకుండా విలాసవంతమైన హోటళ్లలో బస చేస్తుండడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హోటళ్లలో ఉండాలన్న ఆకర్షణకు లోనుకావద్దని, కచ్చితంగా ప్రభుత్వ బంగళాల్లోనే ఉండాలని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి బహుమతులు తీసుకోవడంపైనా హెచ్చరించారు. మంత్రులుగానీ, వారి కుటుంబ సభ్యులుగానీ ప్రభుత్వ రంగ సంస్థల వాహనాలను ఉపయోగిస్తే కఠినంగా వ్యవహరిస్తానని చెప్పారు. అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ (మిగతా 2లో)



వైద్యశాఖలో మూడోవంతు ఖాళీ

- దీర్ఘకాలంగా భర్తీకాని 11,125 పోస్టులు
- 2,778 ఉద్యోగాల భర్తీకి అనుమతి
- 2,281 కొలువులకే టీఎస్‌పీఎస్సీకి ప్రతిపాదనలు
- తాజాగా నియామక ప్రకటన కేవలం 331 పోస్టులకే
- లోపభూయిష్ఠ మార్గదర్శకాలతో తీవ్ర జాప్యం
- ప్రతిపాదనల రూపకల్పనలో వైద్యఆరోగ్య అధికారుల నిర్లక్ష్యం


ఈనాడు – హైదరాబాద్

వైద్య ఆరోగ్యశాఖలో దీర్ఘకాలంగా సుమారు 30శాతం(11,125పోస్టులు) ఖాళీలు వేధిస్తున్నాయి. ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల్లోనూ కలుపుకొని 37,141 పోస్టులుండగా 26,016 మాత్రమే భర్తీ అయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక గతేడాది జులై17న విడుదల చేసిన ఉత్తర్వు ద్వారా 2118పోస్టులు, ఈ ఏడాది మే18న మరో ఉత్తర్వు ద్వారా 660 పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపింది. సర్కారు అనుమతించిన 2778 పోస్టులకు కూడా ఆరోగ్యశాఖ ప్రతిపాదనలు రూపొందించలేదు. 2281 పోస్టుల భర్తీకి మాత్రమే తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)కి ప్రతిపాదనలు పంపించింది. కాగా వీటిలోనూ లోపాలుండడంతో.. నెలలు గడుస్తున్నా అవి



భర్తీకి నోచుకోవడం లేదు.

మానవ వనరుల కొరత: ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లుగా కృషిచేస్తోంది. దాదాపు రూ.200కోట్లకు పైగా విలువచేసే అధునాతన వైద్యపరికరాలను సమకూర్చింది. మాతాశిశు సంరక్షణకు పెద్దపీట వేసిన ప్రభుత్వం 'కేసీఆర్ కిట్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు గర్భిణులకు 4విడతలుగా రూ.12 వేలు(అమ్మాయి పుడితే రూ.13వేలు) నేరుగా ఆ మహిళ ఖాతాలోకే జమచేస్తోంది. ఈ పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మూడు నెలల్లోనే సుమారు 3.60లక్షల మంది గర్భిణులు తమ సమాచారాన్ని ఈ పథకం కింద నమోదు చేసుకున్నారు. ఇదే సమయంలో ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రుల్లోనూ ఓపీ, ఐపీ రోగుల సంఖ్య సుమారు 20శాతం పెరిగింది. సర్కారు దవాఖానాలపై విశ్వాసం పెరుగుతున్న దశలో ప్రభుత్వ వైద్యంలో ప్రధానంగా కనిపిస్తున్న లోటు.. మానవ వనరుల కొరత. అన్నిస్థాయిల (మిగతా 2లో)



రైతుల వివరాలను దరఖాస్తుల సమాచారాన్ని ట్యాబ్‌లో నమోదు చేస్తున్న ఏఈఓ

బినామీలు బయటికొచ్చేనా?

- సమగ్ర సర్వేలో భూ యజమానుల చిరునామాలు గల్లంతు
- కొన్నవారు సర్వేలో నమోదుకు ముందుకు రాని వైనం
- ఇళ్లిల్లు, పొలాల చుట్టూ తిరిగినా తేలని లెక్కలు
- వేసిన పంట కాకుండా మరో పైరు పేరు చెబుతున్న రైతులు
- రెవెన్యూ వివాదాలతో లక్షలాది మంది పేర్ల నమోదు నిలిపివేత - 2లో

భారీ దారి దోపిడీ

- 2 టాటా సుమోల్లో వచ్చి లారీని అడ్డగించిన దుండగులు
- కంటైనర్‌లోని రూ.4.10 కోట్ల సిగరెట్ పెట్టెల అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత డ్రైవర్
- రంగంలోకి 14 పోలీసు బృందాలు

చౌటుప్పల్ గ్రామీణం, హయత్‌నగర్-న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65పై శనివారం అర్ధరాత్రి తర్వాత భారీ దోపిడీ జరిగింది. ఓకంటైనర్ లారీలోని రూ.4కోట్ల విలువైన సిగరెట్ పెట్టెలను గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారు. బాధిత డ్రైవర్ చౌటుప్పల్



దోపిడీకి గురైన కంటైనర్

ఠాణాలో ఫిర్యాదు చేయడంతో ఆదివారం విషయం వెలుగులోకి వచ్చింది. శనివారం రాత్రి 10 గంటల సమయంలో ముషీరాబాద్‌లోని కోస్టల్ రోడ్‌వేస్ లిమిటెడ్ ట్రాన్స్‌పోర్టు నుంచి రేణిగుంటలోని లక్ష్మీపురం పోచమ్మవతి లాజిస్టిక్స్‌కు కంటైనర్ లారీ (కేఏ02ఏడీ1220) బయలుదేరింది. వాహనానికి క్లీనర్ లేడు. అందులో రూ.4.10 కోట్లకు పైగా విలువ చేసే సుమారు 645 సిగరెట్ అట్టపెట్టెలున్నాయి. శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో పెద్దఅంబర్‌పేట వద్దకు రెండు టాటా సుమో వాహనాల్లో వచ్చిన 30 మంది దుండగులు సిగరెట్‌ల లారీని నిలిపారు. లోనికి ఎక్కి బిహార్‌కు చెందిన డ్రైవర్ అఖిలేష్ యాదవ్(33)ను చితకబాదారు. అతడి కళ్లకు గంతలు కట్టి బంధించి, లారీని చౌటుప్పల్ వైపు తీసుకువచ్చారు. కంటైనర్‌లోని సిగరెట్లను మరో లారీలోకి ఎక్కించారు. ఆదివారం తెల్లవారుజామున లారీని కైతాపురం స్టేజి సమీపంలో జాతీయ రహదారి పక్కనే వదిలారు. దండుమల్కాపురం సమీపంలో డ్రైవర్ అఖిలేష్‌ను దించేశారు. డ్రైవర్ కట్లు విప్పుకుని ఓ దాబా (మిగతా 2లో)

ఇక ఆన్‌లైన్‌లోనే ఐఐటీ ప్రవేశ పరీక్షలు

- 2018 నుంచి అమలు - 2లో
- జేఏబీ సమావేశంలో నిర్ణయం

అనాథలంటే అలుసా..?

- బీసీ-ఏగా గుర్తించాలంటూ ప్రభుత్వ ఉత్తర్వులు
- అయినా కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు రెవెన్యూ అధికారుల మీనమేషాలు - 5లో
- 'ఓసీ'గా రాయడంతో ఉన్నత చదువులకూ దూరం

ఎలిమినేడులో మూడో వైమానిక పార్కు

- 300 ఎకరాల్లో ఏర్పాటు
- ప్రభుత్వ నిర్ణయం
- డీపీఆర్ తయారు చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశం



ఎలిమినేడు గ్రామం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మూడో వైమానిక పరికరాల తయారీ పార్కును రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడులో ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 300 ఎకరాల్లో ఈ పార్కును స్థాపించేందుకు త్వరలో సన్నాహాలు చేయనుంది. ప్రస్తుతం ఆదిభట్ల, శంషాబాద్‌లలో వైమానిక పార్కులున్నాయి. వీటిలో 30కి పైగా పరిశ్రమలున్నాయి. కొత్తగా వైమానిక, రక్షణ పరికరాల తయారీ పరిశ్రమలను స్థాపించేందుకు మరికొన్ని సంస్థలు ముందుకొస్తున్నాయి. తమకు స్థలాలు కావాలని దరఖాస్తు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మూడో పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందు కోసం విస్తృత స్థాయిలో స్థల పరిశీలనలు జరిగాయి. రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లోని పలు ప్రాంతాలను అధికారులు సందర్శించి.. ప్రతిపాదలను ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో సమీక్ష జరిగింది. ఎలిమినేడు జాతీయ రహదారికి సమీపంలో, అంతర్జాతీయ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ చదునైన భూములున్నాయి. ప్రస్తుతం ఉన్న వైమానిక పార్కులకు ఇది దగ్గరగా ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన వాటి కంటే ఎలిమినేడు అన్నింటికీ అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం దాని వైపు మొగ్గు చూపింది. శనివారం న్యూకాన్ అంతరిక్ష, రక్షణ ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ మూడో వైమానిక పార్కు ఏర్పాటు విషయాన్ని ప్రకటించారు. కార్యక్రమం అనంతరం కేటీఆర్ ఉన్నతాధికారులతో దాని గురించి చర్చించారు. అందుకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ప్రతిపాదనల ఆమోదం అనంతరం పార్కుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

20 సంస్థలకు స్థలాలు..

కొత్త పార్కులో 20 పెద్ద సంస్థలకు భూములు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు ఇస్తారు. మిగిలిన భూములను చిన్న తరహా పరిశ్రమలకు కేటాయిస్తారు. పార్కులో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులను కల్పిస్తారు. వైమానిక పార్కుల్లో అన్ని హరిత పరిశ్రమలే కావడంతో కాలుష్య సమస్య కూడా ఉండదని అధికారులు వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఈ పార్కుకు శంకుస్థాపన జరుగుతుందని అధికారవర్గాలు తెలిపాయి.

బినామీలు బయటికొచ్చేనా?

ఈనాడు, హైదరాబాద్: బినామీ పేర్లతో భూములు కొన్నవారి వివరాలు రైతు సమగ్ర సర్వేలో బట్టబయలవుతాయని వ్యవసాయ, రెవెన్యూశాఖలు తాజా అంచనాకు వచ్చాయి. రాష్ట్రంలో ఇప్పటివరకూ వ్యవసాయశాఖ నిర్వహించిన ఈ సర్వేలో పలు గ్రామాల్లో భూముల యజమానుల పేర్ల ప్రకారం చిరునామాలు దొరకడం లేదు. వీరి కోసం ఎంత వెదికినా ఎవరూ చెప్పలేకపోతున్నారని వ్యవసాయ విస్తరణ అధికారు(ఏఈఓ)లు ఇప్పటికే వ్యవసాయశాఖకు నివేదించారు. చిరునామాలు దొరక్కపోవడం, ఇతర రెవెన్యూ వివాదాల వంటి కారణాల వల్ల సమగ్ర సర్వే అంతు తేలని కథలా మారింది. గత జూన్ 10 నాటికి సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగిసి రెండు నెలలైనా ఇప్పటికీ రైతులెందరనే లెక్క తేలలేదు. ఇప్పటివరకూ 45.40 లక్షల మంది పేర్ల వివరాలను నమోదు చేశారు. మరో 9 లక్షల మంది రైతుల భూముల వివరాలపై రెవెన్యూ వివాదాలు తేనెతుట్టెల్లా కనిపిస్తున్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా పక్కన పెట్టేశారు.

సమస్యంతా రెవెన్యూ కార్యాలయాల్లోనే...

రైతుల సర్వేలో వాస్తవాలు వెల్లడి కాకపోవడానికి రెవెన్యూ కార్యాలయాల్లో జరుగుతున్న అక్రమాలే కారణమని వ్యవసాయాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఒక రైతు పేరుతో సాధారణంగా రెవెన్యూ కార్యాలయ రికార్డుల్లో ఖాతా సంఖ్య ఉండాలి. అతనికి గ్రామంలో ఎక్కడ ఎన్ని భూములున్నా అదే ఖాతాలో నమోదు చేయాలి. కానీ ఒకే రైతు పేరుతో 2, 3 ఖాతాలు బయటపడుతున్నాయి. వీటిని సమగ్ర సర్వే కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి కంప్యూటర్ తీసుకోవడం లేదు. పలు కుటుంబాల్లో తండ్రి లేదా తాత చనిపోతే వారి పేర్లతో ఉన్న పాసు పుస్తకాలు, రెవెన్యూ ఖాతాల సంఖ్యలను వారసులు లేదా వారి నుంచి కొన్నవారి పేరుతో మార్చలేదు. మార్చినా పాత, కొత్త యజమానుల పేర్లతో ఖాతాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి వాటి నమోదు కూడా ఆగిపోయింది.

ఐదెకరాలకు మించి ఇవ్వడం లేదు...: నిబంధనల ప్రకారం ఐదెకరాలకన్నా ఎక్కువగా ఉంటే పెద్ద రైతుగా గుర్తిస్తారని కొందరు అంతవరకే తమకు భూమి ఉందని నమోదు చేయిస్తున్నారు. అంతకన్నా ఎక్కువ ఉందని నమోదైతే వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం ఇచ్చే ఎకరానికి రూ.4 వేలు అందదన్న అసత్య ప్రచారం జరుగుతోంది. దీని వల్ల కొందరు రైతులు 5 ఎకరాలకు మించి వివరాలు చెప్పలేదని, కానీ రెవెన్యూ రికార్డుల్లో వారి పేరుతో అదనంగా భూమి ఉన్నట్లు గుర్తించామని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఏఈఓ తెలిపారు. దీనికితోడు ఏడాది పాటు సాగు చేసే పత్తి, మామిడి, బత్తాయి, అరటి వంటి పంటల వివరాలు కాకుండా ఖరీఫ్, రబీలో సాగుచేసే తక్కువ కాలంలో పండే పంటల వివరాలు రాయించారు. ఏడాది పాటు సాగు చేసే పంట పేరు రాస్తే ఏడాదికి ప్రభుత్వం రూ.4 వేలే ఇస్తుందని, అలా కాకుండా రెండు పంటల సాగుచేసేవి రాయిస్తే రెండుసార్లు రూ.4 వేల చొప్పున మొత్తం రూ.8 వేలు ఒకే ఏడాదిలో వస్తాయన్న ప్రచారం జరగడం వల్ల రైతులు తప్పుడు వివరాలు చెప్పారు. దీనివల్ల ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం తక్కువగా నమోదైందని ఓ ఉద్యానాధికారి 'ఈనాడు'కు వివరించారు.

అసలు యజమానులెవరు?

తెలంగాణలో వందలాది ఎకరాలకు అసలు యజమానులెవరన్నది ఎవరికీ తెలియడం లేదు. ఉదాహరణకు ఆదిలాబాద్ జిల్లాలో 509 గ్రామాల్లోని 1.32 లక్షల మంది రైతులకు 5.32 లక్షల ఎకరాల వ్యవసాయ భూములున్నట్లు రెవెన్యూ రికార్డుల్లో రాసి ఉంది. కానీ ఇప్పటికీ ఇందులో దాదాపు 20 వేల మంది రైతుల పేర్లు, చిరునామాలు సరిగా దొరకడం లేదు. వీరి పేర్లతో 88 వేల ఎకరాలున్నట్లు తేలింది. ఒక్కో గ్రామం వారీగా ఒక్కో పేరు వారీగా విచారణ చేపట్టారు. జైనథ్ మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివారు 200 ఎకరాలకు పైగా భూముల యజమానుల పేర్లు గల వారి చిరునామాల కోసం ఎంత వెదికినా దొరకడం లేదు. ఉత్తరాది రాష్ట్రాల వ్యక్తుల పేర్లతో ఇవి ఉన్నాయి.

వైద్యశాఖలో మూడోవంతు ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రుల్లోనూ వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు తదితర సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో అత్యవసరంగా మానవ వనరులను భర్తీ చేయకపోతే.. ఆ ప్రభావం కచ్చితంగా వైద్యసేవలపై పడే ప్రమాదం పొంచి ఉంది.

ఆది నుంచీ అయోమయమే

ఏడాది కిందట ప్రభుత్వం అనుమతించిన పోస్టుల భర్తీ వెంటనే జరిగితే వచ్చే రెండేళ్లలో మొత్తం ఖాళీలను భర్తీ చేయడానికి అవకాశముండేది. కానీ వైద్యఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా నెలలు గడుస్తున్నా నియామక ప్రక్రియలో ముందడుగు పడలేదు. వైద్యుల నియామకాలను రాతపరీక్షతో భర్తీ చేయాలా? పరీక్ష లేకుండా పాత విధానంలోనే చేపట్టాలా? అనే సందిగ్ధంలోనే తొలి ఆర్నెళ్లు, ఆతర్వాత స్థానికత సమస్యతో మరికొన్ని నెలలు గడిచిపోయాయి. జాప్యంపై విమర్శలొస్తుండడంతో 8నెలల తర్వాత మార్గదర్శకాలను టీఎస్‌పీఎస్సీకి ఆరోగ్యశాఖ పంపించింది. వీటిలోనూ లోపాలుండడంతో తిరిగి ఆ దస్త్రం వెనక్కి వచ్చింది. ఇంత ప్రాధాన్యతాంశాన్ని అధికారులు తేలిగ్గా తీసుకోవడంపై విమర్శలున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకూ, టీఎస్‌పీఎస్సీ అధికారులకు మధ్య సమన్వయం కొరవడింది. ప్రతిపాదనలు పంపించడానికి ముందే ఇరు శాఖల అధికారులు కూర్చొని అంశాల వారీగా కూలంకుశంగా చర్చించాల్సి ఉండగా.. అసలు ఆదిశగా ప్రయత్నాలే సాగలేదు. ఎట్టకేలకు గతనెలలో ఉన్నతస్థాయిలో ఇరుశాఖల అధికారులు చర్చించుకొని మార్గదర్శక ఉత్తర్వులిచ్చారు. ఆఉత్తర్వులూ వైద్యవిద్య, వైద్యవిధాన పరిషత్ విభాగాల్లోని వైద్యుల పోస్టులకు సంబంధించినవి మాత్రమే కావడం గమనార్హం. ఇటీవల పంద్రాగస్టు కానుకగా టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన నియామక ప్రకటనలో కేవలం వైద్యవిద్య విభాగంలోని 331 వైద్యుల పోస్టులే ఉన్నాయి. మరి మిగిలిన విభాగాల వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పోస్టుల మార్గదర్శకాల సంగతేంటనేది ప్రశ్నార్థకం. అనుమతించిన పోస్టుల భర్తీకే ఇంత జాప్యం జరుగుతుంటే.. ఇక మిగిలిన ఖాళీల నియామకాలెప్పుడు చేపడుతారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

విభాగాల వారీగా మొత్తం ఖాళీలు..

విభాగం	మొత్తం పోస్టులు	భర్తీ	ఖాళీలు
వైద్యవిద్య	9205	5726	3479
ప్రజారోగ్యం	17,148	10882	6266
వైద్యవిధాన పరిషత్	7303	7295	8
ఆయుష్	2697	1706	991
సచివాలయ అధిపతి	17	14	3
ఔషధ నియంత్రణ	202	148	54
ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్	569	245	324
మొత్తం	37,141	26,016	11,125

నియమిత పదవులపై సీఎం కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని మిగిలిన నియమిత పదవుల ఎంపికపై ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు రోజుల పాటు కసరత్తు చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి నియామకాల ప్రక్రియను ఆయన ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు జరిగిన నియామకాల ప్రక్రియను సమీక్షించి, కొత్త నియామకాలను ఆచితూచి జరపాలని నిర్ణయించినట్లు సమాచారం. నియమిత పదవుల్లో పార్టీ నేతలను ఎంపిక చేసినా కొంత మంది సరిగా పనిచేయడం లేదు. కొంత మంది ఛైర్మన్లు తమ వారిపై ఒత్తిడి తెచ్చి సన్మానాలు చేయించుకుంటున్నారనే ఫిర్యాదులు సీఎంకు వచ్చాయి. మరికొంత మంది పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వీటన్నింటినీ ముఖ్యమంత్రి ఇటీవల సమీక్షించారు. ఎవరు ఎలా పనిచేస్తోంది తెలుసుకున్నారు. కొత్త నియామకాల సందర్భంగా లోటుపాట్లు లేకుండా.. కష్టపడి, అంకితభావంతో పనిచేసే వారికి అవకాశం ఇవ్వనున్నారు. ఇందుకోసం నేతల జాబితాను తెప్పించుకుని, పేర్లను పరిశీలించారు. ప్రధానంగా పార్టీ కార్యక్రమాలు, విద్యార్థి సభ్యత్వ నమోదు, ఆయా జిల్లాల్లో, నియోజకవర్గాల్లో బాగా పనిచేస్తున్న వారిని గుర్తించారు. మైనారిటీలకు సంబంధించి నియమిత పదవుల కోసం పార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన జాబితాల్లో గందరగోళం ఏర్పడింది. కొంత మంది ఎమ్మెల్యేలు పార్టీకి సంబంధం లేని వారి పేర్లను సిఫార్సు చేశారు. దీంతో సీఎం.. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఇతర మైనారిటీ నేతలతో సమావేశమయ్యారు. పార్టీలో పనిచేస్తున్న మైనారిటీ నేతల పేర్లను జిల్లాల వారిగా సేకరించాలని, ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో చర్చించి, అర్హులైన వారి పేర్లనే ఇవ్వాలని సూచించారు. నియమిత పదవుల పందేరాన్ని 26 నుంచి ప్రారంభించి వచ్చే నెలాఖరు వరకు పూర్తి చేయాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం.

ఆర్టీఐ, మానవహక్కుల కమిషన్ నియామకాపైనా...: సమాచార హక్కుచట్టం కమిషనర్లు, మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ సభ్యులు, బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్, సభ్యుల వంటి వాటి నియామకాలపైనా సీఎం దృష్టి సారించారు. విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయనిపుణులు, విద్యావంతులు, సామాజిక, న్యాయ రంగాల్లో పరిజ్ఞానంతో పాటు తెలంగాణపై నిర్మాణాత్మక ధోరణి, తెరాసతో సన్నిహిత సంబంధాలు గల వారికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిసింది. పాత్రికేయులు కొందరు పదవులను కోరుతున్నా... దీని వల్ల పార్టీ శ్రేణులతో పాటు ఇతర వర్గాల నుంచి వ్యతిరేకత వస్తుందనే భావనతో వారికి అవకాశం ఇవ్వరాదని సీఎం నిర్ణయించినట్లు సమాచారం.

ఎమ్మెల్యేలకూ పదవులు: పార్టీ ఎమ్మెల్యేలలో మరికొందరికి నియమిత పదవులు ఇవ్వనున్నారు. పార్టీ రాష్ట్ర, నియోజకవర్గ కమిటీల నియామకాలను సైతం నియమితపదవులతో పాటే జరుపనున్నారు.

భారీ దారి దోపిడీ



(మొదటి పేజీ తరువాయి)

యజమాని సాయంతో పోలీసులకు చరవాణిలో సమాచారం అందించారు. వెంటనే చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నవీన్‌కుమార్ రంగంలోకి దిగారు.

దర్యాప్తు ముమ్మరం: పోలీసులు డ్రైవర్ నుంచి కంటైనర్ నంబరును సేకరించారు. ఆ వాహనానికి జీపీఎస్ సౌకర్యం ఉండటంతో ఆచూకీ లభ్యమైంది. కైతాపురం స్టేజీ సమీపంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలో దుండగులు లారీని వదిలివెళ్లే దృశ్యాలు నమోదయ్యాయి. జాతీయ రహదారిపై ఇతర సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. రాచకొండ జాయింట్ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి, యాదాద్రి డీసీపీ పాలకుర్తి యాదగిరి, రాచకొండ క్రైం డీసీపీ జానకి, చౌటుప్పల్ ఏసీపీ స్నేహిత ఘటనాస్థలాన్ని సందర్శించారు. పోలీసు జాగిలం వచ్చింది. క్లూస్‌టీం అధికారులు వేలిముద్రలను సేకరించారు. సిగరెట్ పెట్టలను మరోవాహనంలోకి మార్చడానికి ఎక్కువ మంది దుండగులు రావడం చూస్తుంటే ఇది తెలిసిన వారి పనే అయి ఉంటుందని ఓ పోలీసు అధికారి 'న్యూస్‌టుడే'తో వ్యాఖ్యానించారు. వాహనంలో క్లీనర్‌ను నియమించకపోవడం రవాణా సంస్థ వారి నిర్లక్ష్యం కూడా ఉందన్నారు. పెద్దఅంబర్‌పేటలో దుండగులు లారీని అటకాయించిన నేపథ్యంలో కేసును హయత్‌నగర్ పోలీసులే నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు సీసీఎస్, ఎస్ఓటీ, క్రైం విభాగాలకు చెందిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు దాదాపు 50 మందితో 14 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులోని వెంట్రుకల పరిశ్రమలో జరిగినఅగ్ని ప్రమాదంలో సుమారు రూ.5కోట్ల నష్టం సంభవించింది. ఆదివారం తెల్లవారుజామున గాయత్రి ఎంటర్‌ప్రైజెస్ వెంట్రుకల కర్మాగారంలో మంటలు చెలరేగాయి.

విలాసాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సహించేదిలేదని తెలిపారు. దాంతో సొంత అవసరాలకు ప్రభుత్వ రంగ సంస్థల వాహనాలను తీసుకురావద్దంటూ కొందరు మంత్రులు వారి సిబ్బందికి చెప్పారు. 2019 ఎన్నికల నాటికి అవినీతి రహిత ప్రభుత్వం అన్న గుర్తింపు ఉండాలన్న లక్ష్యంతో ప్రధాని సహచరులపైనా కఠినంగానే ఉంటున్నారు.

దిల్లీ విమానాశ్రయంలో డ్రోన్ కలకలం

దిల్లీ: దిల్లీ విమానాశ్రయంలో రన్‌వేపై డ్రోన్‌లాంటి వస్తువు కలకలం సృష్టించడంతో అరగంటకు పైగా విమాన కార్యకలాపాల్ని నిలిపివేశారు. ఆదివారం రాత్రి 7 గంటలకు విమానం దిగుతున్న సమయంలో ఎయిర్ ఏషియా పైలట్ డ్రోన్‌లాంటి వస్తువును గుర్తించి అధికారులకు సమాచారమందించారు. దీంతో 40 నిమిషాలపాటు విమాన కార్యకలాపాలు నిలిపివేయడంతో పలు విమానాలను దారి మళ్లించారు. అనంతరం రాత్రి 7.55కు సర్వీసులు పారంభమయ్యాయి.

ఇక ఆన్‌లైన్‌లోనే ఐఐటీ ప్రవేశ పరీక్షలు

చెన్నై: ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) సంస్థల ప్రవేశ పరీక్షలు 2018 నుంచి పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరగనున్నాయి. ఆదివారం ఇక్కడ జరిగిన ఉమ్మడి ప్రవేశ మండలి (జాయింట్ అడ్మిషన్ బోర్డు- జేఏబీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని 23 ఐఐటీల ప్రవేశాలపై ఈ మండలే విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటుంది. "2018 నుంచి జేఈఈ (అడ్వాన్స్‌డ్) పరీక్షలు ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని నిర్ణయించాం. త్వరలో ఇతర సమాచారం అందజేస్తాము"ని జేఏబీ-2017 ఛైర్మన్ అయిన ఐఐటీ-మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ భాస్కర రామమూర్తి వెల్లడించారు. "పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకనం సులువుగా ఉండాలన్న ఉద్దేశంతోనే జేఈఈ (అడ్వాన్స్‌డ్)ను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నా"మని జేఏబీ సభ్యుడు ఒకరు చెప్పారు. ఈ విధానాన్ని అమలు చేయాలని గత కొనేళ్లుగా చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు తగిన సౌకర్యాలు కల్పించాల్సి ఉందని చెప్పారు. ఈ ఏడాది 13 లక్షల మంది విద్యార్థులు జేఈఈ (మెయిన్స్) రాయగా, అందులో ఐఐటీ ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ (అడ్వాన్స్‌డ్)ను 2.2 లక్షల మంది రాశారు. ప్రస్తుతం సంప్రదాయ కలం-కాగితం విధానంతో పాటు, కంప్యూటర్ ద్వారా కూడా పరీక్ష రాసే విధానాలను అమలు చేస్తున్నారు. చాలా మంది కలం-కాగితం పద్ధతినే అనుసరిస్తున్నారు. ఇకపై పూర్తిగా కంప్యూటర్ ద్వారా, కాగిత రహితంగా జరుగుతాయి. "దీనివల్ల వేగంగా ఫలితాలు వెలువడుతాయి. నిజాయితీగా మూల్యాంకనం ఉంటుంది. పారదర్శకత నెలకొంటుంది. ప్రశ్నపత్రాల ముద్రణలో తప్పులు వచ్చే సమస్య ఉండదు. ప్రశ్నపత్రాల లీకేజీ బెడద ఉండద"ని జేఏబీ సభ్యుడు వివరించారు. ప్రశ్న పత్రాల్లో తప్పులు దొర్లడం కారణంగా జవాబు రాసినా రాయకపోయినా ఈ ఏడాది మద్రాస్ ఐఐటీ 18 బోనస్ మార్కులు ఇవ్వాల్సి వచ్చింది. దీనిని సవాలు చేస్తూ ఓ విద్యార్థి సుప్రీంకోర్టుకు వెళ్లారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూస్తామని మద్రాస్ ఐఐటీ హామీ ఇచ్చింది. అందులో భాగమే ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ అని ఒక అధికారి వివరించారు.

సమాధానానికే కాదు.. విధానానికీ మార్కులు: విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం..ఈ సమావేశంలో ప్రశ్నపత్రాల రూపకల్పన, మూల్యాంకనం విధానాలపైనా చర్చించారు. ప్రతియేటా ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లడం, వాటికి బోనస్ మార్కులు ఇవ్వడం సమస్యగా మారింది. అందువల్ల ప్రశ్నపత్రం విధానంలో మార్పులు చేయడంపై చర్చలు జరిపారు. కేవలం ప్రశ్నలకు రాసిన సమాధానాల ఆధారంగానే కాకుండా, వాటిని పరిష్కరించడానికి అనుసరించిన పద్ధతులను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న సలహా వచ్చింది. 'ఒక అభ్యర్థి ప్రశ్నకు సమాధానం రాయడానికి ప్రయత్నం చేశాడు. కానీ సరయిన సమాధానం రాలేదు. అయితే సమస్యను పరిష్కరించడానికి ఆయన అనుసరించిన పద్ధతి సరయినదా, కాదా అని పరిశీలించాలి. ఒకవేళ సరయిన పద్ధతే అనుసరిస్తే తగిన మార్కులు ఇవ్వాల'న్న సూచన కూడా వచ్చింది.

ప్రశ్నల నిధి ఏర్పాటు: అభ్యర్థుల ప్రయోజనార్థం ప్రశ్నల నిధి ఏర్పాటు చేయాలన్న సూచన కూడా వచ్చింది. ప్రశ్నలను వాటి క్లిష్టతలను అనుసరించి 1 నుంచి 10శ్రేణులుగా వర్గీకరించాల్సి ఉంటుంది. వాటికి ఇచ్చే సమాధానాలను అనుసరించి అభ్యర్థి సామర్థ్యాన్ని అంచనా వేయాల్సి ఉంటుంది. అమెరికాలో డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించే స్కాలస్టిక్ అప్టిట్యూడ్ టెస్ట్ (ఎస్ఏటీ)లో ఇలాంటి విధానం అనుసరిస్తారు.

పాత పద్ధతిలోనే జేజీఈ (మెయిన్): జేఈఈ (అడ్వాన్స్‌డ్)కు తొలి దశ అయిన జేజీఈ (మెయిన్) పరీక్షలను సీబీఎస్ఈ నిర్వహిస్తుంది. ఇవి పాత పద్ధతిలోనే జరుగుతాయి. కలం-కాగితం, కంప్యూటర్ ఏదో ఒక విధానాన్ని అభ్యర్థులు ఎంచుకోవచ్చు.

కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఉగ్రవాదులు ఆదివారం రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరిని కాల్చి చంపారు. మృతుల్లో ఒకరు కేబుల్ ఆపరేటర్ కాగా రెండో వ్యక్తి కౌమారప్రాయుడు. కాల్పులు జరిపిన ఉగ్రవాదులెవరో గుర్తించారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

థాయ్.. జాయ్

(మొదటి పేజీ తరువాయి)

పర్యాటక వీసాపై తీసుకొచ్చి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేల్చారు. ఆయా స్పాలలో పారదర్శకంగా కనిపించేలా గ్లాస్, సీసీ టీవీలు, వినియోగదారుల రిజిస్టర్లు లేకపోవడంతోపాటు మసాజ్ టేబుల్స్‌కు బదులుగా పడకలను ఏర్పాటుచేయడాన్ని దాడుల సందర్భంగా గుర్తించారు. భవిష్యత్తులో తిరిగి వ్యభిచారం కొనసాగించకుండా ఉండేందుకు ఆయా స్పాలను సీజ్ చేయించాలని నిర్ణయించారు. మొత్తం 65 మంది యువతుల్ని రెస్క్యూ హోంకు తరలించిన పోలీసులు 19 మంది నిర్వాహకుల్ని అరెస్టు చేశారు. బాధితురాళ్లకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం డిపోర్ట్ చేయాలని నిర్ణయించారు. ఆయా స్పాల నుంచి రూ.3.38 లక్షల నగదు, ల్యాప్‌టాప్‌లు, స్వైపింగ్ యంత్రాలు, వినియోగించిన కండోమ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ముంబయిలో మసాజ్.. ఇక్కడ ఏర్పాటు: ఈ వ్యభిచార ముఠాకు నగరానికే చెందిన దాసరి సిద్ధార్థ్ నాయకుడని పోలీసులు గుర్తించారు. బంజారాహిల్స్ నందగిరి హిల్స్‌లోని ఆదిత్య మౌంట్ క్యాసిల్‌లో ఉంటున్న సిద్ధార్థ్..2013 నుంచి ఈ దందా సాగిస్తున్నట్లు తేల్చారు. నగరంలో పేరుగాంచిన ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన ఇతను..ఐర్లాండ్‌లో ఎంటెక్ చదివాడు. ముంబయిలో మసాజ్ కోసం స్పాకు వెళ్లిన అనుభవంతో..వాటిని ఇక్కడ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చాడు. స్పాలలో వ్యభిచారం చేయిస్తే భారీగా లాభాలొస్తాయని భావించి..తొలుత ముంబయి, తమిళనాడు చెంబూరులలో స్పాలను లీజుకు తీసుకున్నాడు. అక్కడ నష్టం రావడంతోపాటు..గత ఏడాది చెంబూరు పోలీసులు ఈ అక్రమ వ్యాపారాన్ని గుర్తించి సిద్ధార్థ్‌ను అరెస్ట్ చేశారు.

థాయ్ మహిళ పరిచయంతో కొత్త పుంతలు: ఈ క్రమంలో ముంబయిలో థాయ్‌లాండ్‌కు చెందిన మహిళ 'కాకే'తో పరిచయమైంది. థాయ్ మహిళలతో మసాజ్ చేయిస్తే వినియోగదారులను సులభంగా ఆకర్షించవచ్చన్న ఆమె ఆలోచనను అమలు చేయాలన్న నిర్ణయానికొచ్చాడు. ఈ ముసుగులో వ్యభిచార దందా నడిపేందుకు సిద్ధమయ్యాడు. అనుకున్న ప్రకారం కాకే ఉద్యోగాలు ఆశచూపి థాయ్‌లాండ్ నుంచి యువతుల్ని ఇక్కడికి పంపడంతో.. ఈసారి హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో మూడు, జూబ్లీహిల్స్‌లో నాలుగు, బెంగళూరులో ఒకటి చొప్పున స్పాలను ప్రారంభించాడు. 'థాయ్ యువతులకు బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఓ బహుళ అంతస్తుల భవనంలో వసతి కల్పించడంతోపాటు..నెలకు రూ.25వేల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నట్లు, వారి వీసాలను లాక్కోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు ఈ అక్రమ కార్యకలాపాల్ని కొనసాగిస్తున్నట్లు' పోలీసులు గుర్తించారు. తన అక్రమ వ్యాపారానికి సహకరించేందుకు సర్ఫరాజ్ అలీ, వినయ్, అజయ్‌లతో సిద్ధార్థ్ ముఠా ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. 'ఈ దందాలో ఇతడు నెలకు సుమారు రూ.90 లక్షలు ఆర్జిస్తున్నాడని పోలీసులు తెలపడం' అతని వ్యాపారం మూడు స్పాలు..ఆరు వ్యభిచారాలు అన్నట్టు సాగుతోందనేందుకు నిదర్శనం.

దాడులు నిర్వహించిన స్పాలు ఇవే..

- గచ్చిబౌలి ఠాణా: సప్త(సూరజ్ టవర్స్), తంత్ర(గచ్చిబౌలి ఫ్లైఓవర్), అవురా(కొత్తగూడ రోడ్), మోహ్(హిమగిరి హాస్పిటల్ ఎదుట), మంధర(కేవస్ బేకర్స్ పక్కన), వి(ఐసీఐసీఐ బ్యాంకుపైన)
- మాదాపూర్ ఠాణా: సప్త(హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పైన), అవురా(సైబర్ టవర్స్ రోడ్), తంత్ర(డిమార్ట్ ఎదురు), బ్లిజ్(లక్మే సెలూన్ పక్కన), మోహ్(ఇమేజ్ గార్డెన్స్ పక్కన), న్యూ రివైవ్(డిమార్ట్ పక్కన)

అద్భుత శిల్పకళకు ఆపద


రామప్ప ఆలయం పక్కనే కామేశ్వరాలయం నిర్మించాల్సిన స్థలం

(మొదటి పేజీ తరువాయి)

కోరింది. ఈ నేపథ్యంలో రామప్ప పరిరక్షణపై మరింత దృష్టిపెట్టాల్సిన అవసరముంది.

పనులు నిలిచిపోయాయి...: రామప్ప ఆలయం పక్కనే ఉన్న కామేశ్వరాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణం కోసం 2012లో పనులు ప్రారంభించారు. మొదట శిథిలమైన గోడల్ని, స్తంభాల్ని తొలగించి అచ్చం అలాగే కట్టాలని నిర్ణయించారు. పునర్నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని పురావస్తు శాఖ ప్రకటించింది. ఆలయాన్ని పూర్తిగా విప్పి పక్కన బెట్టారు. ఇప్పటికీ ఐదేళ్లు గడచిపోయినా పనులు ప్రారంభించలేదు. శిల్పాలన్నీ చిందరవందరగా ఆ ప్రాంగణంలోనే వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. రామప్ప ఆలయాన్ని సందర్శించే వారికి సరైన వసతులు కల్పించలేకపోతున్నారు. నిత్యం పెద్ద సంఖ్యలో యాత్రికులు దూరప్రాంతాల నుంచి వస్తున్నారు. ఇక్కడున్న రెండు మరుగుదొడ్లు సరిపోక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. సరైన తాగునీటి వసతి లేదు. రామప్పకు రావాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కు.

సొరంగాన్ని నిలిపేశారు...: దేవాదుల ఎత్తిపోతలలో భాగంగా జయశంకర్ జిల్లా భీంఘన్‌పూర్ నుంచి రామప్ప చెరువు వరకు ఒక సొరంగాన్ని తవ్వాలనుకున్నారు. 2011లో దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశలో భాగంగా రూ.531 కోట్ల అంచనాతో పనులు కూడా ప్రారంభించారు. ఈ పనుల కోసం రూ.50 కోట్ల వరకు ఖర్చు చేశారు. అయితే, సొరంగం పనులు చేపడుతున్న క్రమంలో బాంబుల మోతకు ఆలయానికి ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరించడంతో సొరంగం తవ్వకాన్ని విరమించుకున్నారు. అలైన్‌మెంటు మార్చి, సొరంగానికి బదులు మూడు వరుసల పైపులైన్‌లు నిర్మించాలని నిర్ణయించారు. మరో రూ.600 కోట్లు అదనంగా వెచ్చించాల్సి వచ్చినా ప్రభుత్వం ఖర్చు చేయడానికి సిద్ధపడింది. ఆలయానికి ఇంతటి ప్రాధాన్యమున్నా.. పురావస్తు శాఖ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలో గోడ నిర్మిస్తాం

–మల్లేశం, ఫోర్‌మెన్, పురావస్తుశాఖ

గోడ ఏ మేరకు కూలిందనే విషయాన్ని పరిశీలిస్తున్నాం. కొలతలు తీసుకుంటున్నాం. త్వరలోనే ప్రహరీని పునర్నిర్మిస్తాం. కామేశ్వరాలయంపై ఇటీవల ఉన్నతాధికారులతో సమావేశమయ్యాం. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం దీనికి నిధులు కేటాయించనుంది. ఆ వెంటనే నిర్మాణం పూర్తిచేస్తాం.

గ్రహం అనుగ్రహం

21-8-2017 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
అమావాస్య: రా. 12-17 తదుపరి భాద్రపద శుక్లపక్ష పాడ్యమి
ఆశ్లేష నక్షత్రం: సా. 4-57 తదుపరి మఖ
అమృతఘడియలు: మ. 3-25 నుంచి 4-57 వరకు
వర్జ్యం: ఉ. 6-09 నుంచి 7-40 వరకు తిరిగి తె. 4-35 నుంచి
దుర్ముహూర్తం: మ. 12-29 నుంచి 1-19 వరకు తిరిగి మ. 3-00 నుంచి 3-50 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5-47; సూర్యాస్తమయం: సా.6-21
పోలాల అమావాస్య

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	21.1	26.2
మహబూబ్‌నగర్	21.6	27.1
ఆదిలాబాద్	21.6	29.0
కరీంనగర్	23.0	27.0
ఖమ్మం	23.0	28.0
సూర్యాపేట	23.0	30.0
తిరుపతి	23.0	35.2
అనంతపురం	23.3	33.3
రామగుండం	23.4	26.8
హన్మకొండ	23.5	28.0
నిజామాబాద్	24.0	30.0

నాలుగో సింహం.. దండోపాయం..!



- సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా రక్షణ నిలయాలు
- ధనార్జనే ధ్యేయంగా అడ్డదారులు తొక్కుతున్న పోలీసులు
- సివిల్ సహా.. అన్ని వివాదాల్లో తలదూరుస్తూ ప్రతిష్ఠకు మచ్చ
- చర్యలు తీసుకుంటున్నా ఆగని పంచాయితీలు
- పోస్టింగ్‌లకు ధర నిర్ణయించడమే కారణమన్న విమర్శలు
- ఫలితమివ్వని ప్రభుత్వ సంస్కరణలు

ఈనాడు - హైదరాబాద్

■ పోకిరి సినిమా గుర్తుందా. అందులో ఓ బిల్డర్‌కి.. ఓ క్రిమినల్ మధ్య పోలీస్‌మార్క్ సెటిల్‌మెంట్ జరుగుతుంది. సహాయం చేయమని బిల్డర్ అర్థించగా కానిస్టేబుల్‌తో ఆ క్రిమినల్‌ని బిల్డర్ సమక్షంలో కాల్పిస్తాడు ఓ పోలీస్ అధికారి. వివాదం సంగతటుంచి.. ఆ మర్డర్ కేసు కూడా నీ మీదే బనాయిస్తానని భయపెట్టి **పద్మావతి పేరుమీద** కోటి రూపాయల విలువైన ఫ్లాట్ రాయమని పురమాయిస్తాడు.

■ పోనీ.. అత్తారింటికి దారేది సినిమాని ఓ సారి మననం చేసుకోండి. అప్పు తీసుకున్న పాపానికి.. మహిళను హోటల్‌కి పిలిపించి.. బెదిరించి మరీ ఆమె పేరుమీదున్న హోటల్‌ను అప్పు ఇచ్చిన వ్యక్తి పేరుమీద రాయించే క్రతువును ఓ పోలీస్ అధికారి దగ్గరుండి మరీ నడిపిస్తాడు.

ఆ.. అవి సినిమాలు కదా. నిజ జీవితంలో అలా జరుగుతుందా? అని అనుకుంటే పొరపడినట్టే. సినిమాలు చూసి పోలీసులు స్ఫూర్తిపొందారో? అలాంటి వాళ్లను చూసి సినిమాలు తీశారో తెలియదు గానీ.. ప్రస్తుతం పలువురు పోలీసులు ఇదే తరహా సెటిల్‌మెంట్లలో తలమునకలై ఉన్నారు. విలువలు మరిచి.. వృత్తి ధర్మాన్ని కాలరాస్తూ.. ధనార్జనే పరమావధిగా ఆ శాఖ పరువు తీస్తున్నారు. సామ.. దాన.. దండోపాయాలు ఉపయోగించి.. బాధితులకు రక్షణ కల్పించాల్సిన రక్షణ నిలయాలనే సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా మారుస్తున్నారు. **దండకాల కోసం 'దండో'పాయాన్ని అమలుచేస్తున్నారు.** ఖాకీ క్రౌర్యం ప్రదర్శించో.. లాఠీకి పనిచెప్పో.. అవసరమైతే తుపాకీ గురిపెట్టి అయినా తాము కోరుకున్న వ్యక్తి కోరిన పని చేసిపెడుతున్నారు. వెలుగు చూస్తున్న ఉదంతాలు కొన్నే అయినా.. బయటపడనవి ఎన్నో నాలుగు గోడల మధ్య జరిగిపోతున్నాయి. ఇటీవల కలకలం సృష్టించిన బ్యూటీషియన్ శిరీష ఆత్మహత్య.. తర్వాత ఎస్సై ఆత్మహత్యల ఘటనలు దీనికి పరాకాష్ఠ.



సాధారణంగా అన్యాయం జరిగిన వారు పోలీసులను ఆశ్రయిస్తారు. న్యాయం చేయమని వేడుకుంటారు. వాస్తవంగా పోలీసులు చేయాల్సిన పని కూడా ఇదే. చట్టబద్ధంగా తమకు సంక్రమించిన అధికారాన్ని ఉపయోగించి నిందితులను అదుపులోకి తీసుకొని, విచారించి, అవసరమైతే అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంది. ఇన్ని అధికారాలు ఉన్నాయనే పోలీసులంటే అందరూ భయపడతారు. బాధితుల కోసం ఉపయోగించాల్సిన ఈ అధికారాన్ని కొందరు పోలీసు అధికారులు తరచూ నిందితుల కోసం వాడుతున్నారు. తమకు లాభం జరుగుతుందన్న దురుద్దేశంతో బాధితుడికి స్వాంతన చేకూర్చేందుకు బదులుగా.. అన్యాయం చేస్తున్నారు. సివిల్ వివాదాల్లో తలదూర్చవద్దన్న న్యాయస్థానాల ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. నిందితులకు మేలు చేస్తూ.. తాము లాభపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వివాదాల్లో తలదూరుస్తున్నారు. బదిలీలలో పైరవీలకు స్థానం లేకుండా చేయనంత కాలం పరిస్థితిలో మార్పు రాదన్న వాదన ఉంది.

పైరవీలే.. చేటు తెస్తున్నాయా?

హైదరాబాద్ కమిషనరేట్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ పోలీసు పోస్టింగుల కోసం పెద్దఎత్తున పైరవీలు నడుస్తున్నాయి. ఆదాయాన్ని బట్టి పోస్టింగ్ ధరను నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు తమ వారికి తమకు ఇష్టమైన చోట ఇప్పించుకుంటున్నారు. ఎస్సై పోస్టు ధర రూ.5 నుంచి రూ.10 లక్షల వరకూ పలుకుతోందన్న విమర్శలున్నాయి. అంత సొమ్ము వెచ్చించి పోస్టింగు తెచ్చుకుంటున్న పోలీసులు అంతకుఅంత సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తు



హైదరాబాద్ ఫార్ములా వినియోగిస్తేనే

అన్ని ప్రాంతాల్లో పోలీసు సెటిల్‌మెంట్లు జరుగుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా హైదరాబాద్ కమిషరేట్ పరిధిలో మాత్రం పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. పోలీస్‌స్టేషన్లో అనధికారిక కార్యకలాపాలేవీ జరగకుండా ఉన్నతాధికారులు అనేక చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితుల ఫోన్ నెంబర్ల ఆధారంగా కమిషరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ నుంచి ఫోన్ చేసి విచారిస్తున్నారు. స్టేషన్లో సిబ్బంది ఎలా వ్యవహరించారు? సమస్య పరిష్కారమైందా? తదితర వివరాలు ఆరాతీస్తున్నారు. ప్రవర్తన బాగాలేదని ఫిర్యాదు వచ్చిందే తడవుగా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నారు. సివిల్ వివాదాల వంటి వాటికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి దిగుతున్నారు. ప్రజలు నేరుగా ఉన్నతాధికారులను సంప్రదించే ఏర్పాట్లూ చేయడంతో.. పొరపాటు చేస్తే తెలిసిపోతుందన్న భయం కిందిస్థాయి సిబ్బందిలో నెలకొంది. ఈ తరహా ఏర్పాట్లు జిల్లాల్లోనూ ఏర్పాటు చేస్తే తప్ప పరిస్థితిలో మార్పు రాదన్న అభిప్రాయం అధికారుల్లో ఉంది.

సీఎం చెప్పినా.. తీరు మారలేదు

వాస్తవానికి తెరాసా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుశాఖకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చింది. స్నేహపూర్వక పోలీసింగ్ పేరుతో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. సిబ్బందికి ఎలాంటి లోటు లేకుండా చూసే క్రమంలో రూ.వందలకోట్లు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసింది. కొత్త భవనాలూ నిర్మిస్తోంది. ఉన్న భవనాలను అన్ని హంగులతో తీర్చిదిద్దుతోంది. దీంతోపాటు స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది సాధారణ ఖర్చుల కోసం నెలనెలా స్టేషన్ స్థాయిని బట్టి రూ.25 వేల నుంచి రూ.75 వేల వరకూ చెల్లిస్తోంది. ప్రతిగా ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలంటూ ప్రభుత్వం పదేపదే చెబుతోంది. రెండు నెలల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పోలీసులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి ఇదే విషయమై స్పష్టత ఇచ్చారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్.హెచ్.ఒ.లు, వారిపైస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలుంటే చెప్పాలని, నిధులకు కొరత రానివ్వనని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఎన్ని చెబుతున్నా పోలీసులలో మాత్రం ఆశించిన మార్పు రావడంలేదు. ఎక్కడో ఒక చోట వివాదాస్పదంగా ప్రవరిస్తున్నారు. మొత్తంగా పోలీసుశాఖ ప్రతిష్ఠకు మచ్చ తెస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు

■ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అదనపు డీసీపీగా పనిచేస్తున్న పులీందర్‌రెడ్డి కుమార్తె ఐశ్వర్యారెడ్డి పటాన్‌చెరు సమీపంలోని ముత్తంగి గ్రామంలో స్థలం కొనుగోలు కోసం అబూబకర్ అనే వ్యక్తికి రూ.5 లక్షల బయానా చెల్లించారు. ఆ స్థలాన్ని అబూబకర్ తనకు కాకుండా మరొకరికి అమ్మాడని రాయదుర్గం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ఇది సివిల్ వివాదమైనా పోలీసులు రంగంలోకి దిగారు. సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణలు అబూబకర్‌ను స్టేషన్‌కు పిలిపించారు. నిర్బంధించి రూ.60 లక్షల విలువైన చెక్కులపై సంతకాలు చేయించుకున్నారు. ఈ విషయం కమిషనర్ దృష్టికి వెళ్లడంతో.. పులీందర్‌రెడ్డితోపాటు బెదిరింపులకు పాల్పడ్డ సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లపైనా కేసులు నమోదయ్యాయి.

■ సైబరాబాద్ కమిషనరేట్ స్థాయిలోని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన శివప్రదీప్.. రవీంద్రప్రసాద్ నుంచి అప్పు తీసుకున్నాడు. ఈ వివాదంలో తలదూర్చిన ఎస్సై **కోటేశ్వరరావు..** శివప్రదీప్‌ను స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురిచేశాడు. ఆ తాలూకా ఆర్తనాదాలను ఫోన్లో రవీంద్రప్రసాద్‌కు వినిపించాడు కూడా. వ్యవహారం బయటకు పొక్కడంతో.. ఎస్సైతోపాటు.. అతనికి వంతపాడిన ముగ్గురు కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

■ వనస్థలిపురానికి చెందిన సంతోష్‌రెడ్డి తన స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు జీవన్‌రెడ్డి అనే వ్యక్తికి రూ.కోటి చెల్లించాడు. సమయం గడిచిపోతున్నా స్థలం అభివృద్ధి పనులు జరగకపోవడంతో.. ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. జీవన్‌రెడ్డి పోలీసుల సాయం కోరాడు. ఏసీపీ రాములు, ఎస్సై సైదులు కలిసి ఇంటికి పిలిపించి మరీ తనను తీవ్రంగా కొట్టారని, మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కాగితాలపై సంతకాలు పెట్టించుకున్నారని సంతోష్‌రెడ్డి రాచకొండ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. విచారణలో అది నిజమని తేలడంతో ఎస్సై సైదులను సస్పెండ్ చేయడంతోపాటు ఏసీపీ రాములును డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

భారత ట్యాంకు శక్తికి మరింత పదును

దిల్లీ: భారత అమ్ములపొదిలో ప్రధాన యుద్ధ ట్యాంకుగా ఉన్న టి-90.. మరింత శక్తిమంతం కానుంది. ఈ శకటానికి మూడో తరం క్షిపణి వ్యవస్థను జోడించేందుకు సైన్యం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం టి-90 ట్యాంకులో ఇన్‌వార్ క్షిపణి వ్యవస్థ ఉంది. లేజర్ నిర్దేశం ప్రకారం పనిచేసే ఈ అస్త్రం స్థానంలో మరింత మెరుగైన క్షిపణిని అమర్చనున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. కొత్త క్షిపణులు.. రాత్రీ పగలు తేడా లేకుండా 8 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవని పేర్కొన్నాయి. టి-90 ట్యాంకులకు అమర్చిన 125 ఎంఎం తుపాకీ గొట్టాల ద్వారా ఈ అస్త్రాలను ప్రయోగించనున్నట్లు వివరించాయి. ముందుగా ప్రోగ్రామ్ చేసిన మార్గాల్లో ప్రయాణిస్తూ.. ఇవి లక్ష్యాన్ని గురి తప్పకుండా ఛేదిస్తాయని పేర్కొన్నాయి. పర్వత ప్రాంతాల్లో ఈ ట్యాంకు సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు అధునాతన ఇంజిన్‌ను అమర్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు వివరించాయి. సదరు ఇంజిన్ 1200-1500 హెచ్‌పీ శక్తిని కలిగి ఉంటుందని తెలిపాయి. దేశం చుట్టూ నెలకొన్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో గత కొన్ని నెలలుగా భారత సైన్యం సత్తాను మెరుగుపరచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. స్వల్ప కాలం సాగే తీవ్రస్థాయి యుద్ధానికి సన్నద్ధమయ్యేందుకు కీలక మందుగుండు సామగ్రి, ఆయుధ విడిభాగాలను కొనుగోలు చేసే అధికారాన్ని సైనిక ఉప ప్రధానాధికారికి కట్టబెట్టింది. అమెరికా నుంచి ఆరు 'ఆపాచీ' పోరాట హెలికాప్టర్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

ప్రత్యేక బలగాలకు ఏసీ జాకెట్లు!

దిల్లీ: వేడి ప్రాంతాల్లో గంటల తరబడి పనిచేసే భారత ప్రత్యేక దళాల కోసం ప్రత్యేక 'ఏసీ' జాకెట్లను అభివృద్ధి చేశారు. వీటిని పరీక్షిస్తున్నారు. ఈ జాకెట్లను ఏ పదార్థంతో తయారుచేశారన్నది ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. వీటిపై పరీక్షలు జరుగుతున్నట్లు రక్షణశాఖ మాజీ మంత్రి మనోహర్ పారికర్ ధ్రువీకరించారు. ' 'ప్రత్యేక బలగాల కార్యకలాపాల్లో భారీస్థాయిలో శారీరక శ్రమ ఉంటుంది. శరీరం బాగా వేడెక్కుతుంది. సైనికుడు అసౌకర్యానికి గురవుతాడు. అలాంటి సమయంలో అతడి వద్ద ఏసీ జాకెట్ ఉంటే కొంత సౌకర్యంగా ఉంటుంది. దానిపై పరీక్షలు జరుగుతున్నాయి" అని పనాజీలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులకు తెలిపారు. ప్రస్తుతం అమెరికా సైనికులు ఇలాంటి జాకెట్లను ఉపయోగిస్తున్నారు. ఇందులో ఉండే చిన్నపాటి బ్యాటరీ ద్వారా దానికి శక్తి అందుతుంది. భారత్ సొంతంగా తయారుచేసిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్ గురించి ప్రస్తావిస్తూ.. అది అద్భుతమైన లోహ విహంగమని పారికర్ చెప్పారు. అది 3.5 టన్నుల ఆయుధాలను మాత్రమే మోసుకెళ్లగలదని, అదొక్కటే ఇందులో ప్రతికూలాంశమని వివరించారు. 2014 నుంచి 2017 వరకూ రక్షణ మంత్రిగా వ్యవహరించిన పారికర్.. ప్రస్తుతం గోవా ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

నౌకల్లో 'గగన్' దిక్సూచి వ్యవస్థకు కసరత్తు

ముంబయి: భారత వాణిజ్య నౌకల్లో దేశీయ దిక్సూచి వ్యవస్థ 'గగన్'ను ప్రవేశపెట్టబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా నౌకాయాన విభాగం చర్చలు ఆరంభించింది. విమానయాన కార్యకలాపాలు మరింత సమర్థంగా ఉండేలా చూసేందుకు, ఖర్చులను తగ్గించేందుకు గగన్ (జీపీఎస్ ఎయిడెడ్ జియో ఆగ్‌మెంటెండ్ నేవిగేషన్)ను 2015లో ప్రారంభించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ)లు సంయుక్తంగా దీన్ని అభివృద్ధి చేశాయి. ఇందుకు రూ.774 కోట్లు ఖర్చయ్యాయి. అమెరికా లేదా రష్యా దిక్సూచి వ్యవస్థలకు ఇది ప్రత్యామ్నాయంగా అక్కరకొస్తుంది. దేశవ్యాప్తంగాను, బంగాళాఖాతం, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా వరకూ ఇది సేవలు అందిస్తుంది. దీన్ని తొలుత విమానయాన రంగంలో ఉపయోగించే అవకాశం ఉంది. అలాగే నౌకాయాన రంగానికీ దీన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. "నౌకాయానానికి సంబంధించిన అందరితోనూ చర్చలు మొదలుపెట్టాం. దీనిపై ఒక మార్గసూచీని తయారుచేస్తున్నాం' ' అని నౌకాయాన విభాగం డైరెక్టర్ జనరల్ మాలినీ శంకర్ తెలిపారు. అయితే నౌకాయాన రంగంలో 'గగన్'ను తీసుకురావడం అంత తేలిక కాదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దీనికి అనేక అనుమతులు, భారీగా పెట్టుబడులు అవసరమని పేర్కొన్నాయి. నౌకల మార్గనిర్దేశానికి దీన్ని ఉపయోగించాలంటే తొలుత అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంవో) నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. మొదట్లో రేవులకు దగ్గర్లో ఈ వ్యవస్థను ఉపయోగించే అవకాశం ఉంది. 'గగన్'ను వ్యవసాయంలోను, సైనిక దళాలు, భద్రతా సంస్థలు, విపత్తు నిర్వహణ సంస్థలు ఉపయోగించే అవకాశం ఉంది.

ప్రపంచ పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సుకు ఏర్పాట్లు షురూ

- కేటీఆర్ అధ్యక్షతన స్థానిక ఆతిథ్య కమిటీ
- వేదికగా హెచ్.ఐ.సి.సి. ఎంపిక

ఈనాడు, హైదరాబాద్: అమెరికా-భారత్‌ల సంయుక్తాధ్వర్యంలో వచ్చే నవంబరు 28 నుంచి 30వతేదీ వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక ప్రపంచ పారిశ్రామికవేత్తల(వ్యవస్థాపకులు) -2017 వార్షిక శిఖరాగ్ర సదస్సు నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించింది. అమెరికా, భారత ప్రభుత్వాల సూచన మేరకు తెలంగాణ ప్రభుత్వం స్థానిక ఆతిథ్య కమిటీ(లోకల్ హోస్ట్‌కమిటీ)ని ఏర్పాటు చేసింది. దీనికి రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ ఛైర్మన్‌గా, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ కన్వీనర్‌గా ఉంటారు. ప్రభుత్వ సలహాదారు పాపారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్, డీజీపీ అనురాగ్‌శర్మ, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు మహేందర్‌రెడ్డి, సందీప్ శాండిల్య, మహేశ్ భగవత్ సభ్యులు. ఈ కమిటీ రెండుసార్లు సమావేశమైంది. సదస్సు నిర్వహణకు భారత నీతిఆయోగ్ కమిటీ, అమెరికా కాన్సుల్ జనరల్‌ల ఆధ్వర్యంలో మరో రెండు ఉన్నతస్థాయి కమిటీలు ఏర్పాటయ్యాయి. వీటితో రాష్ట్రప్రభుత్వ కమిటీ సమన్వయంతో వ్యవహరిస్తుంది.

వేదిక ఎంపిక: ఈసదస్సుకు వేదికగా మాదాపూర్‌లోని హెచ్.ఐ.సి.సి.ని (హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్) ఎంపిక చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, అమెరికా ప్రభుత్వ కమిటీలు వేదికను పరిశీలించి ఆమోదం తెలిపాయి. సదస్సుకు ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకా, 170 దేశాల నుంచి రెండువేల మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. ఈనేపథ్యంలో భద్రత, వసతులు, ఆతిథ్యం ఇతర అంశాల ఆధారంగా ఈవేదికను ఎంపిక చేశారు. అతిథుల స్వాగతం, మర్యాదలు, వేదిక ఏర్పాట్లు, వసతులు, సౌకర్యాలు, రవాణా, వంటి కీలక బాధ్యతలను స్థానిక ఆతిథ్య కమిటీ నిర్వర్తించనుంది.

పట్టణ ప్రణాళిక సమూల ప్రక్షాళన

- బదిలీలతో తొలి అడుగు
- అవినీతి అధికారులపై చర్యలకు రంగం సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పట్టణ ప్రణాళిక విభాగంలో సమూల ప్రక్షాళనకు పురపాలక శాఖ శ్రీకారం చుట్టింది. సుదీర్ఘకాలంగా ఒకే చోట పాతుకపోయిన అధికారుల బదిలీలతో ఈ ప్రక్రియకు నాంది పలికింది. తెలంగాణ ప్రభుత్వం పురపాలక చట్టాన్ని సవరించిన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలు, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) ఒకే విభాగం కిందకి వచ్చాయి. దీంతో జీహెచ్‌ఎంసీ నుంచి ఇతర పట్టణ స్థానిక సంస్థలకు. వాటి నుంచి జీహెచ్‌ఎంసీకి బదిలీలకు అవకాశం కలిగింది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రణాళికా విభాగంలో ఏసీపీలు, టీపీఓలు, టీపీఎస్‌లు 28 మందిని ఇటీవల బదిలీ చేశారు. జీహెచ్‌ఎంసీలో పాతుకుపోయిన పట్టణ ప్రణాళిక అధికారులను జీహెచ్‌ఎంసీ వెలుపలకు బదిలీ చేశారు. అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వల్లే ఈ బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. పురపాలక శాఖ ఇటీవల పట్టణ ప్రణాళికా విభాగంలో కీలక స్థానాల్లోని అధికారుల పనితీరు, అవినీతిపై అంతర్గతంగా విచారణ జరిపించింది. అనంతరం తొలి విడత బదిలీలు చేసింది. భవన నిర్మాణ అనుమతుల్లో అవినీతికి పాల్పడుతుండటం, నిబంధనలను తుంగలో తొక్కుతూ అనుమతులివ్వడం, ఆక్రమణలపై ఉదాసీనత వంటి అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం శాఖాపరంగా సమగ్రంగా పరిశీలిస్తోంది. భవన నిర్మాణ అనుమతి ఇవ్వడంతోపాటు, ఇచ్చిన అనుమతి మేరకు భవనాలను నిర్మించేలా చూడటం, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం తదితర బాధ్యతల అమలులో పలువురు అక్రమాలకు పాల్పడుతున్నట్లు అంతర్గత పరిశీలనలో గుర్తించారు. ఇలాంటివారిని కీలక స్థానాలనుంచి తప్పించనున్నారు. అవినీతి నిరోధకశాఖ ద్వారా చర్యలకు ఉపక్రమించేందుకు దృష్టి సారించారు. ఇటీవల అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పట్టుబడిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల వద్ద భారీ మొత్తంలో నగదు, అక్రమ ఆస్తులు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో పటిష్ఠమైన ఆధారాలతో అక్రమార్కులపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకున్నామని ముమ్ముందు చాలా మార్పులు ఉంటాయని పురపాలకశాఖలో ఓ ఉన్నతాధికారి తెలిపారు.


సంప్రదాయ రైలు పెట్టెల తయారీకి ఇక స్వస్తి

- ముమ్మందు వచ్చేవన్నీ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లే

దిల్లీ: రైలు ప్రమాదాలు జరిగినప్పుడు పెట్టెలు ఒకదానిలో ఒకటి చొచ్చుకుపోవడం, లేదా ఒకదానిపైకి ఒకటి వెళ్లిపోవడం వల్ల ఎక్కువగా వాటిల్లుతున్న ప్రాణనష్టాన్ని నివారించడానికి అధునాతన 'లింక్ హాఫ్‌మన్ బాస్చ్' (ఎల్‌హెచ్‌బీ) పెట్టెల్ని ఎక్కువగా వాడాలని రైల్వేశాఖ ప్రయత్నిస్తోంది. సంప్రదాయ పెట్టెల తయారీని క్రమంగా విడిచిపెట్టేసి, వీటి ఉత్పత్తిని పెంచనుంది. ఈ దిశగా ఇప్పటికే చర్యల్ని ముమ్మరం చేసింది. ఖతౌలీ తరహా ప్రమాదాలు వాటిల్లినప్పుడు ప్రాణనష్టాన్ని, గాయాల తీవ్రతను గణనీయంగా తగ్గించడానికి ఈ పెట్టెలు ఉపయోగపడతాయని రైల్వేశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 2016-17లో 1697 ఎల్‌హెచ్‌బీ పెట్టెల్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా విధించుకోగా 2017-18లో దానిని 2384కి పెంచారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 3025 పెట్టెల్ని ఉత్పత్తి చేస్తారు. 2017-18లో 801 సంప్రదాయ పెట్టెల్నే ఉత్పత్తి చేసి, ఆ తర్వాత వాటికి స్వస్తి పలకనున్నారు. ఒకదానిపైకి ఒకటి వెళ్లే పరిస్థితి ఎల్‌హెచ్‌బీ పెట్టెలతో రాదనీ, బ్రేకులు పనిచేసే తీరూ మెరుగ్గా ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పెట్టెలమధ్య అనుసంధానత తెగిపోయే ప్రమాదం ఉండదన్నాయి. పట్టాలలో పగుళ్లను గుర్తించడానికి అల్ట్రాసోనిక్ వ్యవస్థను విస్తృతంగా వినియోగించుకోనున్నట్లు తెలిపాయి.

కాలుష్య భూతానికి అడ్డుకట్ట!

- రాష్ట్రంలో 'క్లీన్ ఎయిర్ అథారిటీ' ఏర్పాటు
- అన్ని పట్టణాలు, నగరాలకు అనుసంధానం
- చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే కేంద్రాల ఏర్పాటు
- ప్రత్యేక చట్టం చేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయం



జపాన్‌లోని టంగోవాలో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే కేంద్రం

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: రాష్ట్రంలో కాలుష్య భూతాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను అమలు చేయాలని యోచిస్తోంది. జపాన్‌లోని టోక్యోలోలాగా ఇక్కడ కూడా 'క్లీన్ ఎయిర్ అథారిటీ'ని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర పురపాలక శాఖ సిద్ధమవుతోంది. ఆ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా దాన్ని విద్యుదుత్పత్తి చేసే కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేయనున్నారు. రెన్నెల్లలో ఈ ప్రణాళికను అమల్లోకి తేవాలని నిర్ణయించారు. ఈ అథారిటీ ఏర్పాటు కోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా చట్టం చేయాలని తెలంగాణ సర్కారు యోచిస్తోంది. హైదరాబాద్ మహానగరంలో రోజూ 4వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. దీన్ని జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ చెత్త నుంచి రెండు విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 100 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని ఏడేళ్ల కిందట రాంకీ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడంతో ఇప్పటి వరకు విద్యుదుత్పత్తిని మొదలుపెట్టలేదు. దీంతో చెత్త పేరుకుపోయి జవహర్‌నగర్ సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు కాలుష్యభరితమై అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొద్ది రోజుల్లో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ తదితర నగర పాలక సంస్థల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంటుందని ప్రభుత్వం అంచనాకొచ్చింది. రాష్ట్రంలోని అనేక పురపాలక సంఘాల్లో కూడా చెత్త డంపింగ్ సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మినహా మిగిలిన పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలన్నింటికీ అనుబంధంగా క్లీన్ ఎయిర్ అథారిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇదెలా పని చేస్తుందంటే..: నగరాలు, పట్టణాల నుంచి వచ్చే చెత్తను బట్టి రాష్ట్రంలోని కొన్ని ప్రధాన ప్రాంతాల్లో విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. చెత్తలో విద్యుదుత్పత్తికి ఉపయోగపడే దాన్ని వేరు చేసి ఈ కేంద్రాలకు తరలిస్తారు. మిగిలిన చెత్తను సేంద్రియ ఎరువులుగా మారుస్తారు. పీపీపీ పద్ధతిలో విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఎవరైనా సొంతగా ఏర్పాటు చేయడానికి ముందుకొస్తే టెండరు ప్రాతిపదికన అప్పగించే అవకాశముందని చెబుతున్నారు. నగరాలు, పట్టణాల్లో కాలుష్యానికి కారణమవుతున్న ఇతర అంశాలనూ గుర్తించి వాటికి కూడా క్లీన్ ఎయిర్ అథారిటీ క్రమ పద్ధతిలో పరిష్కారాలను చూపనుంది. టోక్యోలో ఇలాంటి సంస్థను అనేక ఏళ్ల కిందటే ఏర్పాటు చేశారు. ఈ అథారిటీని పరిశీలించడానికి పురపాలక శాఖ కార్యదర్శి నవీన్ మిత్తల్‌తోపాటు కొంతమంది సీనియర్ అధికారులు వారం రోజులపాటు టోక్యోలో పర్యటించి వచ్చారు. మంత్రి కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ఈ అథారిటీని ఏర్పాటు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని నవీన్ మిత్తల్ 'ఈనాడు'కు తెలిపారు. ఈ అథారిటీ పరిధిలో హైదరాబాద్ ఉండే అవకాశం లేదన్నారు.

టోక్యోలో ఏం చేస్తున్నారంటే..: టోక్యోలో 23 మహానగర పాలకసంస్థలున్నాయి. కొన్నేళ్ల కిందటే ఈ సంస్థలకు క్లీన్ ఎయిర్ అథారిటీని ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో ఒక్కో నగరంలో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే అత్యాధునిక కేంద్రాలను ఏర్పాటు చేశారు. నగరాల నుంచి వచ్చే చెత్తను ఈ కేంద్రాలకు సమీపంలో కేటాయించిన స్థలంలో నిల్వ చేస్తారు. అక్కడ విద్యుదుత్పత్తికి పనికొచ్చే చెత్తను వేరు చేస్తారు. మొత్తం 23 కేంద్రాల్లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేయడమే కాకుండా మిగిలిన చెత్తతో ఎగుమతులకు వీలుండే విధంగా సేంద్రియ ఎరువులనూ తయారు చేస్తున్నారు. ప్రపంచంలోనే సమర్థ క్లీన్ ఎయిర్ అథారిటీగా టోక్యో సంస్థ పేరొందింది.

పేదరిక నిర్మూలనకు శాంతిభద్రతలూ అవసరమే

- మిషన్ అంత్యోదయపై కేంద్రం స్పష్టీకరణ
- 8 అంశాలపై రాష్ట్రాలకు సూచనలు
- రాష్ట్రంలో ఇంకా మొదలు కాని సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: గ్రామాల్లో పేదరికం కనుమరుగు కావాలంటే ముందు అక్కడ నేరాలు, వివాదాలు అసలు ఉండకూడదు. ప్రశాంత వాతావరణం నెలకొన్నపుడే ప్రగతి ఫలాలు ప్రజలకు అందుతాయనేది కేంద్రం భావన. రెండేళ్లలో దేశవ్యాప్తంగా 50వేల పంచాయతీల్లో పేదరికాన్ని రూపుమాపటమే ధ్యేయంగా రూపొందించిన 'మిషన్ అంత్యోదయ'ను అమలు చేసే క్రమంలో.. నేరాలు, వివాదాలు లేకుండా చూడటంతో సహా 8అంశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలంటూ కేంద్రం తాజాగా రాష్ట్రాలకు సూచించింది. ఎంపికైన గ్రామ పంచాయతీల్లో వివిధ పథకాలను అమలు చేస్తూ మహాత్మాగాంధీ 150వ జన్మదినోత్సవమైన 2019, అక్టోబరు 2నాటికి ఆ గ్రామాల్లో పేదరికాన్ని రూపుమాపటం 'మిషన్ అంత్యోదయ' లక్ష్యం. ఆయా పంచాయతీలను పేదరిక నిర్మూలన దిశలోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రాలు అవలంబించాల్సిన కొన్ని విధానాలను కేంద్రం తాజాగా తెలిపింది. పంచాయతీలను ఆరుబయలు మలవిసర్జన రహితం చేయటం, స్వయం సహాయక సంఘాలకు ఇతోధిక సాయం, జల సంరక్షణ, అదర్శ గ్రామయోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయటం, రూర్బన్ పథకం కింద ఎంపికైన గ్రామాలను మార్గదర్శకాలకు దీటుగా తీర్చిదిద్దటం, అవార్డులు అందుకొనేలా పంచాయతీలను మార్చటంలాంటి అంశాలతో పాటు నేరాలు, వివాదాలు ఉండకుండా చూడాల్సిందిగా సూచించింది.

రాష్ట్రంలో తొలిదశలోనే..: తెలంగాణలో మిషన్ అంత్యోదయ కింద 1,622 పంచాయతీలు ఎంపికవగా వాటిలో ఇంతవరకు సన్నాహాలు ప్రారంభం కాలేదు. నిబంధనల ప్రకారమైతే పంచాయతీ స్థాయిలో తొలుత తీర్మానంచేసి సూక్ష్మ ప్రణాళికలను తయారుచేయటం, పొదుపు సంఘాల్లో మరింత మంది మహిళల్ని చేర్చటంవంటి పనులను గ్రామీణాభివృద్ధి శాఖ చేయాల్సి ఉంటుంది. పేదరిక నిర్మూలనకు అందుబాటులో ఉన్న కేంద్ర, రాష్ట్ర పథకాలను గుర్తించి నిధులు మంజూరయ్యేలా చూడడమూ కీలకమే. కేంద్రం నిర్దేశించిన వ్యవధి రెండేళ్లే అయినందన ఇప్పటికే చర్యలుచేపట్టాల్సి ఉండగా గ్రామాల్లో అందుకు భిన్నమైన పరిస్థితులునెలకొనడంతో కేంద్రం లక్ష్యం ఎప్పుడు నెరవేరుతుందనేది ప్రశ్నార్థకమే.

ఈనాడు

పట్టాలు తప్పిన రైల్వే వ్యవస్థ

ప్రాణాంతక నిర్లక్ష్యం అంటే ఏమిటో, అది సృష్టించే ఘోరకలి ఎలాంటిదో ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ సమీపాన జరిగిన రైలు ప్రమాదం నిర్ద్వంద్వంగా చాటుతోంది. పూరీ నుంచి హరిద్వార్‌కు వెళ్ళే కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ఖతౌలీ సమీపాన పట్టాలు తప్పిన దుర్ఘటన 22 మంది ప్రాణాల్ని బలిగొనగా, 156 మంది గాయపడ్డారని, వారిలో 26 మంది తీవ్రంగా క్షతగాత్రులయ్యారని ఉత్తర రైల్వే ప్రకటించింది. నూట ఐదు కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న ఎక్స్‌ప్రెస్‌ను ఒక్క ఉదుటున బ్రేక్ వేసి ఆపడానికి డ్రైవర్ ప్రయత్నించడంతో పద్నాలుగు బోగీలు పట్టాలు తప్పాయి. రెండు బోగీలు బోల్తాపడగా, మరో రెండు ఒక దాంట్లోకి ఒకటి చొచ్చుకుపోయాయి. ఒక బోగీ రైలు నుంచి వీడిపోగా, ఓ బోగీ పట్టాల సమీపంలో ఉన్న ఇంట్లోకి దూరింది. పాంట్రీకార్ పూర్తిగా ధ్వంసమైన ఈ ప్రమాదంలో బతికి బట్టకట్టినవారంతా అక్షరాలా మృత్యుంజయులేనని చెప్పాలి. ఈ భయానక ప్రమాదానికి కారణం- భారీ వానలకు పనికిరాకుండా పోయిన 15 మీటర్ల రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతుండటం! అక్కడ ట్రాక్ మరమ్మతు పనులు సాగుతున్నట్లు సమీప రైల్వే స్టేషన్‌కు సమాచారం లేదు సరికదా- కనీసం ప్రమాద చిహ్నంగా ఎర్రజెండాల్నీ పాతలేదు. ధాటిగా దూసుకొస్తున్న పూరీ-హరిద్వార్ ఎక్స్‌ప్రెస్‌ను చూసి ట్రాక్ పనులు చేస్తున్నవాళ్లు ప్రాణభీతితో పారిపోయారుగాని నిర్దిష్ట హెచ్చరికలు చెయ్యనేలేదు. ప్రమాదస్థలి చేరువయ్యాక అప్రమత్తమైన డ్రైవర్ హఠాత్తుగా బ్రేకులు వెయ్యడంతో అభాగ్యుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ప్రాథమిక సాక్ష్యాధారాల్ని బట్టి ప్రమాదకారకులపై చర్యలు చేపట్టాలన్న కేంద్ర రైల్వేమంత్రి సురేశ్ ప్రభు ఆదేశాల అనుసారం రైల్వేబోర్డు- నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించి ప్రాణాంతక ప్రమాదానికి బాధ్యులయ్యారంటూ 'గుర్తుతెలియని' వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేసింది. ప్రయాణికుల భద్రత పరంగా భారతీయ రైల్వేల్లో నిష్పూచీతనం ఎంతగా ఊడలు దిగిందో ఈ దుర్ఘటన రుజువు చేస్తున్నందున- ఉత్తుత్తి కేసులు పెట్టడం కాదు; వివిధ అంచెల్లో బాధ్యత జవాబుదారీతనాల్ని పెంచేలా వ్యవస్థీకృత ప్రక్షాళన చేపట్టాలి!

నూట అరవై నాలుగేళ్ల భారతీయ రైల్వే చరిత్రను తిరగేస్తే ఎన్నెన్నో నెత్తుటి పుటలు గుండెల్ని పిండేస్తాయి. కర్ణుడి చావుకు ఎన్ని కారణాలున్నాయో, జాతి ప్రగతికి జీవనాడిగా ఏడికేడు పురోగమించాల్సిన దిగ్గజ రైల్వే వ్యవస్థ అంతకంతకూ దిగజారిపోతుండటానికి అంతకంటే ఎక్కువే కుటిల రాజకీయకోణాలున్నాయి. 1950-2016 మధ్య రైల్వే నెట్‌వర్క్ కేవలం 23శాతం పెరిగిందని, అదే సమయంలో ప్రయాణికుల సంఖ్య 1,344శాతం, సరకు రవాణా 1,642 శాతం పెరిగాయని సుదీప్ బందోపాధ్యాయ సారథ్యంలోని పార్లమెంటరీ స్థాయీసంఘం నిరుడు డిసెంబరు 14న వెల్లడించింది. అవసరాలకు దీటుగా నెట్‌వర్క్ విస్తృతిపై దశాబ్దాలుగా ఏలికలు శీతకన్నేసిన పాపం- అరకొర మౌలిక సదుపాయాలపై తగని ఒత్తిడి పెంచి, ప్రయాణికుల భద్రతను దేవతావస్త్రంగా మార్చేస్తోందన్న స్పష్టీకరించింది. నిరుడు నవంబరులో కాన్పూర్ సమీపంలో ఇండోర్-పట్నా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి 150మందికిపైగా అభాగ్యులు మృత్యువాత పడ్డారు. ఈ ఏడాదీ జనవరి మూడోవారంలో ఆంధ్రప్రదేశ్ విజయనగరంజిల్లా కూనేరు వద్ద హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి 39 మంది మరణించారు. ఇలా ప్రయాణం అంటే ప్రమాదం అన్న దురర్థాన్ని స్థిరీకరించేలా భారతీయ రైల్వే దిగనాసిల్లడానికి- బిహారీ లాలు, బెంగాల్ దీదీల సంకుచిత రాజకీయ ప్రయోజనాలూ పుణ్యం కట్టుకొన్నాయి. రాబడి ఖర్చుల మధ్య అర్థవంతమైన సమతూకాన్ని సాధించగలిగే పరిణత యాజమాన్య పద్ధతి కొరవడబట్టే- కాలం చెల్లిన పట్టాలు, ఎప్పుడు కూలుతాయో తెలియని వంతెనలు, కాపలా లేని క్రాసింగులు, పనికిరాని సిగ్నలింగ్ వ్యవస్థలు నేటికీ నిక్షేపంగా వర్ధిల్లుతున్నాయి. ఈ అవ్యవస్థకు సిబ్బంది నేరపూరిత నిర్లక్ష్యమూ జతపడి ప్రమాదాలు, సంబంధిత మరణాలూ పెరుగుతున్నాయి!

ఇండియాలో మొట్టమొదటి రైలు 1853 ఏప్రిల్‌లో బొంబాయి, థానేల మధ్య నడపగా, అది 34 కిలోమీటర్ల దూరాన్ని 75 నిమిషాల్లో- గంటకు 28 కిలోమీటర్ల వేగంతో చేరుకొంది. 160 ఏళ్లు గతించినా ఇప్పటికీ భారతీయ రైల్వే సగటు వేగం 50 కిలోమీటర్లే నంటే ఏమనుకోవాలి? ఏనాడో 1933లోనే గంటకు 160 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని సాధించిన ఐరోపా, ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వేగంతోపాటు రైల్వేభద్రతలోనూ అద్వితీయంగా రాణిస్తోంది. 2020నాటికి 80 శాతం పెద్దనగరాలకు హైస్పీడ్ రైళ్లు దూసుకుపోయేలా 30వేల కిలోమీటర్ల నెట్‌వర్క్ పరిపూర్తికి చైనా 11,700 కోట్ల డాలర్ల మొత్తం వెచ్చించనుంది. ఆ స్థాయిలో ఆర్థిక సత్తువ లేని ఇండియా ఉన్న కొద్దిపాటి వనరుల్ని అన్ని పద్దులకూ తలా ఇంత అని విదిలిస్తుండటంతో, దశాబ్దాలుగా ఏదీ సాంతం పూర్తికాని దుస్థితి రాజ్యమేలుతోంది. 2015-'16లో 84 శాతం ప్రమాదాలకు రైళ్లు పట్టాలు తప్పడమే ప్రధాన కారణం. దేశవ్యాప్తంగా లక్షా 15వేల కిలోమీటర్ల ట్రాకులో, ఏటా నాలుగున్నర వేల కిలోమీటర్లను పునరుద్ధరించాల్సి ఉంటుంది. పేరుకుపోయిన బకాయిల్ని కలుపుకొంటే ఏటా కనీసం 5,000 కిలోమీటర్ల పునరుద్ధరణ సాగాల్సి ఉండగా, 2,700 కి.మీ.నే ప్రభుత్వం లక్షించగలుగుతోంది. దానికి తోడు ప్రమాద సమయాల్లో ప్రయాణికుల్ని నుజ్జునుజ్జు చేస్తున్న ఇప్పటి బోగీల స్థానంలో క్షేమకరమైన లింక్ హాఫ్‌మ్యాన్ బుష్ (ఎన్‌హెచ్‌బీ) బోగీల్ని సత్వరం ప్రవేశపెట్టాలని స్థాయీసంఘమూ సూచించింది. 2012నాటి కాకోద్కర్ కమిటీ నివేదిక రైల్వేభద్రత కోసం లక్ష కోట్ల రూపాయల వ్యయం కాగల విపుల సూచనలివ్వడం తెలిసిందే. రైల్వేలో విస్తృత సంస్కరణలు చేపడుతున్న మోదీ-సురేశ్ ప్రభు ద్వయం; భారతీయ రైల్వేకు భద్రతను ఓ బాధ్యతగా మప్పాలి. ప్రతి ప్రయాణికుడి ప్రాణమూ అమూల్యమైనదేనన్న స్పృహతో కొరతల కోమా నుంచి భారతీయ రైల్వేను పునరుజ్జీవింపజేయాలి!









జీవ నదుల మరణ వేదన

నదులు నాగరికతకు పుట్టినిళ్లు. మానవ వికాసానికి జీవం పోసిన కల్పతరువులు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, వ్యవసాయ, పారిశ్రామిక ప్రగతికి పునాదులు వేసిన జీవగర్రలు. గంగా, యమున, సింధు, బ్రహ్మపుత్రలు ఉత్తర భారతానికి భాగ్యరేఖలైతే... గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి, తుంగభద్రలు దక్షిణ భారతానికి ధాన్యాగారాలు. ఈ జీవనదులన్నీ విశాల భారతావని జీవనాడులు. దేశ ఆహార, ఆర్థిక పరిపుష్టికి మూలనిధులు. కోట్లమంది భారతీయులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవం, జీవనోపాధి అందిస్తున్న ఉదక రాశులు. నాగరికతకు ప్రాణం పోసిన ఈ జలవేల్పులు నేడు కనుమరుగయ్యే దుర్దశ దాపురించింది. అలల కెరటాలతో ఎగసిపడే జలనిధుల సవ్వడులు ఆగిపోయే కాలం సమీపించింది. గంగా, గోదావరి వంటి జీవనదులు అంతరించే రోజులు మరెంతో దూరంలో లేవు. ఇప్పటికే చిన్న చిన్న నదులు రూపురేఖలు చెదిరి, ఆనవాళ్లు కోల్పోయాయి. ఉత్తరాదిలో యమున, కేరళలో భరతపూజ వంటివి మృతనదులుగా మారాయి. సగానికిపైగా నదులు మురికి కూపాల్లా మారాయి. ఇటు తెలుగుజాతి తాగు, సాగు నీటి అవసరాలు తీర్చుతున్న ప్రధాన నదులు సైతం ఉనికి కోల్పోయే దుస్థితి ఏర్పడింది. నదుల భౌగోళిక వైశాల్యం కుంగిపోవడం, అక్రమ ఇసుక తవ్వకాలు పోటెత్తడమే ఇందుకు ప్రధాన కారణాలు. తీరాల వెంబడి అడవులు, చెట్లు నరికివేత, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలతో ఒకవైపు నదులు కుంచించుకుపోతుంటే మరోవైపు పట్టణీకరణ, పారిశ్రామిక వ్యర్థాల కారణంగా క్షారమయమై కలుషితమవుతున్నాయి.

ముంచుకొస్తున్న ముప్పు

భారతదేశంలో 14 పెద్ద నదులతోపాటు మధ్య, చిన్నతరహా కలిపి మొత్తం 500కి పైగా నదులు ప్రవహిస్తున్నాయి. 85 శాతం తాగు, సాగునీటి అవసరాలు తీర్చే జలం నదుల నుంచే వస్తోంది. నదుల్లో భూగర్భ జలమట్టం నది ఒడ్డు కంటే ఎక్కువ ఉంటేనే జలవాహినుల ప్రవాహం బాగా ఉంటుంది. ఆ స్థాయికంటే ధార తగ్గిందంటే క్రమంగా నది ఎండిపోతున్నట్లే లెక్క. మూడు దశాబ్దాల్లో ఎన్నో నదుల రూపురేఖలు మారిపోయాయి. వర్షాభావం, ఆక్రమణలు, అక్రమ ఇసుక తవ్వకాలు వంటి కారణాలవల్ల అవి బక్కచిక్కిపోయాయి. దక్షిణాదిలో గోదావరి 20 శాతం, కృష్ణా 60 శాతం, కావేరి 40 శాతం మేర కుంచించుకుపోయాయి. ఇప్పటికే పెద్ద నదుల్లో 40 శాతం నీరు ఆవిరైపోయింది. మరో రెండు దశాబ్దాల్లో మిగతా 60 శాతం నీరూ కనుమరుగైపోవడం ఖాయంలా కనిపిస్తోంది. ఈపాటికే అనేక నదులు వర్షాకాల నదులుగా అవతరించాయి. వర్షరుతువులో మినహా నది నీరు సముద్రంలోకి చేరడం లేదు. వేసవి వచ్చిందంటే మధ్య, చిన్నతరహా నదులు పూర్తిగా ఎండిపోతున్నాయి. నదుల్లో పారే నీరు దోసిళ్లతో తీసుకొని తాగడానికే కాదు... తాకడానికైనా పనికిరాని విధంగా కలుషితమయ్యాయి. ప్రపంచంలో పది కాలుష్య నదుల్లో గంగ, యమునలు తొలి వరసలో ఉన్నాయి. 'ఇండియా రివర్స్ వీక్' అధ్యయనం ప్రకారం 70 శాతం నదులు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. 290 నదుల్లో 205 నదులు అత్యంత ప్రమాదకరంగా క్షయమయ్యాయని అధ్యయనం స్పష్టీకరించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదికలు సైతం ఇవే భయానక స్థితిని చాటుతున్నాయి. మృతనదిగా మారిన యమున లాంటి దుస్థితిని ముంబయిలోని మితి, యూపీలోని హిండన్, గుజరాత్‌లోని సబర్మతి, పంజాబ్‌లోని ఘగ్గర్, హైదరాబాద్‌లోని మూసి, నాసిక్‌లోని గోదావరి, పుణెలోని పావన, లుధియానాలోని సట్లెజ్, కర్ణాటకలోని భద్ర, చెన్నైలోని అడయార్, కూవమ్ నదులూ ఎదుర్కొంటున్నాయని హెచ్చరించింది.

నదుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్న ప్రధాన సమస్యలు రెండు. నదీ గర్భాలు, ప్రవాహాలు కాలుష్య కాసారాలుగా మారడం మొదటిదైతే... స్వరూపం, స్వభావం కోల్పోవడం రెండోది. జీవనదుల్లో పారుతోంది స్వచ్ఛమైన, నిర్మలమైన జలం కాదు. తీరాల వెంట వెలసిన నగరాల సాక్షిగా ప్రవహిస్తోంది- గరళ జలం. పారిశ్రామిక వ్యర్థాలతో కూడిన విషం. నేరుగా తాగడానికి స్నానం చేయడానికి వీలులేని విధంగా కాలుష్యం బుసలు కొడుతోంది. కాలుష్యం నదీ జలాల స్వచ్ఛత, నాణ్యతలను కాటేస్తుంటే పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, పెద్ద పెద్ద ఆనకట్టల నిర్మాణం, మళ్లింపు కాల్వలు, జల విద్యుత్ ప్రాజెక్టులు, ఆక్రమణలు, అపరిమిత ఇసుక తవ్వకాలు జలనిధుల భవిష్యత్తును కాలరాస్తున్నాయి. నదుల ఆనవాళ్లను చెరిపేస్తున్నాయి. ఆనకట్టలు, జల విద్యుత్ ప్రాజెక్టులు నదుల సహజ ప్రవాహాలను అడ్డుకుంటున్నాయి. పర్యవసానంగా వాటి ప్రవాహ గమనం, దిశ మారిపోతోంది. పట్ట



కాలుష్యం కాటు... పర్యావరణంపై తూట్లు

ణీకరణ, పారిశ్రామికవాడలు నదీ తీరాలను కబళిస్తున్నాయి. ఏటికేడు పెరిగిపోతున్న పట్టణ, నగరాల జనాభా, నూతన పారిశ్రామిక ప్రాంగణాలు నదుల విస్తీర్ణాన్ని కుదించేస్తున్నాయి. ఈ కోవలో నదుల స్వరూపాన్ని చిన్నాభిన్నం చేస్తోంది విచక్షణలేని ఇసుక తవ్వకాలే. ఇసుక మాఫియా నదుల భౌగోళిక ఉనికినే కాదు తీరప్రాంత సౌందర్యాన్నీ మింగేస్తోంది. నదీ గర్భాల్లోనే వందల అడుగులు తవ్వినా భూగర్భ జలాలు పడటం లేదు. పరిశోధనల ప్రకారం భూగర్భ జలం, వాతావరణం, ఉష్ణోగ్రతలు, భూసారం, నదీ విస్తీర్ణం, నదుల గమనం, భూకంప నియంత్రణ వంటి అనేక అంశాలపై ఇసుక ప్రభావం చూపుతుంది. నీటిని పట్టిఉంచి శుద్ధిచేసే లక్షణం ఇసుక పొరలకు ఉంది. నదీ మతల్లుల అమృత జలాలు ఉప్పగా మారకుండా సైకతమే కాపాడుతుంది. జల చరాల ఉనికిని, జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తుంది. అయితే మనిషికి బతుకు మెతుకునిచ్చే ఇంతటి విలువైన సహజ వనరు ప్రభుత్వాల నిర్లక్ష్యం పాలబడి అత్యంత వేగంగా క్షీణిస్తోంది.

నిరంతర ప్రవాహం, నాణ్యమైన జలం నదుల ఉనికికే కాదు, సమాజ అస్తిత్వానికీ కీలకం. అదే నేడు కొరవడింది. మానవ పరిణామక్రమానికి మూలమైన నది- మానవుడి వికృత చేష్టలు, స్వార్థ చిత్తానికి బలైపోతోంది. ప్రభుత్వ పథకాల నిధుల వృష్టి ఏ నదినీ బాగుచేయలేకపోయింది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం 11 రాష్ట్రాల్లోని 40 కోట్ల మందికి జీవనాధారమైన గంగా నదే. 1986లో మొదలుపెట్టిన గంగా కార్యాచరణ ప్రణాళిక నుంచి నేటి 'నమామి గంగ' వరకు వేల కోట్ల రూపాయలు ధారపోసినా నది శుద్ధి కాలేదు. తీరంలో అపరిశుభ్రత తొలగిపోలేదు. ఈ ఏడాదితో మొదటి దశ పూర్తవుతున్నా గంగ స్వచ్ఛ లక్ష్యం సాకారమయ్యే సూచనలేదని సాక్షాత్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానమే అసహనం వ్యక్తం చేసింది. రెండో దశ పూర్తికి మరో రెండేళ్లు గడువు విధించుకున్నా, వాస్తవ స్థితి ప్రకారం మరో దశాబ్దం తరవాతైనా గంగ స్వచ్ఛత, నాణ్యత పొందే అవకాశం కనిపించడం లేదు.

మేల్కొనకుంటే మహాకష్టం

మరోవైపు దేశం జల సంక్షోభంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతోంది. ప్రపంచంలో నీటి కొరత, నీటి లభ్యత, నీటి కాలుష్యం, నీటి నాణ్యత, వ్యాధుల వంటి అంశాల్లో తీవ్రముప్పును ఎదుర్కొంటున్న దేశాల్లో మనదే అగ్రాసనం. కలుషిత నీరు తాగి మృత్యువాత పడుతున్న చిన్నారులకూ ఇక్కడ లెక్కలేదు. ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ... ఇలా ఏ సంస్థ సర్వే చూసినా భవిష్యత్తులో అత్యంత నీటి ఎద్దడి ఎదుర్కొనే దేశంగా ఇండియా పేరే మార్మోగుతోంది. భారతావనిని దాహం చీకట్లలోకి నెట్టే పరిస్థితులు పోవాలంటే ఒక్కటే దారి- అదే జీవనదుల సంరక్షణ! నదీమ తల్లులకు జీవంపోసే పరిరక్షణ చర్యలు చేపట్టాలి. చట్టాలను పటిష్ఠంగా అమలుపరచాలి. జీవనదుల పునరుజ్జీవనానికి కీలకమైన చిత్తడి నేలలను పరిరక్షించాలి. నదులు పూర్తిగా అంతర్ధానం అయ్యాక వేలకోట్ల రూపాయలతో పునరుద్ధరణ పనులు చేపట్టే దుస్థితి ఎదురుకాకమునుపే ప్రభుత్వాలు మేల్కోవాలి. తాగునీటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకునే దౌర్భాగ్యం రాకుండా చర్యలు తీసుకోవాలి. మహారాష్ట్రలో నదుల పూర్వ వైభవం పేరిట అశాస్త్రీయంగా భారీ యంత్రాలతో నదిలో పూడిక తీయడం, లోతు, వెడల్పు పెంచడంకోసం చేస్తున్న పనులను తిరస్కరించాలి. దీనివల్ల తాత్కాలికంగా నీటి నిల్వ పెరుగుతుందేగాని, నదీ జలచర జీవవ్యవస్థ దెబ్బ తింటుంది. దీనికి బదులుగా అవసరమైనచోట చెక్‌డ్యాములు, అడ్డుకట్టలు నిర్మించాలి. నదీ తీరాల్లోని అడవులను కాపాడుకోవాలి. ఇసుక మాఫియా కోరలు పీకాలి. నిర్మాణ అవసరాల ఆధారంగా ఇసుకకు ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలి. కేరళలో అంతరించిపోతున్న కుట్టంపెరూర్ నదికి గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి శ్రమదానంతో పూర్వ వైభవం తెచ్చిన స్ఫూర్తిని తెలుగువారు అందిపుచ్చుకోవాలి. నల్గొండ జిల్లా వెల్దుర్తి మండలం హల్దీవాగులో ఇసుక తవ్వకాలకు సమష్టిగా అడ్డుకట్టవేసి భూగర్భ జలాలు కాపాడుకోవడంతోపాటు చెక్‌డ్యామ్ నిర్మించుకుని నీటి కష్టాలు అధిగమించిన అక్కడి కర్షకుల ఆదర్శాన్ని ఇతరులు ప్రదర్శించాలి. జీవ నదుల పునరుద్ధరణ, పునరుజ్జీవం కోసం ఆర్ట్‌ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్ సంస్థలు చేపట్టిన కార్యకలాపాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. అన్నింటికంటే ముఖ్యంగా మురికి కయ్యలుగా మారిన నదులను ప్రక్షాళించేందుకు నూతన సాంకేతిక వనరులు ఉపయోగించాలి. నదుల్లో వ్యర్థాలను తొలగించి నీటిని శుద్ధి చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన యంత్రపరికరాలను వినియోగించాలి. నదిలోకి చేరే వ్యర్థాలను సహజంగా శుభ్రపరచే గడ్డి, పూల మొక్కలు తీరాల్లో పెంచాలి. అప్పుడే నదీ గర్భాల్లో ఇసుక పునరుద్ధరణ జరిగి నీటి లభ్యత, నిల్వ పెరుగుతుంది. జీవనదులు పూర్వ వైభవంతో శోభిస్తాయి. భూగర్భ జలాలు పెరిగి బోర్లు పుంజుకొంటాయి. పొలాలు సస్యశ్యామలవుతాయి. ఇందుకోసం ప్రభుత్వాలు, ప్రజలు తక్షణమే కార్యరంగంలోకి దిగాలి. జలం లేకపోతే జగత్తు ఆగిపోతుందనే వాస్తవాన్ని గ్రహించి జలానికి మూలమైన జీవనదులను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ!

- పావులూరి కిశోర్‌బాబు


'డ్రాగన్'కు రెండు నాల్కలు

ధర్మపన్నాలు వల్లించడంలో చైనా దిట్ట. సుద్దులు చెప్పడం, శాంతివచనాలు ప్రవచించడంలో ఆ దేశానిది అందె వేసిన చెయ్యి. ఇతరుల దగ్గరకు వచ్చేసరికి అంతర్జాతీయ చట్టాలు, సూత్రాలు, నిబంధనలను ఏకరవు పెట్టడం, తాను మాత్రం వాటికి పూచిక పుల్లపాటి విలువైనా ఇవ్వకపోవడం దానికే చెల్లింది. తాజాగా హిందూ మహాసముద్రం విషయంలో భారత్‌కు హితోక్తులు చెప్పడం ఇందుకు ప్రబల నిదర్శనం. ఇటీవల చైనాను సందర్శించిన భారత విలేకరులతో ఆ దేశ నౌకాదళ ఉన్నతాధికారి చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే బీజింగ్ ద్వంద్వ వైఖరి అర్థమవుతుంది. ఝూంగ్ జియాంగ్ నగరంలోని వ్యూహాత్మక దక్షిణ సముద్ర నౌకాదళ (ఎస్ఎస్ఎఫ్) స్థావరంలో చైనా నౌకాదళానికి చెందిన యులిన్ యుద్ధనౌకను విలేకరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ ఉన్నతాధికారి కెప్టెన్ లియాంగ్ తియాన్‌జున్ మాట్లాడుతూ హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రతను పరిరక్షించడానికి తాము భారత్‌తో చేయి కలపడానికి సిద్ధమంటూ హాస్యాస్పద ప్రకటన చేశారు. అంతటితో ఆగకుండా హిందూ మహాసముద్రం అంతర్జాతీయ సమాజం ఉమ్మడి ఆస్తి అంటూ ప్రకటన చేశారు. వ్యూహాత్మకంగా తనకు అత్యంత కీలకమైన ఈ ప్రాంతంలో చైనా కదలికలపై భారత్ ఇప్పటికీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో డ్రాగన్ తాజా వ్యాఖ్యలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. ఒకవైపు దక్షిణ చైనా సముద్రం మొత్తం తమదేనని నానాయాగీ చేస్తున్న బీజింగ్ హిందూ మహాసముద్రం మాత్రం ఉమ్మడి ప్రదేశమని అనడం దాని ద్వంద్వవైఖరికి నిదర్శనం.

వితండవాదం

చైనా ప్రకటన వెనక ఎంతో ముందుచూపు దాగుంది. ఇరుగు పొరుగు దేశాలతో అది వ్యవహరిస్తున్న తీరు ఇందుకు తార్కాణం. స్వప్రయోజనాలే చైనాకు ముఖ్యం. అంతర్జాతీయ చట్టాలు, తీర్పులు పట్టనే పట్టవు. మాట వినని దేశాలను భయపెట్టేందుకూ వెనకాడదు. విస్తరణ వాదమే డ్రాగన్ లక్ష్యం. దక్షిణ చైనా సముద్ర వివాదం ఇందుకు దాఖలా. యావత్ దక్షిణ చైనా సముద్రం తనదేనంటూ చైనా చేసిన వాదనను నిరుడు జులైలో హేగ్ నగరంలోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం (పీసీఏ) తోసిపుచ్చింది. వివాద పరిష్కారానికి సుమారు పదిహేడేళ్లపాటు దౌత్య, రాజకీయ మార్గాల్లో పలు ప్రయత్నాలు చేసి దక్షిణ చైనా సముద్రతీర దేశమైన ఫిలిప్పీన్స్ విఫలమైంది. దీంతో 2013లో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దానిపై అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును గుర్తించేది లేదని, దాన్ని చెత్తబుట్టలో వేయండంటూ బహిరంగంగానే చైనా పేర్కొనడాన్ని చూస్తే, అంతర్జాతీయ చట్టాలపై దానికి ఏపాటి గౌరవం ఉందో అర్థమవుతుంది!

దక్షిణ చైనా సముద్రంపై వితండవాదం చేస్తున్న బీజింగ్, తనకు ఎలాంటి సంబంధం లేని హిందూ మహాసముద్రం విషయంలో భారత్‌కు సుద్దులు చెబుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో భద్రతను పరిరక్షించడానికి భారత్‌తో చేయి కలపడానికి సిద్ధమంటూ ఉదారంగా ముందుకు వస్తోంది. అసలు భారత్ పొడ గిట్టని దేశం, ఈ దేశంతో కలిసి పనిచేస్తామని ప్రకటించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇక్కడ ఏమీ ప్రయోజనం లేనట్లయితే భారత్‌తో కలిసి పని చేయాల్సిన అవసరమేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవక మానవు! భౌగోళికంగా హిందూ మహాసముద్రానికి చైనాకు ఎలాంటి సంబంధం లేదు. దానికి ఇక్కడ తీరప్రాంతం లేనేలేదు. అయినా ఈ ప్రాంతంలో ఉనికి కోసం, పట్టు కోసం తాపత్రయపడుతోంది. అందువల్లే వ్యూహాత్మకంగా ఇలాంటి ప్రకటనలు చేస్తోంది. ఈ తీర ప్రాంత దేశాల్లో ఓడరేవులు నిర్మించడం, సైనిక స్థావరాలు ఏర్పాటు చేయడం ద్వారా భారత్‌ను



హిందూ మహాసముద్రంపై చైనా కన్ను

ఇరుకున పెట్టడానికి ప్రయత్నిస్తోంది. ముత్యాలసరం (స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్) పేరిట హిందూ మహాసముద్ర తీరదేశాల్లో ఓడరేవులు, రక్షణ స్థావరాలను నిర్మించి, తద్వారా భారత్ చుట్టూ పాగా వేయాలన్నది వ్యూహం. ఇందులో భాగంగానే శ్రీలంకలోని హంబన్‌టోట, పాకిస్థాన్‌లోని గదర్‌లలో ఓడరేవుల నిర్మాణం పూర్తిచేసింది. మియన్మార్‌లోని కోకస్ ద్వీపంలో, బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌లో, మాల్దీవుల్లోని మరావ అటోల్, సోమాలియా, సీషెల్స్‌లో వివిధ కార్యకలాపాల ద్వారా తన ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తోంది. తూర్పు ఆఫ్రికా దేశమైన జిబౌటిలో ఏకంగా తన తొలి విదేశీ సైనిక స్థావరాన్ని ఇటీవలే ప్రారంభించింది. దీనికి సమీపంలో నుంచే భారత్ చమురు నౌకలు ప్రయాణిస్తుంటాయి. సోమాలియా సముద్ర దొంగలను అడ్డుకునే పేరిట చైనా ఇక్కడ భారీగా బలగాలను మోహరించడం భారత్‌కు చికాకు కలిగించే పరిణామం. ఇప్పటికే ఈ మహాసముద్రంలో చైనా నౌకాదళం కార్యకలాపాలు పెరిగిపోయాయి. చైనాకు చెందిన జలాంతర్గాములు, విధ్వంసక నౌకలు, కీలక సమాచారం సేకరించే నౌకల రాకపోకలు పెరిగినట్లు భారత నౌకాదళం గుర్తించింది. దక్షిణ చైనా సముద్రంలో భారత్ సహా ఇతర నౌకల సంచారంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న బీజింగ్, హిందూ మహాసముద్రంలో తన నౌకల సంచారాన్ని సమర్థించుకోవడం ద్వంద్వ ప్రవృత్తికి నిదర్శనం. తూర్పుచైనా సముద్ర జలాల్లో సంచరిస్తున్న భారత్‌కు చెందిన రెండు నౌకలను చైనా గత ఏడాది జూన్‌లో వెంబడించింది.

దూకుడుకు ముకుతాడు

హిందూ మహాసముద్రంపై చైనా దృష్టి సారించడానికి కారణాలు లేకపోలేదు. అంతర్జాతీయంగా ఇది అత్యంత కీలకమైంది. పసిఫిక్, అట్లాంటిక్ తరవాత ఇదే మూడో అతిపెద్ద మహాసముద్రం. ఇక్కడి నౌకామార్గాలు ప్రపంచంలో అత్యంత కీలకమైనవి. తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపే ఈ మహాసముద్రం భారత్‌కు భద్రతాపరంగా, వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా ఎంతో ముఖ్యమైంది. ఈ మహాసముద్రంలో గల అండమాన్ దీవుల్లో అపార ఖనిజ సంపద ఉన్నట్లు నిపుణులు గుర్తించారు. దీనిద్వారా ప్రపంచంలోని సగం దేశాలకు చమురు సరఫరా జరుగుతోంది. ఆఫ్రికా, పశ్చిమాసియా నుంచి చైనాకు ఖనిజాలు, చమురు, ఇతర ముడిసరకులు దక్షిణ చైనా సముద్రంతో పాటు, హిందూ మహాసముద్రం ద్వారా జరుగుతుంటాయి. ప్రపంచ వాణిజ్యంలో గణనీయ భాగం వాణిజ్యం దీనిమీదుగానే జరుగుతోంది. మారిన అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో దీని ప్రాధాన్యం పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఇంత ప్రాధాన్యం ఉండబట్టే ఈ ప్రాంతంపై బీజింగ్ కన్నేసింది. అడక్కుండానే భారత్‌కు చేయూత ఇస్తామని ముందుకు వస్తోంది. హిందూ మహాసముద్రంలో చైనా క్రియాశీలంగా వ్యవహరించడం భారత్‌తోపాటు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలకూ అసౌకర్యం కలిగించేదే. ఈ మూడు దేశాలు ఏటా ఇక్కడ 'ఆపరేషన్ మలబార్' పేరిట సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తుండటం చైనాకు మింగుడు పడటం లేదు. గతంలో ఈ మహాసముద్రంపై భారత్ పెద్దగా దృష్టి సారించలేదు. యూపీఏ పదేళ్ల పాలనలో ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఈ తీరప్రాంత దేశాల్లో పర్యటించనే లేదు. ఎన్డీఏ ప్రభుత్వం దిల్లీ పగ్గాలు చేపట్టాక కొంత మార్పు వచ్చింది. నిరుడు ప్రధాని నరేంద్ర మోదీ ఈ సముద్ర ప్రాంత దేశాలైన శ్రీలంక, మారిషస్, సీషెల్స్‌లో పర్యటించి పలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. గదర్ ఓడరేవుకు ప్రతిగా ఇరాన్‌లోని ఛబహార్ ఓడరేవును నిర్మిస్తోంది. చైనా దూకుడును అడ్డుకునేందుకు జపాన్, ఆస్ట్రేలియా, అమెరికాతో కలిసి ముందుకు సాగుతోంది. అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా హిందూ మహాసముద్రంలో చైనా ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రయత్నించడం నేడు భారత్ ముందున్న తక్షణ కర్తవ్యం!

- గోపరాజు మల్లపరాజు

ఉత్తమ ఫలితం

యోగశాస్త్రంలో షడూర్ముల ప్రస్తావన ఉంది. ఊర్మి అంటే పెద్ద అల అని అర్థం. ఆ ఊర్ముల్లో ద్వంద్వాలు ఉన్నాయి. అవి- జరామరణాలు, క్షుత్పిపాసలు, శోక మోహాలు.

జరామరణాలు స్థూల శరీరానికి చెందినవి. క్షుత్పిపాసలు సూక్ష్మ శరీరానికి, శోక మోహాలు కారణ శరీరానికి సంబంధించినవి. ఆరు ఊర్ములూ గడచినప్పుడు, వ్యక్తికి అదే ముక్తి అవుతుంది. షడూర్ములను జయించినవాడు 'రుతుంభర' స్థితికి చేరుకుంటాడు. అంటే, పరమాత్మ సందర్శనానికి అర్హుడవుతాడని పెద్దల మాట.

మనిషికి జీవన భ్రాంతి సహజం. అంటే, బతుకు పట్ల ఓ భ్రమ. 'అన్నీ శాశ్వతం' అనే భ్రాంతి అది! జీవనం అంటే నీరు. జీవన భ్రాంతి అంటే నీటిలోని సుడిగుండం. పెద్దపెద్ద అలలతో కూడిన సముద్రానికి సుడిగుండాలు తప్పవు. అలాగే షడూర్ములు కలిగిన దేహానికి జీవన భ్రాంతి తప్పదంటారు విజ్ఞులు!

ఈ శరీరం సర్పం వంటిది అని యోగులు చెబుతారు. దేహం సుఖాల్ని కోరుతుంది. అది ఉగ్రకార్యాలు చేయకుండా ఉండలేదు. పాంచ భౌతికమైన దేహమంతా ధాతుమయం. పర్వతం వంటిది. ఖనిజాల కారణంగా పర్వతానికి రాగం (రంగు) తప్పదు. శరీరానికి అనురాగమూ అటువంటిదే. మానవ దేహం ఒక పటం వంటిది. పటం అంటే, వస్త్రం. దీన్ని అనేక గుణాల(దారాల)తో కూర్చుతారు. అంతమాత్రాన దారం అల్లిక చిరిగిపోకుండా ఉంటుందా, అది ఎల్లకాలం పదిలంగా ఉండటం సాధ్యమేనా? సర్పం వంటి దేహానికి రుజువర్తనం ఉండదు. మెలికలు తిరిగి ఉంటుంది, తిన్నగా ఉండలేదు. అదేవిధంగా, శరీరం పర్వతం వంటిది. ఎంతో కఠినమైనది.

వస్త్రం వంటి దేహానికి పట్టిన మురికి అంత తేలిగ్గా వదలదు. మురికి, మాలిన్యం అంటే- కాలుష్యం, చీకటి, అజ్ఞానం! తెనాలి రామకృష్ణ కవి రచించిన 'పాండురంగ మాహాత్మ్యం' విభిన్న ప్రబంధం. అందులో- కాకి, హంస, చిలుక, పాము, తేనెటీగ, ఆవు మోక్షం పొందిన వృత్తాంతం ఉంది.

ఒకసారి కృష్ణుడి మురళీనాదం విని, హోమధేనువు పాలు కురిసింది. గాలికి ఆ పాల నురుగు హరి మౌళిపై పడిందని, అదే పుణ్యంతో ఆ గోవు సుశీల పేరిట జన్మించిందని కావ్య కథనం. అలాగే, ఒక కాకి హరి ఆలయం మీద వాలడం వల్ల, దాని రెక్కల గాలికి ధూళి ఎగిరిపోతుంది. అదే హరికి పరిచర్యగా పరిణమిస్తుంది. ఒక హంస ఆలయ ప్రాంగణంలో వాలడంతో, దాని రెక్కలకు గల నీటి బిందువులు రాలతాయి. అందువల్ల గోడ అలికిన పుణ్యం దానికి అబ్బుతుంది. చిలుక ఓ హారంలోని మణుల్ని దానిమ్మ గింజలుగా భ్రమపడుతుంది. అది ఆ హారం తీసుకొని అందులోని మణుల్ని చెల్లాచెదరు చేయడంతో, పాండురంగడి ఆలయంలో మణులతో రంగవల్లుల్ని కూర్చిన పుణ్యఫలం



చేకూరుతుంది. ఎలుకను మింగాలని దేవాలయ గర్భగుడిలోకి ప్రవేశిస్తుందో పాము. దాని పడగపై గల మణుల కాంతి కారణంగా, హరికి దీపారాధన చేసిన పుణ్యఫలం దక్కిందంటారు. ఒక తేనెటీగ- విష్ణువు పాదాల్ని కడిగిన నీటితోపాటు పూజాపుష్పాల మకరందాన్ని ఆస్వాదించడం వల్ల తీర్థం, స్వార్థం రెండూ ఫలించాయని భక్తజనులు విశ్వసిస్తారు.

పైన చెప్పిన ప్రాణులన్నీ సుశీలకు పుత్రరూపాల్లో జన్మిస్తాయి. ఆవు తల్లి అయితే, మిగిలినవి ఆమె సంతానం. ఈ ఆరూ షడూర్ములకు ప్రతీకలు. ఆవు-జర, కాకి-మరణం, పాము-క్షుత్తు, తేనెటీగ-పిపాస, హంస-శోకం, చిలుకను మోహానికి ప్రతీకలుగా భావిస్తారు.

సుశీల తన కుమారులకు దేహం అనిత్యమని బోధిస్తుంది. మనో మాలిన్యాన్ని ప్రక్షాళన చేసుకోవాలని కోరుతుంది. మోక్షానికి హరిభక్తే సాధనమని, అది గ్రహించక పలువురు మోక్షం కోసం తాపత్రయపడుతుంటారని చెబుతుంది. విజ్ఞులైనవారు విష్ణువును మదిలో నిలిపి, పెద్ద కూపాన్నీ నేర్పుగా దాటతారు. ఎందరు ఎన్ని విధాలుగా సంచరించినా, విష్ణు సేవామార్గంలో తప్ప వేరే పద్ధతిలో మోక్షం కలగదని సుశీల విపులీకరిస్తుంది. సంతానానికి ఉపదేశించిన తరవాత ఆమె ముక్తురాలవుతుంది.

తల్లి బోధించిన మార్గంలోనే పుత్రులందరూ నడుస్తారు. అటువంటి జీవనమే గడిపి, షడూర్ములనూ దాటి, చివరికి వారు తీరం అనే మోక్షాన్ని చేరుకుంటారు. మోక్షం అంటే, జీవన వికాసమే!

అంతర్యామి

- డి.భారతీదేవి

అనాథలంటే అలుసా..?

- వారిని బీసీ-ఏగా గుర్తించాలంటూ ప్రభుత్వ ఉత్తర్వులు
- అయినా కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు రెవెన్యూ అధికారుల మీనమేషాలు

ఈనాడు - హైదరాబాద్

చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నవారు కొందరు.. అసలు అమ్మానాన్న ఎలా ఉంటారో తెలియని వారు మరి కొందరు.. కులం తెలియదు.. మతం ఏమిటో ఎరుగరు.. అయినా వీరంతా సమాజంలో తోటివారితో కలిసే పెరిగారు. ప్రభుత్వ పథకాలు, ఉచిత విద్యను పొందేందుకు సర్కారే అనాథలను బీసీ-ఏ కేటగిరీలో గుర్తించినా.. కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు మాత్రం రెవెన్యూ అధికారులకు సవాలక్ష అనుమానాలు వస్తున్నాయి. రేపు ఎవరైనా వచ్చి వారు మా పిల్లలంటే.. బీసీ కాకుండా ఇతర కులమని తెలిస్తే? అప్పుడు తమ ఉద్యోగాలకే ఎసరని అధికారులు వాదిస్తున్నారు. దీంతో ఆయా విద్యార్థుల ఉన్నత చదువులు, ఉపకార వేతనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వారు పొందలేని పరిస్థితి తలెత్తింది.

ధ్రువీకరణ పత్రం ఇవ్వలేం..



పాఠశాల ధ్రువీకరణ పత్రం ప్రామాణికంగా తీసుకుని, రికార్డులను పరిశీలించి తహసీల్దారు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. రెవెన్యూ అధికారులు పిల్లలను విచారిస్తున్నారు. ఒకవేళ తల్లిదండ్రుల పేరు చెబితే ఈ పిల్లలకు కులం కూడా తెలుసంటూ బీసీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేమంటున్నారు. తల్లిదండ్రుల పేరు తెలియని పిల్లల విషయంలో.. 'రేపు ఎవరైనా వచ్చి పిల్లల్ని తీసుకెళ్లినపుడు... వారిది ఉన్నత వర్గమో, ఇతర కులాలో అయితే ఎలా' అంటూ తిరిగి ప్రశ్నిస్తున్నారు. అనాథ పిల్లలు, నిరాశ్రయులైన పిల్లలకు ఈ పత్రాలు పొందడం గగనంగా మారుతోంది. ఇప్పటి వరకు బీసీ-ఏ కేటగిరీలో ధ్రువీకరణ పత్రాలు పెద్దగా ఇవ్వలేదని సమాచారం. కులధ్రువీకరణ మంజూరులో కీలకమైన జిల్లా సంక్షేమ అధికారులు ఈ విషయం పట్టించుకోవడం లేదు. ఆశ్రమాలు, పాఠశాలల నిర్వాహకులు రెవెన్యూ అధికారులను కలిస్తే ధ్రువీకరణ ఇవ్వలేమంటూ చేతులెత్తేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఇలా..

తల్లిదండ్రులు లేని, నిరాశ్రయిలైన పిల్లలను బీసీల్లో చేర్చుతూ తెలంగాణ ప్రభుత్వం 2017 ఏప్రిల్ 15న ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని బీసీ-ఏ కేటగిరీలోని వరుస నెం.55 కింద పేర్కొంటూ కుల ధ్రువీకరణ ఇవ్వాలని పేర్కొంది. తద్వారా ఉచిత విద్య, వసతి, ప్రభుత్వ పథకాల సదుపాయాలు పొందేందుకు వీలవుతుందని వివరించింది. ఈ మేరకు సీసీఎల్ఏకూ విధివిధానాలను సూచించింది. పిల్లల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రతి నెలా రెండు, లేదా మూడో శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని వివరించింది. కుల ధ్రువీకరణ పత్రాల జారీ పర్యవేక్షణ బాధ్యతను సంబంధిత జిల్లా బీసీ సంక్షేమ అధికారులకు అప్పగించారు. వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పత్రాల జారీ తదితర విషయాలపై బీసీ సంక్షేమ శాఖ మూడు నెలలకోసారి సమీక్ష నిర్వహించాలి.

- తల్లిదండ్రుల్లేని, నిరాశ్రయులైన పిల్లలు తాము చదువుతున్న ప్రభుత్వ ప్రైవేటు అనాథ విద్యాలయాల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి.
- ఆ పత్రాన్ని జతచేస్తూ బీసీ-ఏ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కోరుతూ సంబంధిత తహసీల్దారుకు దరఖాస్తు చేయాలి. ఈ దరఖాస్తును పరిశీలించి ఒక రసీదు ఇస్తారు.
- అనాథాశ్రమం ఇచ్చిన ధ్రువపత్రాన్ని ప్రామాణికంగా తీసుకుంటూ... వీఆర్వో, ఆర్ఐలు పాఠశాలకు వెళ్లి అక్కడి రికార్డులు పరిశీలించిన తరువాత ఒక నివేదిక ఇస్తారు.

ఈ నివేదిక ప్రకారం వివరాలను పరిశీలించి సమీకృత కులధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులోనే కుటుంబ ఆదాయం శూన్యమని పేర్కొంటారు.

బోధన ఫీజులు లేక..

ఎలాంటి ఆసరా లేని పిల్లల ఉన్నత చదువులకు ఆటంకాలు వస్తున్నాయి. ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో ఎలాగోలా పూర్తిచేసినప్పటికీ డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కోర్సుల సమయంలో ఇబ్బందులు వస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ లేకపోవడంతో బోధన ఫీజులు కష్టమవుతున్నాయి. బోధన ఫీజులు రావాలంటే కుటుంబ ఆదాయం అవసరం. కుటుంబమే లేకుంటే ఆదాయం ఏ విధంగా ఉంటుందన్నది? ప్రశ్నగా మారింది. అటు కుల, ఆదాయ ధ్రువీకరణలు లేకపోవడంతో ప్రతిభ ఉన్నప్పటికీ చదువుకోలేకపోతున్నారు. "మా కళాశాలలో చదువుతున్న అనాథ పిల్లలకు బోధన ఫీజులు రావడం లేదు. దీంతో దాతల సహాయంతో చిన్నపాటి వృత్తివిద్య కోర్సులు చేయిస్తున్నాం. ఇంజినీరింగ్, వైద్య కోర్సులు చేయడం ఖర్చుతో కూడుకున్నది. కనీసం ఉపకారవేతనాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆసక్తి ఉన్నప్పటికీ డబ్బులేక ఆయా కోర్సులు చదవలేకపోతున్నారు" అని ఓ ప్రైవేటు ఎన్జీవో నిర్వాహకురాలు తెలిపారు. "మా పాఠశాలలో చదివిన అమ్మాయికి గతంలో ఓసీగా రాశారు. ఇప్పుడు బోధనఫీజులు, ఉపకారం లేకపోవడంతో చదువుకోవడం ఇబ్బంది అవుతోంది" అని ఓ ఉపాధ్యాయుడు తెలిపారు.

మార్చుకోవడానికి వీల్లేని పరిస్థితి..

ఒకసారి పదో తరగతిలో 'ఓసీ' అని రాసిన తరువాత తిరిగి మార్చేందుకు నిబంధనలు ఒప్పుకోవని కొందరు అధికారులు చెబుతున్నారు. ఇంటి పేరు రాయడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి అంశాల్లో కొంత వరకైనా న్యాయం జరిగేలా సర్కారు కొంత వెసులుబాటు ఇవ్వాలని అభ్యర్థనలు వస్తున్నాయి.

ఓసీలుగా రాస్తున్నారు..

తల్లిదండ్రులు ఎవరో తెలియని, ఒకవేళ తెలిసినా వారు చనిపోయి నిరాశ్రయులుగా మారిన పిల్లల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఆయా విద్యార్థుల కులం ఏమి రాయాలో తెలియక విద్యాలయాల నిర్వాహకులు అయోమయంలో పడుతున్నారు. తల్లి లేదా తండ్రి బతికున్న పిల్లలకు వారి కులాన్ని రాస్తున్నారు. కానీ ఎవరూ లేనివారికి 'ఓసీ'గా విద్యాలయ బదిలీ ధ్రువీకరణ పత్రంలో పేర్కొంటున్నారు. దీంతో ఆయా పిల్లల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. పదో తరగతి పూర్తయిన తరువాత ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు ఇతర ఉన్నత వర్గాలతో సమానంగా పోటీపడాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో చదువులను మధ్యలోనే వదిలేయాల్సిన పరిస్థితి వస్తోంది.

ఈఈఎఫ్ఐ కార్యవర్గం ఎన్నిక

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఈఈఎఫ్ఐ) 8వ జాతీయ మహాసభలు ఆదివారం హైదరాబాద్‌లో ముగిశాయి. 25 మందితో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈఈఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడిగా హబీబ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా స్వదేశ్ దేవ్‌రాయ్, ప్రధాన కార్యదర్శిగా పీఎన్ చౌదరి, కోశాధికారిగా ఎస్.సుబ్రహ్మణియన్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు.

ఎన్ఏబీ విచారణకు షరీఫ్ కుటుంబం గైర్హాజరు

లాహోర్: పాకిస్థాన్ జాతీయ జవాబుదారీ సంస్థ(ఎన్ఏబీ) విచారణకు.. ఆ దేశ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, ఆయన కుటుంబ సభ్యులు హాజరుకాలేదు. పనామా పత్రాల్లో బయటపడిన అవినీతి, మనీలాండరింగ్ ఆరోపణలపై ఈ విచారణ జరుగుతోంది. నవాజ్ షరీఫ్, ఆయన సంతానం హసన్, హుస్సేన్, మరియమ్, అల్లుడు కెప్టెన్ సఫ్దార్‌లను ఆదివారం తమ ముందు హాజరు కావాలంటూ ఎన్ఏబీ సమన్లు జారీ చేసింది. తనను ప్రధాని పదవి నుంచి తొలగిస్తూ సుప్రీం కోర్టు వెల్లడించిన తీర్పుపై వేసిన సమీక్ష పిటిషన్‌పై నిర్ణయం వెలువడ్డాకే.. తాము హాజరవుతామని షరీఫ్ ఎన్ఏబీకి లేఖ ద్వారా తెలిపారు. సెప్టెంబరు ఆరంభంలో ఈ పిటిషన్‌ను కోర్టు విచారించే అవకాశముంది. ఎన్ఏబీ విచారణకు షరీఫ్ కుటుంబం గైర్హాజరవడం ఇది రెండోసారి. వివిధ కేసుల్లో వారికి సమన్ల జారీ కొనసాగిస్తామని ఎన్ఏబీ ప్రతినిధులు తెలిపారు.

ఈసారి 'హ్యాకథాన్'లోకి సామాన్యుడి సమస్యలు

- అన్ని వర్గాల నుంచి స్వీకరణ
- ఐదారు విదేశాల్లోనూ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్
- ఏప్రిల్‌లో నిర్వహణకు ఏఐసీటీఈ ప్రణాళిక

ఈనాడు - హైదరాబాద్

మీ సమస్యలు ఏమిటో చెప్పండి... వాటికి పరిష్కారాలను విద్యార్థులతోనే కనిపెడతాం... సులభంగా సేవలందేందుకు సహకరిస్తాం.... అంటోంది అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ). స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పేరిట ఆయా కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి సమస్యలను ఎంపిక చేసి పరిష్కారం కనుగొనడని తొలిసారిగా జాతీయస్థాయిలో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పోటీలు నిర్వహించిన ఏఐసీటీఈ వచ్చే ఏడాది మరిన్ని కొత్త నిర్ణయాలతో సమాయత్తమవుతోంది. ఈ సారి కేవలం కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచే కాకుండా సామాన్య ప్రజల నుంచీ సమస్యలను ఆహ్వానించనుంది. బీటెక్, ఎంటెక్ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచడంతోపాటు క్షేత్రస్థాయిలోని సమస్యలను డిజిటల్ సాంకేతికత ద్వారా సులభంగా పరిష్కరించేలా ఏఐసీటీఈ గత ఏప్రిల్ 1, 2 తేదీల్లో దేశవ్యాప్తంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌ను నిర్వహించింది. దేశంలో 3,400 సాంకేతిక విద్యా సంస్థలున్నాయి. మొత్తం 29 కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోని 598 సమస్యలను కేంద్రం గుర్తించింది. వాటి పరిష్కారానికి విద్యార్థి బృందాల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా 42 వేల మంది విద్యార్థులు 7,531 ఆలోచనలతో ముందుకొచ్చారు. వీరి నుంచి చివరకు 1266 బృందాలను ఎంపిక చేశారు. వీటిలో 10 వేల మంది పాల్గొన్నారు. దేశంలోని 26 ప్రాంతాల్లో ఏకధాటిగా 36 గంటలపాటు ఈ పోటీలను నిర్వహించారు. ఉత్తమ డిజిటల్ సాంకేతికతను అభివృద్ధి చేసిన బృందాలను ఎంపిక చేసి రూ.50 లక్షల బహుమతులు అందజేశారు. మన రాష్ట్రంలో హైదరాబాద్‌లోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా పోటీలు జరిగాయి.

రెండో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2018ను మరింత పకడ్బందీగా, విస్తృతంగా నిర్వహించాలని ఏఐసీటీఈ తాజాగా నిర్ణయించింది. అందులో భాగంగా తీసుకున్న నిర్ణయాలు..

- పోటీలకు గుర్తించే సమస్యలను కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలతోపాటు విద్యార్థులు, అధ్యాపకులు, చివరకు సాధారణ ప్రజల నుంచి కూడా తీసుకుంటారు. వారు నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలను చెప్పవచ్చు.
- భారత్‌తోపాటు మరో 5-6 దేశాల్లో కూడా ఈ పోటీలను నిర్వహిస్తారు. ఏయే దేశాలన్నది ఇంకా నిర్ణయించలేదు.
- ఇప్పటివరకు కేవలం డిజిటల్ సాంకేతికతతో సమస్యను పరిష్కరించేలా, సులభంగా సేవలందించేలా చేయగా ఈసారి హార్డ్ వేర్ హ్యాకథాన్ కూడా జరుపుతారు. ఉదాహరణకు విత్తనాలను వేగంగా చల్లే పరికరాలు లేవని ఓ రైతు చెబితే దాన్ని కూడా తయారు చేయాల్సి ఉంటుంది. అంటే ఇంజినీరింగ్‌లోని మెకానికల్ తదితర ఇతర బ్రాంచీల వారు కూడా పాల్గొనవచ్చు. ఆలోచనలను ప్రయోగశాల స్థాయిలో అభివృద్ధి చేస్తే చాలు. తదనంతరం అవి ప్రజాబాహుళ్యానికి ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం పరిశోధన చేస్తుంది.
- ఈ సారి లక్ష మందికిపైగా విద్యార్థులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించే హ్యాకథాన్‌కు డిసెంబరులో ప్రకటన జారీ చేయనున్నారు.

పీవీఆర్‌కే ప్రసాద్‌కు తీవ్ర అస్వస్థత

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: విశ్రాంత ఐఏఎస్ అధికారి, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ కార్యనిర్వాహక అధికారి పీవీఆర్‌కే ప్రసాద్ తీవ్ర అస్వస్థతతో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రిలో చేరారు. హృద్రోగ సమస్యతో బాధపడుతూ శనివారం రాత్రి 1.57 గంటల సమయంలో కేర్‌లో చేరినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ముఖ్యమంత్రి సీపీఆర్వో జ్వాలా నరసింహారావు ఆదివారం కేర్ ఆసుపత్రిలో ప్రసాద్‌ను పరామర్శించారు. ఐసీయూలో వైద్య చికిత్స పొందుతున్న ప్రసాద్ ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆదివారం సాయంత్రం వైద్య వర్గాలు వెల్లడించాయి.

స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలి: తమ్మినేని

ఈనాడు, హైదరాబాద్: నిధుల కొరతతో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తుల్లో విధులు నిర్వర్తించలేని దుస్థితి నెలకొందని, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో కోరారు. నల్గొండ జిల్లాలో రాంకీ సంస్థ అక్రమంగా కొనుగోలు చేసిన భూములపై సమగ్ర విచారణ జరిపించాలని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మల్లన్నసాగర్‌కు ఎక్కువ.. కొండపోచమ్మకు తక్కువ

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించనున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణానికి పిలిచిన టెండర్లను గుత్తేదారులు అంచనా కంటే ఎక్కువకు దక్కించుకోగా, కొండపోచమ్మ పనులను తక్కువకు దక్కించుకున్నారు. ఈ రెండు రిజర్వాయర్లు, కాలువ పనులు కలిపి 8 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. 8 మంది పోటీపడ్డారు. పనులను దక్కించుకొన్న గుత్తేదారుల వివరాలు..

ప్యాకేజీ	అంచనా	కోట్‌చేసిన మొత్తం	తక్కువ/ ఎక్కువశాతం	గుత్తేదారు
13	556	549	-1.25	సత్య ఇన్‌ఫ్రా
14	1875	1856	-1	మెగా ఇంజినీరింగ్
కొండపోచమ్మ ఒకటో రీచ్	900	884	-1.75	కె.ఎన్.ఆర్ కన్‌స్ట్రక్షన్స్
రెండోరీచ్	709	696	-1.8	హెచ్.ఇ.ఎస్ ఇన్‌ఫ్రా
మల్లన్నసాగర్ ఒకటో రీచ్	1822	1893	3.95	ఆఫ్కాన్స్
రెండో రీచ్	1499	1546	3.15	ఎల్ అండ్ టీ
మూడో రీచ్	2046	2118	3.5	రాఘవ కన్‌స్ట్రక్షన్స్
నాలుగో రీచ్	1436	1482	3.2	హెచ్.ఇ.ఎస్ ఇన్‌ఫ్రా

నోట్: అంచనా, కోట్‌చేసిన మొత్తం రూ.కోట్లలో

వెనుకబడిన తరగతుల అభివృద్ధిపై సీఎం దృష్టి

రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్



నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: వెనుకబడిన తరగతుల అభివృద్ధి(బీసీ)కి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మున్నూరు కాపుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుతం నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ మేయర్లు అందరూ బీసీలేనని అన్నారు. స్పీకరు, శాసన మండలిలో, మంత్రులు ఇలా అన్ని స్థానాల్లో బీసీలకు అవకాశం ఇచ్చారన్నారు. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిన వారిలో కేసీఆర్ ముందున్నారని, తన రాజకీయ చరిత్రలో ఇలా చూడటం మొదటిసారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆకుల లలిత తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేయండి

- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో 15 ప్రాంతాల్లో ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు పశ్య పద్మ, జంగారెడ్డి, రాయల చంద్రశేఖర్, భూతం వీరయ్య మాట్లాడారు. ప్రాజెక్టు కింద నిర్మించే జలాశయాలు, ఇతర నిర్మాణాల వల్ల పూర్తిస్థాయి సామాజిక ప్రభావం ఎంత ఉంటుందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం కనీసం రెండు తెలుగు పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కోరారు. పర్యావరణ నివేదిక తయారు చేసిన ప్రభుత్వం తెలుగులో ప్రచురించకుండా, ప్రజలకు అందుబాటులో ఉంచకుండా ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధం కావడం దారుణమన్నారు.

ప్రభుత్వ కుట్రలను ప్రతిఘటించండి: భూనిర్వాసితులకు చట్టబద్ధమైన పరిహారం ఇచ్చేవరకూ ప్రజాభిప్రాయ సేకరణ జరపవద్దని, భూములను స్వాధీనం చేసుకోవద్దని తెలంగాణ భూనిర్వాసితుల పోరాట కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలే ధిక్కారానికి పాల్పడడమంటే.. అభివృద్ధి పేరిట విధ్వంసం చేసినట్లేనని కమిటీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకట్, కోకన్వీనర్ టి.సాగర్, ధర్మానాయక్‌లు పేర్కొన్నారు.

'సాగు నీటి ప్రాజెక్టు పనులు భేష్'



అన్నారం బ్యారేజీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర జల వనరుల సంస్థ ఛైర్మన్ ప్రకాశ్‌రావు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణంలో భాగంగా కన్నెపల్లి ప్రధాన పంపుహౌస్, అన్నారం బ్యారేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వి.ప్రకాశ్‌రావు అన్నారు. ఆదివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రాన్ని దర్శించారు. ఈ సందర్భంగా కన్నెపల్లి ప్రధాన పంపుహౌస్ వద్ద పనులను పరిశీలించారు. మెగా కంపెనీ పీఎం వినోద్, ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. అనంతరం 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నారం బ్యారేజీ నిర్మాణం వద్దకు వెళ్లి పరిశీలించారు. పనుల వివరాలను కాళేశ్వరం బ్యారేజీ ఈఈ మల్లికార్జున ప్రసాద్, డీఈఈలు యాదగిరి, సతీష్‌లను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ నిర్మాణంలో అన్నారానికి సంబంధించిన రైతుల నుంచి 229 ఎకరాల భూసేకరణ జరగగా, 60 ఎకరాలు సమస్యగా మారిందని కాళేశ్వరం బ్యారేజీ ఇంజినీర్లు, ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధుల సమక్షంలో స్థానిక సర్పంచి రాజబాపు వివరించారు. అటవీశాఖ అధికారులు 60 ఎకరాలు తమ శాఖ పరిధిలోకి వస్తాయని అడ్డుపడుతున్నట్లు ఇంజినీర్లు వివరించారు. దిగువకు నీటిని వదిలేందుకు ఆ భూమి అత్యవసరమన్నారు. సమస్యను మంత్రి హరీశ్‌రావు, అటవీ శాఖ మంత్రి జోగు రామన్నలతో చర్చించి, భూమిని వెంటనే బ్యారేజీ నిర్మాణానికి అప్పగించేలా, నిర్వాసితులకు ఎకరాకు రూ.5.50 లక్షల పరిహారం అందేలా కృషి చేస్తానని ప్రకాశ్‌రావు హామీ ఇచ్చారు.

‘ఆర్ట్ ఆఫ్ లివింగ్’ ఆనందోత్సవ్‌లో తెలంగాణ నుంచి 2 వేల మంది

ఈనాడు, హైదరాబాద్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ అంతర్జాలం ద్వారా నిర్వహిస్తున్న ఆనందోత్సవ్‌లో దేశవ్యాప్తంగా దాదాపు లక్ష మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నుంచి రెండు వేల మందికి పైగా పాల్గొని యోగా విధానాలు, మానసిక ఒత్తిడిని తగ్గించే మెళకువలు నేర్చుకున్నారు. రవిశంకర్ స్వయంగా పాల్గొంటున్న ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా సుమారు 200 కేంద్రాల్లో నిర్వహించారు. యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఆత్మహత్యలు, కుంగుబాట్లను నివారించేందుకు రవిశంకర్ కొన్ని ఆచరణాత్మక సమాధానాలను తెలియజేశారు. ఆత్మన్యూనత, తమను తాము తక్కువగా భావించుకోవడం, పరస్పర సంఘర్షణలు, హింసా ధోరణుల నుంచి బయటపడే విధానాలను ఈ కార్యక్రమంలో నేర్పుతున్నారు.

1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రానైట్ పరిశ్రమల బంద్

వరంగల్, న్యూస్‌టుడే: గ్రానైట్ పరిశ్రమలపై జీఎస్టీ 2 శాతం నుంచి 28 శాతానికి పెంచడాన్ని నిరసిస్తూ వచ్చే నెల 1 నుంచి 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలను మూసివేసి నిరసన తెలుపనున్నట్లు తెలంగాణ రాష్ట్ర చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమల సంఘం తీర్మానం చేసింది. ఆదివారం హన్మకొండలో జరిగిన గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిచందర్ మాట్లాడారు. అన్ని జిల్లాల గ్రానైట్ నిర్వాహకులతో కలిసి సెప్టెంబరు 8వతేదీన పాదయాత్రగా హైదరాబాద్‌కు వస్తామని.. 9న కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి తమ నిరసనను తెలియజేస్తామన్నారు. ప్రభుత్వ అనుమతితో హైదరాబాద్‌లో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ జిల్లాల గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

కాజీపేట న్యూస్‌టుడే: భువనేశ్వర్ నుంచి ముంబయి వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం రూ.4 లక్షల విలువ చేసే 40 కిలోల గంజాయిని కాజీపేట ప్రభుత్వ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేశారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన గడధర్ పాండా(38), సాన్ స్వైన్(46), చిత్రసేన్ జేన(43), మీనాక్షి(22)లను ఒక్కొక్కరూ పది కిలోల చొప్పున ఎండు గంజాయి ప్యాకెట్లుగా చేసుకొని సంచులలో ముంబయికి రవాణా చేస్తుండగా పట్టుకున్నామని సీఐ వెంకటేశ్ తెలిపారు. వీరు ఒడిశాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ముంబయిలో కిలోకు పది వేల చొప్పున విక్రయిస్తారని చెప్పారు. ఇటీవల విస్తృత తనిఖీలు చేపట్టడంతో ఎక్కువ సంఖ్యలో గంజాయి కేసులు నమోదు చేస్తున్నామని.. ఇప్పటి వరకు కాజీపేట, వరంగల్‌లో కలిపి 230 కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు.

ప్రశాంతంగా డిప్యూటీ సర్వేయర్ రాతపరీక్ష

ఈనాడు, హైదరాబాద్: డిప్యూటీ సర్వేయర్ పోస్టులకు ఆదివారం నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా జరిగిందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జనరల్ నాలెడ్జి, సివిల్(ఐటీఐ) ట్రేడ్ సబ్జెక్టులుగా రాత పరీక్ష జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 273 పోస్టులకు 27068 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి 56 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాత పరీక్ష రాసేందుకు హాల్‌టికెట్లు 26874 మంది డౌన్‌లోడ్ చేసుకోగా వీరిలో 21060 (78.37శాతం) మంది హాజరయ్యారని వెల్లడించారు.

సామూహిక సెలవుకు టీటీయూ మద్దతు

ఈనాడు, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని(సీపీఎస్) రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేయనున్న సామూహిక సెలవుకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ టీచర్ల సంఘం(టీటీయూ) తెలిపింది. 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానాన్నే కొనసాగించాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డిమాండ్ చేశారు.

రూ.500 నకిలీ నోటు

మెదక్, న్యూస్‌టుడే: నల్లధనాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసి రూ.2వేలు, రూ.500 కొత్త నోట్లను ప్రవేశపెట్టగా అక్రమార్జనకు అలవాటుపడిన వారు నకిలీ నోట్లను తయారు చేస్తూ జనాన్ని మోసం చేస్తున్నారు. గిరాకీ ఎక్కువగా ఉండే దుకాణాల్లో, నగదు లావాదేవీలు ఎక్కువగా జరిపే వ్యాపారులకు నకిలీ నోట్లను ఇచ్చి వారిని ఏమారుస్తున్నారు.

మెదక్ జిల్లాలో ఇటీవల ఓ వ్యాపారి బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లగా ఇచ్చిన రూ.500 నోట్ల కట్టలో ఒకటి నకిలీదని బ్యాంకు అధికారులు గుర్తించారు. దానిపై ‘నకిలీ నోటు’ అని రాసి అది చెలామణి కాకుండా చేశారు. మెదక్ పట్టణంలో మరికొందరికి సైతం ఇలాంటి నకిలీ నోట్లు వచ్చినట్టు తెలిసింది. నష్టమైనప్పటికి లేనిపోని తలనొప్పి ఎందుకని కొందరు ఆ నోట్లను చించివేస్తున్నట్టు సమాచారం. కొత్త రూ.500, రూ.2000 నోట్లను తీసుకునే సమయంలో ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా చూసి తీసుకుంటే నష్టపోకుండా ఉండే అవకాశం ఉంది.



‘చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం(యుఏపీఏ) కింద గూర్ఖా జనముక్తి మోర్చా(జీజేఎం) సారథి బిమల్ గురుంగ్‌పై కేసు నమోదు చేసినట్లు డార్జిలింగ్ పోలీసులు వెల్లడించారు. కలింపాంగ్ పోలీసుల స్టేషన్‌పై చేతిబాంబు విసిరిన ఘటన, డార్జిలింగ్‌లో జరిగిన భారీ విస్ఫోటం ఘటన నేపథ్యంలో ఆయనపై కేసులు నమోదు చేశారు.





నిర్మల్ జిల్లా వెంకూర్‌లో నీట మునిగిన పత్తి ★ సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్-వాసర్ మధ్య కొట్టుకుపోయిన మళ్లింపుదారి ★ జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో పొంగి ప్రవహిస్తున్న మానేరు వాగు

కరవు తీరా వానలు

ఈనాడు, న్యూస్‌టుడే యంత్రాంగం

కుంభవృష్టి వర్షాలతో తెలంగాణ రాష్ట్రం తడిచి ముద్దయింది. పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురవడం వల్ల నీటివనరులు క్రమంగా నిండుతున్నాయి. సోమ, మంగళవారాల్లో వర్షాలు కాస్త తగ్గి బుధవారం నుంచి పెరిగే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి చెప్పారు. బంగాళాఖాతం నుంచి వచ్చిన అల్పపీడనం తెలంగాణ రాష్ట్రాన్ని ఆదివారం ఉదయమే దాటి మహారాష్ట్రలోకి వెళ్లింది. ఉత్తర భారతం నుంచి తెలంగాణ మీదుగా కోస్తా వరకు రుతు పవన ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఒక మాదిరిగా అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం బంగాళాఖాతంపై మయన్మార్ తీర ప్రాంతానికి దగ్గరగా ఉపరితల ఆవర్తనం ఉంది. ఇది క్రమంగా బలపడి పశ్చిమ దిశగా సాగితే తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాలు పెరిగే అవకాశాలున్నాయి. దీనిపై మరో రెండు రోజుల్లో స్పష్టత వస్తుంది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలోని 415 ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలోని రెంజల్, వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లిలో 19 సెంటీమీటర్లు(సెం.మీ.) నమోదైంది. నవీపేట, వెంకటాపూర్, ముధోల్‌లో 18 సెం.మీ, సారంగాపూర్, నిజాంసాగర్, కోటగిరిలో 17, వర్ని, శాయంపేట, ఎల్లారెడ్డిలో 15, బోధన్, ములుగు, గోవిందరావుపేటలో 14, నారాయణఖేడ్, రుద్రూరులో 13, పిట్లం, జుక్కల్, బాన్స్‌వాడ, గాంధారిలో 12, మక్లూర్, భీర్కూర్‌లో 11, కామారెడ్డి, హసన్‌పర్తి, బోథ్, నిజామాబాద్‌లో 10 సెం.మీ.ల చొప్పున వర్షం కురిసింది. సాధారణంగా 5 సెంటీమీటర్లకన్నా ఎక్కువ వర్షం ఒకేరోజులో కురిస్తే భారీ వర్షాలుగా చెబుతారు. ఇంతకాలం భారీ వర్షాలు లేక అంతంతమాత్రంగా ఉన్న వరి సాగు ఇక పూర్తిస్థాయిలో పెరుగుతుందని వ్యవసాయశాఖ తెలిపింది.

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలంలో 24 గంటల వ్యవధిలో అత్యధికంగా 212.2 మిల్లీమీటర్లు నమోదైంది. 5 జిల్లాల పరిధిలోని మండలాల్లో 10 నుంచి 212 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలన్నీ నిండాయి. మధ్యతరహా జలాశయాలైన పాకాల, రామప్ప, లక్నవరం, గణపసముద్రం, మల్లూరువాగు ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. నదులు, వాగులు పొంగి పొర్లడంతో జనజీవనం స్తంభించిపోయింది. పంటలు నీట మునిగాయి. పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. అత్యధికంగా నేరడిగొండ మండలంలో 160.4 మి.మీ.ల వర్షం కురిసింది. నిర్మల్ జిల్లాలోని స్వర్ణ, గడ్డెన్నవాగు, కడెం జలాశయాల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. భైంసాలో 221.3 మి.మీ., కుంటాలలో 206.4, తానూరులో 194.3, ముథోల్‌లో 185.4, సారంగాపూర్‌లో 177.2 మి.మీ. నమోదైంది. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా రెండ్రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. ఎల్లంపల్లి జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, పొచ్చర జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లాలోని 11 మండలాల్లో సగటున 10 సెం.మీ వర్షపాతం నమోదైంది. నిజాంసాగర్‌కు ఎగువ నుంచి 1899 క్యూసెక్కులు వస్తోంది. చిన్నతరహా జలాశయాలు కౌలాస్‌నాలా, సింగీతం, కళ్యాణిలు నీటితో కళకళలాడుతున్నాయి. ఆయా జలాశయాల గేట్లు ఎత్తి మంజీరలోకి నీటిని వదిలారు. గాంధారి మండలంలోని గుజ్జుల్ వాగులో గల్లంతయిన దేవిసింగ్ ఆచూకీ ఇంకా లభ్యంకాలేదు. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 8.4 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మంజీరా, గోదావరి నదులకు వరద పోటెత్తింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఈసీజన్‌లో తొలిసారిగా వరద నీరు వచ్చి చేరుతోంది. రెండు రోజులుగా వచ్చిన వర్షాలకు శ్రీరాంసాగర్‌లోకి 1.656 టీఎంసీల నీరు వచ్చి చేరిందని అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు పాంతాల్లోని మళ్లింపు దారులు కొట్టుకుపోయాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వర్షం ఎక్కువగా కురిసింది. కల్హేర్- మాసాన్‌పల్లి, సిర్గాపూర్-వాసర్ గ్రామాల మధ్యన వంతెనల నిర్మాణాల వద్ద ఏర్పాటుచేసిన మళ్లింపు దారులు భారీగా కోతకు గురయ్యాయి. ఈ మార్గాల్లో రాకపోకలు చాలా వరకు స్తంభించాయి. కల్హేర్‌లో 151.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.





లక్నవరం జలాశయంలో వేలాడే వారధి వద్ద నీరు ★ నిండుకుండలా ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల జలపాతం★ వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చర జలపాతం

గోదావరికి వరద ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ఎగువన వర్షాలు లేకపోవడంతో కృష్ణా ప్రవాహం తగ్గిపోయింది. మరోవైపు గోదావరి పరివాహకంలో వానలు కురుస్తుండటంతో నదిలో వరద ప్రారంభమైంది. మూడురోజులుగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్లు, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు పడుతుండటంతో గోదావరి ఉప నదులు పొంగి పొర్లుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలకు కడెం ప్రాజెక్టులో కొద్దికొద్దిగా ప్రవాహం పెరుగుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 7.60 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రానికి తొమ్మిది వేల క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఐదు వేలకుపైగా క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. మరోవైపు కిన్నెరసాని, తాలిపేరు పోటెత్తుతున్నాయి. కృష్ణానదిపై ఉన్న జలాశయాల్లోని నీటిమట్టాల్లో పెద్దగా వ్యత్యాసమేదీ లేదు. శ్రీశైలం జలాశయంలోకి స్వల్పంగా 2238 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది.

అప్రమత్తంగా ఉండాలి: మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖలో ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా చెరువు కట్టలకు గండ్లు పడే ప్రమాదం ఉందని జిల్లాల సీఈలు, ఎస్ఈలను అప్రమత్తం చేశారు. చెరువు కట్టలు తెగిపోకుండా ముందుగానే సిమెంటు సంచులు, ఇసుక సిద్ధం చేసుకోవాలని నీటిపారుదల సబ్‌డివిజన్ల అధికారులకు సూచించారు. వర్షాలతో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించాలన్నారు. చెరువులు, రిజర్వాయర్లలో ఏ మేరకు నీళ్లు చేరాయో నమోదు చేసి, అధికారులను క్షేత్రస్థాయికి పంపించాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులను రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకుని కాపాడాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే క్షమించేది లేదన్నారు. జిల్లాల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తితే కలెక్టర్లకు, రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వాలని ఇంజినీర్లకుసూచించారు.

ఉపరాష్ట్రపతి వెంకయ్యకు నేడు పౌరసన్మానం

ఈనాడు, హైదరాబాద్: ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడికి తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు రాజ్‌భవన్‌లో పౌర సన్మానం జరగనుంది. పదవిని స్వీకరించిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్న ఆయనకు బేగంపేట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు ఘనస్వాగతం పలుకుతారు. అనంతరం అక్కడి నుంచి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. అక్కడ సీఎం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరుగుతుంది. వేదికపై వెంకయ్యతో పాటు గవర్నర్ నరసింహన్, కేంద్రమంత్రులు, పార్లమెంటరీ పార్టీ నాయకులు, ముఖ్యనేతలు ఉంటారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నగర ప్రముఖులు 600 మందిని ఆహ్వానించారు. సన్మానం అనంతరం వెంకయ్యనాయుడి గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు.

రాజీవ్ కృషి ఫలితమే నేటి సాంకేతికత

- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ఆనాడు రాజీవ్‌గాంధీ కృషి ఫలితమే నేడు దేశం సాంకేతిక రంగంలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన తీసుకొచ్చిన సంస్కరణల కారణంగానే నేడు సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకుని ఉత్తమ్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హన్మంతరావు, షబ్బీర్‌అలీ, దానం నాగేందర్, భట్టి విక్రమార్క తదితరులు సోమాజిగూడలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. రాజీవ్ దేశానికి చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. 2019 ఎన్నికలే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నామన్నారు. అంతకు ముందు ఆబిడ్స్ నుంచి సోమాజిగూడ రాజీవ్ కూడలి వరకు సద్భావన యాత్ర నిర్వహించారు. ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మల్లు రవి, శారద, అనీల్‌కుమార్ యాదవ్, వనం శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



సద్భావనా పరుగును ప్రారంభిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో దానం నాగేందర్, వీహెచ్

రాజీవ్‌కు ఘనంగా నివాళులు


దిల్లీ: రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం పలువురు ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన స్మారక స్థలం వీర్‌భూమి వద్ద జరిగిన ప్రార్థన కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, ప్రియాంక, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. రాజీవ్ ప్రాతినిధ్యం వహించిన అమేథీ సహా, దేశంలోని పలుచోట్ల కాంగ్రెస్ శ్రేణులు జయంతి కార్యక్రమాలను నిర్వహించాయి.

వీరభూమిలోని రాజీవ్ సమాధి వద్ద పొన్నాల లక్ష్మయ్య, బలరాంనాయక్, పొన్నం ప్రభాకర్, రాజయ్య, సురేష్‌షెట్కార్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

సెప్టెంబరు 17న బహిరంగసభ

- విమోచన దినోత్సవానికి ప్రభుత్వంపై ఒత్తిడి
- భాజపా తెలంగాణ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో నిర్ణయం

ఈనాడు-హైదరాబాద్: సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని భారతీయ జనతాపార్టీ నిర్ణయించింది. రజాకార్ల అకృత్యాలకు బలైన ప్రాంతాలను సందర్శించడం, కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించడంతో పాటు వచ్చే నెల 17న భారీ బహిరంగ సభ వంటి కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఈ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆహ్వానించనున్నారు. నిజామాబాద్ లేదా కరీంనగర్‌లో ఒకచోట బహిరంగ సభ నిర్వహించే విషయంపై చర్చించింది. సభ ఎక్కడన్నదానిపై రెండు,మూడు రోజుల్లో తుది నిర్ణయం తీసుకోనున్నారు. భాజపా రాష్ట్ర పదాధికారుల సమావేశం ఆదివారమిక్కడ జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కేంద్రమంత్రి దత్తాత్రేయ, శాసనసభాపక్షనేత కిషన్‌రెడ్డితో పాటు సీనియర్‌నేతలు ఇంద్రసేనారెడ్డి, రాజేశ్వరరావు, ఎమ్మెల్యేలు, అన్ని జిల్లాల అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలు హాజరయ్యారు. తెలంగాణ విమోచన దినోత్సవంపై ప్రధానంగా చర్చ జరిగింది. నిజాం పాలనలో రజాకార్ల అకృత్యాలకు బలైన పది ప్రాంతాలను ఎంపికచేసి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు ఒక్కో ప్రాంతానికి ఒక్కో ముఖ్యనేత, ఇతర నాయకులు వెళ్లేలా కార్యక్రమంపై చర్చించారు. పరకాలలో అమరధామం, నిర్మల్‌లో వెయ్యిఉర్ల మర్రిచెట్టు, గుండ్రాంపల్లి వంటి ప్రాంతాలను సందర్శించాలని నిర్ణయించినట్లు సమాచారం. అమరవీరుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నా కార్యక్రమాల్ని చేపట్టాలని కమలనాథులు నిర్ణయించారు. సెప్టెంబరు 10న ఈ కార్యక్రమం చేపట్టాలని అనుకున్నట్లు సమాచారం. భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్ర పర్యటనపై పైనా చర్చించారు. సమావేశం అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ నుంచి వస్తున్న ఒత్తిళ్లతో తెరాస ప్రభుత్వం తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మర్చిపోయిందని విమర్శించారు. సెప్టెంబరు 17 గురించి, అమరవీరుల త్యాగాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు.



భాజపా పదాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్. చిత్రంలో ఇంద్రసేనారెడ్డి, కిషన్‌రెడ్డి, కేంద్రమంతి దత్తాత్రేయ

కేసీఆర్‌కు పురస్కారం తెలంగాణకు గర్వకారణం

- మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ పురస్కారం లభించడం తెలంగాణకు గర్వకారణమని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ స్ఫూర్తితో రాష్ట్రం మరింత ఉత్సాహంతో పురోగమిస్తుందన్నారు. తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ, ఆహారమండలి కేసీఆర్‌ను పురస్కారానికి ఎంపిక చేయడం అన్ని విధాలా సముచితమన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ సారథ్యంలోని కమిటీ ఆయనను ఎంపిక చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మూడేళ్లుగా ఆయన రైతులకు రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్తు, రూ.8వేల సాయం వంటి నిర్ణయాలు తీసుకొని దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. వచ్చే ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారన్నారు. కేసీఆర్ రైతులను రాజులుగా చేస్తుంటే వారి పొట్టకొట్టేందుకు కాంగ్రెస్, ఇతర విపక్షాలు కుట్రలు చేయడం దారుణమని పోచారం అన్నారు.

కాంగ్రెస్ కాలనాగు.. కర్నె ప్రభాకర్: కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కుతంత్రాలు చేస్తోందని తెరాస ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టుపై మర్రి శశిధర్‌రెడ్డి కేంద్ర పర్యావరణ కార్యదర్శి అజయ్‌నారాయణ్‌కు ఫిర్యాదు చేయడం పార్టీ నిజస్వరూపాన్ని బహిర్గతం చేసిందన్నారు. ఆదివారం తెరాస ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ తెలంగాణ పాలిట కాలనాగుగా మారిందని, రాష్ట్రంలో ప్రాజెక్టులను అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే పార్టీ నేతలు కేసులు వేశారని, చివరికి కేంద్రం వద్దకు వెళ్తున్నారని చెప్పారు.

సాగు సంక్షోభంలో ఉంటే సీఎంకు అవార్డా?: కాంగ్రెస్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో వ్యవసాయం సంక్షోభంలో ఉంటూ.. అన్నదాతల ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండో స్థానంలో ఉండగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ అవార్డు రావడం వింతగా ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ అన్నారు. రాష్ట్రంలో 3500 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఒక్క రైతు కుటుంబాన్ని కూడా సీఎం పరామర్శించలేదని గుర్తించాలన్నారు. రైతుల కుటుంబాలకు జీవో ప్రకారం పరిహారం కూడా అందించలేదని ఆరోపించారు. ఆదివారం గాంధీభవన్‌లో శ్రవణ్ విలేఖరులతో మాట్లాడారు.

వసుంధర

జుట్టు రాలిపోకుండా..

కాలుష్యం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం, అశ్రద్ధ వంటి కారణాలతో జుట్టు రాలడం, ఎండిపోవడం వంటి సమస్యలు చాలామందిలో కనిపిస్తున్నాయి. వీటిని అదుపులో ఉంచాలంటే..



పావులీటరు నీటిలో నాలుగు చుక్కల నీలగిరి తైలం, ఐదారు మందార పువ్వులూ, గుప్పెడు చొప్పున మందార ఆకులూ, గుప్పెడు తులసి ఆకుల్ని ఓ గిన్నెలోకి తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. ఆ నీరు రంగు మారేవరకూ మరిగించి తరవాత వడకట్టాలి. ఈ నీటిని వారానికి ఒకసారైనా తలకు మర్దన చేసుకుని కాసేపయ్యాక కడిగేయాలి.

వర్షం, దుమ్ము, ధూళికి సాధారణంగా జుట్టు పొడిబారుతుంది. అలా కాకుండా ఉండాలంటే రెండు నిమ్మకాయల రసాన్ని రెండు కప్పుల నీళ్లల్లో వేసి బాగా కలిపి, ఒక సీసాలోకి తీసుకోవాలి. దాన్ని జుట్టుకు రాసుకోవాలి. ఇది పోషణ అందించి.. పట్టులా మారుస్తుంది.

కప్పు నీళ్లలో రెండు చెంచాల టీపొడీ, కాసిని తులసీ ఆకులు వేసి బాగా మరిగించాలి. ఆ నీళ్లు సగం అయ్యాక దింపేయాలి. తరవాత ఇవతలకు తీసి..అందులో షాంపూ కలిపి తలస్నానం చేయాలి. జుట్టు ఆరోగ్యంగా, పట్టులా మారుతుంది.

కేప్ బ్లవుజు.. కొత్తగా!



ఇప్పటి అమ్మాయిలు చీరకట్టుకీ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వాటిని అందంగా కనిపించేలా చేయడంలో బ్లవుజు ప్రాధాన్యతే ఎక్కువని భావిస్తున్నారు. అలా ఆలోచించే అమ్మాయిలు తమ వార్డ్‌రోబ్‌లో తప్పనిసరిగా ఉంచుకోవలసిన బ్లవుజు రకాలు కొన్ని ఉన్నాయి.

బటర్‌ఫ్లై స్లీవ్స్: కాలేజీ పార్టీలకూ, పుట్టినరోజు వేడుకలూ, ఇతరత్రా సందర్భాలకు చక్కని ఎంపిక ఈ బటర్‌ఫ్లై స్లీవ్స్ బ్లవుజు. దీన్ని ఎంచుకుంటే చక్కని చీరకట్టుతో యువరాణిలా మెరిసిపోవచ్చు. అయితే జాలువారేలా ఉండే వస్త్రరకాల(ఫ్లోయీ ఫ్యాబ్రిక్స్) ఎంచుకుంటే బాగుంటుంది.



స్ట్రైప్స్: ఇవి చూడ్డానికి బాగుంటాయి. ఆధునిక లుక్‌నీ ఇస్తాయి. ఎలాంటి డిజైను లేని సాదా చీర మీదకు ఏ తరహా గీతలున్న బ్లవుజును అయినా ప్రయత్నించొచ్చు. అయితే బ్లవుజును చీరరంగులోనే కుట్టించుకోవచ్చు. ఇది పగటి పూట జరిగే వేడుకలకు చక్కగా ఉంటుంది.

కేప్: తాజా ట్రెండ్‌లలో మొదటి స్థానంలో ఉంది ఈ కేప్ బ్లవుజు. నెట్‌కేప్‌కి ఎంబ్రాయిడరీ చేయించుకుంటే ఎన్ని చీరలు మీదకైనా కొత్తగానే అనిపిస్తుంది. నలుపు, బంగారు రంగులో దీన్ని సిద్ధంగా పెట్టుకుంటే.. రకరకాల చీరలమీదకు ఎంచుకోవచ్చు.



వెనక ఇలా...: మెడ, చేతులు భాగం కాకుండా డిజైన్ చేయించుకోవాలనుకున్నప్పుడు వీపు సగం కాస్త కొత్తగా కనిపించేలా చేయాలి. అందుకోసం నెట్ వస్త్రంలో వీపు సగం కప్పేస్తూ.. దానిపై ఎంబ్రాయిడరీ చేయించుకుంటే కొత్తగా ఉంటుంది. సౌకర్యంగానూ అనిపిస్తుంది.







బ్లూవేల్ ఎందుకొస్తుందంటే...

ఇదివరకెన్నడూ లేనివిధంగా.. గత రెండు దశాబ్దాలుగా మనదేశంలోని టీనేజర్స్‌లో ఆత్మహత్యలు పెరిగాయి. కొన్ని స్థాయిభేదాలతో కుంగుబాటూ ఎక్కువ మందిలో కనిపిస్తోంది. దీనికి కారణమేంటీ? మనదేశం చారిత్రకంగా ఎన్నో యుద్ధాలు ఎదుర్కొంది. తీవ్ర ఆర్థికమాంద్యాలూ, కరవులూ చవిచూసింది. కానీ ఎప్పుడూ కూడా టీనేజీవాళ్లు కుంగుబాటుకి గురై.. ఆత్మహత్యల దాకా వెళ్లిన సందర్భాలు చాలా తక్కువ. అలా వెళ్లకపోవడానికి కారణం.. మన బలమైన కుటుంబ వ్యవస్థే. తల్లో తండ్రో, అన్నో, అక్కో, అమ్మమ్మో, నాన్నమ్మో ఇరవైఏళ్ల దాకా కూడా వాళ్లని లాలనగా చూడటమే. ఇందువల్ల మన టీనేజర్‌లకి 'నేను బతకడమే వ్యర్థం..!' అనే భావన వచ్చేది కాదు. అలాంటి ఓ ఆదరణా, దన్నూ, తోడు లేని ఒంటరితనం నేటి టీనేజర్లలో పెరిగింది. దీనికి రెండు కారణాలు. ఒకటి.. నేటితరం చదువులూ, దానిపై తల్లిదండ్రుల్లో ఉన్న ఓ వేలం వెర్రి! ఇంకొకటి.. పిల్లలతో కనీసం మాట్లాడే ఓపికా, తీరికా వాళ్లకి లేకపోవడం. యువతరం తల్లిదండ్రులు పిల్లలకు వస్తుపరంగా అన్నీ సమకూరుస్తున్నారు. కానీ 'నీకోసమే మేమున్నాం. నువ్వంటే మాకు ప్రాణం!' అని మాటల్లో, చేతల్లో చూపలేకపోతున్నారు. అది మనం చేయగలిగితే టీనేజీ కుంగుబాటుని 90 శాతం దాకా పరిహరించొచ్చు.

బ్లూవేల్ ఛాలెంజ్..
ప్రపంచాన్ని వణికిస్తోంది ఇప్పుడు!! తక్షణం దీన్ని కట్టడిచేయాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. మొన్ననే సీబీఎస్ఈ కూడా స్కూళ్లకి కొన్ని మార్గదర్శకాలు పంపించింది. దాన్ని కట్టడి చేయడంతోపాటూ.. మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన అంశం ఒకటుంది. అసలీ ఛాలెంజ్ ఎవర్ని లక్ష్యంగా చేసుకుంటోందీ అని! ఎవర్ని? కుంగుబాటుని ఎదుర్కొంటున్న టీనేజీ పిల్లల్ని!! ప్రపంచవ్యాప్తంగా నమోదైన 130 పైచిలుకు మరణాలు చెబుతున్న నిజం ఇది. ఓ రకంగా బ్లూవేల్ మనం ఈ కుంగుబాటుపై మరింత దృష్టిపెట్టాలని చెబుతోంది. తల్లిదండ్రులూ, పిల్లల మధ్య దూరం పెరిగిపోతోందని మరో సారి హెచ్చరిస్తోంది!! ఆ దూరాన్ని తగ్గించడమెలాగో చూద్దామా?

అదెలా చేయాలి?

ప్రతి ఒక్కరూ ప్రత్యేకమే : ఓ అడవిలో జంతువులన్నింటికీ చెట్లెక్కే పోటీపెట్టారని అనుకుందాం. ఏనుగు ఎన్నో స్థానంలో నిలుస్తుంది? చివరి స్థానం కూడా రాదు కదా! ఆ కారణంతో ఏనుగుకి శక్తిలేదని అంటామా? పిల్లల విషయంలో అదే చేస్తున్నాం. ప్రతి చిన్నారీ ఎందులో సమర్థులో తెలుసుకోలేక ర్యాంకులు తెచ్చుకోవాలని చూస్తున్నాం. వెనకపడితే పనికిరావని ముద్రవేసి కించపరుస్తున్నాం. అలాకాకుండా టీనేజీ వచ్చేలోపే వాళ్లు ఎందులో సమర్థులో గ్రహించండి. అవసరమైతే నిపుణుల సలహా తీసుకోండి. ఆ రంగంలో ప్రోత్సహించండి.

బలహీనతలు సహా.. : 'ఇట్స్ ఓకే టుబీ నాట్ ఓకే!' అని చెబుతుంటారు ఆంగ్లంలో. పిల్లల్లో లోపాలున్నప్పుడు మనస్ఫూర్తిగా అంగీకరించండి. వాటిని పదేపదే ఎత్తిచూపకండి. 'మనలో లోపాలు ఉన్నంత మాత్రాన.. అమ్మానాన్న నన్ను దూరం చేయరు!' అనే చిన్న నమ్మకాన్ని వాళ్లకివ్వండి.

అక్కున చేర్చుకోండి : స్కిన్ హంగర్.. అమ్మానాన్నా తమని అక్కున చేర్చుకోవాలనే తపన. చిన్నారులకే కాదు టీనేజీవాళ్లకీ ఇది ఉంటుంది. మరీ కృతకంగా అనిపించినా సరే.. రోజుకొక్కసారైనా ఇలా దగ్గరకు తీసుకోండి. ఏదైనా మంచిపని చేసినప్పుడు భుజం తట్టండి. ఇది చాలావరకూ పిల్లల్లో ఒంటరి భావన రాకుండా చూస్తుంది.

సమయం ముఖ్యం : మీకెన్ని పనులున్నా సరే కనీసం రోజుకి గంటైనా పిల్లలతో గడిపేలా చూడండి. ఆ సమయంలో అందరూ కలిసి ఏదైనా సృజనలో నిమగ్నంకండి. ఆ గంటపాటూ పూర్తిగా మీ స్మార్ట్‌ఫోన్లూ.. అంతర్జాలానికి దూరంగా ఉండండి. కనీసం వారానికోసారి, ఒక్కపూటైనా అందరూ కలిసి 'గాడ్జెట్ ఫ్రీ డే'ని పాటించండి. వీలైతే బయటకు వెళ్లిరండి. ఏడాదికొక్కసారైనా మీరున్న పరిస్థితులకి భిన్నమైన వాతావరణంలో గడపండి. ఇదంతా కుటుంబ సభ్యులమధ్య బంధాన్ని పెంచుతుంది.

అన్యోన్యంగా మీరు : పిల్లల మనో వ్యాకులతకి ప్రధాన కారణం.. తల్లిదండ్రుల మధ్య అన్యోన్యత లేకపోవడమే! అమ్మానాన్నా విడిపోతారనే భయం ఐదేళ్లప్పటి నుంచే వాళ్లలో వచ్చేస్తుంది. ఇద్దరూ ఎప్పుడూ గొడవ పడుతూ ఉంటే.. విడిపోయే పరిస్థితులుంటే బయటకు చెప్పుకోలేక కుంగిపోతారు. వ్యసనానికి బానిసయ్యేవాళ్లూ, తమని తాము హింసించుకునేవారు, ప్రేమ పేరుతో మోసాలు చేసేవాళ్లేకాదు, ఆ వంచనకు సులభంగా గురయ్యే వారి నేపథ్యంలోనూ ఈ సమస్య ఉంటోంది!

పనులు నేర్పించండి : ఓవైపు పిల్లలకి కావాల్సిన లాలన ఇవ్వలేని మనం వాళ్లని అతి సున్నితంగా పెంచుతున్నాం. ప్రతిదీ మనమే చేసిపెడుతున్నాం! అలాకాకుండా ఇంటిపనీ, వంటపనీ, నెలవారీ బిల్లులు కట్టడం ఇలా అన్నీ నేర్పించండి. ముఖ్యంగా, ఇల్లు ఊడ్చడం నుంచి బాత్రూమ్ క్లీనింగ్ ద్వాకా ప్రతి పనీ గౌరవమైనదేననే విషయం టీనేజీలోనే వాళ్లకి మనం నేర్పించగలగాలి!! జపాన్, ఆస్ట్రేలియాలో ఈ పద్ధతే పాటిస్తుంటారు. ఈ జీవన నైపుణ్యాలు వారిలో ఆత్మవిశ్వాసం నింపుతాయి. ప్రపంచాన్ని ఎదుర్కోవడం నేర్పుతాయి.

చుట్టూ సానుకూలత : ప్రతిరోజూ వాళ్లకి జరిగిన ఓ మంచిని రాయమనండి. వాళ్లతోపాటూ మీరూ రాయండి. ఇందుకో డైరీ పెట్టండి. 'గ్రాటిట్యూడ్' డైరీ అంటారు దీన్ని. మన ఇంట్లో సానుకూలత పెంచే మంచి టానిక్ ఇది!

బ్లూవేల్ లక్షణాలివి..

ఒంటరితనం : ఒకప్పుడు నచ్చని హారర్, హింసాత్మక సినిమాలు చూడటం, ఏకాంతం కోసం తపించడం, తీవ్రమైన ఒంటరితనం.. చూస్తుండగానే జీవచ్ఛవంలా మారడం ఇవన్నీ కేవలం రెండునెలల తేడాలోనే కనిపిస్తాయి.

తెచ్చిపెట్టుకున్న ఉత్సాహం : 'మావాడు నిన్నటిదాకా ఆనందంగానే కనిపించాడు. జోకులేశాడు. కానీ..' అని వాపోయింది బ్లూవేల్ ఛాలెంజ్‌తో మరణించిన ఓ కుర్రాడివాళ్లమ్మ! ఇది 'హై ఫంక్షనింగ్' డిప్రెషన్ లక్షణం. ఇలాంటివాళ్లు ఎక్కడలేని ఉత్సాహాన్ని కనబరుస్తారు.

స్లీవ్స్ వేయడం : నిద్రాహారాలూ తగ్గించడంతోపాటూ అప్పటిదాకా స్లీవ్స్, షర్టులంటే గిట్టనివాళ్లు వాటినే ఎక్కువ వాడుతుంటారు. ఇది ఒంటిపై వాళ్లకి వాళ్లు చేసుకునే గాయాలు దాచుకోవడానికి అన్నమాట. ఓ కన్నేసి ఉంచండి.

అప్పగింతలు : 'నేను చనిపోతే నువ్వు తట్టుకోగలవా?' ఇలాంటివి ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఏదోనవ్వి ఊరుకోకుండా మాట్లాడి.. అవసరమైతే మానసిక నిపుణుల దగ్గరకి తీసుకెళ్లండి.

అన్నట్టు.. ఐరోపాలో ఇప్పటికే 'పింక్ వేల్' అని యాప్ వచ్చింది. బ్లూవేల్‌కి వ్యతిరేకంగా వచ్చిన గులాబీ తిమింగలం ఇది. పిల్లల్లో పాజిటివిటీ పెంచేందుకని చెబుతున్నారు దీని నిర్వాహకులు. మీ పిల్లలకీ దాన్ని డౌన్‌లోడ్ చేసివ్వండికానీ.. దానికన్నా ముందు మీ ప్రేమనీ వాళ్ల మనసుల్లో గట్టిగా 'ఇన్‌స్టాల్' చేయండి. జీవితాంతం దాన్ని అప్‌డేట్ చేస్తూ ఉండండి..!



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్



అమ్మాయిలూ మీకోసం..!

మనమెంత దుర్భరమైన పరిస్థితిలో ఉన్నా.. బతుకు ఎక్కడోచోట గుప్పెడంత నమ్మకం, ఆనందం, ప్రేమని మనకోసం దాచే ఉంటుందనే విషయం మరిచిపోవద్దు. దాన్ని వెతకడమే మన పని అని తెలుసుకోండి. క్రీడలూ, వ్యాయామం తప్పనిసరి చేసుకోండి. మొదటిది.. గెలుపుతోపాటూ ఓటమినీ ఆస్వాదించడం ఎలాగో నేర్పుతుంది. రెండోది.. ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొనే మానసిక, శారీరక దృఢత్వాన్నిస్తుంది. ఎవరు మీకు ఏ అన్యాయం చేశారనుకున్నా.. క్షమించడం నేర్చుకోండి. బెదిరింపులూ, మోసాలూ, లైంగిక వైధింపులు ఏవైనా సరే.. మౌనంగా ఉండకండి. ఎవరైనా ఒకరితో మాట్లాడటం తప్పనిసరని తెలుసుకోండి.

అదో ఇంజినీరింగ్ కళాశాల. దసరా సెలవుల తర్వాత అమ్మాయిలందరూ కాలేజీలోకి అడుగుపెట్టారు. అలా అడుగుపెడుతూ యథాలాపంగా గమనించారువాళ్లని. సాదాసీదా నేత చీరకట్టుకుని, మెల్లగా బెరుగ్గా వస్తున్నారు ఆ పల్లెపడతులు. 'ఏదైనా పని వెతుక్కుంటూ వచ్చారా అక్కా?' అని అడిగారు. 'కాదు.. చదవడానికి!' అని చెప్పారువాళ్లు. 'చదువా? ఈ వయసులోనా?' అంటూ నవ్వేశారు అమ్మాయిలు. కానీ ఇప్పుడు ఆ అమ్మాయిలే తమ తరగతులు కాగానే.. ఈ పెద్దవాళ్లు చదువుతున్న తరగతులవైపుకి వచ్చేస్తున్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలోని ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న 'విమెన్స్ టెక్నాలజీ పార్కు'లో కనిపించే వింత ఇది. ఇంతకీ ఏం నేర్చుకుంటున్నారు వాళ్లు? రండి చూద్దాం..



సామాన్యురాళ్ల కోసం.. ఓ టెక్‌పార్కు!

మన తెలుగు రాష్ట్రాలు ఎన్నో కళలకు నెలవులు! ముఖ్యంగా చేనేతా, హస్తకళల్ని నమ్ముకుని ఎన్నో కుటుంబాలు వందల ఏళ్లుగా బతుకుతున్నాయి. కారణం ఏవైనా కావొచ్చు కానీ ఆధునిక పోకడలని అందిపుచ్చుకోలేకపోవడం వల్ల వారి ఉత్పత్తులు నేటితరాన్ని మెప్పించలేకపోతున్నాయి. ఆదరించేవారులేక చితికిపోతున్నాయి. తమ రంగాల్లోని కొత్త సాంకేతికతలకి దూరమై ఈసురోమంటున్నాయి. ఆ కుటుంబాల్లోని మహిళల పరిస్థితి మరీ దుర్భరంగా ఉంటోంది. ఆ కళకి ఆధునికత జోడించి వారిలో సాధికారత పెంచే లక్ష్యంతోనే 'విమెన్స్ టెక్నాలజీ పార్కు' ఏర్పడింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం తెలంగాణ రాష్ట్రానికి దీన్ని మంజూరుచేసింది. ఇక్కడి ఎస్.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేశారు దీన్ని. నేటితరం అమ్మాయిలు చదివే ఇంజినీరింగ్ కళాశాలలోనే ఈ పార్కు ఉండటం కలిసొచ్చింది. ఓవైపు ఆధునికతరం, మరోవైపు నిన్నటి కళాకారుల తరం, అటు సంప్రదాయ విద్యా, ఇటు సాంకేతికతా.. ఇవన్నీ కలిసిన వేదికగా ఈ ప్రాంగణం భాసిస్తోంది.



యంత్రాలపై వారే.. పవర్‌లూమింగ్‌తో నేత పని, అరటి నుంచి నూలు తయారీ, భవన నిర్మాణ వస్తువుల ఉత్పత్తి, వ్యవసాయోత్పత్తులూ, మెటల్ క్రాఫ్ట్స్.. ఇలా ఐదు అంశాలపై తర్ఫీదునిస్తున్నారు ఇక్కడ. ఒకప్పటి వరంగల్ జిల్లాలో చేనేత రంగంపై జీవనం సాగిస్తున్న నేత కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. సాధారణంగా ఈ కుటుంబాల్లో మగవారు మగ్గంపై నేస్తుంటే.. మహిళలు సహకారం అందించడానికి పరిమితమవుతారు. కానీ ఇక్కడ భారీ పవర్‌లూమ్ యంత్రాలపై మహిళలే వందల మీటర్ల వస్త్రాలని చిటికెలో నేస్తారు. ఇప్పటిదాకా యాభైమందికిపైగా అలా శిక్షణ పొందారు. వీరికి శిక్షణ ఇప్పించడానికి మహారాష్ట్ర భివాండి నుంచి ఈ రంగంలో ఎంతో అనుభవం ఉన్న శిక్షకుణ్ని రప్పించారు. పరిసర గ్రామాల మహిళలు నేర్చుకుంటామని వస్తే, ఉచితంగా నెలపాటు శిక్షణ ఇచ్చి పంపుతారు.

అరటిపై సరికొత్తగా.. ఏ రంగంలోనైనా ఎప్పటికప్పుడు కొత్తదనం ఉంటేనే వినియోగదారులు ఆ వస్తువును ఇష్టపడతారు. ఇక వస్త్ర రంగంలోనైతే ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లు వస్తూ మార్కెట్‌ని ప్రభావితం చేస్తుంటారు. ఈ క్రమంలో టెక్నాలజీ పార్కు దీనిపై దృష్టిపెట్టింది. ఇక్కడ అరటి బోదెల నుంచి గుజ్జును తీసి నూలు చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. ఆ నూలుతో ఆకర్షణీయమైన చేతి సంచులూ, వైవిధ్యమైన సెల్‌ఫోన్ పౌచ్‌లు, ఇతర అలంకార వస్తువులను తయారుచేస్తున్నారు. ఇటీవల తమిళనాడులో అరటి నూలు నుంచి వస్త్రం తయారుచేసిన విషయాన్ని తెలుసుకున్న నిర్వాహకులు అక్కడికి వెళ్లారు. అక్కడి నుంచి అరటితో తయారుచేసిన వస్త్రాన్ని కొనుక్కొచ్చారు. అదేమో చేనేత వస్త్రం. దీనికి వీళ్లే కొత్త సాంకేతికత జోడించి.. వీటి తయారీకి ఓ యంత్రం తయారుచేశారు. దాంతో ఓ తువాలూ రూపొందించారు. విమెన్ టెక్నాలజీ పార్కు నుంచి వచ్చిన కొత్త ఆవిష్కరణ ఇది! వరంగల్ అర్బన్ జిల్లాలోని హసన్‌పర్తి, ఎల్కతుర్తి, అనంతసాగర్, మడిపల్లి, జయగిరి, దామెర, చింతలపల్లి, బావుపేట గ్రామాల్లో సిమెంటు వస్తువుల తయారీపై ఆధారపడి బతికే కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఆ మహిళల దగ్గరకే వెళ్లి ఫెన్సింగ్ స్తంభాలూ, సిమెంటు ఇటుకలూ, గోళాలూ, ఇతర గృహోపకరణాల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. ఆధునిక కాలానికి అవసరమైన టైల్స్ వేయడంలో తర్ఫీదునిస్తున్నారు. వ్యవసాయోత్పత్తులూ, మెటల్ క్రాఫ్ట్స్ డిజైనింగ్‌లో శిక్షణ ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించారు.

– జి. పాండురంగశర్మ, ఈనాడు, వరంగల్

పాల ముంజలు... కుదరడంలేదు!



ఆదర్ వసుంధర
శ్రీదేవి, హోటల్ మేనేజిమెంట్ నిపుణురాలు

? **పాలముంజల్ని ఇంట్లో ఒకటి రెండుసార్లు తయారుచేశా. కానీ పిండి సాగుతోంది. పూర్ణం కూడా అనుకున్నట్టుగా కుదరలేదు. ఇవి బాగా రావాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.**

- విజయ, హైదరాబాద్

ఇవి కూడా పూర్ణం బూరెల్లాంటివే. అవి సరిగ్గా రానివారు వీటిని సులువుగా చేసుకోవచ్చు. సెనగపప్పూ, బెల్లంతో పూర్ణం చేసుకుని పెట్టుకోవాలి. ఇక తోపు పిండి కోసం బియ్యప్పిండీ, బొంబాయిరవ్వా లేదా సన్నని గోధుమరవ్వను ఎంచుకోవచ్చు. రెండు కప్పుల పిండికి కప్పు పాలు తీసుకోవాలి. ముందుగా పాలు ఒక గిన్నెలోకి తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. అది మరిగాక బియ్యప్పిండీ లేదా బొంబాయిరవ్వ వేసుకుని మంట తగ్గించాలి. అది ఉడుకుతున్నప్పుడు కొద్దిగా ఉప్పు వేయాలి. ఉప్మాలా తయారయ్యాక దింపేసి మూత పెట్టేయాలి.



వేడి బాగా చల్లారాక చేతికి కొద్దిగా నూనె లేదా నెయ్యి రాసుకుని, ఒకసారి బాగా కలపాలి. తరవాత కొద్దిగా ఉండ తీసుకుని చపాతీలా చేసుకుని అందులో పూర్ణం పెట్టి అంచులు మూసేయాలి. ఇలాగే మిగిలిన పిండీ చేసుకుని కాగుతోన్న నూనెలో రెండురెండు చొప్పున వేసి వేయించుకుని తీసుకోవాలి. ఇందులో సెనగపప్పు పూర్ణమే పెట్టక్కర్లేదు. పెసరపప్పుతోనూ చేసుకోవచ్చు. ఒకవేళ బియ్యప్పిండిని బజార్లో కొంటుంటే.. రెండు కప్పుల పిండికి కప్పు పాలు సరిపోతాయి. అదే బియ్యప్పిండిని ఇంట్లో తయారుచేసుకుంటుంటే... కప్పు పిండికి కప్పు పాలు చాలు. బొంబాయిరవ్వ అయితే.. రెండు కప్పులు తీసుకోవాలి. ఇది బాగా తియ్యగా కావాలనుకుంటే.. పిండి తయారీలో చక్కెర వేసుకోవచ్చు. లేదంటే కాస్త ఉప్పు చాలు.

మొహమాటం వద్దు!

పనిలో కాస్త సాయం చేయమన్న స్నేహితుల అభ్యర్థన మన్నించడం.. నిజంగా గొప్ప విషయమే. కానీ అందుకోసం మన పనిని పణంగా పెట్టాల్సిన అవసరం ఎప్పుడూ రాకూడదు. 'నాకు పని ఉంది!' అని చెప్పడానికి ఇబ్బంది పడకూడదు. ఆ ఇబ్బంది మీపై మీకు నమ్మకం పోగొడుతుంది. దాన్ని అధిగమించడమెలా?




'క్షమించండి. నేను మీకు సాయం చేయలేను.. నావల్ల కాదు!' అంటే ఎదుటివాళ్లు ఏమనుకుంటారోననే ఇబ్బందే మనల్ని బాధపెడుతుంది. ఆ పదాలు వాళ్లకి కఠినంగా వినిపిస్తాయేమో అనే జంకూ ఉంటుంది. కానీ ఇలాంటి వాక్యాలు మీరు అనుకున్నంత కఠినమైనవేమీ కాదనే విషయం ముందు అర్థం చేసుకోండి. అవి చెప్పడం ప్రతికూల విషయమేమీ కాదు. ఓ రకంగా మీకూవాళ్లకీ సాయపడే సానుకూల అంశం కూడా!

మనకు నాలుగు చేతులూ.. రెండు మెదడులూ ఉండవు. అంతకంటే రోజుకి 48 గంటలూ రావు. కాబట్టి అందరి పనీ మనం చేయలేం. ఎదుటివాళ్ల పనిని అవసరానికంటే ఎక్కువగా చేయడమంటే.. ఆ మేరకు మన సమయాన్ని కోల్పోవడమే. మన పనిని వదులుకోవడమే. ముందు ఈ వాస్తవాన్ని గ్రహించండి.

మన జీవితంలో ప్రతీ ఒక్కరిని మెప్పించలేమనే విషయం గుర్తుంచుకోండి. కొన్నిసార్లు 'నావల్ల కాదు' అనే వాక్యం ఇచ్చినంత మనశ్శాంతి ఇంకేదీ ఇవ్వదు. మొహమాటానికి పోయి మిమ్మల్నీ, ఆ పని అప్పగించినవాళ్లని తిట్టుకుంటూ పనిచేయడంకంటే ఆ పదం వాడటం వేయిరెట్లు మేలని తెలుసుకోండి.

32000 పైకెళ్తే రాణింపు!



సమీక్ష: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, దేశీయ పరిణామాల నేపథ్యంలో గత వారం మన మార్కెట్ లాభాలతో ముగిసింది. బలమైన మూలాలున్న కంపెనీల షేర్లకు, తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు కలిసొచ్చింది. అయితే విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాల బాట పట్టడం మార్కెట్ సెంటిమెంటుపై ప్రభావం చూపింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం సెలవు కావడంతో గత వారం నాలుగు రోజుల పాటే ట్రేడింగ్ జరిగింది. విదేశీ మార్కెట్ల జోష్‌తో గత సోమవారం మన మార్కెట్ ఉత్సాహంగానే ప్రారంభమైంది. అమెరికా, ఉత్తర కొరియాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయన్న వార్తలు, వడ్డీ రేట్ల పెంపు ఇప్పుడప్పుడే ఉండదంటూ అమెరికా ఫెడ్ చేసిన వ్యాఖ్యలు ఇందుకు తోడ్పడ్డాయి. మార్కెట్లకు ఇటీవలి నష్టాల నేపథ్యంలో, తక్కువ విలువల వద్ద లభిస్తున్న షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల జోరు కొనసాగింది. జులైలో వాణిజ్య లోటు తగ్గడం ఊరటనిచ్చినప్పటికీ, రిటైల్-టోకు ద్రవ్యోల్బణాలు పెరగడంతో ఆ తరవాత మదుపర్లు జాగ్రత్తగా వ్యవహరించారు. షేర్ల విలువలు పెరిగినప్పుడల్లా లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఒడుదొడుకులకు లోనయ్యాయి. వారం చివర్లో విశాల్ సిక్కా రాజీనామా అనంతరం ఇన్ఫోసిస్ షేరు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవడం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. అయినప్పటికీ వారం మొత్తం మీద సెన్సెక్స్ 311 (1%) పాయింట్లు లాభపడి 31524 వద్ద ముగిసింది. నిఫ్టీ 127 (1.3%) పాయింట్లు పెరిగి 9837 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎఫ్ఐఐలు నికరంగా రూ.5,280 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. మ్యూచువల్ ఫండ్‌ల నికర కొనుగోళ్లు రూ.4,369 కోట్లుగా నమోదయ్యాయి. ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లు డీలాపడగా.. స్థిరాస్తి, లోహ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 7:5గా నమోదు కావడం.. మధ్య, చిన్న తరహా షేర్ల విభాగంలో ఎంపిక ఆధారంగా కొనుగోళ్లు జరిగాయనడాన్ని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా: సెన్సెక్స్ 32000 ఎగువన కదలాడితే తిరిగి పుంజుకుంటుందనడానికి సంకేతంగా భావించొచ్చు. ఒకవేళ 60 రోజుల చలన సగటైన 31540 పాయింట్ల దిగువన వరుసగా రెండు 3 రోజుల పాటు చలిస్తే సూచీ మరింత దిద్దుబాటు అయ్యేందుకు అవకాశం ఉంటుంది.


ప్రభావిత అంశాలు: వినాయక చవితి సందర్భంగా శుక్రవారం సెలవు కావడంతో, ఈవారం కూడా నాలుగు రోజుల పాటే ట్రేడింగ్ జరుగుతుంది. ప్రధానంగా దేశీయ, అంతర్జాతీయ పరిణామాలు ఈవారం మార్కెట్‌కు దిశానిర్దేశం చేస్తాయి. ఫలితాల సీజను చివరి దశకు చేరుకుంది. కంపెనీలు వెల్లడించే ఫలితాల ప్రభావం ఆయా షేర్లపై ఉంటుంది. అంతర్జాతీయంగా చూస్తే.. ఈ వారం అమెరికా పరిణామాలపై మదుపర్లు దృష్టి సారిస్తారు. ఆర్థిక ప్రణాళిక అజెండాను ముందుకు తీసుకెళ్లే విషయంలో ట్రంప్ సామర్థ్యంపై సందేహాలు పెరగడమే ఇందుకు కారణం. అలాగే దక్షిణ కొరియా పరిణామాలనూ గమనిస్తారు. అదే సమయంలో చైనా వార్తలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అంతర్జాతీయ చమురు ధరలు, రూపాయి కదలికలు, ఎఫ్ఐఐలు/ డీఐఐల పెట్టుబడులు యథావిధిగా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.

తక్షణ మద్దతు: 31128, 30965, 30610; **తక్షణ నిరోధం:** 31937, 32235, 32502

సెన్సెక్స్ తిరిగి 32000 ఎగువన కదలాడితేనే మరింత ముందుకు వెళుతుందని భావించొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ






కోడిగుడ్లు — 20వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
చిల్లరగా (ఒక గుడ్డు)	4.15	వరంగల్	357
బెంగళూరు	382	చిత్తూరు	390
21న		చెన్నై	397
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఇన్ఫీ షేరుపైనే కళ్లన్నీ..

- స్థిరీకరణకు గురయ్యే అవకాశం
- లోహ, ఔషధ షేర్లకు సానుకూలతలు
- వాహన షేర్లకు నష్టాలొచ్చే అవకాశం
- మార్కెట్‌కు శుక్రవారం సెలవు



ఈ వారం ఇన్ఫోసిస్ షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే కంపెనీలో జరిగే పరిణామాలపై మదుపర్లు అప్రమత్తంగా ఉండాల్సిందే. మధ్య నుంచి దీర్ఘకాలానికి రూ.900 స్థాయి వద్ద ఈ షేరు కొనడం మంచిదేనంటున్నారు. అయితే బైబ్యాక్ కోసం ఆఫర్ ధరను రూ.1150గా నిర్ణయించడం గమనించాల్సిన అవసరం ఉంది. ఇక ప్రామాణిక సూచీల విషయానికొస్తే.. ఈ వారం చాలా తక్కువ శ్రేణికి లోబడి చలించొచ్చు. దేశీయ సంకేతాలు పెద్దగా లేకపోవడం; అంతర్జాతీయంగా సెంటిమెంటు స్తబ్దుగానే ఉండడం ఇందుకు కారణాలుగా చూపిస్తున్నారు. నిఫ్టీకి ఈ వారం 9880-9940 వద్ద నిరోధం ఎదురుకావొచ్చని; 9780-9810 వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంటున్నారు. శుక్రవారం 'గణేశ్ చతుర్థి' సందర్భంగా మార్కెట్లు పనిచేయనందున, ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానుంది. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

స్టాక్ మార్కెట్ ఈ వారం



యంత్ర పరికరాలు: ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. స్వల్పకాలంలో ఎంపిక చేసిన షేర్లలో చలనాలు అంచనా వేయొచ్చు. ఎల్ అండ్ టీ, సీజీ పవర్‌లు సానుకూలంగా, భెల్ ప్రతికూలంగా ట్రేడవవచ్చని విశ్లేషకుల అంచనా. భెల్‌కు రూ.142 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. రూ.118 వద్ద మద్దతు లభించవచ్చు. సీజీ పవర్ రూ.90 స్థాయిని పరీక్షించవచ్చని ఓ బ్రోకరేజీ సంస్థ చెబుతోంది.



బ్యాంకింగ్: దాదాపు అన్ని బ్యాంకుల ఆర్థిక ఫలితాలు వెలువడినందున, ఇక ఏ వార్తలూ లేనందున.. బ్యాంకు షేర్లు స్థిరంగా ఉండొచ్చు. నిఫ్టీ బ్యాంక్‌కు ఈ వారం 24,000 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది. అమెరికా భౌగోళిక-రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ మార్కెట్లు కిందకు రావొచ్చని.. ఇది బ్యాంకు షేర్లపైనా ప్రభావం చూపొచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు.



వాహన: ఈ వారం చాలా వరకు వాహన షేర్లు నష్టపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎం అండ్ ఎం, మారుతీ సుజుకీల్లో బేరిష్ ధోరణి కనిపిస్తోంది. మధ్యకాలానికి మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్‌లను పరిశీలించొచ్చని విశ్లేషకులు అంటున్నారు. వాహనాల విక్రయాలు బాగుండడానికి తోడు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రాణిస్తుండడం ఇందుకు నేపథ్యమని వివరిస్తున్నారు. ఈ వారం ఎం అండ్ రూ.1340 స్థాయికి; బజాజ్ ఆటో రూ.2750 స్థాయికి పడిపోవచ్చు. ఇక టీవీఎస్ మోటార్ రూ.568-594; మారుతీ సుజుకీ రూ.7500-7720 మధ్య ట్రేడవవచ్చు.



చమురు: గత వారం కోలుకున్న ఇండియన్ ఆయిల్ కార్ప్, భారత్ పెట్రోలియం కార్ప్, హిందుస్థాన్ పెట్రోలియం కార్ప్‌లు కొద్ది రోజుల పాటు బలోపేతం అయ్యే అవకాశం ఉంది. దేశీయంగా ఇంధనాలకు గిరాకీ పెరుగుతుండడం, రిఫైనింగ్, మార్కెటింగ్ మార్జిన్లు బాగుండడం ఇందుకు కారణంగా చెప్పొచ్చు. ఇతరత్రా ప్రధాన వార్తలేమీ లేనందున చమురు కంపెనీల షేర్లు ముడి చమురు ధరలపై ఆధారపడి కదలాడవచ్చు.



లోహ: లాభాలు కొనసాగొచ్చు. మార్కెట్‌ను మించి ఈ రంగ షేర్లు రాణించవచ్చు. హిందాల్కో ఇండస్ట్రీస్, హిందుస్థాన్ జింక్, నాల్కో షేర్లలో తాజా కొనుగోళ్లు చేయవచ్చని రెలిగేర్ క్యాపిటల్ మార్కెట్స్ సిఫారసు చేస్తోంది. నికెల్, జింక్ ,అల్యూమినియం లోహ ధరలు మరింత ముందుకు వెళితే ఈ రంగ షేర్లపై ప్రభావం కనిపించొచ్చు.



ఎఫ్ఎమ్‌సీజీ: ఇప్పటిదాకా సాధారణం కంటే తక్కువ వర్షపాతం కురవడంతో గిరాకీ స్తబ్దుగా ఉండొచ్చన్న అంచనాల మధ్య వినియోగదారు వస్తువుల కంపెనీల షేర్లు తక్కువ స్థాయిల్లో కదలాడవచ్చని భావిస్తున్నారు. ఐటీసీ ఈ వారం బలహీనపడవచ్చు. దీనికి రూ.270 వద్ద మద్దతు; రూ.295 వద్ద నిరోధం కనిపించవచ్చు. స్వల్పకాలంలో బ్రిటానియా, గ్లాక్సోస్మిత్‌క్లైన్ కన్జ్యూమర్ హెల్త్‌కేర్‌లు ప్రయోజనం పొందొచ్చు. హెచ్‌యూఎల్ షేర్లు రూ.1240 దాకా పెరగవచ్చు.



టెలికాం: దీర్ఘకాలానికి ప్రతికూల ధోరణి కనిపిస్తున్నా ఈ వారం మాత్రం లాభాలందుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ రంగంపై ఉన్న ఒత్తిడి తొలగించడానికి ప్రభుత్వం కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చన్నది ఇందుకు నేపథ్యం. ఆర్‌కామ్ రూ.21-36.70, ఐడియా రూ.87-93, భారతీ ఎయిర్‌టెల్ రూ.404-431; టాటా కమ్యూనికేషన్స్ రూ.620-667 మధ్య ట్రేడవవచ్చు.



ఐటీ: చాలా తక్కువ శ్రేణికి లోబడి చలించొచ్చు. ఇన్ఫోసిస్ పరిణామాల నేపథ్యంలో మదుపర్లు జాగ్రత్తగా వ్యవహరించవచ్చు. బైబ్యాక్ వార్తలు కూడా ఈ రంగ షేర్లపై ప్రభావం చూపించొచ్చు. ఇన్ఫోసిస్ రూ.900-960 మధ్య; టీసీఎస్ రూ.2460-2570 మధ్య, టీసీఎస్ రూ.2460-2570 మధ్య ఊగిసలాడవచ్చు. విప్రో కూడా రూ.275-305 మధ్య హెచ్చుతగ్గులకు లోనుకావొచ్చు.



ఔషధ: ఫండ్ మేనేజర్ల చూపు ఈ రంగంపై ఉన్నందున, ఈ వారం లాభాలు అందిపుచ్చుకోవచ్చు. ఆగస్టులో సన్ ఫార్మా 12% దాకా కుంగింది. ఈ వారం రూ.540కు చేరొచ్చు. ఏదైనా దిద్దుబాటు జరిగినా రూ.440 వరకు పరిమితం కావొచ్చు. లుపిన్ షేర్లు సైతం రూ.1040కు చేరొచ్చని.. నష్టాలొస్తే రూ.930కే పరిమితం కావొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అరబిందో కూడా రాణించొచ్చు.



సిమెంటు: గిరాకీలో బలహీనతలు, ధరలపై ఒత్తిళ్ల నేపథ్యంలో సిమెంట్ షేర్లలో ట్రేడింగ్ స్తబ్దుగానే ఉండొచ్చు. పడినప్పుడల్లా అల్ట్రాటెక్ సిమెంట్‌ను కొనుగోలు చేయవచ్చని.. సమీప కాలంలో రూ.4100 స్థాయికి పరీక్షించే అవకాశం ఉంది.

రోజుకు 50 సర్వీసులు

ఈ ఏడాది ఆఖరుకు ట్రూజెట్ లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: ప్రాంతీయ విమానయాన సంస్థ ట్రూజెట్ తన విమానాల సంఖ్యను మార్చి 2018 నాటికి ఎనిమిదికి పెంచుకోనుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టర్బో మెఘా ఎయిర్‌వేస్ ఆధ్వర్యంలోని ట్రూజెట్ ఈ ఏడాది చివరి నాటికి రోజుకు 50 సర్వీసులను నడిపే దిశగా ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం రోజుకు 31 విమాన సర్వీసులు నడుపుతోంది. కేంద్ర ప్రభుత్వం 'ఉడాన్' పథకంలో భాగంగా ఈ సంస్థ 18 మార్గాల్లో విమానాలు నడిపేందుకు అనుమతి పొందింది. సెప్టెంబరు చివరి నాటికి ఈ 18 మార్గాలకూ సర్వీసులు విస్తరించనున్నామని టర్బో మెఘా ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ వి.ఉమేశ్ తెలిపారు. ట్రూజెట్ ఇప్పటికే ఈ పథకంలో భాగంగా హైదరాబాద్-కడప, హైదరాబాద్-నాందేడ్, నాందేడ్-ముంబయి మార్గాల్లో విమానాలునడుపుతోంది.

అంత సులువేమీ కాదు

- ఇన్ఫీ కొత్త సీఈఓ అన్వేషణపై విశ్లేషకులు
- కంపెనీలోని వ్యక్తిని నియమించడమే ఉత్తమం: ఐఐఏఎస్



దిల్లీ: ఇన్ఫోసిస్‌కు కొత్త ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) అన్వేషణ అంత సులువేమీ కాకపోవచ్చని పరిశ్రమ నిపుణులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కంపెనీ వ్యవస్థాపకుల నిరంతర పర్యవేక్షణ ఒత్తిళ్లను దృష్టిలో పెట్టుకొని, సీఈఓ పదవి చేపట్టేందుకు చాలా మంది అభ్యర్థులు ఆసక్తి చూపకపోవచ్చని అంటున్నారు. తనపై తప్పుడు, నిరాధార ఆరోపణలు ఎక్కువయ్యాయని చెబుతూ సీఈఓ, ఎండీ పదవికి విశాల్ సిక్కా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు సిక్కా రాజీనామాకు సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణమూర్తి ఆరోపణలే కారణమని బోర్డు పేర్కొంది. 'నిరంతర పర్యవేక్షణ, బాహాటంగా దూషణ ఏ సమర్థ వ్యక్తికైనా ఇబ్బందికరమే. బయటి వ్యక్తులు ఎవరూ కూడా దీనిని సానుకూలంగా తీసుకోలేర'ని ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ అడ్వైజరీ సర్వీసెస్ (ఐఐఏఎస్) అభిప్రాయపడింది. అందువల్ల వ్యవస్థాపకులకు విశ్వాసపాత్రులుగా ఉన్న, కంపెనీలోని వ్యక్తులనే ఈ పదవికి ఎంపిక చేసుకుంటే పని సులువవుతుందని తెలిపింది. ప్రస్తుతం ఇన్ఫోసిస్‌కు కొత్త సీఈఓ ఎంపిక ప్రక్రియ కష్టమేనని పరిశ్రమ నిపుణుడు ప్రమోద్ భాసిన్ చెప్పారు. కార్యకలాపాలు యథాతథంగా సాగుతున్నాయనే సంకేతాన్ని ఇచ్చేందుకు సీఈఓ గుర్తింపు ప్రక్రియను ఇన్ఫోసిస్ వేగవంతం చేయాలని పరిశ్రమకు చెందిన మరో ప్రముఖుడు గణేశ్ నటరాజన్ చెప్పారు.

ఉద్దేశపూర్వక ఎగవేతల్లో..

ఎస్‌బీఐకే 27% వాత

- రూ.25,104 కోట్ల ఎగవేత
- రెండో స్థానంలో పీఎన్‌బీ: ఆర్థికశాఖ

దిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులకు 2016-17లో ఉద్దేశపూర్వకంగా రుణాలు చెల్లించకుండా ఎగవేసిన మొత్తం రూ.92,376 కోట్లు కాగా, ఇందులో 27 శాతం మొత్తం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కే రావల్సి ఉందని కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి చూస్తే 1,762 మంది ఖాతాదార్లు ఎస్‌బీఐకి రూ.25,104 కోట్ల మేర ఎగవేశారు. ఈ జాబితాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రెండో స్థానంలో ఉంది. ఈ బ్యాంకుకు 1,120 మంది ఖాతాదార్లు రూ.12,278 కోట్లు కావాలనే కట్టలేదు. మొత్తం మీద ఈ రెండు బ్యాంకులకు కట్టాల్సిన మొత్తం రూ.37,382 కోట్లు. 2015-16లో కావాలని ఎగవేసిన బాకీల విలువ రూ.76,685 కోట్లుగా ఉంది. ఖాతాల పరంగా చూస్తే గత ఏడాది మార్చినాటికి 8,167గా ఉన్న ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల సంఖ్య ఈ ఏడాది మార్చినాటికి 8,915కు చేరింది. ఇందులో రూ.32,484 కోట్ల విలువైన 1,914 ఖాతాలపై బ్యాంకులు ఎఫ్ఐఆర్ నమోదు చేశాయి. కేంద్ర ఆర్థికశాఖ గణాంకాలు ఈ విషయాలను వెల్లడిస్తున్నాయి.

- ✦ 2016-17లో ఎస్‌బీఐ, నాటి అనుబంధ బ్యాంకులు మొత్తం మీద రూ.81,683 కోట్లను సాంకేతికంగా రద్దు చేశాయి.
- ✦ ఈ ఏడాది మార్చి నాటికి అన్ని ప్రభుత్వరంగ బ్యాంకులకు కలిపి స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) రూ.6.41 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇవి రూ.5.02 లక్షల కోట్లుగా ఉన్నాయి.

18 రోజులు..


రూ.7,300 కోట్లు

ఈ నెలలో స్టాక్ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐల ఉపసంహరణ

దిల్లీ: అంతర్జాతీయ అనిశ్చితులు విదేశీ మదుపర్లపై ప్రభావం చూపుతున్నాయి. అమెరికా-ఉత్తర కొరియా, భారత్-చైనాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, వారు స్టాక్ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఇది షేర్ల అమ్మకాల రూపంలో ప్రతిఫలిస్తోంది. ఈ నెలలో 1-18 తేదీల మధ్య ఈక్విటీ మార్కెట్లలో సుమారు రూ.7,344 కోట్ల (1.14 బిలియన్ డాలర్లు) విలువైన షేర్లను విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) విక్రయించడమే ఇందుకు నిదర్శనం. ఇదే సమయంలో డెట్ సాధనాలలో దాదాపు రూ.9,364 కోట్లు మదుపు చేశారు.. వారు పెట్టుబడులకు సురక్షితమైన సాధనాలను వెతుక్కుంటున్నారనే దానికి దీనిని సంకేతంగా భావించొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఈక్విటీ మార్కెట్లలోకి నికరంగా రూ.53,610 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (సెబీ) డొల్ల కంపెనీలపై తీసుకుంటున్న కఠిన చర్యలు కూడా విదేశీ మదుపర్లపై ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

ధనియాలు సానుకూలం!

కమొడిటీస్ ఈ వారం



● బంగారం, వెండి

పసిడి అక్టోబరు కాంట్రాక్టు గతవారం రూ.29,114 వద్ద ప్రారంభమైంది. ఆ తరువాత రూ.28,800-29,443 మధ్య చలించి చివరకు 0.17% లాభంతో రూ.29,163 వద్ద ముగిసింది. ఉత్తర కొరియా-అమెరికా, భారత్-చైనా మధ్య ఉద్రిక్తతలు ఈ వారం కూడా బంగారం ధరపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రూ.29,060 దిగువన ముగియకుంటే షార్ట్ సెల్లింగ్ పొజిషన్ల జోలికి పోకపోవడమే మంచిది. ఉత్తర కొరియా మరింత దూకుడుగా వ్యవహరిస్తే, పసిడి ధరలు పెరగొచ్చు. అందువల్ల రూ.29,366ను స్టాప్‌లాస్‌గా ఉంచుకోవాలి. వెండి సెప్టెంబరు కాంట్రాక్టు గత వారం రూ.39,186 వద్ద ప్రారంభమైంది. ఆ తరవాత రూ.38,305-39,677 మధ్య చలించి చివరకు 0.31% నష్టంతో రూ.39,063 వద్ద స్థిరపడింది. ఈ వారం రూ.39,650పైన ముగిస్తే మరింత పెరిగే వీలు ఉన్నందున ఈ స్థాయికి పైన షార్ట్ పొజిషన్లను తీసుకోకపోవడమే ఉత్తమం.



● ఇంధన రంగం

ముడిచమురు ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం రూ.3,080 దిగువకు వస్తే ఆ తరువాత మరింత నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి రూ.3,156ను స్టాప్‌లాస్‌గా పరిగణిస్తూ ఆ స్థాయికి దిగువన విక్రయించడమే మంచిది. రూ.3,080 దిగువకు రాకుంటే లాంగ్ పొజిషన్లను కొనసాగించొచ్చు. సాంకేతికంగా చూస్తే కాంట్రాక్టును విక్రయించడమే ఉత్తమంగా కనిపిస్తోంది. ఈ వారం సహజ వాయువు ఆగస్టు కాంట్రాక్టుకు అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. మార్కెట్లో గిరాకీకి మించి సరఫరా ఉంది. సాంకేతికంగా చూస్తే కాంట్రాక్టు రూ.193 స్థాయి పైన కదలాడకుంటే మరింత నష్టపోయే సూచనలు కనిపిస్తున్నాయి. కాబట్టి పెరిగిన ప్రతిసారీ కాంట్రాక్టును విక్రయించడమే ఉత్తమం. ఇందుకు రూ.193.40ను స్టాప్‌లాస్‌గా పరిగణించాలి. షార్ట్ సెల్లింగ్ పొజిషన్లను ఈ వారం మొత్తం కొనసాగించడం కూడా మంచి ఆలోచనే అవుతుంది.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఆగస్టు)	412	415.35	0.81
సీసం (ఆగస్టు)	149.15	150.40	0.84
జింక్ (ఆగస్టు)	185.90	200.80	8.02
అల్యూమినియం(ఆగస్టు)	129.60	131.05	1.12
నికెల్ (ఆగస్టు)	680.60	704	3.44
ముడిచమురు (ఆగస్టు)	3,151	3,125	(0.83)
సహజ వాయువు(ఆగస్టు)	192.90	186	(3.58)
ధనియాలు (సెప్టెంబరు)	4,660	4,844	(3.95)
జీలకర్ర (సెప్టెంబరు)	19,600	19,660	0.31



● ప్రాథమిక లోహాలు

ఈ వారం రాగి ఆగస్టు కాంట్రాక్ట్‌కు రూ.420-422 స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఎదురు కావొచ్చు. లాంగ్ పొజిషన్లు ఉన్న వారు ఈ స్థాయిల వద్ద లాభాలు స్వీకరించడం మంచిది. సీసం ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం రూ.147 దిగువన ముగిస్తే ఆ తరువాత రూ.143 వరకు నష్టపోయే అవకాశం ఉంది. నేడు రూ.150పైన ముగిస్తే కొత్తగా కొనుగోళ్లు చేపట్టొచ్చు. జింక్ ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం రూ.195 దిగువకు రాకుంటే రూ.204-206.50 వరకు పెరిగే సూచనలున్నాయి. ఈ వారం అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు రూ.128.40 దిగువకు వస్తే మరింత నష్టపోయే వీలు ఉంది. నికెల్ ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం సాంకేతికంగా సానుకూలంగా కనిపిస్తోంది. కాబట్టి ప్రస్తుత పొజిషన్లను రూ.728 వరకు కొనసాగిస్తే కలిసి రావొచ్చు.



● వ్యవసాయ ఉత్పత్తులు

ఈ వారం ధనియాలు సెప్టెంబరు కాంట్రాక్టు సానుకూలంగా కనిపిస్తోంది. కాబట్టి లాంగ్ పొజిషన్లను కొనసాగించడమే మంచిది. అనుకోకుండా ఏమైనా ఒడుదొడుకులు ఎదురైతే రూ.4,564ను స్టాప్‌లాస్‌గా పరిగణిస్తూ మరిన్ని కాంట్రాక్టులు పోగు చేసుకోవడం మంచి ఆలోచన అవుతుంది. చిన్న ట్రేడర్లు షార్ట్ సెల్లింగ్ పొజిషన్లకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం. ప్రస్తుత సీజనులో ఎగుమతులకు మంచి గిరాకీ ఉన్నందున జీలకర్ర సెప్టెంబరు కాంట్రాక్టు సానుకూలంగానే కనిపిస్తోంది. అయితే దేశీయ విపణిలో గిరాకీ తగ్గినందున నష్టపోయేందుకు కూడా అవకాశాలున్నాయి. అందువల్ల రూ.19,765-19,936 మధ్య పెరిగిన ప్రతిసారీ విక్రయించడమే ఉత్తమం.

–ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

సగం కార్లు ఆటోగేర్

టాటా మోటార్స్ ప్రణాళిక

దిల్లీ: ప్రయాణికుల వాహనాల అమ్మకాలు పెంచుకునేందుకు ఆటోమేటెడ్ మ్యాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంటీ) సాంకేతికతకు పెద్దపీట వేయాలని టాటా మోటార్స్ భావిస్తోంది. భవిష్యత్‌లో తమ ప్రయాణికుల వాహనాల విభాగంలో ఈ తరహా సాంకేతికతతో కూడినవే 50 శాతం వరకు ఉంటాయని టాటా మోటార్స్ మార్కెటింగ్ హెడ్ (ప్యాసింజర్ వాహనాల వ్యాపార విభాగం) వివేక్ శ్రీవాస్తవ తెలిపారు.

టియాగోలోనూ..

టియాగోలో ఏఎంటీ సాంకేతికతతో కూడిన మధ్యశ్రేణి వాహనాన్ని టాటా మోటార్స్ అందుబాటులోకి తెచ్చింది. ధర రూ.4.79 లక్షలు. ఇదే సాంకేతికతతో టియాగోలో అధిక ధర మోడల్‌ను ఇప్పటికే విక్రయిస్తోంది. వచ్చే మూడు నాలుగు నెలల్లో కాంపాక్ట్ సెడాన్ టిగోర్‌ను కూడా ఏఎంటీ సాంకేతికతతో తీసుకొని రానుంది. వచ్చే నెలలో కంపెనీ విడుదల చేయాలని భావిస్తోన్న కాంపాక్ట్ ఎస్‌యూవీ నెక్సాన్‌ను కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఇదే సాంకేతికతతో కంపెనీ అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది.

3 బీమా సంస్థలు..

రూ.20,000 కోట్లు!

ఐపీఓ అనుమతికి దరఖాస్తులు

దిల్లీ: పబ్లిక్ ఇష్యూ సందడిలో బీమా సంస్థలు భాగమవుతున్నాయి. ఇప్పటికే ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్ ఐపీఓ పత్రాలను సెబీకి సమర్పించాయి. తాజాగా ఆగస్టులో మరో 3 కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్, న్యూ ఇండియా అస్యూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ప్రైవేట్ రంగానికి చెందినది కాగా.. మిగిలిన రెండూ ప్రభుత్వ రంగ సంస్థలు. ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ రెండు ప్రభుత్వ రంగ బీమా కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ముగిసే అవకాశం ఉంది.

హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్: ఐపీఓ పత్రాలను ఆగస్టు 18న సెబీకి సమర్పించింది. ఇష్యూలో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ 9.55%, స్టాండర్డ్ లైఫ్ మారిషస్ 5.42% చొప్పున మొత్తంగా 14.97 శాతం వాటాకు సమానమైన 29.98 కోట్ల షేర్లు విక్రయించనున్నాయి. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ రూ.7,500 కోట్లు సమీకరించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

న్యూ ఇండియా అస్యూరెన్స్: ఐపీఓ ద్వారా రూ.6,500 కోట్లు సమీకరించే యోచనలో న్యూ ఇండియా అస్యూరెన్స్ ఉంది. ఈ నెల 8న సెబీకి ఐపీఓ పత్రాలను సమర్పించింది. ఇష్యూలో భాగంగా ప్రభుత్వం 9.6 కోట్ల షేర్లను విక్రయించనుంది.

జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్: ఈ సంస్థ దాదాపు రూ.6,500 కోట్లు ఐపీఓ ద్వారా సమీకరించాలని అనుకుంటోంది. ఈ నెల 7న సెబీకి ఐపీఓ పత్రాలను సమర్పించింది. ఇష్యూలో భాగంగా ప్రభుత్వం 10.7 కోట్ల షేర్లను విక్రయించనుంది.

వచ్చే ఏడాది మార్చి వరకు 'భీమ్' ప్రోత్సాహకాలు

దిల్లీ: నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన 'భీమ్' యాప్‌పై ప్రోత్సాహకాల గడువును వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగించారు. ఈ యాప్ ద్వారా బిల్లులు చెల్లించేందుకు, వినియోగదార్లకు అవకాశం కల్పించే వ్యాపారులకు నెలకు రూ.1,000 వరకు నగదు వెనక్కి (క్యాష్ బ్యాక్) ఇస్తున్నారు. తొలుత 20-50 లావాదేవీలకు రూ.50 ప్రోత్సాహం ఇస్తారు. ఆపైన ప్రతి లావాదేవీకి రూ.2 చొప్పున గరిష్ఠంగా నెలకు రూ.950 వరకు చెల్లిస్తారు. ఈ ప్రయోజనాలు పొందాలంటే ఒక నెలలో కనీసం 20 లావాదేవీలు తమ వద్ద భీమ్ యాప్ ద్వారా నిర్వహించేందుకు వ్యాపారులు అనుమతించాలి. కనీసం ప్రతి బిల్లు విలువ రూ.25, అంతకుమించి ఉండాలి. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

- మహిళల్లో నెలసరి ఇక్కట్లు.. యమయాతన
- 30 శాతంమందిలో అధిక రుతుస్రావం
- కొంతమందిలో భరించలేని కడుపునొప్పి
- ఆ సమయంలో శారీరకంగా త్వరగా అలసట
- ఆ రోజుల్లో సెలవు ఇస్తున్న కొన్ని సంస్థలు
- ఎన్నో దేశాల్లో ఈ విధానం అమలు



నెలనెలా.. ఇలా ఎలా?

ఆమె ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగిని. నెలసరి గడియ వచ్చిందంటే వణికిపోతుంది. అధిక రుతుస్రావం.. భరించలేని కడుపునొప్పి. పలువురు వైద్యుల వద్దకెళ్లి చికిత్స పొందింది. సమస్య తాత్కాలికంగా తగ్గి మళ్లీ మొదటికొస్తుంది. ఆ సమయంలో విశ్రాంతి తీసుకుంటే బావుంటుందనిపిస్తుంది. కాని పని ఒత్తిడి, లక్ష్యాలు కళ్ల ముందు కనిపిస్తుంటే ఉద్యోగానికి వెళ్లక తప్పని పరిస్థితి. కొన్నిసార్లు కార్యాలయంలో నిస్సత్తువతో కళ్లు తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. కాని ప్రతీనెలా మూడ్రోజులు సెలవులంటే కుదరదు. సెలవు అడగడమూ ఇబ్బందే. అందుకే శరీరం, మనసు సహకరించకపోయినా మాత్రలు వేసుకుంటూ విధులకు వెళ్తోంది.

ఈనాడు – హైదరాబాద్

నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొంటున్న సహజమైన ఇబ్బందులివి.. మనదేశంలో దాదాపు 30-35 శాతంమంది మహిళలు నెలసరి సమయంలో అధిక రుతుస్రావంతో బాధపడుతుంటారు. మరో 20-30 శాతంమందిలో భరించలేని కడుపునొప్పి వేధిస్తుంటుంది. దాదాపు ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు ఇలాంటి ఇబ్బందులతో బాధపడుతున్నారంటే.. ప్రతి మూడిళ్లలోనూ ఒక ఇంట్లో నెలకోసారి అశాంతి, ఆవేదనలు చెలరేగుతున్నట్లే! ఆ సమయంలో శారీరకంగా త్వరగా అలసటకు గురికావడం, నీరసించిపోవడం, త్వరగా చికాకు, కోపం వంటి లక్షణాలూ వెంటాడుతుంటాయి. మహిళలు ఎదుర్కొంటున్న ఈ మూడురోజుల సమస్యలను గుర్తించిన కొన్ని ప్రైవేటు సంస్థలు విధుల్లో వారికి ఉపశమనాన్నిచ్చే నిర్ణయాలను తీసుకుంటున్నాయి. ఇటీవలే ముంబయికి చెందిన 'గోజూప్' అనే డిజిటల్ మార్కెటింగ్ సంస్థ, ముంబయికే చెందిన మరో డిజిటల్ మీడియా సంస్థ 'కల్చర్ మిషన్'.. నెలసరిలో తొలి రోజు విధులకు హాజరుకానక్కర్లేదని తమ ఉద్యోగినులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించాయి. ఇదే విధానాన్ని దేశంలోని అన్ని సంస్థల్లోనూ అమలు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలూ పంపించింది. ఈ సంస్థలను స్ఫూర్తిగా తీసుకొని గతనెలలోనే మలయాళ మీడియా సంస్థ 'మాతృభూమి' కూడా తమ ఉద్యోగినులకు 'తొలిరోజు' విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించింది. నిజానికి చాలా దేశాల్లో ఇలాంటి వెసులుబాటు ఇప్పటికే ఉంది. మనదేశంలోనూ ఇప్పుడిది చర్చనీయాంశమైంది.

ఎందుకు సెలవు?

రుతుస్రావమనేది మహిళల్లో సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొందరిలో మాత్రం ఆ మూడ్రోజులు నరకాన్ని తలపిస్తుంది. నెలసరికి కొద్దిరోజుల ముందు.. ఆ సమయంలో కొందరి శరీరంలో హార్మోన్ల అసమతౌల్యం ఏర్పడుతుంది. ఫలితంగా అలసట, కోపం, చికాకు వంటివి తెలియకుండానే వచ్చేస్తాయి. పనిచేసే చోట ఇవన్నీ దుష్ప్రభావం చూపుతాయి. అకారణంగా ఎవరి మీదైనా ఈ లక్షణాలను ప్రదర్శిస్తే.. సహజంగానే సహ ఉద్యోగుల మనసులు నొచ్చుకుంటాయి. శరీరంలో జరిగే ఈ మానసిక మార్పులన్నీ పనిపైనా ప్రభావం చూపుతాయి. అయితే ఈ లక్షణాలు కొంతమందిలో నెలసరికి ముందే కనిపిస్తాయి. చాలా మరికొంతమందిలో ఆ మూడ్రోజుల సమయంలో కనిపిస్తుంటాయి. రుతుస్రావ సమయంలో ప్రధానంగా బాధించేవి రెండు అంశాలు. మొదటిది అధికంగా రుతుస్రావం కావడం. రెండోది నొప్పి వేధించడం. నొప్పిని తట్టుకోవడానికి మాత్రలు వేసుకున్నా.. వాటి ప్రభావం కొన్ని గంటలే ఉంటుంది. మళ్లీ మళ్లీ మాత్రలు వేసుకుంటే మూత్రపిండాలపై దుష్ప్రభావం పడుతుంది కాబట్టి.. చాలామంది పంటిబిగువున నొప్పిని భరిస్తూనే విధులను నిర్వహిస్తుంటారు. ఇలాంటి సమయంలో అడగకుండానే సెలవు పెట్టగల అవకాశం ఉంటే మహిళలకు వరమనే చెప్పాలి.

భిన్నాభిప్రాయాలు

రుతుస్రావ సమయంలో సెలవు పొందడంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సహజంగా జరిగే ప్రక్రియకు ప్రత్యేకంగా సెలవు తీసుకోవడమెందుకనేది కొందరి భావన. 30 శాతంమందిలోనే ఈ సమస్య వేధిస్తుంటే అందరికీ వర్తింపజేయడం వల్ల పని సమయాల్లో ఉత్పత్తిపై ప్రభావం పడుతుందనీ, దీన్ని అలుసుగా చేసుకొని ఆ వంకతో సెలవులు పొందేవారుంటారని కొందరు నిపుణులు అంటున్నారు. అయితే మహిళలకు ఇది దీర్ఘకాలిక సమస్య అనీ, దీన్ని ఎదుర్కొనే వారికి కచ్చితంగా కొంతమేరకు విశ్రాంతి అవసరమని మరికొందరు అంటున్నారు. పలు కారణాలను అన్వేషిస్తూ దీర్ఘకాలంగా వేర్వేరు రూపాల్లో చికిత్సలు పొందుతున్నా.. ఈ సమస్యలు తగ్గకుండా బాధలు పడేవారే ఆ 30 శాతం మందిలో అధికంగా ఉంటారని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. భరించలేనినొప్పిని అనుభవించేవారికి విశ్రాంతి మేలు చేస్తుందనీ, అయితే ఎన్నిరోజులు సెలవు తీసుకోవాలనేది ఆ మహిళ స్వేచ్ఛకు వదిలేయాలనే అభిప్రాయమూ వెల్లడవుతోంది.

విదేశాల్లో ఇలా..

జపాన్: రుతుస్రావ నొప్పితో బాధపడుతున్న మహిళలకు జపాన్‌లో 1947 నుంచి సెలవు పొందే వెసులుబాటు ఉంది. పని ప్రదేశాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో శానిటరీ నాప్‌కిన్లను అందుబాటులో ఉంచుతోంది.

చైనా: గత ఏడాది నుంచి ఒకటి లేదా రెండురోజుల నెలసరి సెలవులు పొందే వెసులుబాటు కల్పించారు. అయితే అవసరమైన వైద్య ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

ఇండోనేషియా: రుతుస్రావ సమయంలో రెండురోజుల సెలవులు పొందే విధానంలో ఇండోనేషియాలో చాన్నాళ్లుగా అమల్లో ఉన్నా చాలా సంస్థలు ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి.

దక్షిణ కొరియా: 2001 నుంచి ఈ సెలవు అమల్లో ఉంది.

ఇటలీ: రుతుస్రావ సెలవులపై ఇటలీ పార్లమెంటు ఇటీవలే కసరత్తు ప్రారంభించింది.

వేధిస్తుంటే సెలవు అవసరమే

నెలసరి సహజమైన శరీర ధర్మం. ఇందుకోసం ప్రత్యేకంగా అందరూ సెలవు పెట్టనక్కర్లేదు. సాధారణంగా నిర్వహించుకునే విధులకు ఆటంకాలేమీ ఉండవు. కొందరిలో మాత్రం ఈ సమయంలో వేదన భరించలేకుండా ఉంటుంది. అలాంటి లక్షణాలున్నవారు అవసరానికి తగ్గట్లుగా ఒకరోజో.. రెండ్రోజులో విశ్రాంతి తీసుకోవచ్చు. అది వ్యక్తిగత స్వేచ్ఛకు వదిలేయాలే తప్ప.. తప్పకుండా సెలవులు తీసుకోవాలనే షరతులు విధించక్కర్లేదు.

–డాక్టర్ బాలాంబ, సీనియర్ గైనకాలజిస్టు

కారణాలను గుర్తించి చికిత్స

సాధారణంగా యుక్తవయసులో రుతుస్రావం ఎక్కువగా అవుతుంది. వయసు పెరుగుతున్న కొద్దీ తగ్గుతుంది. అయితే కొందరు మహిళల్లో అధిక రుతుస్రావం, నొప్పి వంటి సమస్యలు దీర్ఘకాలంగా వేధిస్తుంటాయి. ఈ సమస్యలకు కారణాలను అన్వేషించి చికిత్స చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎండోమెట్రియాసిస్, అండాశయాల్లో నీటిబుడగలు, గర్భాశయంలో కణతులు, అధిక బరువు, జీవనశైలిలో మార్పులు.. తదితర కారణాల వల్ల ఇవి ఎదురవ్వొచ్చు. 40-50 ఏళ్ల మధ్య వయస్కుల్లో నెలసరి నిలిచిపోవడానికి ముందు దశలోనూ కొందరిలో రుతుస్రావం అధికమవుతుంది. పనిచేసే సమయంలో వీటి ప్రభావం శారీరకంగా, మానసికంగా కొంత తప్పకుండా ఉంటుంది. అధిక రుతుస్రావం కారణంగా కళ్లు తిరిగి పడిపోతుంటారు. ఇలాంటప్పుడు తగిన ఆహారం తీసుకోవాలి. అవసరమైన మాత్రలు వేసుకోవాలి. తీవ్రతను బట్టి ఆ మూడ్రోజుల్లో అవసరం మేరకు విశ్రాంతి కూడా తీసుకోవాల్సి వస్తుంది.

–డాక్టర్ జయంతీరెడ్డి, సీనియర్ గైనకాలజిస్టు

గిరిజన కార్యకర్త ఇంటిలో భాజపా అధ్యక్షుడు అమిత్ షా భోజనం



పార్టీ కార్యకర్త కమల్ ఉయికే నివాసంలో భోజనం చేస్తున్న అమిత్‌షా, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ తదితరులు

భోపాల్: భాజపా అధ్యక్షుడు అమిత్ షా పార్టీకి చెందిన గిరిజన కార్యకర్త ఇంటిలో ఆదివారం మధ్యాహ్నం భోజనం చేశారు. సామాజికంగా అణగారిన వర్గాలకు పార్టీని మరింత చేరువచేసేందుకు ఆయన భోపాల్ వచ్చారు. మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నంద్‌కుమార్ చౌహాన్‌లతో కలిసి ఆయన సేవనియా గౌడ్ ప్రాంతంలోని పార్టీ కార్యకర్త కమల్ సింగ్ ఇంటికి వెళ్లారు. అందరితో కలిసి దాల్-బట్టీ, కడీ-చావల్, మిఠాయిలు తిన్నారు. వీటిని స్వయంగా కమల్ సింగ్ కుటుంబమే తయారు చేసింది. రాష్ట్రంలోని మరికొందరు బలహీన వర్గాల కార్యకర్తల ఇళ్లలోనూ షా భోజనం చేశారు. తమ ప్రభుత్వం బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. రాష్ట్రాల్లో తమ ప్రభుత్వాలు కొలువైన చోట అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు.

ఆ ఇంటిలో మరుగుదొడ్డే లేదు: కాంగ్రెస్

షా భోజనం చేసిన కార్యకర్త ఇంటిలో కనీసం మరుగుదొడ్డి లేదని, భాజపా అభివృద్ధిలో కంతలకు ఇదే నిదర్శనమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ విషయంపై కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి కె.మిశ్ర మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మక స్వచ్ఛ భారత్ అభియాన్‌లో డొల్లతనాన్ని కమల్ సింగ్ ఇల్లు బయటపెట్టిందని విమర్శించారు.

నోట్ల రద్దుతో వేర్పాటువాదుల నోట్లో మట్టి

- కేంద్ర మంత్రి జైట్లీ వెల్లడి

ముంబయి: పెద్ద నోట్ల రద్దుతో దేశంలోని అనేక ప్రాంతాల్లో మావోయిస్టులకు, జమ్మూకశ్మీర్‌లోని వేర్పాటువాదులకు ఇబ్బందులు మొదలయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. వారికి డబ్బుకు బాగా కొరత ఏర్పడిందని తెలిపారు. ఫలితంగా కశ్మీర్‌లో రాళ్లు రువ్వే ఆందోళనకారుల సంఖ్య బాగా తగ్గిందని చెప్పారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "నోట్ల రద్దుకు ముందు కశ్మీర్ వీధుల్లో వేల మంది ఆందోళనకారులు పోగయ్యేవారు. ఇప్పుడు అలాంటి ఆందోళనలకు కనీసం 25 మంది కూడా రావడంలేదు. కశ్మీర్‌లోని వేర్పాటువాదులకు, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లోని మావోయిస్టులకు డబ్బుకు కటకట ఏర్పడింది" అని జైట్లీ చెప్పారు. పెద్ద నోట్ల రద్దు వల్ల.. దేశ ఆర్థిక వ్యవస్థకు వెలుపల చలామణీలో ఉన్న డబ్బు కూడా బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చి చేరిందని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో సాయుధ వేర్పాటువాదానికి ముగింపు పలికేందుకు కేంద్రం పట్టుదలగా ఉందని చెప్పారు. ఇప్పుడు భద్రతా దళాలదే అక్కడ పైచేయిగా ఉందన్నారు. దశాబ్దాల నాటి కశ్మీర్ సమస్యను పరిష్కరించేందుకు మునుపటి యూపీఏ ప్రభుత్వం నిర్దిష్టంగా ఎలాంటి విధానాన్ని అనుసరించలేదని చెప్పారు. నవ భారత నిర్మాణంపై భాజపా దార్శనికతను వివరిస్తూ.. రక్షణ, గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల రంగాలకు ఎక్కువ నిధులను ఖర్చు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.

ఎన్ఐఏ ధాటికి కశ్మీర్‌లో రాళ్ల దాడి తగ్గింది

- కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ వెల్లడి

లఖ్‌నవూ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పోషించిన పాత్ర వల్ల జమ్మూకశ్మీర్‌లో రాళ్లు రువ్వుతున్న ఘటనలు బాగా తగ్గిపోయాయని కేంద్ర హోంశాఖ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గత మూడేళ్లలో నక్సలిజం, ఉగ్రవాదం వంటి ఘటనలు తగ్గుముఖం పట్టాయన్నారు.

"కశ్మీర్‌లో ఎన్ఐఏ పోషించిన పాత్రను మీరు చూశారు. దేశ భద్రతకు మేం కట్టుబడి ఉన్నాం. అందుకోసం గట్టి చర్యలు తీసుకుంటున్నాం" అని రాజ్‌నాథ్ చెప్పారు. ఆదివారం ఆయన ఇక్కడ ఎన్ఐఏ కార్యాలయ, నివాస సముదాయాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నక్సలిజం, ఉగ్రవాదం, అతివాదంపై తాము విజయం సాధిస్తామన్నారు. గత మూడేళ్లలో ఈశాన్యంలో అతివాదం 75 శాతం మేర తగ్గుముఖం పట్టిందని చెప్పారు. నక్సలిజం 35-40 శాతం మేర తగ్గిందని తెలిపారు. ఉగ్ర నిధుల వనరులను అడ్డుకుంటామన్నారు. "నకిలీ కరెన్సీ, ఉగ్రవాద నిధుల మూలాలను నిర్మూలిస్తే అది ఉగ్రవాదానికి చావు దెబ్బ అవుతుంది. ఈ అంశంలో ఎన్ఐఏ అద్భుతంగా పనిచేస్తోంది. ఫలితంగా ఉగ్ర నిధులకు దోహదపడేవారికి దడ పడుతోంది" అని పేర్కొన్నారు. లఖ్‌నవూలో ఎన్ఐఏ కార్యాలయం, నివాస ప్రాంగణం.. దేశంలోనే మొట్టమొదటిదని చెప్పారు. ఎన్ఐఏ.. 165 కేసులను దర్యాప్తు చేస్తోందని, అది శాస్త్రీయ పద్ధతిలో సాగడం వల్ల దోష నిర్ధారణ రేటు 95 శాతంగా ఉందని చెప్పారు.

ఏడుగురు రైల్వే అధికారులపై చర్యలు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటు చేసుకున్న ఘోర రైల్వే ప్రమాదం నేపథ్యంలో రైల్వేశాఖ కొరడా ఝుళిపించింది. తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ముగ్గురు అత్యున్నతస్థాయి అధికారుల్ని సెలవుపై వెళ్లాల్సిందిగా ఆదేశించింది. మరో నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి రైల్వేశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సెక్రటరీ స్థాయి అధికారి అయిన రైల్వే బోర్డు సభ్యుడు (ఇంజనీరింగ్) ఆదిత్యకుమార్ మిత్తల్‌తో పాటు, ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్ ఆర్.కె.కులశ్రేష్ఠ, దిల్లీ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్.ఎన్.సింగ్‌లను సెలవుపై పంపించారు. రైలు పట్టాల నిర్వహణను చూడాల్సిన దిల్లీ సీనియర్ డివిజనల్ ఇంజినీర్, సహాయ ఇంజినీర్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (పర్మినెంట్ వే), జూనియర్ ఇంజినీర్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. ఉత్తర రైల్వే చీఫ్ ట్రాక్ ఇంజినీర్‌ను బదిలీ చేశారు. ¬ ప్రమాదం వెనుక ఉగ్రవాద కోణం ఉందని చెప్పడానికి సరిపడా ఆధారాలు కనిపించడం లేదని ఉత్తర్‌ప్రదేశ్ ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్) తెలిపింది.

రైల్వే మంత్రిదే బాధ్యత: కాంగ్రెస్

దిల్లీ: యూపీలో జరిగిన రైలు ప్రమాదానికి రైల్వే శాఖ మంత్రి సురేశ్‌ప్రభు బాధ్యత వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలసత్వం విషయంలో ఆయనొక కొత్త రికార్డు సృష్టిస్తున్నారని పార్టీ సమాచార విభాగం బాధ్యుడు రణదీప్ సూర్జేవాలా ఆదివారం విలేకరుల సమావేశంలో విమర్శించారు. 2014 మే నుంచి ఇప్పటి వరకు 27 భారీ రైలు ప్రమాదాల్లో 259 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన చెప్పారు. బులెట్ రైళ్ల కోసం వెళ్లే ముందు భద్రతకు నిధులు కేటాయించాలని సూచించారు.

నిర్లక్ష్యమే రైలును పడేసిందా?

- అనుమతి లేకుండానే పట్టాలపై నిర్వహణ పనులు..!?
- యూపీ రైలు ప్రమాదంపై నేటి నుంచి విచారణ
- తుక్కుగా మారిన ఆరు పెట్టెలు
- మృతుల సంఖ్య 22... మరింత పెరిగే అవకాశం

ముజఫర్‌నగర్/ దిల్లీ



ముజఫర్‌నగర్‌కు సమీపాన జరిగిన కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో అతుక్కుపోయిన బోగీలను క్రేన్ల సాయంతో వేరు చేస్తున్న దృశ్యం

పూరీ నుంచి హరిద్వార్ వెళ్తున్న కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ఘోర ప్రమాదానికి గురి కావడానికి కారణం సిబ్బంది నిర్లక్ష్యమేనా అనే అనుమానం బలపడుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి, కారణాలను నిగ్గు తేల్చడానికి రైల్వే మంత్రిత్వశాఖ రంగంలో దిగింది. రైల్వే భద్రత కమిషనర్ శైలేష్‌కుమార్ పాఠక్ నేతృత్వంలో సోమవారం నుంచి దర్యాప్తు మొదలు కానుంది. ముజఫర్‌నగర్‌కు సమీపంలోని ఖతౌలీ స్టేషన్ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో 23 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తొలుత వార్తలు వెలువడిన విషయం తెలిసిందే. ప్రాణాలు కోల్పోయినవారు 22మంది కాగా, 156 మంది గాయాలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నారనీ, వారిలో 26 మందికి తీవ్రంగా గాయాలయ్యాయనీ అధికార వర్గాలు ఆదివారం వివరించాయి. క్షతగాత్రుల్లో ఎక్కువ మంది పరిస్థితి విషమంగా ఉందని యూపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(సమాచార విభాగం) అవినాశ్ కుమార్ అవస్థి ఒక వార్తా సంస్థకు తెలిపారు. దెబ్బతిన్న రైలుమార్గం పునరుద్ధరణ ఆదివారం రాత్రికి పూర్తయింది. రైలు పట్టాలపై నిర్వహణ పనులు జరుగుతున్నట్లుగా ప్రాథమికంగా తెలుస్తోందనీ, అవి ఏమిటనేది స్పష్టతలేదనీ రైల్వేబోర్డు సభ్యుడు మహ్మద్ జంషెడ్ దిల్లీలో విలేకరులకు చెప్పారు. అనుమతి లేకుండా నిర్వహణ పనులు చేపట్టారా అనేది తేలాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. ఇ-టికెట్ కింద 40%మందికి బీమా వర్తిస్తుందనీ, ఇది కాకుండా రైల్వే కూడా పరిహారం చెల్లిస్తుందని చెప్పారు. 'సాధారణంగా ఇలాంటి పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు పెట్టెలు బోల్తాపడడం, పట్టాలు తప్పడం, ధ్వంసం కావడం వంటివి జరుగుతాయి. ఈ ఘటనలో 200 మీటర్ల మేర పట్టాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమగ్రంగా విచారణ జరపాలి. అన్ని లెక్కలూ తేల్చి, ప్రతీ వైఫల్యాన్ని పరిగణనలో తీసుకుంటాం'అని జంషెడ్ వివరించారు.

సవాల్ విసిరిన పునరుద్ధరణ పనులు: పట్టాలు తప్పిన 14 పెట్టెల్లో 6 ఘోరంగా దెబ్బతిని, తుక్కుగా మిగిలాయి. వాటిని పట్టాలపైనుంచి తొలగించే పనులూ ఒక పట్టాన పూర్తికాలేదు. అధునాతన 140 టన్నుల క్రేన్లను, పెద్దఎత్తున కూలీలను రంగంలో దించి 24 గంటలకు పైగా కష్టపడితే గానీ శకలాలను తొలగించలేకపోయారు. ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైనప్పుడు గంటకు 100 కి.మీ. వేగంతో వెళ్తోందని దిల్లీ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్.ఎన్.సింగ్ వెల్లడించారు. రైల్లో 23 పెట్టెలు ఉంటే వాటిలో 13 పట్టాలు తప్పాయని తెలిపారు. జాతీయ విపత్తు ఉపశమన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) సహకారంతో చేపట్టిన సహాయక చర్యలు ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు పూర్తికాగా ఆ తర్వాత రైలుమార్గం పునరుద్ధరణ పనులు ప్రారంభించారు.

బాధ్యుల్ని నిర్ణయించండి: సురేశ్ ప్రభు

యూపీలో ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైన ఘటనకు బాధ్యుల్ని వెంటనే నిర్ణయించాలని రైల్వే శాఖ మంత్రి సురేశ్‌ప్రభు ఆదివారం రైల్వేబోర్డు ఛైర్మన్‌ను ఆదేశించారు. వైఫల్యం ఉన్నట్లయితే కఠిన చర్యలు తప్పవన్నారు. పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తూ క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సను అందిస్తున్నట్లు ట్విటర్‌లో తెలిపారు.

పోలీసు కేసు నమోదు

ఉత్కళ్ ప్రమాదంపై ఖతౌలీ ప్రభుత్వ రైల్వే పోలీసులు కేసు నమోదుచేశారు. యంత్రాలను నిర్లక్ష్యంగా వదిలేయడం(సెక్షన్ 287), తమ చర్యలతో ఇతరుల ప్రాణాలకు ప్రమాదం తీసుకురావడం (సెక్షన్ 337), నిర్లక్ష్యంతో ప్రాణనష్టానికి కారణమవడం నేరాల కింద గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదైంది.

ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు 'అచ్ఛే దిన్'

ప్రమాణాల పెంపునకు పదేళ్ల ప్రణాళిక

ఈనాడు, దిల్లీ: దేశంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు 'అచ్ఛే దిన్' రానున్నాయి. ఆ సంస్థల్లో విద్యా ప్రమాణాలు పెంపునకు కేంద్ర మానవ వనరుల శాఖ, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్- ఏఐసీటీఈ), రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయనున్నాయి. ఇందుకోసం మోదీ ప్రభుత్వం పదేళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఉపాధి అవకాశాలకు తగ్గట్టుగా పాఠ్యాంశాల స్థాయి పెంచడం, చదువులు పూర్తయిన తరువాత విద్యార్థులకు ఉద్యోగాలు లభించేలా చూడడం, నియామక విధానాన్ని మెరుగుపరచడం వంటి అంశాలను ఈ ప్రణాళికలో పొందుపరిచారు. సమకాలీన ఉపాధి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను రూపొందించేందుకు జాతీయ స్థాయిలో సలహా మండలిని ఏర్పాటు చేయనున్నట్టు ఓ అధికారి చెప్పారు.

కనీసం మూడు సార్లు శిక్షణ

బిటెక్ పట్టా పొందే ముందు ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థీ కనీసం మూడు సార్లు శిక్షణ (ఇంటర్న్‌షిప్) పొందేలా ఏఐసీటీఈ బాధ్యత తీసుకుంటుంది. ప్రధాన సబ్జెక్టులతోపాటు, నాయకత్వ లక్షణాలు, బృందంలో పనిచేయడం, సంభాషణ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. ఇందుకోసం అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు మార్గదర్శకాలు పంపిస్తారు. 2022నాటికి వాటిలో కనీసం సగమైనా పాటించకపోతే ఏఐసీటీఈ వద్ద గుర్తింపు రద్దు చేస్తారు. వీటన్నింటినీ అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందిస్తుందని మానవ వనరుల శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.

కాన్పూర్-ఝాన్సీ మార్గంలో విరిగిన పట్టా

- డ్రైవరు అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

లఖ్‌నవూ: ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద సహాయ చర్యలు కొలిక్కి రావడానికి ముందే యూపీలో మరో ప్రమాదం త్రుటిలో తప్పింది. కాన్పూర్-ఝాన్సీ మార్గంలో మలాస-పుఖ్రాయా స్టేషన్ల మధ్య రైలుపట్టా విరిగి ఉన్న విషయాన్ని ప్రతాప్‌గఢ్-భోపాల్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవరు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో ఆయన ఈ ప్రమాదాన్ని గమనించి, అత్యవసర బ్రేకులతో రైలును ఆపారు. దాంతో కొంత మంది ప్రయాణికులు స్వల్పంగా గాయాలపాలైనా, ప్రాణాలతో సురక్షితంగా బయటపడగలిగారు. పట్టాలకు మరమ్మతులు చేసిన తర్వాత ఆ రైలు వెళ్లింది. షాజహాన్‌పూర్‌లో కాపలాదారుడు లేని లెవెల్‌క్రాసింగ్ గేటు వద్ద ఆదివారం బాపూధామ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఒక ట్రక్కును ఢీకొంది. ట్రక్కు డ్రైవరు అక్కడికక్కడే మరణించారు.

298 మంది భారతీయులకు పాక్ పౌరసత్వం

ఇస్లామాబాద్: ఐదేళ్లలో దాదాపు 298 మంది భారతీయులకు పాకిస్థాన్ పౌరసత్వం అందించినట్లు ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్ నుంచి పాకిస్థాన్‌కు వలస వెళ్లిన దాదాపు 298 మందికి 2012 ఏప్రిల్ 14 నుంచి 2017 వరకు పాకిస్థాన్ పౌరసత్వం మంజూరు చేసినట్లు మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ దేశ నేషనల్ అసెంబ్లీలో అధికార పాకిస్థాన్ ముస్లిం లీగ్ (నవాజ్) సభ్యుడు షేక్ రోహైల్ అస్గర్ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం ఈ వివరాలు వెల్లడించింది.

గిల్గిట్-బాల్టిస్థాన్‌లో ఐఎస్ఐకు భూ కేటాయింపులపై నిరసనలు

దిల్లీ: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో భాగమైన గిల్గిట్-బాల్టిస్థాన్ ప్రాంతంలోని వేలఎకరాల స్థలాన్ని గూఢచర్య సంస్థ ఐఎస్ఐకు అప్పగించడంపై నిరసనలు పెల్లుబుకుతున్నాయి. పాక్ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ గిల్గిట్‌వాసులు ఆదివారం వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టారు. 'కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ఐఎస్ఐ, సైనిక విభాగం ఉత్తర ప్రాంత కమాండ్‌కు అక్రమంగా కేటాయించారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను నామమాత్రపు ధరలకే సైన్యానికి అప్పగిస్తున్నారనడానికి ఈ చర్యే ప్రత్యక్ష నిదర్శనం' అని స్థానికుడు గుల్బాన్ షా వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదులకు నిధులు వేల్స్ నుంచే

- అమెరికా దర్యాప్తు సంస్థ వెల్లడి
- స్పెయిన్‌కు అక్కడి నుంచే సాయం

లండన్: ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులకు ఆర్థిక సహాయం అందించే కేంద్రంగా యునైటెడ్ కింగ్‌డంలోని వేల్స్ ప్రాంతం మారింది. వివిధ చోట్ల ఉన్న కంపెనీల ద్వారా ఈ సాయం అందుతోంది. స్పెయిన్‌లోని బార్సెలోనాలో సహా పలు చోట్ల జరిగిన దాడులకు ఇక్కడ నుంచే నిధులు అందాయి. ఇక్కడ ఉన్న కంపెనీల ద్వారా ఆయుధాలు ఉన్న డ్రోన్లు, నిఘా పరికరాలు, రాకెట్లు ప్రయోగించే సాఫ్ట్‌వేర్ సరఫరా అవుతున్నాయి. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ దగ్గర ఉన్న పత్రాలు ఆధారంగా ద సండే టైమ్స్ ఈ మేరకు కథనాన్ని ప్రచురించింది. వేల్స్‌లోని కార్డిఫ్ ప్రాంతంలో ఉన్న కంపెనీ ద్వారా స్పెయిన్‌లోని మాడ్రిడ్‌కు పీటర్ సొరేన్ అనే బోగస్ వ్యక్తికి నిఘా పరికరాలు పంపించారు. నిజానికి పీటర్ సొరేన్ అన్నది బంగ్లాదేశ్‌కు చెందిన ఐ.టి.నిపుణుడు సైఫుల్ సుజన్ మారు పేరు. దక్షిణ వేల్స్‌లో ఉండే ఆయన మూడేళ్ల క్రితం కుటుంబంతో సహా సిరియా వెళ్లి ఐ.ఎస్.లో చేరాడు. అక్కడ అమెరికా జరిపిన డ్రోన్ దాడుల్లో మరణించాడు. హ్యాకింగ్, ఆయుధాల తయారీలో నిపుణుడైన సుజాన్ ఐ.ఎస్.లో కీలక బాధ్యతలు నిర్వహించినప్పుడు ఇక్కడ ఉన్న కొన్ని కంపెనీలు ఆయనతో సత్సంబంధాలు నెరిపాయి కూడా. ఆయన పేరు మీదే స్పెయిన్‌కు నిఘా పరికరాలు పంపడం గమనార్హం. ఇబాక్స్‌టెల్ ఎలక్ట్రానిక్స్ సంస్థ అమెరికా మేరీలాండ్‌లో ఉన్న ఐ.ఎస్. మద్దతుదారుడు మహ్మమ్మద్ ఎల్షినావే (32)కు 2105లో 7,700 డాలర్లు పంపించినట్టు ఎఫ్‌బీఐ పరిశోధనలో తేలింది.

మృత్యు శకటం డ్రైవర్ ఎక్కడ?


బార్సెలోనా: స్పెయిన్‌లోని బార్సెలోనాలో రహదారుల మీద ఉన్నవారిపై తెల్లవ్యాన్‌నునడిపి 13 మంది మృతికి కారకుడైన డ్రైవర్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈదుర్ఘటనతో సంబంధం ఉన్న మరో ఇద్దరు ఇస్లామిక్‌స్టేట్ ఉగ్రవాదులు మరణించారా? తప్పించుకొని పారిపోయారాఅన్నదానిపైనా ఆరాతీస్తున్నారు. గురువారం జనసంచారం అధికంగా ఉండే బార్సెలోనాలోని లాస్ రాంబ్లాస్‌లో మృత్యు శకటాన్ని నడిపిందెవరన్నది ఇంకా స్పష్టంగా తెలియనప్పటికీ 22 ఏళ్ల మొరాకో జాతీయుడైన యూనెస్ అబౌయాకౌబ్ పైనే అనుమానాలున్నాయి. అయితే అతడు ఫ్రాన్స్‌కు తప్పించుకొని పారిపోయి ఉంటాడన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. బార్సెలోనాతో పాటు, కాంబ్రిల్స్‌లో దాడులు జరిపిన ఉగ్రవాద ముఠాలో 12మంది ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

ఉగ్రవాద ముఠా అంతమైనట్టే..: ఈ దాడులతో సంబంధం ఉన్న అయిదుగురు ఉగ్రవాదులు హతమవగా, మరో నలుగుర్ని అరెస్టు చేశామని, దీంతో ఈ ముఠా నిర్వీర్యమైనట్టేనని అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి జువాన్ ఇగ్నాసియో జొయిదో ప్రకటించారు. ఈ దాడి జరగడానికి ముందు బుధవారం అర్ధరాత్రి అల్కనార్‌లోని ఓ ఇంట్లో పేలుడు సంభవించి ఇద్దరు మరణించారు. తాము గాలిస్తున్న ఉగ్రవాదులు వీరే అయి ఉంటారని, దాంతో ముఠా మొత్తం అంతమయినట్టేనని పోలీసులు భావిస్తున్నారు.



బార్సిలోనాలో ఉగ్రవాద చర్యకు ప్రాణాలు కోల్పోయినవారికి సంఘటన స్థలం వద్ద ఘన నివాళులర్పిస్తున్న స్పెయిన్ దేశస్థులు

ఈనాడు సినిమా


రామ్

అభిరామ్ జిందగీ

రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఉన్నది ఒకటే జిందగీ'. లావణ్య త్రిపాఠి, అనుపమ పరమేశ్వరన్ కథానాయికలు. కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు. స్రవంతి రవికిషోర్ నిర్మాత. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. 'నేను శైలజ' తర్వాత రామ్- కిశోర్ తిరుమల కలయికలో రూపుదిద్దుకొంటున్న చిత్రమిది. ఇందులో కథానాయకుడు అభిరామ్ అనే సంగీతకారుడిగా కనిపించబోతున్నారు. ఆ పాత్రని ట్విట్టర్ ద్వారా పరిచయం చేశారు రామ్. గిటార్ చేతపట్టి కనిపిస్తున్న ఓ ఫొటోని పోస్ట్ చేస్తూ... "చాలా అందంగా రూపుదిద్దుకొన్న పాత్ర అభిరామ్. ఆ పాత్రతో అందరినీ కలిసేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నా" అని ట్వీట్ చేశారు రామ్. ఇదివరకటి చిత్రాలకి పూర్తి భిన్నమైన వేషధారణతో కనిపిస్తున్నారు రామ్. 'నేను శైలజ' కలయికలో వస్తున్న ఈ చిత్రం అందరి అంచనాలని అందుకొనేలా ఉంటుందని చిత్రబృందం చెబుతోంది.

పంచ్ డైలాగ్

ఆ పూట ఆకలి తీర్చే అన్నదానం కన్నా, అన్ని పూటలా కడుపు నింపే విద్యా దానం గొప్పది! చిత్రం: సాంబ
- పంపినవారు: జి.వీర వెంకట సత్యనారాయణ, విజయనగరం

సాఫ్ట్‌వేర్ సరసుడు

శింబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'సరసుడు'. నయనతార, ఆండ్రియా, ఆదాశర్మ కథానాయికలు. పాండిరాజ్ దర్శకత్వం వహించారు. టి.రాజేందర్ నిర్మాత. సెప్టెంబరు 8న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. శింబు మాట్లాడుతూ "తమిళం, తెలుగు భాషల్లో తెరకెక్కిన చిత్రమిది. తమిళంలో ఇప్పటికే విడుదలై విజయాన్ని సొంతం చేసుకొంది. 'మన్మథ', 'వల్లభ' చిత్రాల తర్వాత ఆ స్థాయిలో నాకు పేరు తెచ్చే చిత్రమవుతుంది. ఒక మంచి ప్రేమకథతో పాండిరాజ్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. నా తమ్ముడు కురళ్ అరసన్ అందించిన సంగీతం, సత్యం రాజేష్ నటన చిత్రానికి బలం" అన్నారు. 'సాఫ్ట్‌వేర్ నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది. నేనే మాటలు, పాటలు రాశా" అన్నారు టి.రాజేందర్.


నయనతార, శింబు


రామ్‌చరణ్

గోదారి సెట్టుందీ...

రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రంగస్థలం 1985'. సమంత కథానాయిక. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ చిత్రం కోసం గోదావరి పరిసర ప్రాంతాల్ని, అక్కడి గ్రామాల్ని పోలినట్టుగా ప్రత్యేకంగా ఓ సెట్‌ని తీర్చిదిద్దారు. అందులోనే రామ్‌చరణ్, సమంత, ఆది పినిశెట్టి, జగపతిబాబు తదితర తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. సుకుమార్ ఇదివరకు తీసిన చిత్రాలకి పూర్తి భిన్నంగా ఈ కథని తీర్చిదిద్దినట్టు చిత్రబృందం చెబుతోంది. రామ్‌చరణ్ కూడా కొత్త గెటప్‌లో సందడి చేయబోతున్నారు. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: రత్నవేలు.

ఏదైనా కొద్దిసేపే!

"నా దృష్టి ఎప్పుడూ భవిష్యత్తుపైనే ఉంటుంది. మాటిమాటికీ వెనుదిరిగి చూసుకోవడం ఇష్టం ఉండద"ని చెబుతోంది కాజల్. ఆ అలవాటుతో పాటు, తొందరగా మరిచిపోయే గుణమే విజయ రహస్యంగా భావిస్తానంటోంది. 'నేనే రాజు నేనే మంత్రి'లో రాధగా నటించి మంచి పేరు తెచ్చుకొన్న ఆమె ప్రస్తుతం కల్యాణ్‌రామ్ సరసన 'ఎమ్.ఎల్.ఎ'లో నటిస్తోంది. యాభై సినిమాల మైలు రాయిని అధిగమించిన కాజల్, సినిమా రంగంలో సాగించాల్సిన ప్రయాణం ఇంకా చాలా ఉందంటోంది. "చేతికి అందింది విజయం, పరాజయం.. ఏదైనాసరే కొద్దిసేపే నా మనసులో ఉంటుంది. వాటి నుంచి తెలుసుకోవల్సింది ఏముందో అది గ్రహించి, ఆ మరు క్షణమే భవిష్యత్తుపై దృష్టిసారిస్తుంటా. అందుకే ఇంత దూరం ప్రయాణించానేమో అనిపిస్తుంటుంది. మతిమరుపు అందరికీ ఇబ్బంది కలిగిస్తే నాకు మేలు చేసింది. నేను చేసిన పాత్రలు, ఫలితాలు అంటూ గతాన్నే గుర్తు చేసుకొంటే ముందుకు వెళ్లేదెప్పుడు? ఇది ఎవర్నో చూసో, లేదంటే ఎవరో చెబితేనో తెలుసుకొన్న విషయం కాదు. నాకు నేనుగా అనుభవపూర్వకంగా తెలుసుకొని, ఆచరణలో పెట్టా. తొలినాళ్లలో ఒక పరాజయం ఎదురవగానే దాని గురించి ఎక్కువగా ఆలోచించేదాన్ని. క్రమంగా ఆ అలవాటును దూరం చేసుకొన్నా. అప్పట్నుంచి నాకంతా మంచే జరిగింది" అని చెప్పింది కాజల్.


కాజల్

చక్రపాణి పాత్రలో ప్రకాష్‌రాజ్


ప్రకాష్‌రాజ్

సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'మహానటి'. కీర్తి సురేష్, సమంత ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకుడు. స్వప్న సినిమా సంస్థ నిర్మిస్తోంది. వైజయంతీ మూవీస్ సమర్పిస్తోంది. ఈ సినిమాలో సావిత్రి భర్త జెమినీ గణేశన్ పాత్రలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్నారు. ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్ ఆదివారం 'మహానటి' సెట్లోకి అడుగు పెట్టారు. ప్రముఖ నిర్మాణ సంస్థ విజయ వాహిని స్టూడియోస్ అధినేతల్లో ఒకరైన చక్రపాణి పాత్రలో ప్రకాష్‌రాజ్ నటిస్తున్నారు. ఇందులో సావిత్రిగా కీర్తి సురేష్ నటిస్తుండగా, సమంత ఓ పాత్రికేయురాలి పాత్రలో కనిపిస్తారని తెలిసింది.

గీతోపదేశం

తలబడి కలబడి
నిలబడు
పోరాడే యోధుడు జడవడు
సంకల్పం నీకుంటే
ఓటమికైనా వణుకేరా
బుడిబుడి అడుగులు తడబడి
అడుగడుగున నీవే నిలబడి
ఎదురీదాలి లక్ష్యం వైపు
ఎంతో పాటుపడి

గీతం: తలబడి కలబడి నిలబడు...
చిత్రం: పిల్ల జమీందార్
రచన: కృష్ణచైతన్య
- పంపినవారు: పొత్తూరి ప్రసాద్, హైదరాబాద్

అదిరెన్... ఫ్యాషన్!


నర్గీస్ ఫక్రి


శ్రద్ధాకపూర్


సన్నీ లియోని


ప్రీతి జింటా


కృతి సనన్

వెండితెరపై వెలుగుతున్న తారల్లో చాలామంది ఒకప్పుడు మోడలింగ్ చేసినవాళ్లే. ర్యాంప్‌పై వయ్యారంగా నడిచి ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడమే కాదు.. సినిమా అవకాశాల్ని అందుకున్నవారెందరో ఉన్నారు. సినిమాల్లో కనిపిస్తున్నా ర్యాంప్‌పై కొత్త రకం డిజైన్ దుస్తులు ధరించి అలా అలా నడిచి వెళ్లడంలో ఓ కిక్ ఉంటుందనేది తారల అభిప్రాయం. అందుకే వీలున్నప్పుడల్లా పిల్లి నడకలు నడిచేసి మురిసిపోతుంటారు. ఓ ప్రముఖ సౌందర్య ఉత్పత్తి సంస్థ ముంబయిలో ఫ్యాషన్ వీక్ నిర్వహించింది. ఇందులో మోడళ్లతో పాటు బాలీవుడ్ ముద్దుగుమ్మలు, కొంతమంది యువ కథానాయకులు కొత్త రకం గెటప్పుల్లో ర్యాంప్ వాక్ చేసి అలరించారు. ఈ ఫ్యాషన్ షోలో ప్రీతి జింటా, శ్రద్ధాకపూర్, సన్నీ లియోని, కృతి సనన్, నర్గీస్‌ఫక్రి, చిత్రాంగద సింగ్, మలైకా అరోరా లాంటి అందాల కథానాయికలతో పాటు రణ్‌వీర్‌సింగ్, విద్యుత్ జమ్వాల్ లాంటి కథానాయకులు సందడి చేశారు.


మలైకా అరోరా


విద్యుత్ జమ్వాల్


రణ్‌వీర్ సింగ్


చిత్రాంగద సింగ్

హేయ్... పిల్లగాడా


సాయిపల్లవి, దుల్కర్‌సల్మాన్

దుల్కర్‌సల్మాన్, సాయిపల్లవి జంటగా తమిళంలో నటించిన 'కలి' తెలుగులో 'హేయ్... పిల్లగాడ' పేరుతో విడుదలవుతోంది. సమీర్ తాహిర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో డి.వి.కృష్ణస్వామి విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో దర్శకుడు శేఖర్‌కమ్ముల లోగోని ఆవిష్కరించారు. "ఒక కొత్త రకమైన ప్రేమ కథతో తెరకెక్కిన చిత్రమిది. 'ఫిదా' తర్వాత తెలుగులో విడుదలవుతున్న సాయిపల్లవి చిత్రమిదే. వచ్చే నెల 8న విడుదల చేస్తామ"న్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో సురేంద్రకృష్ణ, భాషాశ్రీ, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

'తారామణి' ప్రేమకథ


ఆండ్రియా, వసంత్ రవి

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'తారామణి'. రామ్ దర్శకుడు. డి.వెంకటేష్ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాత మాట్లాడుతూ "ఇదో ముక్కోణపు ప్రేమకథ. పెరుగుతున్న సాంకేతికత వల్ల యువతరం ఎలాంటి సమస్యల్ని ఎదుర్కొంటోందనే విషయాన్ని అంతర్లీనంగా చెబుతున్నాం. ఇప్పటికే తమిళంలో విడుదలై మంచి విజయాన్ని అందుకొంది. త్వరలోనే తెలుగులోనూ విడుదల చేస్తున్నామ"న్నారు.

అదే నమ్మకంతో ఉన్నాను!



రాధిక

"చదువుకొనే రోజుల్నుంచే తెలుగు సినిమాలతో అనుబంధం ఉంది. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమలో స్థిరపడాలి అనుకున్నాను. మైథిలీ పాత్ర నా సినీ ప్రయాణానికి ఓ బలమైన పునాది వేస్తుందనే నమ్మకంతో ఉన్నాను"అంటోంది రాధికా మెహ్రోత్ర. ఆమె కథానాయికగా పరిచయమవుతున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. చంద్రకాంత్ కథానాయకుడిగా నటించారు. జి.గోవర్ధన్ దర్శకుడు. సెప్టెంబరు ద్వితీయార్థంలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాధికా మెహ్రోత్ర హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "ఒక మంచి కథలో, మధురమైన పాత్రని పోషించే అవకాశం నాకు లభించింది. ఉన్నత స్థానానికి వెళ్లాలనే తపనతో కలలు కనే అమ్మాయి మైథిలీ. జీవితంలో ఆమెకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయన్నది ఆసక్తికరం" అని చెప్పింది. వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ "మాది రాజస్థాన్. కళాశాల రోజుల్లోనే రంగస్థలంపై మక్కువ పెరిగింది. తెలుగు సినిమాలతో నా అనుబంధం సుదీర్ఘమైనది. 'బొమ్మరిల్లు' మొదలుకొని పలు చిత్రాలు చూశాను. నాగార్జున, ప్రభాస్ తదితర కథానాయకుల నటనంటే నాకు ఇష్టం" అని చెప్పింది రాధిక.

ఛాంపియన్

నలభై ఏళ్లలో ఐదు పతకాలు! ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదీ భారత రికార్డు. 2011 ముందు కేవలం ఒకే ఒక్క పతకం. ఒకప్పుడు అర్హత సాధిస్తేనే గొప్ప అనుకునే పరిస్థితి. కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నం. సైనా నెహ్వాల్, పి.వి.సింధు, కిదాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్‌ల విజయాల హోరుతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పసిడి సహా ఒకటి కంటే ఎక్కువ పతకాలు ఆశించగల పరిస్థితుల్లో ఇప్పుడు భారత్ ఉంది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే అత్యధికంగా ఈసారి 21 మంది ఛాంపియన్‌షిప్‌లో అలరించబోతుండడం విశేషం. భారత్.. రాశిలోనే కాదు వాసిలోనూ బాగుంది. గతంలో ఎన్నడూ లేనంత పటిష్టమైన సైన్యంతో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌పై దండయాత్రకు సిద్ధమైంది భారత్. గ్లాస్గోలో సోమవారం నుంచే పోరు. మరి ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్రీడాకారుల అవకాశాలను ఓసారి పరిశీలిద్దామా..!

పసిడి ఆశల్లో..



మధ్యాహ్నం 3.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో

- భారత్‌కు మంచి అవకాశం
- ఫేవరెట్లుగా శ్రీకాంత్, సాయి, సింధు, సైనా
- ప్రపంచ బ్యాడ్మింటన్ నేటి నుంచే

గ్లాస్గో (స్కాట్లాండ్)

సింధు.. స్వర్ణమే లక్ష్యంగా

2014 వరకు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ సాధించిన పతకాలు నాలుగు కాంస్యాలు. అందులో సింధు గెలిచినవే రెండు. ప్రతిష్టాత్మక టోర్నీలో సింగిల్స్‌లో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణి కూడా సింధునే. 2013, 2014లలో వరుసగా రెండు కాంస్యాలు సాధించింది. ఐతే ఈ నాలుగేళ్లలో మార్పు సుస్పష్టం. నిరుడు రియో ఒలింపిక్స్‌లో రజత పతకం సింధు కెరీర్‌తో పాటు భారత బ్యాడ్మింటన్ స్వరూపాన్నే మార్చేసింది. సింధుపై అంచనాలూ భారీగా పెరిగాయి. ఈ ఏడాది సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్ సాధించిన సింధు.. ఒలింపిక్ ఛాంపియన్ కరోలినా మారిన్‌ను ఓడించి ఇండియా ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్ గెల్చుకుంది. కెరీర్‌లో అత్యుత్తమంగా రెండో ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం మహిళల సింగిల్స్‌లో అత్యుత్తమ క్రీడాకారిణిగా కనిపిస్తున్న సింధు.. పతకాల సంఖ్యను మూడుకు పెంచుతుందా? ఈసారి స్వర్ణ పతకంతో సత్తాచాటుతుందా? అన్నది చూడాలి. తొలి రౌండ్లో కిమ్ మిన్ (కొరియా)తో ఆమె తలపడుతుంది.

వయసు: 22 | ర్యాంకు: 5 | 2017లో ఆడిన మ్యాచ్‌లు 27, విజయాలు 21, ఓటములు 6


సైనాకు పరీక్ష



భారత బ్యాడ్మింటన్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన సైనా నెహ్వాల్‌కు ప్రపంచ ఛాంపియన్‌షిప్ రూపంలో కెరీర్‌లోనే అతిపెద్ద పరీక్ష ఎదురుకానుంది. 2015లో రజతం సాధించిన సైనా.. ఆ తర్వాత గాయం కారణంగా ఆటలో లయను కోల్పోయింది. మోకాలి గాయంతో రియో ఒలింపిక్స్‌లో అర్ధంతరంగా పోరాటాన్ని ముగించింది. రెండేళ్లుగా ఫామ్‌తో తంటాలు పడుతున్న సైనా ఈ ఏడాది జనవరిలో మలేసియా మాస్టర్స్ టైటిల్ గెలిచింది. ఐతే తన అత్యుత్తమ ఆటను అందుకోవడంలో ఇబ్బంది పడుతుంది. కాకపోతే పోరాడేతత్వం కలిగిన సైనా రెట్టింపు కష్టంతో సాధన చేస్తోంది. మళ్ళీ అగ్రస్థానానికి చేరుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. తొలి రౌండ్లో సైనాకు బై లభించింది.

వయసు: 27 | ర్యాంకు: 16 | 2017లో ఆడిన మ్యాచ్‌లు 22, విజయాలు 15, ఓటములు 7

ఫేవరెట్ శ్రీకాంత్



ఒలింపిక్ ఛాంపియన్ లిన్ డాన్‌ను చైనా ఓపెన్ సూపర్ సిరీస్ (2014)లో ఓడించిన శ్రీకాంత్ ఇప్పుడు భారత సింగిల్స్‌కు ముఖచిత్రంగా మారిపోయాడు. వరుసగా రెండు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచిన ఏకైక భారత ఆటగాడిగా నిలవడంతో పాటు. వరుసగా మూడు సూపర్ సిరీస్‌లలో ఫైనల్ చేరిన ఘనత కూడా అతడిదే. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలిచే అవకాశాలు మెండుగా ఉన్న ఆటగాళ్లలో అతడే ముందుంటాడు. శ్రీకాంత్.. తనదైన రోజున ఎంతటి ఆటగాడినైనా ఓడించగల సమర్థుడు. ఇండోనేసియా ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ సిరీస్‌లలో అతని ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. ప్రపంచ నంబర్‌వన్ సాన్ వాన్ హో (కొరియా)ను వారం రోజుల్లో రెండు సార్లు మట్టికరిపించిన శ్రీకాంత్.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఫేవరెటే. తొలి మ్యాచ్‌లో సెర్గీ సిరాంత్ (రష్యా)తో శ్రీకాంత్ తలపడతాడు.

వయసు: 24 | ర్యాంకు: 8 | 2017లో ఆడిన మ్యాచ్‌లు 28, విజయాలు 22, ఓటములు 6

ఈసారి బరిలో..

పురుషుల సింగిల్స్: శ్రీకాంత్, సాయిప్రణీత్, అజయ్ జయరాం, సమీర్‌వర్మ; **మహిళల సింగిల్స్:** సింధు, సైనా, రితుపర్ణ దాస్, తన్వి లాడ్; **పురుషుల డబుల్స్:** సుమీత్‌రెడ్డి- మను అత్రి, సాత్విక్ సాయిరాజు- చిరాగ్ శెట్టి, అర్జున్- రామచంద్ర శ్లోక్; **మహిళల డబుల్స్:** సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప, సంజన- ఆర్తి, మేఘన- పూర్విష; **మిక్స్‌డ్ డబుల్స్:** ప్రణవ్- సిక్కిరెడ్డి, సుమీత్ రెడ్డి- అశ్విని పొన్నప్ప, సాత్విక్ సాయిరాజు- మనీషా

టోర్నీలో మన మెరుపులు

ప్రకాశ్ పదుకొనె	- కాంస్యం (1983)
జ్వాల, అశ్విని	- కాంస్యం (2011)
పి.వి.సింధు	- కాంస్యం (2013)
పి.వి.సింధు	- కాంస్యం (2014)
సైనా	- రజతం (2015)

విశేషాలు

- ఈ ఏడాది శ్రీకాంత్ వరుసగా రెండు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచాడు
- 2017లో భారత ఆటగాళ్లు ఆరు టైటిళ్లు సొంతం చేసుకున్నారు
- భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే అత్యధికంగా 21 మంది ఈసారి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బరిలో దిగుతున్నారు

సంచలనాల సాయిప్రణీత్



లీ చాంగ్ వీ (మలేసియా), తౌఫిక్ హిదాయత్ (ఇండోనేసియా)లను చిత్తుచేసిన భమిడిపాటి సాయిప్రణీత్ అందరి దృష్టిలో పడింది సింగపూర్ ఓపెన్ సూపర్ సిరీస్‌లోనే. ఫైనల్లో శ్రీకాంత్‌తో తలపడ్డ సాయి ప్రణీత్.. కెరీర్‌లో తొలి సూపర్ సిరీస్ టైటిల్ సాధించాడు. సింగపూర్ ఓపెన్ నెగ్గిన ఆరు వారాలకు థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ టైటిల్‌తో మెరిశాడు. మంచి ఫిట్‌నెస్‌తో ఉన్న సాయిప్రణీత్ నుంచి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సంచలనాలు ఆశించొచ్చు. తొలి రౌండ్లో వీ నాన్‌తో సాయిప్రణీత్ పోటీపడతాడు.

వయసు: 25, ర్యాంకు: 19
2017లో: ఆడిన మ్యాచ్‌లు 24, విజయాలు 19, ఓటములు 5

కుప్పకూల్చి.. దంచి కొట్టి..

భారత్ దెబ్బకు లంక బెంబేలు



ధావన్ 132 నాటౌట్

23 ధావన్ ఇన్నింగ్స్‌లో బౌండరీలు. అతను 20 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. లంక ఇన్నింగ్స్‌లో 20 బౌండరీలే (18 ఫోర్లు, 2 సిక్సర్లు) నమోదయ్యాయి.

- ఉతికారేసిన ధావన్, కోహ్లి
- సత్తా చాటిన బౌలర్లు
- తొలి వన్డే టీమ్‌ఇండియాదే

శ్రీలంక 13 ఓవర్ల వరకు వికెట్టే కోల్పోకుండా 73 పరుగులు చేసింది. ఓ దశలో స్కోరు 139/1. అలాంటి స్థితి నుంచి ఆ జట్టు కేవలం 77 పరుగుల వ్యవధిలో 9 వికెట్లు కోల్పోయింది. చివరికి 216 పరుగులే చేసింది. ఇటు భారత్ 23 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. కానీ తర్వాత ఒక్కటంటే ఒక్క వికెట్ కోల్పోకుండా పరుగుల వరద పారించింది. కేవలం ఒకే ఒక్క వికెట్‌తో 217 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేసింది. ఇదీ తొలి వన్డే సాగిన తీరు! తమ ఆట టెస్టు సిరీస్‌తో పోలిస్తే పూర్తి భిన్నంగా ఉండబోతోందనిపించేలా తొలి వన్డేను ఆరంభించిన లంక.. ఎంతోసేపు ఆ జోరును కొనసాగించలేకపోయింది. ఒకట్రెండు వికెట్లు పడేవరకు ఓపిగ్గా ఎదురు చూసిన భారత బౌలర్లు.. ఆ తర్వాత ముప్పేట దాడితో లంక బ్యాట్స్‌మెన్ పని పట్టారు. ఇక బ్యాటింగ్‌లో ధావన్, కోహ్లి అయితే లంకేయులపై అసలేమాత్రం దయ చూపలేదు. మొత్తంగా టెస్టుల్లో కన్నా గట్టిగా తొలి వన్డేలో లంకను దంచి కొట్టింది టీమ్‌ఇండియా.

దంబుల్లా

శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో తిరుగులేని ఆధిపత్యం చలాయించిన టీమ్‌ఇండియా.. ఐదు వన్డేల సిరీస్‌ను కూడా ఘనవిజయంతో ఆరంభించింది. ఆదివారం తొలి వన్డేలో ఆతిథ్య జట్టును 9 వికెట్ల తేడాతో చిత్తు చిత్తుగా ఓడించింది. టెస్టు సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో మెరుపు శతకం సాధించిన ఓపెనర్ శిఖర్ ధావన్.. వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లోనూ అదే తరహాలో రెచ్చిపోయాడు. ధావన్ (132 నాటౌట్; 90 బంతుల్లో 20×4, 3×6)తో పాటు కెప్టెన్ కోహ్లి (82 నాటౌట్; 70 బంతుల్లో 10×4, 1×6) కూడా రెచ్చిపోవడంతో 218 పరుగుల లక్ష్యాన్ని భారత్ 28.5 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. అంతకుముందు కేదార్ జాదవ్ (2/26), అక్షర్ పటేల్ (3/34), చాహల్ (2/60), బుమ్రా (2/22)ల ధాటికి లంక 43.2 ఓవర్లలో 216 పరుగులకే కుప్పకూలింది. టాప్-3 బ్యాట్స్‌మెన్ డిక్వెలా (64; 74 బంతుల్లో 8×4), గుణతిలక (35), కుశాల్ మెండిస్ (36) ఇన్నింగ్స్‌కు మంచి పునాది వేసినా.. లంక సద్వినియోగం చేసుకోలేకపోయింది. ధావన్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. రెండో వన్డే గురువారం జరుగుతుంది.



అక్షర్ పటేల్ (3/34)

బెంబేలెత్తించిన ధావన్: బ్యాటింగ్‌లో శుభారంభాన్ని వృథా చేసుకుని తక్కువ స్కోరుకు పరిమితమైన లంక.. బౌలింగ్‌లో మరింతగా నిరాశ పరిచింది. ఆయాచితంగా రోహిత్ వికెట్ లభించినప్పటికీ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. టెస్టు సిరీస్‌లో చెలరేగిన ధావన్.. వన్డేకొచ్చేసరికి మరింతగా చెలరేగిపోవడంతో లంక బౌలర్ల పరిస్థితి దయనీయంగా మారింది. కట్టు తప్పిన లంక బౌలింగ్‌ను అతను ఉతికారేశాడు. బౌండరీల మోత మోగిస్తూ 71 బంతుల్లోనే అలవోకగా శతకం బాదేశాడు. అతడిచ్చిన ఒకట్రెండు క్యాచ్‌లను కూడా లంకేయులు చేజార్చారు. లంకపై ధావన్‌కు వరుసగా ఇది 50+ స్కోరు కావడం విశేషం. కోహ్లి కూడా ధాటిగా ఆడటంతో చూస్తుండగానే లక్ష్యం కరిగిపోయింది.

ఆ రెండు స్వీప్‌లతో మలుపు..: అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన లంక తొలి పది ఓవర్లలో వికెట్టే కోల్పోకుండా 55 పరుగులు చేసింది. డిక్వెలా, గుణతిలక ఏ తడబాటూ లేకుండా బ్యాటింగ్ చేశారు. కొత్త బంతి బౌలర్లు భువనేశ్వర్, పాండ్యలను అలవోకగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా డిక్వెలా ప్రతి బంతినీ లెగ్ సైడ్ ఆడుతూ.. అటువైపే బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును నడిపించాడు. 13 ఓవర్లకు ఆ జట్టు స్కోరు 73/0. దీంతో స్కోరు 300 దాటడం ఖాయంగా కనిపించింది. కానీ.. రెండు స్వీప్ షాట్లు ఆ జట్టు రాతను మార్చేశాయి. ముందుగా గుణతిలక.. చాహల్ బౌలింగ్‌లో ఆడిన రివర్స్ స్వీప్ తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించింది. అతను రాహుల్ చేతికి దొరికిపోయాడు. ఆ తర్వాత డిక్వెలాకు జతకలిసిన కుశాల్ మెండిస్ ధాటిగా ఆడటంతో లంక ఇన్నింగ్స్ బాగానే సాగింది. ఐతే 25వ ఓవర్లో పార్ట్‌టైం స్పిన్నర్ కేదార్ జాదవ్ బంతికి స్వీప్ షాట్ ఆడబోయిన డిక్వెలా వికెట్ల ముందు దొరికిపోవడంతో ఇన్నింగ్స్ మలుపు తిరిగింది. 139/1తో ఉన్న లంక.. ఇంకో 77 పరుగులకే మిగతా 9 వికెట్లూ కోల్పోయింది. స్పిన్నర్లు చాహల్, జాదవ్, అక్షర్‌ల ముప్పేట దాడికి లంక బ్యాట్స్‌మెన్ నిలవలేకపోయారు. పేలవ షాట్లు కూడా వారిని దెబ్బ తీశాయి. కెప్టెన్ తరంగ (13).. జాదవ్ ఫుల్ టాస్ బంతిని గాల్లోకి లేపి ఔటవడం గమనార్హం. జట్టులో అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అనదగ్గ కుశాల్ మెండిస్ క్రీజులో ఉన్నంతసేపూ మంచి షాట్లే ఆడాడు. అతణ్ని అక్షర్ బౌల్డ్ చేశాడు. తర్వాత మాథ్యూస్ (36 నాటౌట్) ఓవైపు పోరాడుతున్నా.. అతడికి సహకరించేవారే కరవయ్యారు. అతణ్ని అటువైపే ఉంచి మిగతా వికెట్లను కూల్చేశారు భారత బౌలర్లు.

ఫ్చ్.. రోహిత్!

తొలి వన్డేలో భారత్ కోల్పోయిన ఏకైక వికెట్‌లోనూ లంకేయుల పాత్ర పరిమితం. రోహిత్ ఉదాసీనతకు దురదృష్టం కూడా తోడై అతను రనౌటయ్యాడు. పాయింట్‌లోకి బంతిని నెట్టి పరుగు కోసం ప్రయత్నించాడు రోహిత్. అతను బ్యాట్‌ను వదులుగా పట్టుకోవడంతో క్రీజుకు కొన్ని అంగుళాల దూరంలో అది చేజారింది. ఇంతలో కపుగెదెర డైరెక్ట్ త్రోతో వికెట్లను పడగొట్టాడు. బంతి వికెట్‌ను తాకే సమయానికి రోహిత్ పూర్తిగా క్రీజు లోపలే ఉన్నాడు. కానీ అతడి పాదం నేలను తాకేలోపే వికెట్లు లేచిపోయాయి.

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్వెలా ఎల్బీ (బి) జాదవ్ 64; గుణతిలక (సి) రాహుల్ (బి) చాహల్ 35; కుశాల్ (బి) అక్షర్ 36; తరంగ (సి) ధావన్ (బి) జాదవ్ 13; మాథ్యూస్ నాటౌట్ 36; కపుగెదెర రనౌట్ 1; హసరంగ (సి) జాదవ్ (బి) అక్షర్ 2; తిసార (బి) బుమ్రా 0; సందకాన్ ఎల్బీ (బి) అక్షర్ 5; మలింగ (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 8; ఫెర్నాండో (బి) బుమ్రా 0; ఎక్స్‌ట్రాలు 16 **మొత్తం:** (43.2 ఓవర్లలో ఆలౌట్) **216; వికెట్ల పతనం:** 1-74, 2-139, 3-150, 4-166, 5-169, 6-176, 7-178, 8-187, 9-209; **బౌలింగ్:** భువనేశ్వర్ 6-0-33-0; హార్దిక్ 6-0-35-0; బుమ్రా 6.2-0-22-2; చాహల్ 10-0-60-2; కేదార్ 5-0-26-2; అక్షర్ 10-0-34-3

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ రనౌట్ 4; ధావన్ నాటౌట్ 132; కోహ్లి నాటౌట్ 82; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (28.5 ఓవర్లలో ఒక వికెట్‌కు) **220; వికెట్ల పతనం:** 1-23; **బౌలింగ్:** మలింగ 8-0-52-0; ఫెర్నాండో 6-0-43-0; మాథ్యూస్ 2-0-9-0; తిసార 2-0-18-0; సందకాన్ 6-0-63-0; హసరంగ 4.5-0-35-0

భరద్వాజ్‌కు కాంస్యం



దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షాట్‌గన్ ప్రపంచకప్ డబుల్ ట్రాప్‌లో భారత షూటర్ శపథ్ భరద్వాజ్ కాంస్యం గెలుచుకున్నాడు. ఫైనల్లో 48 పాయింట్లు స్కోరు చేసిన 15 ఏళ్ల భరద్వాజ్.. జేమ్స్ డెడ్మన్ (బ్రిటన్), మికి లోనెన్ (ఫిన్లాండ్) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు. మనీషా కీర్-లక్షయ్ షెరాన్ జోడీ కూడా కాంస్యం గెలుచుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో భారత జంట 34-33తో సెవిన్ ఎడ్వర్డ్ లేయర్-ఎమ్మా లీ విలియమ్స్ (అమెరికా) జోడీపై విజయం సాధించింది.

ఇంగ్లాండ్ చేతిలో విండీస్ చిత్తు



లండన్: తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆతిథ్య ఇంగ్లాండ్ మూడు రోజుల్లోపే ముగిసిన తొలి టెస్టులో ఇన్నింగ్స్ 209 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకే కుప్పకూలిన విండీస్.. ఫాలో ఆన్‌లో మరింత దారుణంగా ఆడింది. బ్రాడ్ (3/34), అండర్సన్ (2/12), అలీ (2/54), రొలాండ్ జోన్స్ (2/18) ధాటికి 137 పరుగులకే కుప్పకూలింది. క్రెయిగ్ బ్రాత్వైట్ (40) టాప్ స్కోరర్. ఇంగ్లాండ్ 514/8 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. కుక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యం సంపాదించింది. రెండో టెస్టు ఈ నెల 25న హెడింగ్లేలో ఆరంభమవుతుంది.

విజేత రుత్విక శివాని

ఈనాడు, హైదరాబాద్: సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో రుత్విక శివాని (తెలంగాణ) విజేతగా నిలిచింది. ఆదివారం పుణెలో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రుత్విక 21-10, 21-13తో అనుర ప్రభుదేశాయ్ (గోవా)ను ఓడించింది.

సాక్షి సాధించేనా

నేటి నుంచి ప్రపంచ రెజ్లింగ్



పారిస్: ఒలింపిక్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్ మరో పోరాటానికి సిద్ధమైంది. సోమవారం పారిస్‌లో ఆరంభమయ్యే ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె బరిలో దిగనుంది. రియో ఒలింపిక్స్‌లో 58 కిలోల విభాగంలో కాంస్యం నెగ్గిన మలిక్ 60 కిలోల విభాగంలో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గాయం కారణంగా రియో ఒలింపిక్స్‌లో విఫలమైన వినేశ్ ఫొగాట్ ఈసారి ఎలాగైనా పతకం గెలవాలన్న పట్టుదలతో ఉంది. ఆసియా పురుషుల రెజ్లింగ్ ఛాంపియన్ భజ్‌రంగ్ పూనియా (65కిలోలు), సందీప్ తోమర్‌పై కూడా అంచనాలున్నాయి.

పట్నాపై పుణెరి విజయం



పట్నా-పుణెరి మ్యాచ్‌లో ఓ దృశ్యం

లఖ్‌నవూ: ప్రొ కబడ్డీ లీగ్‌లో ఆదివారం పుణెరి పల్టాన్ జట్టు 47-42తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. ప్రదీప్ నర్వాల్ 19 పాయింట్లు సాధించినా పట్నాను గెలిపించలేకపోయాడు. పుణెరి తరఫున రాజేశ్ మండల్ (10 పాయింట్లు) రాణించాడు. రైడర్లు చకచకా పాయింట్లు తేవడంతో విరామానికి పుణెరి 25-13తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. పట్నాకు భారీ ఓటమి ఖాయమనిపించింది. ఐతే రెండో అర్ధభాగంలో పుంజుకున్న పట్నా.. అంతరాన్ని తగ్గించింది. మరో మ్యాచ్‌లో జైపుర్ పింక్ పాంథర్స్ 24-22తో యూపీ యోధను ఓడించింది.

అటవీశాఖ ఆహ్వానం

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్ర అటవీశాఖలో భారీఎత్తున కొలువుల భర్తీ చేయబోతోంది. 1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 90 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, 67 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టులతో మొత్తం ఖాళీల సంఖ్య 2014. అటవీ శాఖలో చేరాలనుకునేవారికి ఇదో సువర్ణావకాశం. ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు లేనందువల్ల ఈ పోస్టుల రాత పరీక్షలన్నింటికీ పోటీ తీవ్రంగానే ఉంటుంది. దాదాపు ఒకే సిలబస్ ఉన్నందున మూడు రకాల ఉద్యోగాలకూ సంసిద్ధం కావొచ్చు!

ప్రపంచవ్యాప్తంగా నేడు ఎదుర్కొనే ప్రధాన సమస్య వాతావరణ కాలుష్యం. తరచుగా సంభవించే వరదలు, దాని ఫలితంగా జరిగే నేలల క్రమక్షయం, భూగర్భ జలాల కొరత, వర్షాల కొరత, వాతావరణ కాలుష్యం.. ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించడంలో అడవులది కీలకపాత్ర. కాబట్టి విచక్షణ రహితంగా అడవులను నరికివేయడాన్ని అరికట్టడంలో అటవీశాఖ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో కీలకపాత్ర వహిస్తారు. కనుమరుగవుతున్న వన్యప్రాణులను సంరక్షించే బాధ్యతనూ వీరు స్వీకరిస్తారు. కాబట్టి వీరిని మామూలు ఉద్యోగుల్లా కాకుండా సాహసంతో



ఎ.ఎం. రెడ్డి
డైరెక్టర్, కెరీర్ ఇన్‌స్టిట్యూట్

కూడుకున్నవారిగా భావించాలి. నిరక్షరాస్యులైన గిరిజన ప్రజలతో కలిసిమెలిసివుంటూ వారిని చైతన్యవంతులను చేయడంలో కూడా వీరికి పాత్ర. పరీక్ష సిలబస్‌లో ప్రత్యేకించి సామాజిక అవగాహనను కూడా పేర్కొన్నారు. ఆరకంగా ఈ కొలువుల్లో ఉద్యోగ భద్రతతోపాటు సంతృప్తి కూడా ఉంటుంది. కాలక్రమేణా పదోన్నతులు కూడా లభిస్తాయి.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

అత్యధిక సంఖ్యలో ఖాళీలున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల గురించి ముందుగా చూద్దాం. మొత్తం 1857 ఖాళీల్లో పురుషులకు 1230, మహిళలకు 627 పోస్టులను కేటాయించారు. మహిళా అభ్యర్థులకు ఇదో సువర్ణావకాశం. ఇవి జిల్లావారీగా నియమించే పోస్టులు. అంటే 80% ఉద్యోగాలను ఆయా జిల్లాలవారికే కేటాయించి, మిగిలిన 20% ఆ జిల్లాతోపాటు మిగిలిన అన్ని జిల్లాలవారికీ కేటాయిస్తారు.

విద్యార్హతలు- ఇంటర్/ తత్సమాన పరీక్ష. వయసు- 18-31 సంవత్సరాలు. రిజర్వేషన్ ఉన్నవారికి గరిష్ఠ వయః పరిమితి 36 సంవత్సరాలు. నిర్దిష్ట దేహదార్ఢ్యం ఉండాలి.

రాతపరీక్ష తర్వాత పురుషులు 25 కి.మీ., మహిళలు 16 కి.మీ. దూరాన్ని కాలినడకన 4 గంటల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ముందుగానే తమ శారీరక కొలతలను నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

అభ్యర్థుల తుది ఎంపిక రాతపరీక్ష, ఆపై నడక, మెడికల్ టెస్టులపై ఆధారపడి ఉంటుంది. రాతపరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి.

పేపర్-1 జనరల్ నాలెడ్జ్, పేపర్-2 సాధారణ గణితానికి సంబంధించినవి. ఒక్కో పేపర్ 100 ప్రశ్నలతో 100 మార్కులకు ఉంటుంది. ప్రశ్నలు బహుళైచ్ఛిక విధానంలో ఉంటాయి. 90 నిమిషాల పరిమిత సమయంలో 100 ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలను గుర్తించవలసి ఉంటుంది.

బీట్ ఆఫీసర్ పోస్టులకు కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ అయినప్పటికీ డిగ్రీ, పీజీ చదివినవారే ఎక్కువగా ఉంటారు. ఇంజినీరింగ్ అభ్యర్థులు కూడా పోటీ పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం- ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలకు పెరిగిన గిరాకీ, గణనీయంగా పెరిగిన జీతభత్యాలు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ల పరీక్షలకు ఒకే పరీక్ష పద్ధతి, ఒకే సిలబస్ ఉన్నాయి.

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు

90 పోస్టుల్లో 29 ఉద్యోగాలను మహిళలకు కేటాయించారు. అయితే మహిళలు మెరిట్‌లో వస్తే వారికి ఓపెన్‌లో కూడా అవకాశం ఉంటుంది. సైన్స్, ఇంజినీరింగ్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ మొదలైన సబ్జెక్టులుగా కలిగి ఉండి, డిగ్రీ ఉత్తీర్ణత పొందినవారు అర్హులు.

ఇది డిగ్రీ కనీస అర్హతగా ఉన్న పోస్టు అయినప్పటికీ పీజీ విద్యార్థులు కూడా పోటీపడే అవకాశం ఉంది. అటవీశాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగాన్ని ప్రారంభించినవారు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాసైతే త్వరితగతిన పదోన్నతులు పొందవచ్చు. కొద్దికాలంలోనే ఫారెస్ట్ రేంజ్, తర్వాత అసిస్టెంట్ కన్జర్వేటర్ స్థాయికి కూడా పదోన్నతి పొందే అవకాశం ఉంటుంది.

దేహదార్ఢ్యానికి సంబంధించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు నిర్దేశించిన ప్రమాణాలే (కొలతలు) ఈ పోస్టులకూ వర్తిస్తాయి. అలాగే రాతపరీక్ష, ఆపై నడక పరీక్ష ఉంటాయి. రాతపరీక్షలో రెండు పేపర్లు బహుళైచ్ఛిక ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. మొదటి పేపర్ జనరల్ నాలెడ్జ్, రెండో పేపర్ సాధారణ గణితం. ఒక్కో పేపర్‌లో 100 మార్కులకు 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు. ఒక్కో పేపర్‌ను 90 నిమిషాల్లో సాధించాల్సి ఉంటుంది.

బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్ల ఉద్యోగాలకు విద్యార్హతలు వేరైనప్పటికీ దేహదార్ఢ్య (ప్రమాణాలు, కొలతలు, నడక పరీక్ష) పరీక్షా విధానం, సిలబస్ ఒకటిగానే పేర్కొన్నారు. కాబట్టి ఈ రెండు పరీక్షలు రాసే అభ్యర్థులందరూ ఈ ఉమ్మడి సిలబస్‌పై పూర్తి అవగాహనతో ఉండాలి. ఈ పరీక్షలు అక్టోబరు 3, 4 వారాల్లో నిర్వహించవచ్చని పేర్కొన్నారు. సన్నద్ధతకు రెండు నెలలు మాత్రమే ఉండటంతో ఈ పరీక్షలోని రెండు పేపర్లపై వీలైనంత త్వరగా పట్టును సాధించటం అవసరం.

ఏ స్థాయి? ఏ విధంగా తయారవ్వాలి?

పేపర్-1: జనరల్ నాలెడ్జ్ (ఎస్ఎస్‌సీ స్టాండర్డ్)

ఈ పేపర్‌లోని 100 ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఉంటాయని పేర్కొన్నారు. నిజానికి కొన్ని అంశాలు అంతకంటే ఎక్కువ స్థాయిలో ఉంటాయి.

వర్తమాన విషయాలు: వీటి నుంచి దాదాపు 10-12 ప్రశ్నలు రావొచ్చు. జాతీయ, రాష్ట్ర స్థాయి దినపత్రికలను అనుసరించాలి. ఎక్కువ ప్రశ్నలు గత సంవత్సర కాలంగా జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ స్థాయుల్లో జరిగిన ముఖ్య సంఘటనలపై ఉంటాయి.

జనరల్ సైన్స్: ఈ విభాగంలో 8, 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాల్లోని శాస్త్ర సాంకేతిక అంశాలు చదవాలి. రోజువారీ పరిశీలన, అనుభవంలో ఉండే వివిధ అనువర్తనాలపై ప్రశ్నలుంటాయి.


పర్యావరణ సమస్యలు, విపత్తు నిర్వహణ: వీటికి సంబంధించి కూడా 8, 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాలు ఉపయోగకరం. జాతీయ, అంతర్జాతీయంగా ఇటీవల సంభవించిన విపత్తుల అధ్యయనం అవసరం. పార్లమెంట్ 2005లో రూపొందించిన విపత్తు నిర్వహణ చట్టంలోని ముఖ్యాంశాలు ముఖ్యమైనవి.

భౌగోళికాంశాలు: భారతదేశం, తెలంగాణలకు సంబంధించి 8, 9, 10 తరగతుల పాఠ్యాంశాలు చదవాలి. అదనంగా ఇటీవలి కాలంలో దేశంలోనూ, తెలంగాణలోనూ ప్రారంభించిన వివిధ నీటిపారుదల ప్రాజెక్టులపై అవగాహన పెంచుకోవాలి. ఈమధ్య కాలంలో ప్రారంభించిన భారీ పరిశ్రమల పరిజ్ఞానం అవసరం.

భారతదేశ ఆర్థికవ్యవస్థ: దేశ ఆర్థికవ్యవస్థ మౌలికాంశాలు, పంచవర్ష ప్రణాళికలను పాఠ్యపుస్తకాల్లో చదువుకోవాలి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, వాటి కేటాయింపులు, ప్రాధాన్యాలు, గత సంవత్సర ఆర్థిక వ్యవస్థ పనితీరుకు సంబంధించి ఆర్థిక సర్వేల సమగ్ర అధ్యయనం తప్పనిసరి. అదనంగా ఇటీవల ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్‌పై కూడా అవగాహన ఉండాలి.

భారత రాజ్యాంగం- రాజకీయ వ్యవస్థ: రాజ్యాంగంలోని ముఖ్యాంశాలు, పాఠ్యపుస్తకాలను చదువుకుంటూ ఇటీవలి పరిణామాలను ప్రత్యేకించి గమనించాలి. ఉదాహరణకు- ఇటీవల జరిగిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు. ముఖ్యంగా రాజ్యాంగ విశిష్ట లక్షణాలు- సమాఖ్య, ఏక కేంద్ర లక్షణాలపై కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై దృష్టిసారించాలి. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి రాష్ట్ర విధాన సభ, విధాన పరిషత్‌ల వివరాలను తెలుసుకోవాలి.

భారతదేశ చరిత్ర-స్వాతంత్రోద్యమం: వీటికి పదో తరగతి స్థాయిలోపు పాఠ్యపుస్తకాలు సరిపోతాయి. ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక భారతదేశ చరిత్రలను క్రమపద్ధతిలో చదవాల్సి ఉంటుంది. ముక్కలు ముక్కలుగా చదవడం లాభించదు. అయితే ఎక్కువగా స్వాతంత్రోద్యమంపై దృష్టిసారించాలి.



తెలంగాణ చరిత్రను శాతవాహనుల కాలం నుంచి హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనమయ్యేవరకు అధ్యయనం చేయాలి. శాతవాహనులు, విష్ణుకుండినులు, రాష్ట్రకూటులు, ముదిగొండ చాళుక్యులు, కాకతీయులు, రాచకొండ, దేవరకొండ, రాజ్యాలు ఆ తర్వాత గోల్కొండ, అసఫ్‌జాహీల చరిత్రకు సంబంధించిన ముఖ్యాంశాలు చదవాల్సి ఉంటుంది. తెలంగాణ ఉద్యమానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి.

తెలంగాణ సమాజం-సంస్కృతి, వారసత్వం, కళలు మొదలైనవాటిపై పాఠ్యపుస్తకాలను ఆరోతరగతి నుంచి చూసుకోవాలి. తెలంగాణ పండుగలు, జాతరలు, వంటలు, దేవాలయాలు, గ్రామీణ ప్రాంతాల వాడుక పదజాలం మొదలైనవి ముఖ్యం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు

రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తున్న పథకాలన్నింటిపై పూర్తి అవగాహన అవసరం. వీటి సమాచారాన్ని రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటి, స్వాతంత్ర్యదినోత్సవం నాటి ప్రముఖ దినపత్రికల్లో చూడవచ్చు. మొదటిసారిగా ప్రవేశపెట్టిన నైతిక విలువలు, మహిళలు, దళితుల పట్ల ఆదరాభిమానాలు, సమాజంపై అవగాహన ప్రధానమైనవి. ఎక్కువ ప్రశ్నలు నిత్యజీవితంలోని అనుభవాలపై ఉంటాయని గమనించాలి. సమాజంలోని కులవ్యవస్థ, మత వ్యవస్థ, దళితుల సమస్యలు, మహిళా సమస్యలు మొదలైనవాటిపై అవగాహన తప్పనిసరి.

ఈ రెండు పరీక్షల్లో రెండో పేపర్ సామాన్య గణితానికి సంబంధించింది. ఇందులోని ప్రశ్నలన్నీ పదో తరగతి స్థాయిలో ఉంటాయి. కాబట్టి ఈ పేపర్‌లో నిర్దేశించిన సిలబస్ అంశాలన్నింటినీ 8, 9, 10 తరగతుల పాఠ్య పుస్తకాల్లో చదివి అవగాహనను తెచ్చుకోవాలి. సాధ్యమైనంత ఎక్కువ ప్రశ్నలను సాధన చేయాలి. సాధన చేసేటపుడు షార్ట్‌కట్ పద్ధతి మెలకువలను తెలుసుకోవాలి. లేకపోతే సమయం సరిపోదు. కేవలం 90 నిమిషాల్లో 100 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలని మర్చిపోకూడదు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు

ఈ మూడు పోస్టుల సిలబస్ దాదాపుగా ఒకటే అయినందువల్ల (ఎఫ్ఆర్ఓ ఐచ్ఛిక సబ్జెక్టు మినహాయించి) అభ్యర్థులు అన్ని పోస్టులకూ పోటీ పడవచ్చు. ప్రణాళికబద్ధంగా చదివి ప్రతిభ చూపితే ఉన్నత ఉద్యోగమైన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టునే సొంతం చేసుకోవచ్చు. అనుభవజ్ఞులైన నిపుణుల మార్గదర్శకత్వంలో ఏ సబ్జెక్టును ఏవిధంగా ఎంతవరకూ చదవాలో తెలుసుకుంటే మేలు!

అటవీ ఉద్యోగాల్లో ఎగువస్థాయి (హయ్యర్ కేడర్) ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పోస్టులదే. మొత్తం 67 ఖాళీల్లో మహిళలకు కేటాయించినవి 20, పురుషులకు 47. రాష్ట్ర స్థాయిలో వీటిని ఉన్నత ఉద్యోగులుగా పరిగణించవచ్చు. అటవీ శాఖలో ఈ రేంజ్ అధికారులు కీలకపాత్ర వహిస్తారు. వీరు తమ పై అధికారులు, కింది అధికారులకు మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు. ఉద్యోగంలో చేరాక డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాసై అంచెలంచెలుగా పదోన్నతులు పొందవచ్చు. ముందుగా అసిస్టెంట్ కన్జర్వేటర్, తర్వాత డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, ఆపై ఫారెస్ట్ కన్జర్వేటర్ పదవి వరకు చేరవచ్చు. ఈ విధంగా వారు అఖిలభారత సర్వీస్ అయిన ఐఎఫ్ఎస్ స్థాయికి చేరుకోవచ్చు.

ఈ ఉద్యోగాలకు కనీస విద్యార్హత సైన్స్, ఇంజినీరింగ్, మేథమేటిక్స్, అగ్రికల్చర్, వెటర్నరీ సైన్స్‌ల్లో ఏదో ఒకదానిలో పట్టభద్రత. వయసు 18-28 సంవత్సరాలు. రిజర్వేషన్ ఉన్నవారికి మరో 5 సంవత్సరాల సడలింపు ఉంటుంది. నిర్దిష్ట దేహదార్ఢ్యం ఉండాలి.

ఈ ఉద్యోగాల నియామకం రెండు రకాల పరీక్షలపై ఆధారపడి ఉంటుంది. అదనంగా నడక పరీక్ష, ఇంటర్వ్యూ.

అర్హత పరీక్ష: దీనిలో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది జనరల్ ఇంగ్లిష్, రెండోది సామాన్య గణితానికి సంబంధించింది. ఒక్కో పేపర్‌లో 100 మార్కులకుగానూ 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో పేపర్‌ను 100 నిమిషాల్లో సాధించవలసి ఉంటుంది. ఈ రెండు పేపర్లలో 40% మార్కులను సాధించి అర్హత పొందవలసి ఉంటుంది. ఈ మార్కులను తుది ఎంపికలో పరిగణించరు. .

రెండో పరీక్ష 500 మార్కులకు. 450 మార్కులు రాతపరీక్షకు కేటాయించగా 50 మార్కులకు ఇంటర్వ్యూ. ఈ రాతపరీక్షలో 2 పేపర్లుంటాయి. మొదటి పేపర్ జనరల్‌స్టడీస్‌కు, రెండోది ఏదైనా ఒక ఐచ్ఛిక సబ్జెక్టుకు సంబంధించినది. అభ్యర్థులు మొత్తం 21 సబ్జెక్టుల్లో ఏదేని ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

పేపర్-1: జనరల్ స్టడీస్: ఇందులో మొత్తం 11 అంశాలను పేర్కొన్నారు. 150 మార్కులకు 150 ప్రశ్నలుంటాయి. వీటిని 150 నిమిషాల్లో అంటే రెండున్నర గంటల్లో సాధించాల్సి ఉంటుంది.

పేపర్-2: ఐచ్ఛిక సబ్జెక్టుకు సంబంధించింది. 300 మార్కులకు 150 ప్రశ్నలు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు. అభ్యర్థుల తుది ఎంపికలో ఈ పేపర్‌దే కీలకపాత్ర. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు తమకు ఇష్టమైన, పట్టున్న సబ్జెక్టును ఎంచుకోవాల్సి ఉంటుంది.

చివరగా ఇంటర్వ్యూ. దీనికి కేటాయించిన మార్కులు 50. కాబట్టి అభ్యర్థుల తుది ఎంపిక ముఖ్యంగా రెండో పరీక్షలోని రెండు పేపర్లపై ఆధారపడి ఉంటుంది. పరీక్ష సన్నద్ధతకు ఎక్కువ సమయం లేనందున ఇప్పటినుంచే తగిన ప్రణాళికను రూపొందించుకోవాలి. ముఖ్యాంశాలను ప్రాధాన్యక్రమంలో అధ్యయనం చేస్తూ వీలైనన్ని మాదిరి ప్రశ్నపత్రాలను సాధించటం మేలు.



ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ అధికారుల పోస్టుల భర్తీ కోసం ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 9 బ్యాంకుల్లో మొత్తం 3562 పోస్టులను ప్రకటించారు. డిగ్రీ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ ప్రకటనలో గమనించాల్సిన ప్రధాన విషయం- మెయిన్స్ పరీక్షలో సమూల మార్పు. గత సంవత్సరం నిర్వహించిన మెయిన్స్‌కు పూర్తి భిన్నంగా ఈ ఏడాది నిర్వహించబోయే పరీక్ష ఉంది. ఎస్‌బీఐ పీఓ మెయిన్స్ పరీక్ష తరహాలోనే ఈ పరీక్షనూ నిర్వహిస్తారు. ఈ పోస్టులకు ఎంపికవ్వటానికి ఏ తీరులో కృషి చేయాలో తెలుసుకుందాం!

9 బ్యాంకులు: 3562 పీఓ పోస్టులు

ఉద్యోగ వ్యూహం

రెండంచెల రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా పీఓ అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. మొదటి అంచెలో నిర్వహించే ప్రిలిమినరీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు రెండో అంచెలోని మెయిన్స్‌కు అర్హత సాధిస్తారు. దీనిలో ఉత్తీర్ణులైన నిర్ణీత అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.



డా. జీఎస్. గిరిధర్
డైరెక్టర్, RACE



పరీక్షా విధానం

ప్రిలిమినరీలో మూడు విభాగాలుంటాయి. 100 ప్రశ్నలతో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. కేటాయించిన మొత్తం సమయం 60 నిమిషాలు.

మెయిన్స్‌లో మొత్తం అయిదు సబ్జెక్టులతో నాలుగు విభాగాలుంటాయి. విభాగాల వారీగా సమయాన్ని కేటాయించారు. మొత్తం 3 గంటలు. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో డిస్క్రిప్టివ్ పేపర్‌కు అదనంగా 30 నిమిషాల వ్యవధి. అంటే మెయిన్స్ మొత్తానికి కేటాయించిన సమయం 3.30 గంటలు. అభ్యర్థులు ఈ విభాగాలన్నింటిలో విడివిడిగా ఉత్తీర్ణులవ్వాలి. ప్రతి తప్పు సమాధానానికీ ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో నాలుగోవంతు కోత (రుణాత్మక మార్కు) విధిస్తారు.

ఉమ్మడి సబ్జెక్టులు

ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలు రెండింటిలోనూ కొన్ని సబ్జెక్టులు ఉమ్మడిగా ఉన్నాయి. ప్రిలిమినరీలో ఉన్న రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజీలు మెయిన్స్‌లో ఉన్నాయి. మెయిన్స్‌లో ఉన్న డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ చేయడానికి అరిథ్‌మెటిక్ అంశాలు, సింప్లిఫికేషన్స్ అవసరమవుతాయి. అవి ప్రిలిమినరీ పరీక్షలో ఉన్న క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగంలో ఉంటాయి. అందువల్ల వాటిని కూడా ఉమ్మడి సబ్జెక్టుగానే పరిగణించాలి. కాబట్టి ప్రిలిమినరీలో ఉన్న సబ్జెక్టులన్నీ మెయిన్స్‌లోనూ ఉన్నట్లే.

మెయిన్స్ పరీక్షలో ఆయా విభాగాలను నిర్ణీత వ్యవధిలోనే పూర్తిచేయాల్సి ఉంటుంది. డేటా ఇంటర్‌ప్రిటేషన్, రీజనింగ్‌లకు ఎక్కువ సమయం అవసరమవుతుంది. ఎవరు ఎక్కువ ప్రశ్నలు సాధించగలుగుతారో వారికే విజయావకాశాలు ఎక్కువ.

సబ్జెక్టులు- ప్రశ్నల సరళి

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్/ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ప్రిలిమినరీలోని క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లోని ప్రశ్నలు, సింప్లిఫికేషన్స్, నంబర్ సిరీస్, డేటా సఫిషియన్సీ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వివిధ అరిథ్‌మెటిక్ అంశాల నుంచి వస్తాయి. మెయిన్స్‌లోని డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లోని ప్రశ్నలు, పట్టికలు, లైన్‌గ్రాఫ్‌లు, బార్ డయాగ్రమ్‌లు, పైచార్టులు, కేస్‌లెట్స్ నుంచి ఎక్కువగా ఉంటాయి. డేటా ఇంటర్‌ప్రిటేషన్ ప్రశ్నలను సాధించడానికి పర్సంటేజీ, యావరేజ్, రేషియో- ప్రపోర్షన్, కాల్క్యులేషన్స్‌పై పట్టు ఉండాలి. అంతర సంబంధం ఉన్న రెండు లేదా అంతకన్నా ఎక్కువ గ్రాఫ్‌లను ఇచ్చినపుడు సమాచారాన్ని పట్టిక రూపంలోకి మార్చుకుంటే ప్రశ్నలను త్వరగా సాధించవచ్చు.

రీజనింగ్: మెయిన్స్ పరీక్షలోని ప్రశ్నలు హెచ్చు స్థాయిలో ఉంటాయి. అనలిటికల్ రీజనింగ్/ క్రిటికల్ రీజనింగ్ నుంచి ఎక్కువ ప్రశ్నలు ఉంటాయి. సీటింగ్ అరేంజ్‌మెంట్‌లో ప్రశ్నల సంక్లిష్టతతో పాటు ప్రశ్నల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు రెండింటిలో ఈ అంశం నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, వెన్ డయాగ్రమ్, సిలాజిజమ్, ఇన్‌పుట్- అవుట్‌పుట్, ఎలిజిబిలిటీ టెస్ట్, పజిల్ టెస్ట్, స్టేట్‌మెంట్ సంబంధ ప్రశ్నలు ఉంటాయి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్: చాలా ముఖ్యమైన, ఎక్కువమంది విఫలమవుతున్న విభాగమిది. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటితోపాటు మెయిన్స్ పరీక్షలో అదనంగా డిస్క్రిప్టివ్ టెస్ట్‌లోనూ ఈ సబ్జెక్టు ఉంది. గ్రామర్ బాగా చూసుకోవాలి. డిస్క్రిప్టివ్ టెస్ట్‌లోని ఎస్సే, లెటర్ రైటింగ్‌లను బాగా సాధన చేయాలి.

సందేహాలు- జవాబులు

గత సంవత్సరాలతో పోలిస్తే చాలా తక్కువ సంఖ్యలో పోస్టులున్నాయి. ఇదే సంఖ్యలో అంతిమంగా భర్తీ చేస్తారా?

జ: ఐబీపీఎస్ ద్వారా 20 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పోస్టులను భర్తీ చేస్తారు. పీఓ ప్రకటన విడుదలయ్యే సమయానికి కేవలం తొమ్మిది బ్యాంకులనుంచే ఖాళీల వివరాలు వెలువడ్డాయి. మిగిలిన 11 బ్యాంకుల్లో కూడా ఖాళీలు ఉండబోతున్నాయి కాబట్టి తుది ఫలితాలు వెలువడే సమయానికి ఈ సంఖ్య మరింత పెరగవచ్చు. గతంలో జరిగిన నియామక ప్రక్రియల ద్వారా ఏటా దాదాపుగా 25000 వరకు ప్రొబేషనరీ ఆఫీసర్ల భర్తీ జరుగుతున్నందువల్ల దాదాపు అదే సంఖ్యలో ఈ ఏడాది కూడా భర్తీ జరిగే అవకాశం ఉంది.

ఐబీపీఎస్ పీఓ పరీక్షను ఎస్‌బీఐ పీఓ మాదిరిగానే నిర్వహిస్తున్నారు కాబట్టి, పరీక్ష సంక్లిష్టత కూడా హెచ్చుస్థాయిలో ఉంటుందా?

జ: తప్పకుండా. పీఓ పరీక్షకు ప్రతి సంవత్సరం పోటీ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పరీక్ష సంక్లిష్టత కూడా ఎక్కువగా, ఎస్‌బీఐ పీఓ పరీక్ష స్థాయిలోనే ఉండే అవకాశం ఉంది.

ఎస్‌బీఐ పీఓ పరీక్షలో ప్రతిసారి నూతన తరహా ప్రశ్నలు వస్తుంటాయి. ఐబీపీఎస్ పీఓ పరీక్షలో కూడా అదే తరహాలో ప్రశ్నలుంటాయా?

జ: సాధారణంగా ఎస్‌బీఐ పీఓ పరీక్షలో మాత్రమే కొత్త తరహా ప్రశ్నలు ఉంటుంటాయి. అదే మాదిరి ప్రశ్నలు ఐబీపీఎస్‌లో ఆ తర్వాత వస్తుంటాయి. కాబట్టి ఈ పరీక్షలో నూతన తరహా ప్రశ్నలు ఉండకపోవచ్చు.

ప్రిలిమినరీకి 45 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. మొదటిసారి పరీక్ష రాస్తున్నవారికి ఈ సమయం సరిపోతుందా?

జ: ప్రిలిమినరీలో కేవలం మూడు సబ్జెక్టులే ఉన్నాయి. కాబట్టి ఆ సమయానికి ఆ మూడింటినీ తేలికగానే పూర్తి చేయవచ్చు. ఆ తర్వాత సమయంలో మెయిన్స్ పరీక్షలో ఉన్న ఇతర సబ్జెక్టులు సన్నద్ధమవ్వొచ్చు.

రోజుకు ఎన్ని గంటలు కేటాయించాలి?

జ: ఎన్ని గంటలు కేటాయించారనేది కాకుండా ఎంత బాగా సన్నద్ధమయ్యారనేది ముఖ్యం. రోజుకు కనీసం 8-10 గంటల సమయం కేటాయిస్తూ ఆ సమయంలో అన్ని సబ్జెక్టులు పూర్తయ్యేలా చూసుకోవాలి. అభ్యర్థులకు వీలైతే ఇంకా ఎక్కువ సమయం కూడా కేటాయించుకోవచ్చు.

దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసినవారికి పరీక్ష రాసే అవకాశం ఉందా?

జ: రెగ్యులర్/ దూరవిద్య డిగ్రీ పూర్తిచేసిన ఎవరికైనా ఈ పరీక్ష రాసే అవకాశం ఉంది.



జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్: మెయిన్స్‌లో మాత్రమే ఉన్న ఈ విభాగంలో దాదాపు 80% ప్రశ్నలు పరీక్ష సమయానికి 5, 6 నెలల ముందు వరకు ఉన్న కరెంట్ అఫైర్స్ నుంచి ఉంటాయి. బ్యాంకింగ్, ఆర్థిక సంబంధ విషయాలపైనే ప్రశ్నలు ఎక్కువ. భారత ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు, కేంద్రప్రభుత్వ పథకాలు, ఆర్‌బీఐ, స్టాక్ మార్కెట్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ విషయాలు మొదలైనవాటి నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి. విషయాలన్నింటినీ క్షుణ్ణంగా తెలుసుకోవాలి, కేవలం ప్రశ్నకు జవాబు అన్న రీతిలో కాకుండా పరిణామాలను విశ్లేషించేలా సన్నద్ధత ఉండాలి.

కంప్యూటర్ నాలెడ్జ్: ఇది మెయిన్స్‌లో రీజనింగ్‌తో కలిపి ఉన్న సబ్జెక్టు. జనరేషన్స్ ఆఫ్ కంప్యూటర్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్, వైరస్-యాంటీ వైరస్, నెట్‌వర్కింగ్, డీబీఎంఎస్, ఈ రంగంలోని తాజా పరిణామాలు మొదలైనవి బాగా చూసుకోవాలి.

సరైన ప్రణాళిక, సాధన

అభ్యర్థులు ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు రెండింటికీ కలిపి సన్నద్ధత ప్రారంభించాలి. మెయిన్స్‌కు సన్నద్ధమైతే ప్రిలిమ్స్ కూడా పూర్తవుతుంది. ప్రిలిమ్స్ జరిగే సమయానికే ఈ సన్నద్ధత పూర్తయ్యేలా చూసుకోవాలి. తదనుగుణంగా ప్రణాళిక వేసుకోవాలి. మొదటిసారి పరీక్ష రాస్తున్నవారు ముందుగా సబ్జెక్టులన్నింటిలోని అంశాల ప్రాథమిక భావనలు బాగా తెలుసుకోవాలి. వాటిపై వివిధ రకాల ప్రశ్నలను సాధన చేయాలి. తర్వాత పరీక్షలో ఉన్న ప్రకారం సమయాన్ని నిర్దేశించుకుని వివిధ మాదిరి ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

మెయిన్స్‌తో పోలిస్తే ప్రిలిమినరీకి చాలా తక్కువ సమయం ఉంటుంది. 60 నిమిషాల్లో 100 ప్రశ్నలు పూర్తిచేయాలి. అంటే సగటున ఒక ప్రశ్నను సాధించడానికి 36 సెకన్ల వ్యవధి మాత్రమే ఉంటుంది. అన్ని విభాగాల్లో విడివిడిగా ఉత్తీర్ణులవ్వాల్సి ఉంటుంది. కాబట్టి ప్రతి విభాగంలో కనీస సంఖ్యలో ప్రశ్నలను సాధించాలి. అందువల్ల మొత్తం సమయాన్ని విభాగాలవారీగా విభజించుకుని ఆ సమయానికే కట్టుబడి ఉండాలి. దీని ప్రకారం ఇంగ్లిష్‌కు 15 నిమిషాలు, రీజనింగ్‌కు 20, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు 25 నిమిషాల చొప్పున సమయాన్ని నిర్దేశించుకుంటే ఉపయోగకరం.

ఐబీపీఎస్ పీఓ పరీక్ష విధానం

ప్రిలిమినరీ

పేపర్	ప్రశ్నలు	మార్కులు	వ్యవధి
ఇంగ్లిష్ లాంగ్వేజ్	30	30	గంట
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	35	35	
రీజనింగ్ ఎబిలిటీ	35	35	
మొత్తం	100	100	

మెయిన్

పేపర్	ప్రశ్నలు	మార్కులు	సమయం
రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్	45	60	60 ని॥లు
డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్	35	60	45 ని॥లు
జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్	40	40	35 ని॥లు
ఇంగ్లిష్ లాంగ్వేజ్	35	40	40 ని॥లు
మొత్తం	155	200	3 గంటలు
ఇంగ్లిష్ లాంగ్వేజ్ (లెటర్ రైటింగ్, ఎస్సే)	2	25	30 ని॥లు



డి. శ్రీరంజన్

కలల ఉద్యోగానికి మెలకువలు

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో ఎక్కువ మార్కులు సాధించాలంటే స్పీడ్ కాల్క్యులేషన్స్ ఉండాలి. పూర్వ ప్రశ్నపత్రాలను సాధన చేయటం మేలు చేస్తుంది. రీజనింగ్‌లో కోడింగ్-డీ కోడింగ్, పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్, ఇన్‌పుట్- అవుట్‌పుట్, స్టేట్‌మెంట్- అసంప్షన్స్/ కోర్స్ ఆఫ్ యాక్షన్ అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి. జనరల్ అవేర్‌నెస్ కోసం సమకాలీన పరిణామాలపై అవగాహన ఉండాలి. ఎకానమీ విభాగానికి సంబంధించి కేంద్ర బడ్జెట్, వృద్ధిరేటు (జీడీపీ), ఎకానమీ సర్వే, స్టాక్ మార్కెట్ సూచికలు, సెబీ, ఆర్థిక రంగానికి సంబంధించిన సూచికలు ముఖ్యం. బ్యాంకింగ్ అవేర్‌నెస్‌లో బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన ముఖ్య నివేదికలు, నియామకాలు, కొత్త బ్యాంకులు, డిజిటల్ బ్యాంకింగ్ అంశాలను అధ్యయనం చేయాలి. ఇంగ్లిష్ విభాగం చాలా ముఖ్యమైనది. గ్రామర్‌పై పట్టు పెంచుకోవాలి. ఆంగ్ల దినపత్రికను ప్రతిరోజూ చదవటం చాలా ప్రయోజనకరం. సాధ్యమైనన్ని ప్రాక్టీస్ పేపర్లు సాధన చేయాలి. తమ కలల బ్యాంకు ఉద్యోగం సంపాదించటానికి అభ్యర్థులు వర్తమాన అంశాలపై అవగాహన పెంచుకోవటం చాలా అవసరమని గుర్తుంచుకోవాలి.

కష్టం కాదు కృషి చేయాలంతే!



సీఏ కోర్సు పట్ల పెంచుకున్న భయాలతో కొంతమంది దీనిలో చేరడానికి సంకోచిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణ కుటుంబానికి చెందిన ఒక పల్లెటూరి కుర్రాడు సీఏ- సీపీటీ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో ఉత్తమశ్రేణిలో నిలవడం నిజంగా ఘనత అని చెప్పవచ్చు. సంకల్పం బలంగా ఉంటే సాధించలేనిది ఉండదని నిరూపించాడీ టాపర్.. నల్లాని సాయికృష్ణ. తన సన్నద్ధత తీరు అతడి మాటల్లోనే...

పదోతరగతి: 9.7 జీపీఏ
ఇంటర్: 967 మార్కులు
సీఏ–సీపీటీ: 197 మార్కులు

మాది కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలంలోని బండిపాలెం. మా నాన్న రుక్మాంగధరావు వ్యవసాయం చేస్తుంటారు. అమ్మ సీతామహాలక్ష్మి గృహిణి. మాది సాధారణ రైతు కుటుంబం. నేను మంచి ఉద్యోగం చేస్తూ జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలన్నది మా నాన్న కల. అందుకే వీలైనంత త్వరగా జీవితంలో స్థిరపడి అమ్మానాన్నలకు చేయూతను ఇవ్వాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నా. పదో తరగతిలో ఉన్నపుడు నందిగామలోని మా పాఠశాల... కాకతీయ అపోలో ఇన్‌స్టిట్యూట్లో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమం ద్వారా సీఏ గురించీ, దీన్ని చేసినవారికి ఉండే ఉపాధి అవకాశాల గురించీ తెలిసింది. అవి నాకు నచ్చాయి; స్ఫూర్తినిచ్చాయి. ఆ క్షణమే సీఏ చదవాలని నిర్ణయించుకున్నాను.

తరువాతి ప్రేరణ- మాకు తెలిసిన వాళ్ల అమ్మాయి.. మా అక్క ధనలక్ష్మి. తను పల్లెటూరు నుంచి వచ్చి సీఏ కోర్సు పూర్తి చేసింది. ఆమెలాగే వీలైనంత త్వరగా సీఏ పూర్తిచేసి జీవితంలో స్థిరపడాలనీ, మంచి సీఏగా రాణించాలనీ స్థిరంగా అనుకున్నాను.

పదో తరగతిలో 9.7 గ్రేడు పాయింట్లు సాధించాను. మా నాన్న నన్ను ఎంఈసీ, సీఏ చదవడానికి మాస్టర్‌మైండ్స్ శిక్షణ సంస్థలో చేర్పించారు. ఇంటర్ ఎంఈసీ, సీఏ-సీపీటీ కోర్సులను ఏకకాలంలో చదివాను. సాయి బ్రహ్మతేజ అనే మా సీనియర్ విద్యార్థి సీఏ-సీపీటీలో 194 మార్కులతో అఖిలభారత స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈ మార్కులను అధిగమించాలని లక్ష్యం పెట్టుకున్నాను. ఆ దిశగా సన్నద్ధత ప్రారంభించాను. ఇంటర్ ఎంఈసీలో 967 మార్కులు తెచ్చుకున్నా. వెంటనే జరిగిన సీఏ-సీపీటీ పరీక్షలో 200 కు 197 మార్కులు సాధించగలిగాను. ఆ రకంగా అఖిలభారత స్థాయిలో టాపర్‌గా నిలిచినందుకు అమ్మానాన్నలు ఎంతగానో సంతోషించారు.

సీఏ కోర్సు అందరూ అనుకునేంత కష్టమైనది కాదని నా అభిప్రాయం. సీఏ-సీపీటీ చదువుతున్నప్పుడు ఏరోజూ కూడా కష్టం అనిపించలేదు. అలాగే నా సీనియర్లు ఐపీసీసీ, సీఏ ఫైనల్ పూర్తి చేసినవారు కూడా ప్రణాళిక ప్రకారం క్రమశిక్షణతో చదివితే సీఏ ఐపీసీసీ, సీఏ ఫైనల్ కూడా కష్టమేం కావని చెప్పారు. చెప్పడమే కాదు.. తమ ఫలితాల ద్వారా నిరూపించారు. కావలసిందల్లా.. దృఢ సంకల్పం, కష్టపడే తత్వం. అంతే!

పునశ్చరణ అవసరం: ఇన్నాళ్లూ చదివిన పుస్తకాలు, సీపీటీకి సంబంధించిన మెటీరియళ్లనే మళ్లీ మళ్లీ చదవడం మేలు. కొత్త వాటి జోలికి పోకూడదు. ఎందుకంటే కొత్తవాటిని చదివితే తికమకకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఐసీఏఐ వారి మెటీరియలే ప్రామాణికం. సీపీటీలోని అకౌంట్స్, ఎం.లా సబ్జెక్టులు చాలా ముఖ్యమైనవి. సీపీటీ మొదటి ప్రయత్నంలోనే నెగ్గాలంటే ఈ రెండు సబ్జెక్టులపై పట్టుండాలి. సన్నద్ధతలో వీటికి సింహభాగం కేటాయించడం మేలు. రోజూ 10-12 గంటలపాటు సన్నద్ధతకు కేటాయించండి. దీంతో ఆత్మస్థైర్యం కూడా ఏర్పడుతుంది.

ఏ సబ్జెక్టు? ఎలా?

అకౌంట్స్‌లోని ఏ అంశాన్నీ బట్టీ పట్టకూడదు. ప్రతి అంశం పట్ల తార్కిక ఆలోచనా దృక్పథాన్ని అలవరచుకోవాలి.

'ఎం-లా'లో సబ్జెక్టు పరంగా వివాదాస్పద అంశాలు ఎక్కువ కాబట్టి, చదువుతున్న పుస్తకం తప్ప వేరే మెటీరియల్ కానీ, పుస్తకాన్ని కానీ పరీక్షల ముందు చదవవద్దు. సీపీటీ పరిధిలో సెక్షన్ సంఖ్యలు, కేస్ స్టడీస్, రచయితల పేర్లు, నిర్వచనాలను గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. గుర్తు పెట్టుకోగలిగితే సరే కానీ తప్పనిసరి కాదు.

ఎకనామిక్స్‌లోని మాక్రో ఎకనామిక్స్‌లో ఫాక్ట్స్, ఫిగర్స్ (సంవత్సరాలు, శాతాలకు సంబంధించిన డేటా) చాలా ముఖ్యం.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో ముఖ్యంగా మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌లో.. ఫార్ములాలు ముఖ్యమని గుర్తుంచుకోవాలి. పునశ్చరణ చేసుకునే అంశాలు/ సంబంధిత ఫార్ములాలను వేరొక పేపర్‌లో రాసుకుంటూ ప్రతిరోజూ ఒకసారి తర్ఫీదు పొందుతూ వెళ్లాలి. అప్పుడే తుది పరీక్షలో బాగా రాయగలుగుతారు. పోటీపరీక్షల్లో నిడివిగా ఉన్న లెక్కలను మొదట చేయడానికి ప్రయత్నించకూడదు. తెలిసినప్పటికీ ఆ ప్రశ్నలు మూడు సబ్జెక్టులు పూర్తి చేసుకున్న తర్వాతే ఆలోచించాలి.

సీఆర్ఎం టెలికాలింగ్‌లో..

తాజా ఇంటర్న్‌షిప్‌లు

1. గ్రాఫిక్ డిజైన్
సంస్థ: Nuovosports
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 8000
internshala.com/ i/5181
గడువు: ఆగస్టు 30, 2017
అర్హత: అడోబ్ ఫొటోషాప్, కోరెల్‌డ్రా, అడోబ్ ఇలస్ట్రేటర్

2. కాడ్ డిజైన్
సంస్థ: ReyKu Tech
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 5000
internshala.com/ i/5182
గడువు: ఆగస్టు 30, 2017
అర్హత: ఆటోకాడ్ నైపుణ్యాలు

3. డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: లెర్నిన్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 5000- రూ. 10,000
internshala.com/ i/5183
గడువు: ఆగస్టు 29, 2017
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.

4. బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: అర్బన్‌క్లాప్
ప్రదేశం: దిల్లీ, ముంబయి, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ. 6000- రూ. 8000
internshala.com/ i/5184
గడువు: ఆగస్టు 30, 2017
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.

5. సీఆర్ఎం టెలికాలింగ్
సంస్థ: గోద్రెజ్ ప్రాపర్టీస్ లి.
ప్రదేశం: బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ. 15,000
internshala.com/ i/5185
గడువు: ఆగస్టు 30, 2017
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ

6. బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: క్లౌడ్ఐ టెక్నాలజీస్ ఇండియా
ప్రదేశం: విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ. 5000
internshala.com/ i/5186
గడువు: సెప్టెంబరు 21, 2017
అర్హత: ఎంఎస్ ఆఫీస్, ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ నైపుణ్యాలున్నవారు.

7. బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: ఆర్‌టీఎస్‌పీఎల్
ప్రదేశం: విశాఖపట్నం, వరంగల్, సికింద్రాబాద్, విజయవాడ
స్టైపెండ్: నెలకు రూ. 6000- రూ. 10,000
internshala.com/ i/5187
గడువు: ఆగస్టు 28, 2017
అర్హత: ఇంగ్లిష్, హిందీ ప్రొఫిషియన్సీ నైపుణ్యాలున్నవారు.

8. డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: మై-హెల్త్‌కనెక్ట్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 4000- రూ. 6000
internshala.com/ i/5188
గడువు: ఆగస్టు 24, 2017
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ

9. హ్యూమన్ రిసోర్సెస్
సంస్థ: టాటా కమ్యూనికేషన్స్ లి.
ప్రదేశం: చెన్నై
స్టైపెండ్: నెలకు రూ. 10,000
internshala.com/ i/5189
గడువు: ఆగస్టు 28, 2017
అర్హత: ఎంఎస్ ఎక్సెల్ నైపుణ్యాలున్నవారు

10. సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: బాలీహూ టుడే
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ. 3000- రూ. 5000
internshala.com/ i/5190
గడువు: ఆగస్టు 30, 2017
అర్హత: సోషల్ మీడియా మార్కెటింగ్, ఫేస్‌బుక్ మార్కెటింగ్ నైపుణ్యాలు ఉన్నవారు.

కేంద్రప్రభుత్వ కొలువులకు సిద్ధమేనా?

కేంద్రప్రభుత్వ హోం మంత్రిత్వశాఖలోని ఇంటలిజెన్స్ బ్యూరో విభాగంలో అసిస్టెంట్ సెంట్రల్ ఇంటలిజెన్స్ అధికారి పోస్టులకు ప్రకటన వెలువడింది. దీని ద్వారా 1300 పోస్టులను భర్తీ చేయనున్నారు. డిగ్రీ అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకుని, రాతపరీక్షకు సిద్ధం కావాల్సిన తరుణమిది!

గ్రేడ్-2, ఎగ్జిక్యూటివ్/ గ్రూప్-సీ నాన్ గెజిటెడ్‌గా పరిగణించే ఈ పోస్టుల ఎంపిక మూడు అంచెల్లో జరుగుతుంది. మొదటి రెండు రాతపరీక్షలు. మూడోది ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష). ఈ కొలువు సాధిస్తే.. ఉద్యోగికి రూ. 40,000కు పైగా నెలజీతం పొందే అవకాశం ఉంది.



చాగంటి సుధీర్ చక్రవర్తి
శ్రీధర్స్ సీసీఈ

టైర్–1 పరీక్ష: 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు. నాలుగు విభాగాల్లో ప్రతి విభాగం నుంచీ 25 చొప్పున ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి 60 నిమిషాలు.

ఎ) జనరల్ ఇంటలిజెన్స్ (లాజికల్/ఎనలిటికల్ ఎబిలిటీ)
బి) జనరల్ ఎవేర్‌నెస్
సి) క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్
డి) ఇంగ్లిష్ లాంగ్వేజ్

టైర్-1 పరీక్షలో కనీస అర్హత మార్కులు తెచ్చుకున్న వారికి టైర్-2 పరీక్ష నిర్వహిస్తారు.

టైర్–2 పరీక్ష: ఇది డిస్క్రిప్టివ్ పరీక్ష. కేవలం ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలు వస్తాయి. వ్యవధి: 60 నిమిషాలు.

ఎ) ఎస్సే రైటింగ్: 30 మార్కులు
బి) ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, ప్రెసీ: 20 మార్కులు

ఈ పరీక్షలో 33 శాతం మార్కులు వచ్చినవారిని మౌఖిక పరీక్షకు ఎంపిక చేస్తారు.

మౌఖిక పరీక్ష: ఇది 100 మార్కులకు ఉంటుంది. మొత్తం మూడంచెల పరీక్షల్లో తెచ్చుకున్న మార్కులను బట్టి విజేతలను ఎంపిక చేసి, పోస్టులను భర్తీ చేస్తారు.

దరఖాస్తు చేయాలంటే...

విద్యార్హత: సెప్టెంబరు 2, 2017 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసివుండాలి.

వయః పరిమితి: సెప్టెంబరు 2, 2017 నాటికి జనరల్ కేటగిరీ అభ్యర్థులు 18 సం.- 27 సం. మధ్య ఉండాలి. (రిజర్వ్‌డ్ అభ్యర్థులకు గరిష్ఠ వయసు విషయంలో మినహాయింపు ఉంది).

www.mha.nic.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.

మహిళలు, ఎస్‌సీ, ఎస్‌టీ అభ్యర్థులు ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.


జనరల్, ఓబీసీ పురుష అభ్యర్థులు రూ. 100 ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలి.

దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ: సెప్టెంబరు 2, 2017

పరీక్ష కేంద్రాలు: తెలంగాణ: హైదరాబాద్ ; ఆంధ్రప్రదేశ్: విజయవాడ

మౌఖిక పరీక్ష:

అభ్యర్థి వేసుకున్న దుస్తులు, శుభ్రత, ఆకారం, ప్రదర్శించే విషయాల దగ్గర్నుంచి అన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. అడిగిన ప్రశ్నకు సూటిగా, అర్థమయ్యేలా సమాధానం చెప్పటం ప్రధానం. తెలియని విషయాలను చెప్పాలనే ప్రయత్నం సరి కాదు.



అన్ని విభాగాల్లో వీలైనన్ని ఎక్కువ మార్కులు పొందేలా ప్రణాళిక పాటించాలి. అవసరమైన మెటీరియల్ సేకరించి, సబ్జెక్టులపై పట్టు సాధించటం; వీలైనన్ని మాదిరి ప్రశ్నల సాధన.. . ఇవి చేయగలిగితే చాలు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి, జీవితంలో స్థిరపడవచ్చు!

పోస్టులు:
అన్ రిజర్వ్‌డ్: 951
ఓబీసీ: 184
ఎస్‌సీ: 109
ఎస్‌టీ: 56
మొత్తం: 1300

జనరల్ అవేర్‌నెస్‌లో సమాజ పరిణామాలపై ప్రశ్నలను అడుగుతారు. ముఖ్యంగా సైన్స్, సాంఘిక అంశాలైన చరిత్ర, ఆర్థికం, భౌగోళికం, రాజ్యాంగ వ్యవస్థలపై ప్రశ్నలు వస్తాయి. సైన్స్, చరిత్ర ప్రశ్నలకు ప్రాధాన్యం ఉంటుంది.

ఇలా సన్నద్ధమవుదాం

టైర్–1 పరీక్ష:

జనరల్ ఇంటలిజెన్స్: వెర్బల్ -నాన్ వెర్బల్ రీజనింగ్, హైలెవల్ రీజనింగ్ ప్రశ్నలుంటాయి. క్లరికల్ ఆప్టిట్యూడ్‌లోని అడ్రస్ మ్యాచింగ్ ప్రశ్నలు కూడా వస్తాయి. సబ్జెక్టుపై శ్రద్ధపెట్టి తగిన సమయం కేటాయించాలి. సాధన చేయాలి.

జనరల్ అవేర్‌నెస్: సమాజంలో చుట్టూ జరుగుతున్నవాటిపై ప్రశ్నలను అడగటం ద్వారా అభ్యర్థి సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ముఖ్యంగా సైన్స్, సాంఘిక అంశాలైన చరిత్ర, ఆర్థికం, భౌగోళికం, రాజ్యాంగ వ్యవస్థలపై ప్రశ్నలు వస్తాయి. సైన్స్, చరిత్ర ప్రశ్నలకు ప్రాధాన్యం ఉంటుంది. జాతీయ అంతర్జాతీయ విశేషాలు, వర్తమాన అంశాలు కూడా ముఖ్యం.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: దీనిలో అరిథ్‌మెటిక్, మేథమేటిక్స్, డేటా అనాలిసిస్ అంశాలుంటాయి. అరిథ్‌మెటిక్ ప్రశ్నలను రోజువారీ దినచర్యల్లో జరిగే ప్రశ్నలుగా ఆలోచించి, సామాజిక కోణంలో చూస్తే జవాబులు తేలికవుతాయి. సూక్ష్మీకరణపై దృష్టిపెడితే తక్కువ సమయంలో ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవచ్చు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్: గ్రామర్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, యాంటనిమ్స్, సిననిమ్స్, క్లోజ్డ్ టెస్ట్, కాంప్రహెన్షన్ పాసేజ్‌లపై అవగాహన అవసరం. ఒకే అంశం నుంచి ఐదు ప్రశ్నలు వచ్చేలా ఉంటాయి. రోజూ ఆంగ్ల దినపత్రిక చదువుతూ, తెలియని పదాలకు అర్థాలు తెలుసుకుంటూ వాటిని నోట్సుగా రాసుకోవటం మంచిది. మాదిరి ప్రశ్నలను సాధన చేస్తూ లోపాలు సరిదిద్దుకోవాలి.

తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు.

విభాగాలవారీగా కటాఫ్ మార్కులున్నాయి.

ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి.

టైర్–2 పరీక్ష:

సమాజంలోని ముఖ్య సంఘటనలూ, ప్రభుత్వ పథకాల గురించి తక్కువ పదాలతో ఎక్కువ సమాచారం ఇచ్చేలా వ్యాసరచన అలవాటు చేసుకోవాలి.

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, ప్రెసీల్లో భాష ఉపయోగించే క్రమంలో తప్పులు లేకుండా స్పష్టంగా, క్లుప్తంగా రాయటం అభ్యసించాలి.

Binge watch అర్థం తెలుసా?

ఇంగ్లిష్‌లో వాడుకలోకి వస్తున్న వ్యక్తీకరణలను గమనిస్తూ, వాటి ప్రయోగాన్ని తెలుసుకోవడం విద్యార్థులకు చాలా అవసరం. ఈవారం అలాంటి కొన్ని Expressions ను ఉదాహరణలతో నేర్చుకుందాం!



ఎం. సురేశన్

Vijai: There was a heated argument yesterday, did you observe? (నిన్న తీవ్రస్థాయిలో వాదన జరిగింది, నువ్వు గమనించావా?)

Bhaskar: Of course, I did. The members of the board of the company discussed whether to keep the present manager or send him away (నేనూ గమనించా. నిన్న కంపెనీ బోర్డు సభ్యులు ప్రస్తుత మేనేజర్‌ను ఉంచాలా తీసేయాలా అని చర్చించుకున్నారు).

Vijai: This has been a hot potato for months. The manager is a man of ideas. Some of them were blown away by his efficiency (కొన్ని నెలలుగా ఈ వివాదం సాగుతూనే ఉంది. ఈ మేనేజర్‌కు కొత్త ఆలోచనలు వస్తుంటాయి. వాళ్లలో కొంతమందికి అతని సామర్థ్యం చాలా ఆకట్టుకుంది).

Bhaskar: But the others are at odds with him. They don't seem to like his by passing them, and taking quick and right decisions (కానీ ఇతరులు అతనితో విభేదిస్తున్నారు. వాళ్లను ఉపేక్షించడం, త్వరగా, సరైన నిర్ణయాలు తీసుకోవడం వాళ్లకు ఇష్టం లేనట్టుంది).

Vijai: Yea, they bark up the wrong tree, because he doesn't tolerate their interference in the daily affairs of the company (అవును, వాళ్లు అసలు వాళ్లను వదిలేసి, ఇతరుల మీద కోపం చూపిస్తున్నారు, ఎందుకంటే వాళ్లు రోజువారీ కంపెనీ వ్యవహారాల్లో కల్పించుకోవడం అతను సహించడు).

Bhaskar: You know one thing? His son is his exact opposite. He indulges in binge watch and is very lazy (నీకో సంగతి తెలుసా? అతని కొడుకు అతనికి పూర్తి వ్యతిరేకం. అతను చాలా సోమరి, ఎంతసేపూ టీవీ చూస్తూ కూర్చుంటాడు).

Vijai: Ok, let us wait and see what happens. But getting rid of this manager will be a big loss to the company (చూద్దాం, ఏం జరుగుతుందో. కానీ ఈ మేనేజర్‌ను తొలగించడం సంస్థకు పెద్ద నష్టం).

Now look at the following sentences from the conversation above:

1. This has been a hot potato for months
2. Some of them have been blown away by his efficiency
3. He indulges in binge watch of the TV

Now let us discuss the expressions in detail:

1. A hot potato = a controversial issue (వివాదాస్పదమైన అంశం)

a) Venkat: Jayanth has fallen in love with a girl of another caste. His parents, however are against it (జయంత్ వేరే కులం అమ్మాయిని ప్రేమించాడు. అతని తల్లిదండ్రులు దాన్ని వ్యతిరేకిస్తున్నారు).

Prabhakar: Yea, I know. This has been a hot potato among them for months now (అవును. నాకు తెలుసు. కొన్ని నెలలుగా ఇది పెద్ద వివాదాస్పదమైన అంశమైంది వాళ్లింట్లో).

b) Sadanand: Our government renaming some of the cities is wrong, isn't it? (మన ప్రభుత్వం కొన్ని నగరాలకు కొత్త పేర్లను పెట్టడం తప్పు కదా?)

Sameer: Yea. It has become a hot potato in the country. It certainly is a wrong move (అవును. అది పెద్ద వివాదాంశం అయ్యింది దేశంలో. అది కచ్చితంగా తప్పు చర్యే).

2. To be blown away = To be very impressed (ఆకట్టుకునే విషయం).

వాడుక-వేడుక
Modern English Usage



a) Sumantha: Did you see the girl who joined our class newly? How beautiful she is! (కొత్తగా మన తరగతిలో చేరిన అమ్మాయిని చూశావా? ఎంత అందంగా ఉందో!)

Haripriya: Really extraordinary! Everybody in the class have been blown away by her beauty (నిజంగా అసాధారణం! తరగతిలో ప్రతి ఒక్కరినీ ఆ అమ్మాయి అందం ఆకట్టుకుంది).

b) Divakar: The new actor stole the heart of everybody. His action was extraordinary (ఆ కొత్త నటుడు ప్రతి ఒక్కరి హృదయాలను దోచుకున్నాడు).

Ahmed: You can say that again and again. His action blew away all the audience (ఆ మాట నువ్వు మళ్లీ మళ్లీ అనొచ్చు. అతని నటన అందరినీ ఆకట్టుకుంది).

3. Binge watch = Watching the TV without break (నిర్విరామంగా టీవీని చూస్తూ కూర్చోవడం).

a) Sekhar: Ravi is a couch potato. He spends all the time watching the TV (రవికి టీవీ ఒక వ్యసనం. ఎప్పుడూ టీవీని చూస్తూ కూర్చుంటాడు).

Sriram: He is not fed up with the boring TV shows. He indulges in binge watch (విసుగెత్తించే టీవీ ప్రదర్శనలతో అతనికి విసుగు లేదు. ఎప్పుడూ టీవీ ముందే కూర్చుని ఉంటాడు).

b) Vishnu: I don't find our TV shows interesting in any way. They are very tiring (మన టీవీ ప్రదర్శనలు ఏవిధంగా ఆకట్టుకునేవిగా నాకు అనిపించడం లేదు).

Eswar: But I don't see how housewives indulge in binge watch. Why do they find them so interesting? (కానీ నాకు అర్థం కానిది, ఇల్లాళ్లు ఎలా ఎప్పుడూ ఆ టీవీ కార్యక్రమాలను ఎలా చూస్తూ ఉంటారని. వాటిని ఎందుకు వారు ఆసక్తికరంగా భావిస్తారు?)


విద్యార్థులకు లీడర్‌షిప్ ప్రోగ్రామ్

రేపటి తరం నాయకులను తయారుచేయాలనే ఉద్దేశంతో 'ఇంటర్న్‌శాల స్టూడెంట్ పార్ట్‌నర్ (ఐఎస్‌పీ)' పేరుతో ఇంటర్న్‌షిప్, ట్రెయినింగ్ ప్రోగ్రామ్ జరగబోతోంది. ఇది ఆరునెలల వ్యవధి ఉండే వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్. దీని ద్వారా విద్యార్థులు తమ నాయకత్వ లక్షణాలు, సాఫ్ట్‌స్కిల్స్, బిజినెస్, మార్కెటింగ్ నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడంతోపాటు విద్యార్థులు తమ క్యాంపస్‌ల్లో అర్థవంతమైన ఇంటర్న్‌షిప్‌లను నెలకొల్పడంలోనూ ఐఎస్‌పీ తోడ్పడుతుందని సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు.

ఈ ప్రోగ్రామ్ 250 మంది విద్యార్థులతో 2014లో ప్రారంభమైంది. అప్పటి నుంచి వరసగా దీన్ని నిర్వహిస్తూనే ఉంది. దీనిలో అఖిల భారత స్థాయిలో ప్రతి కళాశాల నుంచి నేపథ్యంతో సంబంధం లేకుండా ముగ్గురి చొప్పున 10,000 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. డిజిటల్ మార్కెటింగ్ నుంచి ఆంత్రపెన్యూర్‌షిప్ వరకు అన్ని అంశాల్లో ఈ ఇంటర్న్‌షిప్ సాగుతుంది. కొన్ని టాస్కులు, పోటీలు నిర్వహిస్తారు. వీటి ద్వారా విద్యార్థులు రివార్డులతో పాటు ఇన్ ఆఫీస్ ఇంటర్న్‌షిప్‌ను గెలుచుకోవచ్చు. వివరాలకు- http:// bit.ly/ ISP8-2017 ను సందర్శించవచ్చు. దరఖాస్తులకు చివరితేదీ: ఆగస్టు 28, 2017

చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
హయత్‌నగర్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ–501512
e-mail: edc@eenadu.net

తెలంగాణ అట్లాస్




తెలంగాణ రాష్ట్రాన్ని 31 జిల్లాలుగా విభజన చేసి కొంతకాలం గడిచినప్పటికీ ఇంతవరకు చాలామందికి ఆయా జిల్లాల పరిధులపై సరైన అవగాహన ఏర్పడలేదు. అన్ని జిల్లాల సరిహద్దులు, ఇతర విశేషాలతో పాటు రాష్ట్ర చారిత్రక, రాజకీయ, భౌగోళిక, ఆర్థిక అంశాలను పటాల రూపంలో చాలా సులభంగా అర్థమయ్యే రీతిలో తెలుగులో ఒక పుస్తకాన్ని ప్రచురించారు.

ఇందులో చరిత్ర పూర్వయుగ ఆవాసాలు మొదలు మౌర్యులు, శాతవాహనులు తదితర చక్రవర్తుల, తర్వాతి రాజుల కాలంలో తెలంగాణ ప్రాంత భౌగోళిక విశేషాలను చక్కటి రంగుల ముద్రణలో అందించారు. ప్రతి జిల్లాలోని మండలాలు, నగర పాలక సంస్థలు, జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తుల వివరాలు ఇచ్చారు.

ముఖ్యమైన ప్రదేశాలు, కట్టడాలు, ప్రకృతి దృశ్యాల చిత్రాలను ఇవ్వడం వల్ల రాష్ట్రంపై విద్యార్థులతోపాటు సాధారణ పౌరులు కూడా సమగ్ర అవగాహన పెంపొందించుకోడానికి ఈ పుస్తకం సాయపడుతుంది.

31 జిల్లాల తెలంగాణ అట్లాస్
కూర్పు, రూపకల్పన: శివశంకర్
పేజీలు: 96, రూ. 299

టీఎస్‌పీఎస్సీ పరీక్షల కోసం



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల పలు ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఆయా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం 'విజేత కాంపిటీషన్స్' కొన్ని పుస్తకాలను వెలువరించింది.

గ్రూప్స్, ఇతర పరీక్షల్లో తప్పనిసరిగా ఉండే జనరల్ స్టడీస్ విభాగం కోసం తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో సమాచారం అందించారు. వీటితోపాటు గురుకులాల్లో టీజీటీ మెయిన్స్ పరీక్షార్థుల కోసం తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులకు మెటీరియల్ ఇచ్చారు.

వీటిలో సిలబస్ ప్రకారం అధ్యాయాల వారీగా ముఖ్యాంశాలు, ప్రాక్టీస్ బిట్లు, పాత ప్రశ్నపత్రాలను అందించారు.

1) టీఎస్‌పీఎస్సీ జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ (తెలుగు) పేజీలు: 1152, ధర: రూ. 649
2) జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ (ఇంగ్లిష్) పేజీలు: 608+640, ధర: రూ. 699 (రెండు భాగాలు)
3) గురుకులాలు టీజీటీ మెయిన్స్ తెలుగు పేజీలు: 528, ధర: రూ. 449
4) టీజీటీ మెయిన్స్ ఇంగ్లిష్ పేజీలు: 704, ధర: రూ. 599

35ఏ అధికరణ దస్త్రం గల్లంతు

ఆచూకీ కోసం కేంద్రం ప్రయత్నం

దిల్లీ: జమ్మూకశ్మీర్ పౌరులకు ప్రత్యేకహక్కులను కల్పించే 35ఏ అధికరణాన్ని రాజ్యాంగంలో చొప్పించడానికి ఉద్దేశించిన ఒక కీలకదస్త్రం గల్లంతైనట్లు కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ మెహ్రిషి పేర్కొన్నారు. 1954 నాటి ఈ దస్త్రం.. నార్త్ బ్లాక్‌లోని కట్టుదిట్టమైన భద్రతకలిగిన వాల్ట్‌లలో ఉండేదని తెలిపారు. దీని ఆచూకీని త్వరగా కనుగొనాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అధికరణ రాజ్యాంగ చెల్లుబాటును సుప్రీంకోర్టులో సవాల్‌చేసిన నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. గల్లంతైన ఈ దస్త్రం నాటి అటార్నీ జనరల్ వ్యక్తంచేసిన న్యాయ అభిప్రాయానికి సంబంధించింది కాదని రాజీవ్ వివరణ ఇచ్చారు. అది కేబినెట్ నోట్‌కు సంబంధించినదని తెలిపారు. రికార్డులను భద్రపరిచే విధానం సరిగా లేకపోవడం వల్లే ఇలా జరిగిందని చెప్పారు. ప్రభుత్వ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆ దస్త్రాన్ని ధ్వంసం చేశారన్న వార్తలను ఆయన ఖండించారు. నిబంధనల ప్రకారమే పాత దస్త్రాలను తీసేస్తామని చెప్పారు. ఇలాంటి ముఖ్యమైన దస్త్రాలను నాశనం చేసే ప్రసక్తే ఉండదన్నారు. గల్లంతైన ఈ దస్త్రం చాలా ముఖ్యమైనది. ఎందుకంటే నాడు 35ఏ అధికరణాన్ని చొప్పించడానికి రాజ్యాంగాన్ని.. పార్లమెంటు ద్వారా కాకుండా రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా సవరించారు. ఈ నేపథ్యంలో విధానపరమైన ఉల్లంఘనలు జరిగాయంటూ సదరు సవరణను సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి దీన్ని నివేదించే అవకాశం ఉన్నట్లు న్యాయస్థానం పేర్కొంది. అయితే ఈ అధికరణాన్ని తొలగించేందుకు చేసే ఎలాంటి ప్రయత్నాన్నైనా అడ్డుకుంటామని జమ్మూకశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు హెచ్చరించాయి. ఈ అధికరణం కింద కశ్మీర్ వెలుపలి వారికి.. ఈ రాష్ట్రంలో ఆస్తులు కొనుగోలు చేసే హక్కు ఉండదు. కశ్మీరీ మహిళలు ఈ రాష్ట్రానికి వెలుపలి వారిని వివాహం చేసుకున్న సందర్భంలో వారి సంతానానికి కూడా కశ్మీర్‌లో ఆస్తి హక్కు లభించదు. ఇది లింగ వివక్ష కిందకు వస్తుందని సదరు దావాలో పిటిషనర్లు పేర్కొన్నారు.

చైనా సరిహద్దుల్లో జోరుగా రోడ్లు

దిల్లీ: భారత్-చైనా సరిహద్దుల్లో వ్యూహాత్మక రోడ్ల నిర్మాణంలో అలవిమాలిన జాప్యం చోటుచేసుకోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన కేంద్రం.. ఆ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయడంపై దృష్టిసారించింది. ఇందుకోసం సరిహద్దు రోడ్ల సంస్థ (బీఆర్‌వో)కు మరిన్ని అధికారాలిచ్చింది. 3409 కిలోమీటర్ల నిడివి కలిగిన 61 రోడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంపై కాగ్ అసంతృప్తి వ్యక్తంచేసిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. భారత్-చైనా సరిహద్దుల్లోని ఈ రోడ్లన్నీ వ్యూహాత్మకంగా చాలా కీలకమైనవి. బీఆర్‌వో పనులు వేగవంతమయ్యేలా సంస్థలో మార్పులు తీసుకురావడమే తమ ఉద్దేశమని రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. అదనంగా పరిపాలనాపరమైన అధికారాలివ్వడమే కాకుండా.. దేశ, విదేశాల నుంచి నిర్మాణ సామాగ్రి కొనుగోలు కోసం బీఆర్‌వో డైరెక్టర్ జనరల్‌కు రూ.100 కోట్ల వరకూ ఆర్థిక అధికారాలను అప్పగించింది. ఇప్పటివరకూ స్వదేశీ పరికరాల కొనుగోలుకు రూ.7.5 కోట్లు, విదేశాల నుంచి రూ.3 కోట్ల విలువైన పరికరాల సమీకరణకే అధికారం ఉండేది. టర్న్‌కీ పద్ధతిలో రోడ్డు ప్రాజెక్టుల్లో భారీ నిర్మాణ కంపెనీల సేవలను బీఆర్‌వో పొందడానికి వీలు కల్పిస్తూ విధానపరమైన మార్గదర్శకాలకూ రక్షణ మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. పనుల పురోగతిని ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడానికి ఒక సాఫ్ట్‌వేర్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నారు.

షికాగోలో కాల్పులు.. ఏడుగురు మృతి

38 మందికి గాయాలు

షికాగో: అమెరికాలోని షికాగోలో శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం వరకు వేర్వేరు చోట్ల జరిగిన కాల్పుల్లో కనీసం ఏడుగురు ప్రాణాలు కోల్పోగా 38 మంది గాయాల పాలయ్యారు. ఆదివారం తెల్లవారుజామున వెస్ట్ పుల్‌మాన్‌లో ఒక బాంకెట్‌హాల్ పార్కింగ్ ప్రదేశంలో నల్లని ఎస్‌యూవీ వాహనంలో వచ్చిన వ్యక్తి ఏడుగురిపై కాల్పులు జరిపాడు. వారిలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తెల్లవారుజామున 5.10 గంటల సమయంలో బ్రైటన్‌పార్క్ ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనంపై ఆగి ఉన్న వ్యక్తిని మరో వాహనంలో వచ్చిన దుండగుడు తుపాకితో కాల్చేశాడు. రోజర్స్ పార్క్ ప్రాంతంలోనూ ఎస్‌యూవీ కారులో వచ్చిన దుండగుడు రహదారి పక్కన నిల్చొన్నవారిపై కాల్పులు జరిపాడు. ఇలాంటివే వేర్వేరు ఘటనల్లో మొత్తం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. గత వారాంతంలోకూడా షికాగోలో శుక్రవారం రాత్రి నుంచి సోమవారం ఉదయం మధ్య తొమ్మిది మంది కాల్పుల్లో చనిపోగా 30 మంది గాయపడ్డారు.

కొత్త నేత్రపరీక్షతో కొన్నేళ్ల ముందుగానే అల్జీమర్స్ గుట్టురట్టు



లాస్‌ఏంజెలెస్: కేవలం నేత్రపరీక్ష చేయడం ద్వారా అల్జీమర్స్‌వ్యాధి సోకబోయే వ్యక్తులను కొన్ని సంవత్సరాల ముందే గుర్తించవచ్చు. అల్జీమర్స్ వ్యాధి మెదడును ఎలా ప్రభావితం చేస్తుందో, అదేవిధంగా రెటీనాపైనా దుష్ప్రభావం కలుగజేస్తుందని అమెరికాలోని సెడర్ సినాయ్ వైద్యకేంద్రం పరిశోధకులు కనుగొన్నారు. నేత్రపరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించిన అత్యాధునిక నేత్రస్కానింగ్‌తో అమైలాయిడ్ బీటా అనే విషపూరిత ప్రొటీన్లు పేరుకుపోవడాన్ని పరిశోధకులు గుర్తించగలిగారు. ఇవి రెటీనాలో ఉంటే అల్జీమర్స్ వ్యాధి సోకబోతోందని నిర్ధారించుకోవచ్చని అసోసియేట్ ప్రొఫెసరు మయ కొరొన్యొ హమావోయి పేర్కొన్నారు. రెటీనాపై ఎన్నిసార్లయినా సులువుగా పరీక్ష జరపవచ్చని, అదే మెదడుపై పదేపదే చేయడం మంచిది కాదన్నారు. తద్వారా వ్యాధి తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేయవచ్చని తెలిపారు. పరిశోధకులు ఇప్పటివరకు అంతగా పట్టించుకోని అమైలాయిడ్ ఫలకాలను రెటీనాలో కనుగొన్నామని చెప్పారు. మెదడులోని కొన్ని భాగాల్లో ఉండే ఫలకాలకు, రెటీనాలో ఉండే ఫలకాలకు అవినాభావ సంబంధం ఉందన్నారు. 16 మంది అల్జీమర్స్ రోగులపై చేసిన పరిశోధన పూర్తి వివరాలు 'జేసీఐ ఇన్‌సైట్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అల్జీమర్స్ వల్ల జ్ఞాపకశక్తిని కోల్పోతారు. మాటలను అర్థం చేసుకోలేరు, నడవలేరు. ఆహారం తగినంతగా తినరు.

ప్రపంచంలోనే అతిచిన్న సర్జికల్ రోబో

పెద్ద శస్త్రచికిత్స కూడా చిన్న గాట్లతో పూర్తి



లండన్: మొబైల్‌ఫోన్లు, అంతరిక్ష కేంద్రంలో వాడే సాంకేతికతను ఉపయోగించి శస్త్రచికిత్సలు చేయగల ప్రపంచంలోనే అతిచిన్న రోబోను యూకే శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచారు. మనిషి చేతిని పోలి ఉండే 'వెర్సైస్' అనే ఈ రోబోతో సంప్రదాయ పెద్ద శస్త్రచికిత్స బదులు కేవలం గాట్లు పెట్టి పూర్తి చేయవచ్చు. హెర్నియా సరిచేయడం, పురీషనాళం, పాయువు, పెద్దప్రేగు, ప్రొస్టేట్, చెవి, ముక్కు, గొంతు శస్త్రచికిత్సలు సులువుగా నిర్వహించవచ్చు. సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే తక్కువ రక్తస్రావం, బాధతో రోగి త్వరగా కోలుకుంటాడు. త్రీడీ తెర సాయంతో రోబోను వైద్యుడు నియంత్రిస్తారు. వచ్చే ఏడాది లాంఛనంగా ప్రారంభించే ఈ రోబోను ముందుగా లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స చేసేలా రూపొందించనున్నామని కేంబ్రిడ్జ్ మెడికల్ రోబోటిక్స్ ముఖ్యకార్యనిర్వాహకుడు మార్టిన్ ఫ్రోస్ట్ చెప్పారు. మొబైల్‌ఫోన్లలో వాడే ఎలక్ట్రానిక్స్‌ను ఉపయోగించి రోబో వీలైనంత స్వతంత్రంగా ఆలోచించేలా; వాహనాలు చలించడానికి కారణమయ్యే గేర్‌బాక్సు సాంకేతికతను పరిశోధకులు ఉపయోగించి ఈ చిన్న రోబోను తయారుచేశారు.

మెదడు సంకేతాల గుట్టువిప్పే కృత్రిమ మేధస్సు



బెర్లిన్: మెదడు సంకేతాలను చదివే కృత్రిమ మేధస్సును శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. మాట పడిపోయిన పక్షవాత బాధితుల ఆలోచనలు తెలుసుకోవడంలో ఇది ఎంతగానో తోడ్పడే వీలుంది. కాళ్లు, చేతుల కదలికలు సహా వివిధ చర్యలకు మెదడు సంకేతాలు పంపిస్తుంది. వీటిని ఎలక్ట్రోఎన్‌సెఫాలోగ్రామ్ (ఈఈజీ) సాయంతో గుర్తించొచ్చు. ప్రస్తుతం వీటిని మెరుగ్గా అర్థం చేసుకునేందుకు జర్మనీలోని ఫ్రెయ్‌బర్ వర్సిటీ నిపుణులు ప్రత్యేక అల్గారిథమ్‌లను సిద్ధంచేశారు. వీటి సాయంతో మూర్ఛ లాంటి వ్యాధులనూ ముందుగానే పసిగట్టే వీలుంది. 'మెదడులోని భిన్న భావాలు, కదలికలకు సంబంధించిన భేదాలను మేం అభివృద్ధిచేసిన కృత్రిమ మేధస్సు ఇట్టే గుర్తించగలదు. నాడీ అనుసంధానాల్లోని విద్యుత్ సంకేతాల ఆధారంగా ఇది పనిచేస్తోంది'అని పరిశోధనలో పాలుపంచుకున్న నాడీశాస్త్ర నిపుణుడు టోనియో బాల్ తెలిపారు. భావాలను సైతం కచ్చితత్వంతో చదివే కృత్రిమ మేధస్సు అభివృద్ధికి ప్రస్తుతం తాము కృషి చేస్తున్నామని వివరించారు.

డిజిటలీకరణ దిశగా హైకోర్టు

త్వరలో రికార్డుల కంప్యూటరీకరణ ● 'ఇ-కోర్టు'లో లోపాల దిద్దుబాటు దిశగా అడుగులు

ఈనాడు - హైదరాబాద్

డిజిటలీకరణ దిశగా ఉమ్మడి హైకోర్టు అడుగులేస్తోంది. ఇందుకు సంబంధించి న్యాయస్థాన ఇ-కోర్టు కమిటీ ఇప్పటికే ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కేసులకు సంబంధించిన దస్త్రాలను కంప్యూటరీకరించే పని నిమిత్తం టెండర్లు పిలిచి గుత్తేదారును ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మౌలిక వసతుల కల్పన పూర్తవుతోంది. కంప్యూటరీకరణ నిమిత్తం ఓ బ్లాక్‌ను ప్రత్యేకంగా కేటాయించడం విశేషం.

హైకోర్టులోని ఓ న్యాయస్థాన హాలులో ప్రయోగాత్మకంగా ఇ-కోర్టును ఏర్పాటు చేయగా, గత ఏడాది జులైలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ దీనిని ప్రారంభించారు. జస్టిస్ పి.నవీన్‌రావు నేతృత్వంలో ఇక్కడ కేసుల విచారణ ప్రారంభమైంది. అప్పట్లో రెండేళ్లకు సంబంధించిన రికార్డులను స్కాన్ చేసి ఉంచారు. న్యాయమూర్తి, న్యాయవాదులిద్దరూ కంప్యూటర్ తెరపైనే రికార్డులను పరిశీలించేవారు. వాదనలను మార్కింగ్ చేసుకోడానికీ, నోట్స్ రాసుకోవడానికీ కంప్యూటర్ నోట్‌ప్యాడ్‌పై సౌకర్యాలున్నాయి. ఇంటర్నెట్ సౌకర్యంతో సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను ఎప్పటికప్పుడు చూసుకునే అవకాశమూ ఉంది. అయితే, కేసులకు సంబంధించిన పత్రాలను సక్రమంగా స్కాన్ చేయకపోవడంతో, ఇ-కోర్టు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని... పూర్తిస్థాయిలో నవీకరించి ఇ-కోర్టు విధానాన్ని ప్రారంభించాలని హైకోర్టు యోచించింది. భవిష్యత్తులో ఇ-ఫైలింగ్ కూడా ప్రారంభమైతే, న్యాయవాదులు వాదనలకు మినహా డాక్యుమెంట్లు, పిటిషన్లు, కౌంటర్లు దాఖలు చేయడానికి న్యాయస్థానానికి రావాల్సిన అవసరం ఉండదు!

సమాచార భద్రతే కీలకం

భవిష్యత్తులో పూర్తిస్థాయి కాగితం రహిత సేవలు అందించాలంటే.. ఇప్పట్నుంచే డేటాను నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. పిటిషన్లను ఫైలింగ్ చేసేటప్పుడే కాగితాలతోపాటు ఎలక్ట్రానిక్ కాపీలనూ సేకరించాల్సి ఉంటుంది. ఇలా చేస్తూపోతే, రెండు మూడేళ్లకు కేసులకు సంబంధించిన అన్ని వివరాలూ ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయి.



ఏవైనా అభ్యంతరాలుంటే హైకోర్టు నుంచి ఈ-మెయిల్‌లో సమాచారం అందుతుంది. భవిష్యత్తులో కక్షిదారులకు కూడా ఆన్‌లైన్‌లోనే నోటీసులు ఇవ్వనున్నారు. దిల్లీ, ముంబయి హైకోర్టుల్లో కొన్ని ఇ-కోర్టులు ఇలా విజయవంతంగా నడుస్తున్నాయి.

యాప్‌లోనూ కేసుల వివరాలు

2007లో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టులు... 'ఇ-కోర్టు ప్రాజెక్టు'ను చేపట్టి దశలవారీగా పూర్తిచేస్తూ వస్తున్నాయి. 2015 నాటికి దేశవ్యాప్తంగా 14 వేల జిల్లా కోర్టుల్లో కంప్యూటరీకరణ పూర్తయింది. ఇ-కోర్టుల ప్రాజెక్టును పూర్తిచేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చుతున్నాయి. ఇప్పటికే కేసుల వివరాలను తెలుసుకోడానికి 'నేషనల్ డేటా గ్రిడ్' ఏర్పాటైంది. దీని ద్వారా ఏ న్యాయస్థానంలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఏ దశలో ఉన్నాయన్నది తెలుసుకునే అవకాశం కలుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి హైకోర్టులో ఏ కోర్టులో ఏ కేసు నడుస్తోందో తెలిపేలా ప్రదర్శన ఫలకాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారానూ ఆ వివరాలను మొబైల్ ఫోన్‌లో చూసుకునే వెసులుబాటు కలుగుతోంది. కేసుల విచారణ సందర్భంగా రెండుసార్లు సంబంధిత న్యాయవాదులను సంక్షిప్త సందేశాల ద్వారా అప్రమత్తం చేసే వీలు కల్పించారు. తమ కేసు న్యాయమూర్తి వద్ద విచారణకు రావడానికి ముందు ఏడు కేసులున్నాయనగా ఒకసారి, మూడు కేసులున్నాయనగా మరోసారి ఈ ఎస్ఎంఎస్‌లు వస్తాయి.

కారాగారాలతో అనుసంధానం

జిల్లా కోర్టుల్లో న్యాయాధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తయింది. కంప్యూటరీకరణ ప్రక్రియా చివరిదశకు వచ్చింది. కేసుల వాయిదా, ప్రస్తుత దశ వివరాలను కంప్యూటర్‌లో చూసుకునే అవకాశముంది. 38 చోట్ల వీడియో లింకేజీ ఏర్పాట్లు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో 293 కోర్టులకుగాను 230 న్యాయస్థానాలకు 156 జైళ్లతో అనుసంధానం ఏర్పడింది. దీంతో జైళ్ల నుంచి నిందితులను కోర్టుకు తీసుకురావాల్సిన అవసరం లేకుండా, వీడియో లింకేజీ ద్వారా వారిని హాజరుపరిచి రిమాండ్ పొడిగిస్తున్నారు. ఫలితంగా సమయంతో పాటు రవాణా, భద్రతా ఖర్చులు ఆదా అవుతున్నాయి.

'బాల మేధావి' కిరీటం భారత సంతతి బాలుడిదే

బ్రిటన్‌లో బుల్లితెర పోటీలో 12ఏళ్ల రాహుల్ గెలుపు



లండన్: ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్తలు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌లకు మించిన మేధస్సు కలిగినవాడిగా మన్ననలు పొందిన బ్రిటన్‌లోని భారత సంతతి బాలుడు రాహుల్ దోషి.. బాల మేధావి కిరీటాన్ని దక్కించుకున్నాడు. "చైల్డ్ జీనియస్" పేరిట బ్రిటన్‌లోని ఛానెల్ 4 ఓ పోటీ నిర్వహించింది. దీనిలో 12ఏళ్ల రాహుల్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. 9ఏళ్ల రోనన్‌తో పోటీపడి 10-4 ఆధిక్యంతో శనివారం రాత్రి విజయం సాధించాడు. అడిగిన ప్రశ్నలన్నింటికీ గతవారం సరైన సమాధానాలు చెప్పడంతో మీడియాలో ఇతడి పేరు మారుమోగింది. పోటీ అద్భుతంగా అనిపించిందని విజయం సాధించిన అనంతరం రాహుల్ చెప్పాడు. మరోవైపు బాలమేధావి కిరీటాన్ని రాహుల్ దక్కించుకోవడంతో గర్వంగా ఉందని ఉత్తర ఇంగ్లండ్‌లో ఐటీ మేనేజర్‌గా పనిచేసే అతడి తండ్రి మినేష్ వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో భారత సంతతి వ్యక్తుల ప్రచారంపై ఈసీకి సందేహం

దిల్లీ: భారత సంతతి వ్యక్తులు (పీఐఓ) ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం వీసా నిబంధనలను ఉల్లంఘించినట్లువుతుందా అన్న విషయం తెలపాలని కేంద్ర న్యాయశాఖను ఎన్నికల కమిషన్ (ఈసీ) కోరింది. ఇటీవల పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పీఐఓలు ఆప్ తరపున ప్రచారం నిర్వహించారు. దీంతో పీఐఓలు ప్రచారంలో పాల్గొనేందుకు వీలుందా అన్న విషయంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ప్రశ్నను లేవనెత్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు ఏవీ రానప్పటికీ.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నుంచి ఈ అంశంపై ఈసీ సమాధానం కోరింది. విదేశీ వ్యవహారాలశాఖ సమాచారం కోసం న్యాయశాఖను అభ్యర్థించింది. దీనికి న్యాయశాఖ ఇంకా బదులివ్వలేదు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిపక్షాల ప్రదర్శనలు

ఈనాడు, దిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు కలిసి సంయుక్తంగా ప్రదర్శనలు నిర్వహించనున్నాయి. ఈ విషయంలో అన్ని పార్టీలనూ కాంగ్రెస్సే సమన్వయం చేస్తోంది. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాంల్లో ఈ ర్యాలీలు జరపనున్నాయి. ఈ సందర్భంగా రైతులు, నిరుద్యోగులు, దళితులు, మైనార్టీల సమస్యలతో పాటు గో సంరక్షకుల చర్యలను ప్రముఖంగా ప్రస్తావించనున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి భాజపాకు వ్యతిరేకంగా మహాకూటమి ఏర్పాటు చేయాలన్నదే ఈ ప్రయత్నాల ఉద్దేశమని కాంగ్రెస్ నాయకుడు ఒకరు చెప్పారు.

భారీ ఎత్తున జరిగిన రజనీ అభిమానుల సమావేశం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తారా? రారా? అనే అంశం అంతటా ఆసక్తి రేపుతున్న నేపథ్యంలో తిరుచ్చిలో ఆయన అభిమాన సంఘాల నిర్వాహకులు భారీ సమావేశం ఏర్పాటు చేశారు. తమ హీరో రాజకీయాల్లోకి తప్పకుండా వస్తారని, ఈ విషయమై ఆయనతో తాను మాట్లాడినట్టు గాంధియ మక్కళ్ ఉద్యమం అధ్యక్షుడు తమిళరువి మణియన్ కొద్దిరోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రజనీకాంత్ అభిమానులతో తమిళరువి మణియన్ తిరుచ్చిలోని చెన్నూర్‌లో ఆదివారం సాయంత్రం ఈ సమావేశం నిర్వహించారు. రజనీ రాజకీయ రంగ ప్రవేశానికి నాందిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రచారం జరిగింది. ఇందులో పాల్గొనాలంటూ అన్ని జిల్లాల్లోని రజనీకాంత్ అభిమానులకు తమిళరువి మణియన్ ఆహ్వానం పలికారు. దీంతో చెన్నై, పుదుకోట్టై, నాగపట్నం, తిరునెల్వేలి, మదురై, తూత్తుకుడి, రామనాథపురం తదితర జిల్లాల నుంచి భారీసంఖ్యలో రజనీ అభిమానులు తిరుచ్చి చేరుకున్నారు. రజనీకాంత్ అభిమాన సంఘాల బ్యానర్లు కట్టుకున్న కార్లు, వ్యాన్లు పెద్దసంఖ్యలో వచ్చాయి. రజనీకాంత్ రాజకీయరంగ ప్రవేశం కోసం అభిమానులు ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఆయన అనుమతితోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు సమాచారం.

'విలీనం'పై చీలిక వర్గాల ధీమా

- ధ్వజమెత్తుతున్న ప్రత్యర్థులు
- తమిళనాట రాజకీయ ఉత్కంఠ

చెన్నై, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే చీలిక వర్గాల విలీనం దాదాపు ఖరారైనట్లు స్వయంగా ఇరువర్గాల నేతలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఆ పార్టీలోని టీటీవీ దినకరన్ వర్గం, ప్రధాన ప్రతిపక్షం డీఎంకే విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాయి. కేంద్ర ప్రభుత్వ స్క్రీన్‌ప్లే మేరకు ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గాల విలీన నాటకం తెరపైకి వచ్చిందంటూ ప్రధాన ప్రతిపక్ష నేత, డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ విమర్శించారు. అవినీతిలో వాటాలు వేసుకోవడానికి చీలిక వర్గాలు ఏకం అవుతున్నాయంటూ దినకరన్ వర్గం ఆరోపించింది. వీటిని పట్టించుకోబోమని, సోమవారం మంచి ప్రకటన వెలువడనుందని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి వర్గీయులు స్పష్టం చేశారు.

కలయిక ఖాయం: ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం వర్గాల విలీన చర్చలపై శుక్రవారం రాత్రి నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. శనివారం కూడా ఇరువర్గాలు విలీనం ఖాయమనే అంశాన్ని స్పష్టం చేశాయి. ఆదివారం కూడా అదే తరహా ప్రకటనలు వెలువడ్డాయి. ప్రస్తుతం పన్నీర్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఖరారైనట్లు తెలిసింది. దీంతోపాటు ఆయన వర్గీయులకు మంత్రి, పార్టీ జిల్లా కార్యదర్శుల పదవులు ఇవ్వనున్నట్లు సమాచారం. పార్టీ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడిగా పన్నీర్‌సెల్వం ఉండనున్నారు. ఈ మేరకు రెండు వర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. మరికొన్ని డిమాండ్ల విషయంలోనూ పట్టు సాధించిన తర్వాత విలీనంపై పన్నీర్ సెల్వం ప్రకటన చేయనున్నట్లు తెలిసింది.

దినకరన్ వర్గం తీవ్ర ఆరోపణ: అన్నాడీఎంకేలోని టీటీవీ దినకరన్ వర్గం ఈ పరిణామాలపై భగ్గుమంది. పన్నీర్ సెల్వం, పళనిస్వామిల మధ్య రూ.500 కోట్ల బేరం కుదిరిందని ఆరోపించింది. దీంతోనే విలీనానికి పన్నీర్‌సెల్వం మొగ్గు చూపారని పెరంబూర్ ఎమ్మెల్యే వెట్రివేల్ ఆరోపించారు. దీనిని ఎడప్పాడి పళనిస్వామి వర్గానికి చెందిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి డి.జయకుమార్ కొట్టిపారేశారు. దినకరన్ వర్గం అభిప్రాయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, సోమవారం మంచి నిర్ణయం తీసుకోనున్నామని తెలిపారు. డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ సైతం అన్నాడీఎంకే చీలికవర్గాల విలీనంపై ధ్వజమెత్తారు.

మెట్రో లైన్ల ముహూర్తాలు ఖరారు

- అందుబాటులోకి రానున్న 19 ప్రాజెక్టులు

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం చొరవ కారణంగా దేశంలోని పలు నగరాల్లో మెట్రో రైల్వే లైన్ల పనులు త్వరత్వరగా పూర్తవుతున్నాయి. గత మూడేళ్లలో 258% మేర బడ్జెట్ కేటాయింపులు పెంచడంతో ఇది సాధ్యమయింది. ఫలితంగా లఖ్‌నవూ, అహ్మదాబాద్, హైదరాబాద్, నాగ్‌పూర్ మెట్రోలు ప్రారంభోత్సవాలకు సిద్ధమవుతున్నాయి. ఇవి మొదలైతే దేశంలో మెట్రో రైల్ నెట్‌వర్క్ సౌకర్యం ఉన్న నగరాల సంఖ్య 12కు చేరుతుంది. లఖ్‌నవూ, అహ్మదాబాద్, నాగ్‌పూర్ ప్రాజెక్టులను మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరు చేయడం గమనార్హం. లఖ్‌నవూ మెట్రో రైల్ ప్రారంభోత్సవానికి మెట్రోరైల్ సేఫ్టీ కమిషనర్ గత వారం అనుమతులు మంజూరు చేశారు. తొలి దశలో అక్కడి ట్రాన్స్‌పోర్ట్ నగర్-చార్‌భాగ్ (8.50 కి.మీ) మధ్య పరుగులు ప్రారంభమవుతాయి. వచ్చే 20 నెలల్లో దేశంలోని తొమ్మిది నగరాల్లో 19 సెక్షన్ల మధ్య మెట్రో రైలు సేవలు ప్రారంభంకాబోతున్నాయి. ఈ కొత్త సెక్షన్లన్నీ మొదలైతే దేశంలో కొత్తగా 313 కిలోమీటర్ల నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చినట్లవుతుంది. 1984లో కోల్‌కతా మహానగరంలో మెట్రోసేవలు మొదలైన నాటినుంచి గత 33 ఏళ్లలో ఎనిమిది నగరాల్లో 370 కిలోమీటర్లు ప్రారంభం కాగా, ఈ మూడేళ్లలోనే దాదాపు అంతస్థాయిలో కొత్త నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. 2012-15 మధ్యకాలంలో వీటి కోసం రూ.16,565 కోట్లు మంజూరుచేస్తే ఈ ప్రభుత్వం 2016-18 మధ్యకాలానికి రూ.42,696 కోట్లు కేటాయించింది.

ప్రారంభంకాబోయే మెట్రోలు ఇవే

సంఖ్య	నగరం	పొడవు (కి.మీ.)	ప్రారంభ తేదీ
1	లఖ్‌నవూ	8.50	ఆగస్టు 2017
2	అహ్మదాబాద్	6.30	సెప్టెంబర్
3	దిల్లీ	28.40	సెప్టెంబర్
4	హైదరాబాద్	28.00	సెప్టెంబర్
5	చెన్నై	3.10	అక్టోబర్
6	దిల్లీ	38.20	అక్టోబర్
7	కొచ్చి	5.00	నవంబర్
8	నాగ్‌పూర్	5.80	నవంబర్
9	దిల్లీ	15.50	డిసెంబర్
10	దిల్లీ	16.30	మార్చి 2018
11	దిల్లీ	30.20	ఏప్రిల్
12	నోయిడా	29.70	ఏప్రిల్
13	చెన్నై	15.50	జూన్
14	నాగ్‌పూర్	5.00	జూన్
15	దిల్లీ	3.20	జూన్
16	హైదరాబాద్	28.00	జూన్
17	బెంగళూరు	12.80	డిసెంబర్
18	లఖ్‌నవూ	15.00	మార్చి 2019
19	అహ్మదాబాద్	18.50	మార్చి



రైలు బ(o)డి

విద్యార్థులను ఆకట్టుకునేలా.. వారి ఆలోచన సరళికి తగిన విధంగా.. ఆకర్షణీయంగా పాఠశాల ఆవరణలు ఉంటే చక్కటి ఫలితాలు ఉంటాయి. పిల్లలు ఉత్సాహంగా బడికి వస్తారు. ఇదే ఉద్దేశంతో పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం మట్లపాలెం తూర్పు ప్రాథమిక పాఠశాలను వినూత్నంగా తీర్చిదిద్దారు. తరగతి గదులు రైలు పెట్టెలుగా కన్పించేలా రంగులు వేయించారు. కేరళ రాష్ట్రంలోని పాఠశాలల గదులను విభిన్నంగా తీర్చిదిద్దుతారని తెలుసుకొని తమ పాఠశాలను కూడా ఇలా సరికొత్తగా మలచినట్లు ఉపాధ్యాయుడు రుద్రరాజు బాలాజీ విజయవర్మ తెలిపారు. రైలు బండి రూపంలో ఉన్న పాఠశాల గదులను చూసి విద్యార్థులు మురిసిపోతున్నారని , క్రమం తప్పకుండా బడికి వస్తున్నారని వివరించారు.

– న్యూస్‌టుడే, యలమంచిలి

నంద్యాలలో హోరాహోరీ

- కీలకంగా ముస్లిం, కాపు, బలిజ ఓట్లు
- కొనసాగుతున్న ఆర్థిక ప్రలోభాలు

నంద్యాల నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: నంద్యాల గడ్డపై ఎవరి జెండా ఎగురుతుందనే దానిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర విభజన తర్వాత జరుగుతున్న మొదటి ఉప ఎన్నికను తెదేపా, వైకాపాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుండంతో అంతటా ఆసక్తి నెలకొంది. అభివృద్ధి నినాదంతో తెలుగుదేశం పార్టీ ప్రజల్లోకి వెళ్లగా... ప్రభుత్వం మోసపూరిత హామీలిస్తోందని, వాటిని నమ్మొద్దని వైకాపా ప్రచారం చేస్తోంది. మొదట్లో మామూలుగా సాగిన ప్రచారం ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ తారస్థాయికి చేరింది. విమర్శలు, ప్రతి విమర్శలతో ఎన్నికల వాతావరణ వేడెక్కింది. ప్రతిపక్ష నేత, వైకాపా అధినేత జగన్ వరసగా ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. జగన్ దాదాపు 15 రోజలపాటు ఇక్కడే మకాం వేసి తన అభ్యర్థి తరపున ప్రచారం చేస్తుండగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు శని, ఆదివారాలు వరసగా రెండు రోజులు పర్యటించారు. తొమ్మిది పదిమంది మంత్రులు, ఇరుపార్టీలకు చెందిన దాదాపు 50మంది ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల ప్రధాన నాయకులు స్థానికంగా ఉంటూ అభ్యర్థుల గెలుపు కోసం పని చేస్తున్నారు. ఈ ఉప ఎన్నిక చివరికి ప్రధాన పార్టీల అభ్యర్థులు భూమా బ్రహ్మానందరెడ్డి (తెదేపా), శిల్పా మోహన్‌రెడ్డి (వైకాపా)ల కంటే ఆయా పార్టీల అధినేతల మధ్య పోటీగా మారింది.

నంద్యాల నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులు తమను గెలిపిస్తాయనే నమ్మకంతో తెదేపా శ్రేణులు ఉండగా... వైకాపా మాత్రం ప్రభుత్వ వ్యతిరేకతపైనే ఆశలు పెట్టుకుంది. 1983 నుంచి ఇప్పటి వరకు 8 పర్యాయాలు నంద్యాల శాసనసభ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగితే ఇందులో నాలుగు పర్యాయాలు తెదేపా విజయం సాధించింది. హోరాహోరీగా సాగుతున్న ఉప ఎన్నికల ప్రచారానికి సోమవారంతో ముగింపు పడనుంది. 23న పోలింగ్, 28న ఫలితాల వెల్లడితో ఉత్కంఠకు తెరపడనుంది.

ఆత్మీయ సమావేశాల జోరు: నంద్యాల ఉప ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మలి అంకానికి తెరతీశాయి. కుల సంఘాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. తెదేపా జాతీయ అధ్యక్షుడు, చంద్రబాబు రెండు రోజుల విస్తృత పర్యటన ఆదివారంతో ముగిసింది. శనివారం రోడ్‌షోలు, ప్రసంగాలు సాగించిన ముఖ్యమంత్రి ఆదివారం వరసగా ఆర్య, వైశ్య, డ్వాక్రా మహిళలు, ముస్లింలు, కాపు, బలిజ సంఘాల ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రతిపక్షనేత జగన్ ఇప్పటికే ముస్లింలు, కాపు, బలిజ, ఆర్యవైశ్య సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఓట్లు అధికంగా ఉన్న వర్గాలను ఎక్కడో చోట కలిసి, ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ముస్లింలు, బలిజ, కాపు ఓట్లు కీలకంగా మారనున్నాయి. అనధికారిక అంచనా ప్రకారం ఈ నియోజకవర్గంలో ముస్లింలు 51,802 ఉండగా, బలిజ, కాపులు కలిసి 38వేలు, ఆర్యవైశ్యులు 11 వేలు వరకు ఉంటారని అంచనా.

ఆ రెండు రోజులు ఎక్కడ: నంద్యాలలో హోటళ్లు, లాడ్జీలు, భోజనశాలలకు రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. ఎప్పుడూ అన్ని గదులు నిండని లాడ్జీల్లో గదులు దొరకలేదు. దాదాపు 20 రోజులుగా ఇదే పరిస్థితి. కార్ల అద్దె వ్యాపారం పుష్కలంగా సాగింది. ఇంత భారీ మొత్తంలో సాగిన వ్యాపారం, ఈ ఉప ఎన్నిక నంద్యాల చరిత్రలో నిలిచిపోనుంది. బుధవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధన ప్రకారం.. సోమవారం సాయంత్రానికి ప్రచారం ముగియనుంది. ఆ తర్వాత ఇతర జిల్లాల నేతలు ఎవ్వరూ నంద్యాలలో ఉండకూడదు. ఈ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో పక్క గ్రామాల నుంచి పర్యవేక్షణ సాగించేలా నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో నాయకుల హడావుడి గ్రామాలకు మారనుంది. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీల వద్ద ఓటర్ల ఫోన్ నంబర్లు ఉన్నందున ప్రత్యేక యాప్‌లతో వారికి సంక్షిప్త సమాచారాలను పంపనున్నారు. ఇందుకు సంబంధించి యాప్‌లను సైతం రూపొందించారు. ఎవరైనా ఓటు వేయడానికి రాకపోతే పోలింగ్ బూత్‌లోని ఏజెంటు సమాచారం ఆధారంగా వారి సెల్‌ఫోన్‌కు సమాచారం ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

బెట్టింగ్‌ల జోరు..

నంద్యాలలో ఇప్పుడు పందేలు(బెట్టింగ్‌లు) భారీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనే కాకుండా, హైదరాబాద్, బెంగళూరులలోనూ పందేలు నడుస్తున్నాయి. పందేలు కాసిన వారు ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు నంద్యాల ఎన్నికల సరళిని తెలుసుకుంటున్నారు. అభ్యర్థుల గెలుపోటములు, తెదేపా మెజారిటీపైనా పందేలు కాస్తున్నారు.

సుప్రీంకోర్టులో కీలక వారం

- 27న సీజేఐ జస్టిస్ ఖేహర్ పదవీ విరమణ
- ఆ లోపు రెండు ప్రధాన తీర్పులు

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు పని దినాల్లో ఈ వారం కీలకం కానుంది. ఈ నెల 27వ తేదీన పదవీ విరమణ చేయబోతున్న భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ జేఎస్ ఖేహర్ పలు కీలక కేసుల్లో వెలువరించబోతున్న తీర్పులు అత్యంత ప్రాముఖ్యమైనవి కావడమే అందుకు కారణం. ఆయన ఆధ్వర్యంలోని తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం... గోప్యత హక్కుపై తీర్పు ఇవ్వనుంది. వ్యక్తిగత గోప్యత హక్కుకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు స్థాయి ఉందా? లేదా? అన్న దానిపై న్యాయస్థానం తన తీర్పు ద్వారా స్పష్టత ఇవ్వనుంది. అలాగే ముమ్మారు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చే పద్ధతికి రాజ్యాంగ బద్ధతపై అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించనుంది. దీంతోపాటు దిగువస్థాయి న్యాయ వ్యవస్థలో న్యాయాధికారుల నియామకానికి సంబంధించి జాతీయ స్థాయిలో కేంద్రీకృత వ్యవస్థ ఉండాలా? వద్దా? అన్న అంశంపై ఉత్తర్వులు వెలువరించనుంది. ఈ పద్ధతిని వివిధ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇవ్వబోయే ఉత్తర్వులు కీలకం కానున్నాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00